ఈనాడు

విజయవాడ 31-12-2025 బుధవారం సిటీ సంపుటి 52 . సంచిక 141

THE LARGEST CIRCULATED TELUGU DAILY

రూ. 6-50 పేజీలు 16

www.eenadu.net

Vijayawada, Visakhapatnam, Hyderabad, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru


MARUTI SUZUKI ARENA
VICTORIS
GOT IT ALL
SCAN AND CONNECT TO
A SHOWROOM NEAR YOU
E-BOOK TODAY AT
WWW.MARUTISUZUKI.COM
CONTACT US AT 1800-102-1800
Applicable T&C available at your nearest dealership. Creative visualization. Car colour may vary due to printing on paper. Images used are for illustration purposes only. Features may vary by model/conditions.
VICTORIS

ఈనాడు

విజయవాడ 31-12-2025 బుధవారం సిటీ సంపుటి 52 . సంచిక 141

THE LARGEST CIRCULATED TELUGU DAILY

రూ. 6-50 పేజీలు 16 www.eenadu.net

Vijayawada, Visakhapatnam, Hyderabad, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru



పౌర సేవలకు ధ్రువ్!

3లో

హెలికాప్టర్‌ను ప్రారంభించిన కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు

వీబీ జీ రాంజీతో రాష్ట్రాలకు మేలే

రూ.17వేల కోట్ల కేటాయింపులు పెరిగే అవకాశం

తెలంగాణకు రూ.333 కోట్లు అదనంగా రావొచ్చు

11లో

ఆంధ్రప్రదేశ్‌కు కొంత తగ్గొచ్చు

ఎస్‌బీఐ ఎకనమిక్ రీసెర్చ్ నివేదిక



శతమానం... సులువుగా!

2026 జయీభవ!

శతమానం భవతి... అని ఆశీర్వదించినా...
నిండు నూరేళ్లు వర్ధిల్లు... అని దీవించినా
పదాలు వేరైనా... అంతరార్థం ఒక్కటే!
చిరకాలం ఆరోగ్యంగా జీవించమనే!
... ఆ ఆరోగ్యం కోసమే తపిస్తోంది ఆధునిక లోకం!
.... ఆ దీర్ఘాయుష్షు రహస్యం కోసం
పరిశోధిస్తోంది శాస్త్రసాంకేతిక లోకం!
ఆరోగ్యంగా, దీర్ఘాయుష్షులుగా జీవించాలని ఎవరికుండదు..!
మరి ఇందుకున్న మార్గాలేంటి?

- ప్రత్యేక కథనం 13లో

ఐటీ 'కౌశలం'తో ఉద్యోగమస్తు!

డేటాబేస్‌లో 24 లక్షల మంది వివరాలు

కంపెనీలు, అగ్రిగేటర్లతో పోర్టల్ అనుసంధానం

నాలుగు నెలల్లో ఐటీ ఉపాధి కల్పన లక్ష్యం

త్వరలోనే మెట్రో నగరాల్లో రోడ్ షోలు

సంక్రాంతి తర్వాత 'ఐటీ జాబ్ ఫెయిర్'లు



ఈనాడు - అమరావతి

రాష్ట్రంలో ఇంజినీరింగ్ పూర్తిచేసిన విద్యార్థులకు వచ్చే నాలుగు నెలల్లో ఉపాధి అవకాశాలు కల్పించే లక్ష్యంగా ఐటీ శాఖ ప్రణాళిక రూపొందించింది. అర్హతలను బట్టి అభ్యర్థులు, కంపెనీలు, జాబ్ అగ్రిగేటర్లకు వారధిలా 'కౌశలం' పోర్టల్‌ను అందుబాటులోకి తెచ్చింది. ఇంజినీరింగ్ పూర్తి చేసి, చిరుద్యోగులుగా, నిరుద్యోగులుగా ఉన్న సుమారు 24 లక్షల మంది సమస్త సమాచారాన్ని అందులో ఉంచింది. నిరుద్యోగ యువత వివరాలను ఆర్టీజీఎస్‌లోని డేటాలేక్ ద్వారా సేకరించి, క్షేత్రస్థాయిలో అధికారులు ఇప్పటికే పరిశీలించారు. రాష్ట్రంలో ఇంజినీరింగ్ పూర్తిచేసి, ఎక్కడా ఉపాధి లభించని, ఒకవేళ ఉద్యోగం చేస్తున్నా.. అర్హతకు తగని వృత్తి(అండర్ ఎంప్లాయిమెంట్)లో ఉన్నవారిని ఐటీ శాఖ గుర్తించింది. ఆ వివరాలను 'కౌశలం'లో అందుబాటులో ఉంచింది. ప్రైవేటు కంపెనీలు తమ అవసరాలకు సరిపడా స్కిల్స్ ఉన్నవారిని అందులోంచి ఎంపిక చేసుకోవచ్చు. ఉద్యోగాలు కల్పించే కంపెనీలు, నైపుణ్య శిక్షణ ఇచ్చే సంస్థలు, టెస్టింగ్ ఏజెన్సీలు, అభ్యర్థులు, అగ్రిగేటర్లను ఒకే వేదికపైకి తెచ్చేలా ప్రభుత్వమే ఓ సంస్థను ఏర్పాటు చేయడం విశేషం. పోర్టల్‌లో ఇంకా నమోదుకాని వారుంటే, నేరుగా రిజిస్టర్ చేసుకోవచ్చు. (మిగతా 3లో)

కళాశాలల అనుసంధానం

రాష్ట్రంలోని అన్ని కళాశాలలనూ కౌశలం పోర్టల్‌తో అనుసంధానించాలని ఐటీ శాఖ యోచిస్తోంది. ఇంజినీరింగ్ మూడో, నాలుగో సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు పోర్టల్ ద్వారా తాజా సమాచారం అందుతుంది. వారు ఇంజినీరింగ్ పూర్తై జాబ్ మార్కెట్‌కు వెళ్లేలోగా.. నేర్చుకోవాల్సిన కోర్సులేంటి? వచ్చే ఏడాదిలో ఏఏ రంగాల్లో ఎక్కువ ఉపాధి అవకాశాలు ఉండొచ్చన్న సమాచారం విద్యార్థులు, ప్రొఫెసర్లు, కళాశాలల యాజమాన్యాలకు వెళ్తుంది. ముందస్తు అంచనాల మేరకు కోర్స్, సిలబస్ మార్పులను సూచిస్తుంది. కళాశాలల్లో నైపుణ్యాలు పెంచుకునేలా పోర్టల్ ద్వారా సమాచారమిస్తారు.

నైపుణ్య శిక్షణ.. ఉపాధి కల్పన

గ్రాడ్యుయేషన్ పూర్తిచేసి, నిరుద్యోగులుగా ఉన్నవారిపై అధికారులు ప్రత్యేక దృష్టి సారిస్తారు. సాంకేతిక నైపుణ్యాలు లేనివారికి ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ద్వారా నైపుణ్య శిక్షణ ఇవ్వనున్నారు. స్కిల్ కంపెనీలనూ పోర్టల్‌కు అనుసంధానించి, వారిద్వారా ఆన్‌లైన్, ఆఫ్‌లైన్, హైబ్రిడ్ విధానంలో నైపుణ్య శిక్షణ ఇప్పిస్తారు. రానున్న 4 నెలల్లో ప్రభుత్వం ఈ ప్రక్రియ చేపట్టనుంది. తర్వాత వారికి కంపెనీలతో నేరుగా మాట్లాడుకునేలా చూస్తుంది. పోర్టల్‌లో రిజిస్టరైన కంపెనీలు, అగ్రిగేటర్లతో సంక్రాంతి తర్వాత 'ఐటీ జాబ్ ఫెయిర్' నిర్వహించాలని అధికారులు నిర్ణయించారు. కౌశలం డేటాబేస్‌లోని అభ్యర్థులకు ఈ ఫెయిర్‌లోనే కంపెనీలు ఇంటర్వ్యూలు నిర్వహించవచ్చు. అర్హులకు అక్కడికక్కడే ఉద్యోగాలు ఆఫర్ చేయొచ్చు.



స్వర్ణరథంపై శ్రీదేవి, భూదేవి సమేత శ్రీమలయప్పస్వామి



తిరు వీధుల్లో స్వర్ణ రథోత్సవ వైభవం

వైకుంఠనాథుడి వైభోగం

తిరుమలలో వైకుంఠ ద్వార దర్శనాలు ప్రారంభం

మాడవీధుల్లో కనువిందుగా స్వర్ణ రథోత్సవం 12లో

నేడు ద్వాదశి చక్రస్నానం

అశ్లీల ప్రసారాలను అడ్డుకోండి

11లో

- సోషల్ మీడియా సంస్థలకు కేంద్రం తాఖీదు

బంగ్లాదేశ్ మాజీ ప్రధాని ఖాలిదా జియా కన్నుమూత

తొలి మహిళా ప్రధానిగా రికార్డు

సైనిక పాలనకు వ్యతిరేకంగా పోరాటం

దశాబ్దాల రాజకీయ జీవితం

మోదీ సహా ప్రపంచ నేతల నివాళి




ఢాకా, దిల్లీ: బంగ్లాదేశ్‌కు తొలి మహిళా ప్రధానిగా సేవలందించిన బేగం ఖాలిదా జియా(80) కన్నుమూశారు. 'నా తల్లి ఇక లేరు' అని ఆమె కుమారుడు, బంగ్లాదేశ్ నేషనలిస్టు పార్టీ(బీఎన్‌పీ) తాత్కాలిక అధ్యక్షుడు తారిఖ్ రహ్మాన్ మంగళవారం ప్రకటించారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ ఢాకాలోని ఎవర్‌కేర్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఖాలిదా మంగళవారం ఉదయం 6 గంటల సమయంలో కన్నుమూశారని ఆమె వ్యక్తిగత ఫిజీషియన్ డాక్టర్ అజం జాహిద్ హుసేన్ తెలిపారు. (మిగతా 3లో)

కొత్త జిల్లాల్లో నేటి నుంచే పాలన

5 రెవెన్యూ డివిజన్లూ ప్రారంభం

నోటిఫికేషన్ జారీ చేసిన ప్రభుత్వం ● కలెక్టర్లు, ఎస్పీలు వచ్చేస్తున్నారు



ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో కొత్త జిల్లాలు, రెవెన్యూ డివిజన్ల ఏర్పాటు ప్రక్రియ పూర్తయింది. అక్కడ కలెక్టర్లు, సంయుక్త కలెక్టర్లు, ఎస్పీలు, అదనపు ఎస్పీలు, ఆర్డీవోలు, సిబ్బంది నియామకాలూ షురూ అయ్యాయి. బుధవారం నుంచే జిల్లా కేంద్రాల నుంచి పాలన మొదలవుతోంది. రెండు కొత్త జిల్లాలు, ఐదు రెవెన్యూ డివిజన్లతోపాటు వివిధ ప్రాంతాల్లో మార్పుచేర్పులపై రెవెన్యూశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి.సాయిప్రసాద్ (మిగతా 3లో)

కొత్త జిల్లాలు

1. మార్కాపురం

జిల్లా పేరు: మార్కాపురం

జిల్లా కేంద్రం: మార్కాపురం

జనాభా: **11,42,313**

నియోజకవర్గాలు: మార్కాపురం, గిద్దలూరు, యర్రగొండపాలెం, కనిగిరి

రెవెన్యూ డివిజన్లు: మార్కాపురం 15 మండలాలు, కనిగిరి 6 మండలాలు

2. పోలవరం

జిల్లా పేరు: పోలవరం

జిల్లా కేంద్రం: రంపచోడవరం

జనాభా: **3,49,953**

నియోజకవర్గాలు: రంపచోడవరం

రెవెన్యూ డివిజన్లు: రంపచోడవరం 8 మండలాలు, చింతూరు 4 మండలాలు

పునర్వ్యవస్థీకరణ: జిల్లా పేరు: అన్నమయ్య

కేంద్రం: మదనపల్లె ★ జనాభా: **14,22,605**

నియోజకవర్గాలు: మదనపల్లె, రాయచోటి, పీలేరు, తంబళ్లపల్లె, పుంగనూరు (4 మండలాలు)

రెవెన్యూ డివిజన్లు: మదనపల్లె 11 మండలాలు, పీలేరు (కొత్తగా) 8 మండలాలు, రాయచోటి 6 మండలాలు

కోనసీమ రైతులకిచ్చిన మాట నిలబెట్టుకున్నాం

ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్

శంకరగుప్తం డ్రెయిన్ ఆధునికీకరణకు వర్చువల్‌గా శంకుస్థాపన 2లో

రూ.20.62 కోట్లతో డ్రెడ్జింగ్ పనులు

రాష్ట్ర చరిత్ర తిరగరాసేలా పారిశ్రామికాభివృద్ధి

2025లో సంక్షేమం, అభివృద్ధిలో పరుగులు

20 లక్షల ఉద్యోగాలకు పెట్టుబడుల ఆకర్షణ

2026లోనూ మరిన్ని ఘనమైన లక్ష్యాలతో ముందుకు: ప్రభుత్వం వెల్లడి 14లో

కలవరపెడుతున్న స్క్రబ్ టైఫస్ విస్తృతి

రాష్ట్రంలో 2 వేలకు మించి పాజిటివ్ కేసులు

ఇప్పటికే 22కు చేరిన మరణాలు

మూడేళ్లుగా అత్యధిక పీడితులు చిత్తూరు జిల్లాలోనే



అంతర్జాతీయ విమానాశ్రయ శోభ

భోగాపురంలో చారిత్రక ఘట్టం

4న తొలి విమానం ల్యాండింగ్



సిద్ధమవుతున్న రన్‌వే

విజయనగరం జిల్లా భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం చారిత్రక ఘట్టానికి సిద్ధమవుతోంది. 2026 జనవరి 4న ఇక్కడ తొలి విమానం ల్యాండ్ కానుంది. దిల్లీ నుంచి వచ్చే ఆ విమానంలో కేంద్ర పౌర విమానయానశాఖ మంత్రి రామ్మోహన్‌నాయుడు, విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు రానున్నారు. దీనికోసం అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. భవిష్యత్తులో అంతర్జాతీయ విమాన సర్వీసులకు ఇది కీలక అడుగుగా భావిస్తున్నారు. ప్రస్తుతం నిర్మాణ పనులు శరవేగంగా సాగుతున్నాయి. రన్‌వే, టెర్మినల్ భవనాలు, ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్, భద్రతా వ్యవస్థ తదితర కీలక మౌలిక సదుపాయాల కల్పన పనులు తుది దశకు చేరుకున్నాయి.

– న్యూస్‌టుడే, భోగాపురం

ఇదీ సంగతి!



ఇదుగో డియర్! ఇక్కడ ట్రాఫిక్ చాలా హెవీగా ఉంది. వచ్చేటప్పటికి ఒంటి గంట దాటవచ్చు. నా కోసం ఎదురుచూడకు!

కూతపెడుతున్న పందెం కోడి



బరిలో కలబడటంపై శిక్షణ

- సంక్రాంతి బరిలోకి దిగేందుకు సిద్ధం
- నెలల తరబడి ప్రత్యేక శిక్షణతో రాటుదేలుతున్న పుంజులు
- ఉస్తాద్‌లకు పెట్టినట్లు డైట్.. పహిల్వాన్లకు ఇచ్చినట్లు తర్ఫీదు
- ప్రత్యేకంగా నిపుణులైన సిబ్బందితో సిద్ధం చేయిస్తున్న పందేలరాయుళ్లు
- సంప్రదాయంగా మొదలై వ్యాపారంగా మారిన పందేలు

ఈనాడు, అమరావతి: మన రాష్ట్రంలో సంక్రాంతి అనగానే గుర్తొచ్చేవి కోడి పందేలు. పొరుగు రాష్ట్రాలవారే కాదు విదేశాల్లో స్థిరపడిన ప్రవాసాంధ్రులు కూడా సంక్రాంతికి సొంతూళ్లకు వచ్చి పందేలు వీక్షించడానికి తహతహలాడతారు. అంత క్రేజ్ ఉన్న కోడిపందేలకు 'బరి'లో దిగే కోళ్లు మామూలుగా ఉంటే ఎలా? అందుకే వాటి ఎంపిక నుంచి శిక్షణ వరకు, అది తినే డైట్ నుంచి బరిలో చేసే ఫైట్ వరకు అన్నీ ఆసక్తికరమే. ప్రధానంగా ఉమ్మడి ఉభయగోదావరి, కృష్ణా జిల్లాలు కోడిపందేలకు పెట్టింది పేరు. తెలుగింటి పెద్ద పండగకు సంప్రదాయ క్రీడలుగా మొదలైన కోడి పందేలు ఆ నాలుగు రోజులు అతి పెద్ద జూదంగా, కోట్లలో పందేలు కాసే స్థాయికి వెళ్లిపోయాయి.

ఈ శిక్షకులు స్పెషల్

బ్రాండింగ్ ఉండి, గతంలో పందేల్లో గెలిచిన ఎక్కువ కోళ్లకు శిక్షణనిచ్చిన కాక్ ట్రైనింగ్ సెంటర్‌ల వారితో శిక్షణ ఇప్పించేందుకు ప్రయత్నిస్తుంటారు. గతంలో రాజుల కోటల్లో ఇలాంటి శిక్షణనిచ్చిన కుటుంబాలకు చెందినవారు వంశ పారంపర్యంగా ఈ వృత్తిలో కొనసాగుతున్నారు. అలాంటివారినీ కోళ్లకు శిక్షణనిచ్చేందుకు నియమించుకుంటారు. (మిగతా 3లో)



పందెం కోళ్లకు 'నీరు'పోత

పోలవరాన్ని 'తాండవ' దాటించారు

ఏడాదిలో పూర్తయిన అక్విడక్టు నిర్మాణం



తాండవ నదిపై నిర్మించిన పోలవరం కాలువ అక్విడక్టు

పోలవరం ఎడమ కాలువ పనులు యుద్ధ ప్రాతిపదికన సాగుతున్నాయి. దీనిలో భాగంగా కాకినాడ జిల్లా తుని మండల పరిధి కుమ్మరిలోవ సమీపంలోని తాండవ నది, రేఖవానిపాలెం వద్ద తుని-నర్సీపట్నం ప్రధాన రహదారిపై చేపట్టిన అక్విడక్టు నిర్మాణాన్ని ఏడాది వ్యవధిలోనే పూర్తిచేశారు. సుమారు రూ. 75.94 కోట్ల వ్యయంతో చేపట్టిన ఈ పనులు వైకాపా ప్రభుత్వంలో నిలిచాయి. కూటమి పాలనలో గతేడాది డిసెంబరులో పునఃప్రారంభించారు. ఏడాదిలో మిగిలిన సుమారు 40 శాతం పనులను పూర్తిచేశారు. 22 పిల్లర్లతో 447 మీటర్ల పొడవున నిర్మించిన ఈ అక్విడక్టు నిర్మాణంలో 6,380 టన్నుల ఇనుము, 78,855 క్యూబిక్ మీటర్ల కాంక్రీటు వినియోగించినట్లు ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు గోవింద్ తెలిపారు. అక్విడక్టులో భాగంగా నాలుగు నీటి (మిగతా 3లో)

గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో పనిచేస్తున్న 417 మంది భాషా పండితులు, వ్యాయామ ఉపాధ్యాయులకు ప్రభుత్వం తీపికబురు అందించింది. స్కూల్ అసిస్టెంట్లుగా ఉన్నతీకరణకు అనుమతిస్తూ ఉత్తర్వులు ఇచ్చింది.

కోనసీమ రైతులకిచ్చిన మాట నిలబెట్టుకున్నాం

- ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్

మామిడికుదురు, న్యూస్‌టుడే: 'రాజోలు నియోజకవర్గ పర్యటనలో శంకరగుప్తం మేజర్ డ్రెయిన్ నీటి ముప్పు వల్ల మోడువారిన కొబ్బరి చెట్లను చూశాను. మరో కొబ్బరిచెట్టు దెబ్బతినక ముందే దీనికి సమర్థమైన పరిష్కారం చూపాలని నిర్ణయించుకున్నా. 45 రోజుల్లో ప్రణాళికతో వస్తానని చెప్పా. రైతుల దయనీయ పరిస్థితిని అర్థం చేసుకున్న సీఎం చంద్రబాబు నాయుడు రూ.20.62 కోట్లు మంజూరు చేశారు. సుబ్రహ్మణ్య షష్ఠి రోజున మాట ఇవ్వగా.. గడువు కన్నా ముందే డ్రెయిన్ ఆధునికీకరణ పనులకు వైకుంఠ ఏకాదశి నాడు శ్రీకారం చుట్టడం ఆనందంగా ఉంది' అని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మలికిపురం మండలంలోని శంకరగుప్తం మేజర్ డ్రెయిన్ డ్రెడ్జింగ్‌తో పాటు గట్ల బలోపేతానికి మలికిపురం మండలం కేశనపల్లి తుపాను పునరావాస కేంద్రంలో శంకుస్థాపన కార్యక్రమాన్ని పవన్ కల్యాణ్ మంగళగిరి క్యాంపు కార్యాలయం నుంచి మంగళవారం వర్చువల్‌గా చేపట్టారు. ఇందులో భాగంగా శంకరగుప్తం డ్రెయిన్ 8.50వ కి.మీ పాయింట్ నుంచి 16.50వ కి.మీ. వరకు పూడిక తీయనున్నారు. డ్రెయిన్ మొదలైన చోటు నుంచి 14.50వ కి.మీ. పాయింట్ వరకు ఇరువైపులా గట్లను పటిష్ఠం చేయనున్నారు.

డ్రెయిన్‌ల ప్రక్షాళన మొదలైంది!

పవన్ కల్యాణ్ వర్చువల్‌గా మాట్లాడుతూ శంకరగుప్తం డ్రెయిన్ డ్రెడ్జింగ్‌తో డెల్టాలో ప్రక్షాళన ఆరంభమైందని చెప్పారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో పంటకాలువల అభివృద్ధికి రూ.4 వేల కోట్లు అవసరమని అధికారులు చెప్పారని, బీసీ రోశయ్య నివేదిక అధ్యయనం చేసి వాటి ఆధునికీకరణపై ముందుకెళ్తామన్నారు. 'అన్నం పెట్టే రైతులు కన్నీరు పెట్టని రాష్ట్రంగా ఉండాలన్న సదుద్దేశంతోనే కూటమి ప్రభుత్వం వారికి అన్నివిధాలా అండగా నిలుస్తోంది. రెండు దశాబ్దాలుగా వారు అనుభవిస్తున్న ఆవేదన విని సత్వర కార్యాచరణపై దృష్టి సారించాను. డ్రెయిన్ ఆక్రమణల తొలగింపుపై కలెక్టర్ దృష్టి పెట్టాలి' అని పవన్ సూచించారు. కొబ్బరి సమస్యల పరిష్కారానికి కోకోనట్ బోర్డు ఏర్పాటు అంశాన్ని కేంద్రం దృష్టికి తీసుకువెళ్లనున్నట్లు చెప్పారు. 'కౌలురైతుల ఆత్మహత్యల గురించి నాదెండ్ల మనోహర్ నా దృష్టికి తెచ్చినప్పుడు గతంలో ముక్కోటి ఏకాదశి నాడే భరోసా యాత్ర ప్రారంభించాం. అదేరోజు ఒప్పుకొన్న సినిమా ద్వారా వచ్చిన రూ.5 కోట్ల అడ్వాన్స్ మొత్తాన్ని కౌలురైతులకు ఇచ్చాం. మరికొందరు దాతల సహకారంతో 3 వేల మందికి సాయం అందించాం'ని పవన్ గుర్తు చేసుకున్నారు.





శంకరగుప్తం మేజర్ డ్రెయిన్ పనులకు వర్చువల్‌గా శంకుస్థాపన చేస్తున్న ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ◆మలికిపురం మండలం కేశనపల్లిలో శిలాఫలకం వద్ద రాజోలు ఎమ్మెల్యే దేవవరప్రసాద్, కలెక్టర్ మహేశ్‌కుమార్, ఇతర అధికారులు

ముంపు నివారణకు లైడార్ సర్వే

జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు మాట్లాడుతూ శంకరగుప్తం మేజర్ డ్రెయిన్‌కు గతంలో తెదేపా పాలనలో డ్రెడ్జింగ్ చేశారని, తర్వాత ఐదేళ్ల వైకాపా హయాంలో ఎలాంటి పనులూ చేయలేదని ఆరోపించారు. 'ఇక్కడి సమస్య నా దృష్టికి వచ్చాక ఇంజినీరింగ్ అధికారులతో పరిశీలింపజేసి, ప్రతిపాదనలు తయారు చేయించాం. ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ కృషితో నిధులు మంజూరై, పనులు ప్రారంభించాం. గోదావరి జిల్లాల్లో ముంపు శాశ్వత నివారణకు లైడార్ సర్వే చేపట్టి, సీఎంకు నివేదిస్తామ'ని చెప్పారు. కేశనపల్లిలో జరిగిన కార్యక్రమంలో రాజోలు ఎమ్మెల్యే దేవవరప్రసాద్, కలెక్టర్ ఆర్.మహేశ్‌కుమార్, ఆర్డీవో మాధవి, జలవనరుల శాఖ ఎస్ఈ కె.గోపీనాథ్, డ్రైనేజీ శాఖ ఎస్ఈ ఎన్.వి.కిశోర్ పాల్గొన్నారు.

ప్రైవేటు పాఠశాలల్లోనూ వ్యాయామ విద్య

ఆదేశాలు జారీ చేసిన పాఠశాల విద్యాశాఖ

ఈనాడు, అమరావతి: ప్రైవేటు పాఠశాలల్లో వ్యాయామ విద్య నేర్పించాలని పాఠశాల విద్యాశాఖ ఆదేశాలు జారీ చేసింది. ఇందులో భాగంగా యోగా, ఆరోగ్య విద్య, డ్రిల్, క్రీడలు నిర్వహించాలని సూచించింది. ఒకటి నుంచి పదో తరగతి వరకు విద్యార్థులకు శిక్షణ ఇవ్వాలని ఆదేశించింది. ప్రతి తరగతికి వారానికి ఆరు పీరియడ్లను ప్రత్యేకంగా వ్యాయామానికి కేటాయించాలని, ప్రతి విద్యార్థికి రోజుకు కనీసం ఒకగంట శారీరక శ్రమ ఉండేలా చూడాలని ఆదేశించింది. పాఠశాల అసెంబ్లీలో ప్రతి రోజూ పది నిమిషాల ద్వారా, వారానికి ఒక పీరియడ్ నిర్దేశించిన సిలబస్ మేరకు ఆరోగ్య విద్యకు కేటాయించాలని సూచించింది. ఈ మేరకు కాల నిర్ణయ పట్టికను విడుదల చేసింది. వ్యాయామ విద్యపాఠాలు విద్యార్థులకు నైతిక విలువలపైనా ప్రత్యేక శిక్షణ ఇవ్వాలని ఏపీటీఎఫ్ అమరావతి అధ్యక్షుడు సీవీ ప్రసాద్ కోరారు.

అహం అంటేనే అంత!



అహంకారమనే దుర్గుణం దేనినీ గెలవాలని కోరుకోదు. అది కేవలం అవమానపడకూడదని మాత్రమే భావిస్తుంది. అందుకే చాలా మంది తమ తప్పుడు నిర్ణయాలనూ సమర్థించుకుంటారు. - రాజ్ శమణి, రచయిత

వండితే ఆహారం.. కళ పండితే ఆహ్వానం!





బియ్యం గింజలపై చెక్కిన '2026, వెల్‌కమ్' అనే ఆంగ్ల అక్షరాలు మహిత

కొత్త సంవత్సరాన్ని ఒక్కొక్కరు ఒక్కోలా ఆహ్వానిస్తారు. బాపట్ల జిల్లా చీరాల పట్టణానికి చెందిన అన్నం మహిత మాత్రం తనకు తెలిసిన కళతో నూతన సంవత్సరాన్ని స్వాగతిస్తున్నారు. సూక్ష్మ కళలో ప్రవేశం ఉన్న మహిత.. ఒక బియ్యం గింజపై 2026ను, మరో ఏడింటిపై వెల్‌కమ్ అనే ఆంగ్ల అక్షరాలను ఎంతో ఓపికతో కళాత్మకంగా చెక్కారు. ఇందుకు 5 గంటలు పట్టిందని తెలిపారు. ఎటువంటి యంత్రం వాడలేదన్నారు.

- న్యూస్‌టుడే, చీరాల అర్బన్

మత్స్యకార సమాఖ్యలకు జలాశయాలు

ఈనాడు, అమరావతి: చెరువులు, జలాశయాలను లీజు పద్ధతిలో అర్హత కలిగిన మత్స్యకార సమాఖ్యలకు మూడేళ్ల కాలానికి ఇచ్చేందుకు ప్రభుత్వం అనుమతించింది. ఏడాదికి 10% పెంపుపై 2025 జులై 1 నుంచి 2028 జూన్ 30 వరకు లీజుకు ఇవ్వొచ్చు. కరవు మండలాలుగా ప్రకటించిన కాలంలో పెంపుదల నుంచి మినహాయింపు ఇస్తారు.

గ్రూప్-2పై దాఖలైన వ్యాజ్యాలను కొట్టివేసిన హైకోర్టు

ఎంపిక ప్రక్రియలో ముందుకెళ్లేందుకు ఏపీపీఎస్సీకి వెసులుబాటు

ఈనాడు, అమరావతి: గ్రూప్-2 పోస్టుల భర్తీకి 2023లో జారీచేసిన నోటిఫికేషన్లో మహిళలు, క్రీడాకారులు, దివ్యాంగులు, మాజీ సైనికులకు ప్రత్యేక రిజర్వేషన్ పాయింట్లు (హారిజాంటల్ రిజర్వేషన్) ఇవ్వడాన్ని సవాలు చేస్తూ దాఖలైన వ్యాజ్యాలను హైకోర్టు కొట్టేసింది. ఎంపిక ప్రక్రియను పూర్తి చేసేందుకు ఏపీపీఎస్సీకి వెసులుబాటు కల్పించింది. హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ న్యాపతి విజయ్ మంగళవారం ఈ మేరకు తీర్పు ఇచ్చారు.

◆ 897 గ్రూప్-2 పోస్టుల భర్తీకి 2023 డిసెంబర్ 7న జారీ చేసిన నోటిఫికేషన్లో మహిళలు, క్రీడాకారులు, దివ్యాంగులు, మాజీ సైనికులకు ప్రత్యేక రిజర్వేషన్ పాయింట్లు ఇవ్వడాన్ని సవాలు చేస్తూ గాజువాకకు చెందిన ఎం.పార్థసారధి, కడపకు చెందిన కె.పెంచలయ్య, తదితరులు గతేడాది హైకోర్టులో వ్యాజ్యాలు వేశారు. సుప్రీంకోర్టు ఇచ్చిన మార్గదర్శకాలకు అనుగుణంగా రిజర్వేషన్ రోస్టర్‌ను నిర్ణయించి గ్రూప్-2 పోస్టులకు తాజాగా నోటిఫికేషన్ ఇచ్చేలా ఏపీపీఎస్సీ, రాష్ట్రప్రభుత్వాన్ని ఆదేశించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం 2023 ఆగస్టులో జారీచేసిన జీవో 77 సుప్రీంకోర్టు తీర్పునకు విరుద్ధమన్నారు.

◆ సర్టిఫికేషన్ పరిశీలన కోసం ఎంపికైన కొందరు అభ్యర్థుల తరఫున న్యాయవాదులు వాదనలు వినిపిస్తూ.. 'కోర్టును ఆశ్రయించిన పిటిషనర్లు ఎంపిక ప్రక్రియలో పాల్గొని విఫలమయ్యారు. ఈ నేపథ్యంలో వారు నోటిఫికేషన్‌ను సవాలు చేయడానికి వీల్లేదు. రోస్టర్ పాయింట్ల కేటాయింపులో ఏదైనా లోపాలు జరిగిఉంటే వాటిని సరి చేసుకోవచ్చు. అంతే తప్ప నోటిఫికేషన్ మొత్తాన్ని రద్దు చేయాల్సిన అవసరం లేదు. ఎంపిక కాని అభ్యర్థులు నోటిఫికేషన్ మొత్తాన్ని సవాలు చేయడానికి వీల్లేదు. వ్యాజ్యాలను కొట్టేయండి' అని కోరారు.

ఆ కులాల్ని గౌడగా మార్చే డిమాండ్‌పై అభ్యంతరాలుంటే చెప్పాలి: బీసీ కమిషన్

ఈనాడు, అమరావతి: గౌడ (గమళ్ల), కలలీ, గౌండ్ల కులాల్ని గౌడ్/గౌడగా మార్చాలనే డిమాండ్ మేరకు దీనిపై ఆయా కులాల నుంచి ఏవైనా అభ్యంతరాలుంటే తెలియజేయాలని బీసీ కమిషన్ కార్యదర్శి తనూజారాణి మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. ఈ నెల 3న విజయవాడలోని కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో గౌడ కులస్తులు ఆయా కులాల్ని ఒకే పేరు కింద గౌడ్/గౌడ మార్చాలని విన్నవించారు. వారి కుల ధ్రువీకరణ పత్రాల్ని గౌడ్/గౌడగా జారీ చేయాలని కోరారు. అయితే ఈ సమావేశానికి గౌడ (గమళ్ల), కలలీ, గౌండ్ల కులాల నుంచి ఎవరూ హాజరు కానందున తదుపరి చర్యల్లో భాగంగా ఆయా కులాల వారి నుంచి అభ్యంతరాలు స్వీకరిస్తున్నట్లు తనూజారాణి వివరించారు. అభ్యంతరాలుంటే వాటిని జనవరి 6లోగా వారు బీసీ కమిషన్ కార్యాలయానికి తెలియజేయాలని సూచించారు.

గ్రహం అనుగ్రహం 31-12-2025 బుధవారం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం; దక్షిణాయనం;
హేమంత రుతువు, పుష్యమాసం, శుక్లపక్షం
ద్వాదశి: రా. 11-08 తదుపరి త్రయోదశి; కృత్తిక: రా. 11-32 తదుపరి రోహిణి
వర్జ్యం: మ. 12-21 నుంచి 1-50 వరకు;
అమృత ఘడియలు: రా. 9-18 నుంచి 10-47 వరకు
దుర్ముహూర్తం: ఉ. 11-41 నుంచి 12-24 వరకు; రాహుకాలం: మ. 12-00 నుంచి 1-30 వరకు; సూర్యోదయం: ఉ.6.34; సూర్యాస్తమయం: సా.5.32

చలి-పులి

ప్రాంతం	కనిష్ఠ	గరిష్ఠ	ప్రాంతం	కనిష్ఠ	గరిష్ఠ
ఆదిలాబాద్	6.7	29.8	అనంతపురం	17.5	31.2
హైదరాబాద్	13.1	29.6	శ్రీకాకుళం	18.0	28.0
ఖమ్మం	14.4	31.2	కడప	18.0	29.0
విజయనగరం	15.0	26.0	విజయవాడ	18.0	29.2
కరీంనగర్	15.0	28.0	విశాఖపట్నం	18.4	27.6
మహబూబ్‌నగర్	15.1	31.2	గుంటూరు	19.0	30.0
కర్నూలు	16.7	30.7	తాడేపల్లిగూడెం	19.0	30.0
రాజమహేంద్రవరం	17.0	33.0	నరసాపురం	19.6	29.4
			సూర్యాపేట	20.0	29.0
			ఒంగోలు	20.5	29.7
			నెల్లూరు	21.4	28.5

పౌర సేవలకు ధ్రువ్!

• హెలికాప్టర్‌ను ప్రారంభించిన కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు



గగన విహారంలో ధ్రువ్-ఎన్‌జీ హెలికాప్టర్

ఈనాడు, బెంగళూరు: పౌర హెలికాప్టర్ ధ్రువ్-ఎన్‌జీ (నెక్స్ట్ జనరేషన్) సేవలకు సిద్ధమైంది. పౌర విమానయాన మంత్రి కె.రామ్మోహన్‌నాయుడు మంగళవారం బెంగళూరులో ఈ హెలికాప్టర్‌ను లాంఛనంగా ప్రారంభించారు. మల్టీరోల్, తేలికపాటి ట్విన్ ఇంజిన్ వ్యవస్థలున్న ఈ హెలికాప్టర్‌ను హెచ్ఏఎల్ పూర్తిగా స్వదేశీ పరిజ్ఞానంతో తయారు చేసింది. ఆత్మనిర్భర్ భారత్ శక్తికి ప్రతీకగా తయారైన ఈ హెలికాప్టర్‌లో శక్తి సివిల్ ఇంజిన్‌ను అమర్చగా అందుకు సంబంధించిన ధ్రువపత్రాన్ని రామ్మోహన్‌నాయుడు హెచ్ఏఎల్‌కు అందజేశారు. హెచ్ఏఎల్ సీఎండీ సునీల్, డీజీసీఏ జేడీజీ మనీశ్ కుమార్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

బహుళ అవసరాలకు

పౌర సేవలు, ప్రకృతి విపత్తులు, అత్యవసర వైద్య సేవలు, ప్రముఖుల ప్రయాణాలు.. ఇలా బహుళ ప్రయోజనాల లక్ష్యంతో తయారైన ఈ హెలికాప్టర్ 5,500 కిలోల బరువుండగా, గంటకు 285 కిలోమీటర్ల వేగం, భూమికి ఆరు వేల మీటర్ల ఎత్తు వరకు ఎగరగలదు. వెయ్యి కిలోల పేలోడ్ బరువును మోయగలిగే, ప్రపంచశ్రేణి గ్లాస్ కాక్‌పిట్, సెల్ఫ్ సీలింగ్ ఇంధన ట్యాంకర్లు, రెండు 'శక్తి 1హెచ్1సీ' ఇంజిన్లతో తయారైంది. అడ్వాన్స్‌డ్ వైబ్రేషన్ కంట్రోల్ సిస్టమ్‌లతో అన్ని రకాల ప్రయాణాలకు అనువుగా రూపొందించారు. గరిష్ఠంగా 14 మంది ప్రయాణించగలిగే ఈ హెలికాప్టర్‌ను దేశీయంగా నిర్వహించేలా, మరమ్మత్తులు చేయగలిగేలా తయారు చేశారు.

ఓ మైలురాయి: కేంద్రమంత్రి

భారతీయ వైమానిక చరిత్రలో ధ్రువ్-ఎన్‌జీ హెలికాప్టర్‌ను ఓ మైలురాయిగా మంత్రి రామ్మోహన్‌నాయుడు కొనియాడారు. ప్రయాణానికి ముందు కాక్‌పిట్‌లోని వ్యవస్థలను పరిశీలించిన ఆయన ఈ హెలికాప్టర్ కేవలం ఓ యంత్రపరికరం కాదు.. భారతీయ వైమానిక సమర్థతకు ప్రతీకని పేర్కొన్నారు.



ధ్రువ్ కాక్‌పిట్ పరిశీలన అనంతరం అభివాదం చేస్తున్న రామ్మోహన్ నాయుడు. చిత్రంలో హెచ్ఏఎల్ సీఎండీ సునీల్, పవన్‌హన్స్ సీఎండీ సంజీవ్ రాజ్‌దాన్ తదితరులు

చక్రాలు, రక్షణ వ్యవస్థలను సుదీర్ఘకాలంగా తయారు చేస్తున్న హెచ్ఏఎల్ నేడు పౌర విమాన విభాగంలోనూ సత్తా చాటగలిగిందన్నారు. రానున్న 15 ఏళ్లలో వెయ్యి పౌర హెలికాప్టర్లు తయారు కానున్నాయని మంత్రి రామ్మోహన్‌నాయుడు ప్రకటించారు.

రైల్‌వన్ యాప్ ద్వారా టికెట్లు కొంటే 3% రాయితీ

అన్‌రిజర్వ్‌డ్ టికెట్లపై జనవరి 14 నుంచి జులై 14 వరకు..

దిల్లీ: రైళ్లలో అన్‌రిజర్వ్‌డ్ టికెట్లను రైల్‌వన్ యాప్‌ద్వారా కొని డిజిటల్ విధానంలో చెల్లింపులు చేసేవారికి 3% రాయితీని రైల్వే మంత్రిత్వశాఖ ఇవ్వనుంది. 2026 జనవరి 14 నుంచి జులై 14 వరకు ఇది అమల్లో ఉంటుంది. ఈ యాప్ ద్వారా ఆర్-వ్యాలెట్‌తో చెల్లింపుల్ని చేసేవారికే ప్రస్తుతం ఈ రాయితీని క్యాష్‌బ్యాక్ రూపంలో ఇస్తోంది. డిజిటల్ బుకింగ్‌లను ప్రోత్సహించడానికి ఈ యాప్ ద్వారా జరిగే అన్నిరకాల డిజిటల్ చెల్లింపులకు దీనిని విస్తరించాలని నిర్ణయం తీసుకుంది. సంబంధిత సాఫ్ట్‌వేర్‌లో తగిన మార్పులు చేయాలని 'రైల్వే సమాచార వ్యవస్థ కేంద్రం'(క్రిస్)కు మంగళవారం రైల్వేశాఖ ఆదేశాలిచ్చింది. ప్రయాణికుల స్పందన ఎలా ఉందో మే నెలలో తెలియజేస్తే దీనిపై తదుపరి పరిశీలన చేస్తామని ఉత్తర్వుల్లో పేర్కొంది. ఆర్-వ్యాలెట్ ద్వారా ఇప్పటికే ఉన్న రాయితీ కొనసాగుతుందని స్పష్టంచేసింది. ఇతర ఏ ఆన్‌లైన్ విధానాల్లో కొన్న అన్‌రిజర్వ్‌డ్ టికెట్లకు వర్తించబోదని తేల్చిచెప్పింది.

బంగ్లాదేశ్ మాజీ ప్రధాని ఖాలిదా కన్నుమూత

(మొదటి పేజీ తరువాయి)

ఖాలిదా జియా చివరిసారిగా నవంబరు 21న సైనిక కార్యక్రమంలో పాల్గొన్నారు. మూడుసార్లు ప్రధానిగా పని చేసిన ఆమె.. బీఎన్‌పీ ఛైర్‌పర్సన్‌గా అనేక దశాబ్దాలపాటు బంగ్లాదేశ్ రాజకీయాలను శాసించారు. ఖాలిదా అంత్యక్రియలు బుధవారం ప్రభుత్వ లాంఛనాలతో ఆమె భర్త సమాధి సమీపంలో జరగనున్నాయి. 3 రోజులపాటు సంతాప దినాలను పాటిస్తున్నట్లు బంగ్లాదేశ్ ప్రధాన పాలకుడు మహమ్మద్ యూనస్ తెలిపారు. బుధవారం సెలవు ప్రకటించారు. అంత్యక్రియలకు భారత్ తరఫున విదేశాంగశాఖ మంత్రి జైశంకర్ హాజరుకానున్నారు.

ప్రజాస్వామ్యం కోసం పోరాటం

బంగ్లాదేశ్‌కు తొలి మహిళా ప్రధానిగా పని చేసిన ఖాలిదా.. దేశంలో ప్రజాస్వామ్యాన్ని పునఃప్రతిష్ఠించడంలో కీలక పాత్ర పోషించారు. ఆమె 1946 ఆగస్టు 15న అవిభాజ్య భారత్‌లోని దినాజ్‌పుర్ జిల్లాలో తయ్యబా, ఇస్కందర్ మజుందార్ దంపతులకు జన్మించారు. తండ్రి టీ వ్యాపారం చేసేవారు. 1960లో ఖాలిదా.. సైనిక కెప్టెన్ జియావుర్ రహ్మాన్‌ను వివాహం చేసుకున్నారు. బంగ్లాదేశ్‌కు జియావుర్ అధ్యక్షుడిగా పని చేశారు. 1981 మే 30న సైనిక తిరుగుబాటు సందర్భంగా అధ్యక్షుడు జియావుర్ హత్యకు గురయ్యారు. అప్పటికి ఖాలిదా వయసు 35 ఏళ్లు. భర్త హత్యతో అనుకోకుండా ఆమె రాజకీయాల్లోకి రావాల్సి వచ్చింది. 1978లో తన భర్త స్థాపించిన బీఎన్‌పీకి ఆయన హత్యానంతరం 1984లో ఛైర్‌పర్సన్ అయ్యారు. అప్పటి నుంచి చనిపోయే వరకూ ఆ పదవిలో కొనసాగారు.

• 1982లో సైనిక పాలనకు వ్యతిరేకంగా ఖాలిదా.. ప్రజాస్వామ్య సాధన ఉద్యమాన్ని చేపట్టారు. 1990లో సైనిక నియంత ఎర్షాద్ పాలన ముగిసింది. 1991లో జరిగిన ఎన్నికల్లో బీఎన్‌పీ ఘన విజయం సాధించింది.

• ఖాలిదా జియా దేశ తొలి మహిళా ప్రధానిగా బాధ్యతలు చేపట్టారు. ముస్లిం ప్రపంచంలో బేనజీర్ భుట్టో తర్వాత ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన రెండోవ్యక్తిగా నిలిచారు.

• 1996లో రెండోసారి బీఎన్‌పీ విజయం సాధించింది. షేక్ హసీనా నేతృత్వంలోని అవామీ లీగ్ పార్టీ ఆందోళనల కారణంగా 12 రోజులకే జియా రాజీనామా చేయాల్సి వచ్చింది. అదే ఏడాది జూన్‌లో జరిగిన ఎన్నికల్లో అవామీ లీగ్ విజయం సాధించింది. హసీనా ప్రధాని అయ్యారు.

• 2001 సార్వత్రిక ఎన్నికల్లో మరోసారి ఖాలిదా జియా నేతృత్వంలోని బీఎన్‌పీ ఘన విజయం సాధించింది. 2006 వరకూ ఆమె ప్రధాని పదవిలో కొనసాగారు.

• 2018లో ఖాలిదాకు... జియా అనాథల ట్రస్టు కేసులో ఐదేళ్లు, జియా ఛారిటబుల్ ట్రస్టు కేసులో ఏడేళ్ల శిక్షలు పడ్డాయి. 2024లో హసీనా పదవి నుంచి వైదొలగిన ఒక రోజు తర్వాత ఖాలిదాకు అధ్యక్షుడు క్షమాభిక్ష ప్రసాదించారు. దీంతో ఆమె జైలు నుంచి విడుదలయ్యారు. ఆ మరుసటి రోజే ఆమె భారీ ర్యాలీ నిర్వహించి మళ్లీ రాజకీయ రంగంలోకి వచ్చారు.



బంగ్లాదేశ్ పర్యటన సందర్భంగా 2015 జూన్‌లో ఢాకాలో ఖాలిదా జియాతో ప్రధాని మోదీ

భారత్‌తో మిశ్రమ బంధమే..

1991లో ఖాలిదా అధికారం చేపట్టిన తొలిసారి భారత్‌తో సంబంధాలు మిశ్రమంగానే కొనసాగాయి. సాధారణ దౌత్యంతోపాటు గంగా నదీ జలాలు, సరిహద్దుల విషయంలో కొంత ఉద్రిక్తత కొనసాగింది.

• 'లుక్ ఈస్ట్' పాలసీలో భాగంగా చైనా, ఇస్లామిక్ దేశాలతో సంబంధాలకు ఖాలిదా ప్రాధాన్యమిచ్చారు.

• రెండోసారి ఖాలిదా ప్రధాని అయ్యాక సంబంధాలు భారీగా దెబ్బతిన్నాయి. రెండు దేశాల మధ్య కనెక్టివిటీ, వాణిజ్యం విస్తరణ నిలిచిపోయింది. బంగ్లాదేశ్ నుంచి ఉగ్రవాదులు కార్యకలాపాలను కొనసాగించారని, సరిహద్దుల నుంచి భారీగా చొరబాట్లు జరిగాయని భారత్ ఆరోపించింది.

• ప్రధానిగా ఉండగా 1992, 2006లలో ఖాలిదా భారత్‌ను సందర్శించారు. 2012లో ప్రతిపక్ష నేతగా వచ్చారు.

• ఖాలిదా.. 1991, 1996, 2001లలో 5 వేర్వేరు నియోజకవర్గాల నుంచి పార్లమెంటుకు ఎన్నికయ్యారు. 2008లోనూ 3 నియోజకవర్గాల్లో విజయం సాధించారు.

• బంగ్లాదేశ్ రాజకీయాల్లో దశాబ్దాలపాటు ఖాలిదా జియా, షేక్ హసీనా చిరకాల ప్రత్యర్థులుగా కొనసాగారు.

• వచ్చే ఏడాది ఫిబ్రవరిలో జరగనున్న ఎన్నికల్లో బీఎన్‌పీ విజయం సాధిస్తుందనే అంచనాలున్నాయి. అదే జరిగితే ఖాలిదా మరోసారి ప్రధాని అయ్యేవారు.

• ప్రస్తుతం పార్టీని ఆమె కుమారుడు తారిఖ్ రహ్మాన్ నడిపిస్తున్నారు. 17 ఏళ్ల ప్రవాసం తర్వాత ఇటీవలే ఆయన బంగ్లాదేశ్‌కు వచ్చారు.

మోదీ సహా పలువురి సంతాపం

ఖాలిదా జియా మరణంపట్ల ప్రధాని నరేంద్ర మోదీ సహా పలువురు నేతలు సంతాపం తెలిపారు. 2015లో ఢాకాలో ఖాలిదాతో తాను భేటీ అయిన చిత్రాన్ని ఆయన ఎక్స్‌లో పోస్టు చేశారు.

• కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, అగ్రనేత రాహుల్ గాంధీ, పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ సంతాపం ప్రకటించారు.

• ఒక గొప్ప రక్షకురాలిని కోల్పోయామని బంగ్లాదేశ్ ప్రధాన పాలకుడు యూనస్ తన సంతాప సందేశంలో పేర్కొన్నారు.

• ఖాలిదా మరణంపట్ల భారత్‌లో ఆశ్రయం పొందిన అవామీ లీగ్ అధ్యక్షురాలు షేక్ హసీనా సంతాపం తెలిపారు. బంగ్లాదేశ్ రాజకీయ చరిత్రలో ఆమె చెరగని ముద్ర వేశారని కొనియాడారు.

డ్రైవర్ సుబ్రహ్మణ్యం హత్య కేసులో కొత్త ఆధారాలు

• అరెస్టు భయంతో ఎమ్మెల్సీ అనంతబాబు భార్య ముందస్తు బెయిల్ పిటిషన్!

ఈనాడు, కాకినాడ: కాకినాడకు చెందిన దళిత యువకుడు వీధి సుబ్రహ్మణ్యంను హత్య చేసి డోర్ డెలివరీ చేసిన కేసులో కొత్త ఆధారాలు వెలుగు చూస్తున్నాయి. సీసీ టీవీ ఫుటేజీని సెంట్రల్ ఫోరెన్సిక్ సైన్స్ లేబొరేటరీకి పంపించి విశ్లేషించగా నిందితుడు, వైకాపా ఎమ్మెల్సీ అనంతబాబు కుటుంబ సభ్యుల దృశ్యాలు కనిపించినట్లు సమాచారం. హత్యకు కొద్ది నిమిషాల ముందు, తర్వాత ఆయనతో ఎవరెవరు కలిసి ఉందీ గుర్తించారు. ఈ క్రమంలో అనంతబాబు భార్య లక్ష్మీ దుర్గ అలియాస్ రోజాను విచారణకు పిలవడానికి ఆమె కుల ధ్రువీకరణ కోసం అడ్డతీగల తహసీల్దార్ కార్యాలయానికి ఇటీవల విచారణ అధికారి లేఖ రాశారు. ఈ విషయాన్ని గుట్టుగా ఉంచాల్సిన రెవెన్యూ సిబ్బందిలో ఒకరు ఆ కాపీని అనంతబాబుకు చేరవేసి సమాచారం లీక్ చేశారు. అరెస్టు కోసమే తమ సమాచారం కోరుతున్నారని భావించిన అనంతబాబు భార్య.. హైకోర్టులో ఈ నెల 29న ముందస్తు బెయిల్ పిటిషన్ వేశారు. బలమైన సాంకేతిక ఆధారాలు బయటపడటంతో ఈసారి అరెస్టు తప్పదనే భయంతోనే ఆమె కోర్టును ఆశ్రయించినట్లు పోలీసు వర్గాలంటున్నాయి.

నాడు నీరుగార్చేశారు..

వైకాపా హయాంలో ఎమ్మెల్సీ అనంతబాబు తన దగ్గర పనిచేసి మానేసిన డ్రైవర్ సుబ్రహ్మణ్యాన్ని 2022 మేలో హత్య చేసి డోర్ డెలివరీ చేశారు. తొలుత ఈ ఘటనకు తానే కర్త, కర్మ, క్రియ అని చెప్పి జైలుకు వెళ్లిన అనంతబాబు తర్వాత బెయిల్‌పై వచ్చారు. అధికార పార్టీ నేత కావడంతో కేసును అప్పట్లో పోలీసులు నీరుగార్చేయడంతో కూటమి ప్రభుత్వం వచ్చాక సుబ్రహ్మణ్యం తల్లిదండ్రులు మళ్లీ విచారణ కోరారు. ప్రస్తుతం కాకినాడ ఎస్‌డీపీవో దేవరాజ్ మనీష్ పాటిల్ నేతృత్వంలో సిట్ విచారణ జరుపుతోంది.

ఐటీ 'కౌశలం'తో ఉద్యోగమస్తు!

(మొదటి పేజీ తరువాయి)

పోర్టల్‌లో నమోదైన ప్రతి ఒక్కరికీ ఐటీ శాఖ ఒక లాగిన్‌ను కల్పించింది. అందులో వారికి ఓ వెబ్‌పేజీ ఉంటుంది. లాగిన్ కాగానే సిస్టమ్ జనరేటెడ్‌గా వచ్చే హోంపేజీలో అభ్యర్థి, తండ్రి పేరు, కమ్యూనికేషన్ అడ్రస్, ఈ-మెయిల్ అడ్రస్, ఫోన్ నంబర్, విద్యార్హతలు, ధ్రువీకరణ పత్రాలు, కోర్సు ఉత్తీర్ణులైన సంవత్సరం, సాధించిన మార్కులు, ఏఐ నైపుణ్యం, ఇతర ప్రొఫెషనల్ కోర్సుల్లో ప్రవేశం వంటి సమాచారమంతా ప్రత్యక్షమవుతుంది.

• అభ్యర్థి ప్రతిభా పాటవాలను ఉద్యోగాలు కల్పించే కంపెనీలకు అందించేలా ఐటీ శాఖ ఒక పరీక్ష నిర్వహించి, వారికి గ్రేడింగ్‌లు ఇచ్చింది.

• వచ్చే ఆరు నెలల్లో ఏ రంగంలో ఉద్యోగాలు రావొచ్చు? దానికి కావాల్సిన నైపుణ్యాలేంటి? ఇందుకోసం ఎలాంటి సర్టిఫికెట్ కోర్సులు చేయాలి? తదితర వివరాలు ఆయా వ్యక్తుల ఇన్‌బాక్స్‌లో కనిపిస్తాయి.

ఉద్యోగాల ఖాళీలు గుర్తించేందుకు..

• రోజూ ఇంటర్‌నెట్ స్క్రేప్ చేసి (ఏ రంగంలో ఉద్యోగ అవకాశాలు ఉంటాయో ఏఐ టూల్ గమనిస్తుంది. వివిధ జాబ్ పోర్టల్స్‌ను పరిశీలిస్తారు) ఉపాధి అవకాశాలను గుర్తిస్తారు. ఇదంతా ఏఐ టూల్ ద్వారా జరుగుతుంది. పోర్టల్‌లో నమోదైన 24 లక్షల మందిలో ఆయా ఉద్యోగాలకు అర్హులైన వారి ఇన్‌బాక్స్‌లో ఖాళీల వివరాలు కనిపిస్తాయి. ఉదాహరణకు ఓ అభ్యర్థి సివిల్ ఇంజినీరింగ్ చేసి, క్యాడ్‌క్యామ్‌లో అనుభవం ఉందనుకోండి. ఒక సంస్థకు అలాంటి ఉద్యోగి అవసరమైతే.. వారికి ఆ సమాచారాన్ని పోర్టల్ ద్వారా పంపిస్తారు. అభ్యర్థి పోర్టల్ ద్వారానే దరఖాస్తు చేసుకోవచ్చు.

• యువత సమాచారమంతా పెద్దపెద్ద రిక్రూట్‌మెంట్ కంపెనీలకు ఏపీఐ (అప్లికేషన్ ప్రోగ్రామింగ్ ఇంటర్‌ఫేస్) ద్వారా ఐటీ శాఖ ఇప్పటికే అందించింది. ఉదాహరణకు ఓ ఐటీ కంపెనీ పైథాన్‌లో అనుభవమున్న 500 మంది కావాలనుకుంటే.. అర్హులైన నిరుద్యోగులు, ఇప్పటికే ఏదైనా కంపెనీలో ఉద్యోగం చేస్తూ మెరుగైన కెరీర్ కోసం ఎదురుచూస్తున్న వారి జాబితా ఆ కంపెనీకి కనిపిస్తుంది. కంపెనీ ప్రతినిధులు నేరుగా అభ్యర్థులను సంప్రదించి, ఇంటర్వ్యూ నిర్వహించి, ఎంపిక చేసుకోవచ్చు.

• జాబ్ అగ్రిగేటర్లుగా ఉన్న మాన్‌స్టర్, నౌకరీ వంటి ఏజెన్సీలు.. ఉద్యోగాలిచ్చే కంపెనీలు, అభ్యర్థులకు మధ్య వారధిగా పనిచేస్తున్నాయి. కౌశలం పోర్టల్ డేటా వారికీ అందుబాటులో ఉంది.

విస్తృత ప్రచారానికి రోడ్‌షోలు: భాస్కర్ కాటమనేని, ఐటీ శాఖ కార్యదర్శి



'కౌశలం'పై ప్రచారానికి జనవరి మొదటి వారంలో బెంగళూరు, చెన్నై, హైదరాబాద్, పుణె, దిల్లీ నగరాల్లో రోడ్ షోలు నిర్వహిస్తాం. ఐటీ కంపెనీలు, అగ్రిగేటర్లకు పోర్టల్ గురించి వివరిస్తాం. ఆయా కంపెనీల హెచ్ఆర్ మాడ్యూల్, ఐటీ శాఖ మాడ్యూల్‌ను అనుసంధానిస్తున్నాం. తద్వారా పోర్టల్‌లో డేటాను కంపెనీలు సులువుగా వాడుకోవచ్చు. ఎంప్లాయీస్ ప్రావిడెంట్ ఫండ్ (ఈపీఎఫ్) డేటాతోనూ పోర్టల్‌ను అనుసంధానిస్తాం. దీనివల్ల కౌశలం పోర్టల్‌లో నమోదైన వారికి ఏదైనా కంపెనీ, అగ్రిగేటర్ ఉద్యోగం కల్పిస్తే, ఆ సమాచారం అందుతుంది.

పోలవరాన్ని 'తాండవ' దాటించారు

(మొదటి పేజీ తరువాయి)

ప్రవాహ ద్వారాలు ఏర్పాటు చేశారు. వీటిగుండా పోలవరం కాలువ వెళ్తుండగా, కింద తాండవ నది ప్రవహించనుంది. అక్విడక్టుకు ఇరువైపులా వాహనాలు వెళ్లేందుకు రెండు మార్గాలు నిర్మించారు. మరోవైపు నదిలో బోట్ షికారు ఏర్పాటు చేసి, ఇరువైపులా ఫుడ్‌కోర్టులు నిర్మించే పనులపై పర్యాటక శాఖ అధికారులు దృష్టి సారించారు. ఇవి పూర్తయితే ఈ ప్రాంతం పర్యాటకంగా అభివృద్ధి చెందుతుందని స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

– న్యూస్‌టుడే, తుని గ్రామీణం



జామే.. సపోటాలా!

సపోటాలా కనిపిస్తున్నా.. ఇవి జామకాయలే. చెట్టు ఆకులను చూసి లేకపోతే కోసి చూస్తే తప్ప అవి జామ అని గుర్తించలేం. అనకాపల్లి జిల్లా అచ్యుతాపురం మండలం తిమ్మరాజుపేటలో రేవిడి శ్రీను ఇంటి వద్ద ఉన్న చెట్టుకు ఈ కాయలు కనిపించాయి. సాధారణంగా ఆకుపచ్చ, లేతపసుపు రంగులో ఉండాల్సిన కాయలు సపోటాను పోలి ఉండటంతో అందరినీ ఆకట్టుకుంటున్నాయి. ఈ విషయాన్ని ఉద్యానాధికారి పైడిరాజు వద్ద ప్రస్తావించగా ఫాస్పరస్ లోపం వల్ల కాయల్లో ఇలాంటి మార్పులు వచ్చే అవకాశం ఉందని చెప్పారు.

– న్యూస్‌టుడే, అచ్యుతాపురం



స్థూలకాయానికి చాలా కారణాలు

కొవ్వు పదార్థాలు అధికంగా తినడం ఒక్కటే స్థూలకాయానికి కారణం కాదని.. మరెన్నో అంశాలు అందుకు దోహదం చేస్తాయని ఆధునిక విజ్ఞానం పేర్కొంటోంది. అవి.. • మన ఆకలి సంకేతాలు లేదా జీవక్రియలను అస్థిరపరిచే మందులు తీసుకొంటుండటం

• హార్మోన్ల అసమతౌల్యత • గర్భంతో వచ్చే అధికబరువు • నాణ్యతలేని నిద్ర • దీర్ఘకాలంగా ఉండే ఒత్తిడి • చురుగ్గాలేకపోవడం • ఎక్కువ సమయం స్క్రీన్‌కు అతుక్కుపోవడం • పేగుల్లోని బ్యాక్టీరియా కూర్పులో తేడాలు • హార్మోన్లను ఉత్పత్తి చేసే అంతఃస్రావ వ్యవస్థకు విఘాతం కలిగించే రసాయనాలు, కాలుష్యం

– క్రిస్టీ లియాంగ్, ఫిజీషియన్

కూతపెడుతున్న పందెం కోడి

(మొదటి పేజీ తరువాయి)

హైదరాబాద్ బార్కాస్‌లో పహిల్వాన్‌ల వద్ద శిక్షణ పొందిన పుంజులను కొందరు తెచ్చుకుని పోటీలో దింపితే.. మరికొందరు ఆ పహిల్వాన్ వద్ద శిక్షణ పొందిన వారిని తీసుకువచ్చిన కోళ్లకు తర్ఫీదు ఇప్పిస్తుంటారు. కోనసీమలోని రావులపాలెంలాంటి ప్రాంతాల వారైతే కోల్‌కతా నుంచి నిపుణులను రప్పిస్తుంటారు. ఇలా శిక్షణనిచ్చేవారు ఒక్కొక్కరు 10-15 కోళ్లనే పర్యవేక్షిస్తుంటారు. వీరికి నెలకు రూ.15-20 వేలు చెల్లిస్తుంటారు. సాధారణంగా శిక్షణ దసరా నుంచి మొదలుపెడుతుంటారు. ఈ షార్ట్‌టర్మ్ కోర్సు బాగా పాపులర్. కొన్నిచోట్ల క్రాష్‌కోర్సులాగా ఇంకా తక్కువ వ్యవధిలోనూ ఇస్తారు. మరికొన్ని కేంద్రాల్లో ఏడాది పొడవునా శిక్షణ ఇస్తుంటారు.

పందెం కోడితో ఒకరోజు

• పందెం కోడి శిక్షణ వేకువజామున 5 గంటలకే మొదలవుతుంది. పందేనికి 60 రోజుల ముందు నుంచి రోజూ ఉదయాన్నే డ్రైఫ్రూట్ లడ్డూ, ఖీమా, కొన్ని రకాల ఆకుకూరలను ఉడకబెట్టి పెడుతుంటారు.

• 40 రోజుల ముందు నుంచి గుడ్డు తెల్లసొన పెడతారు.

• ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు ఆరుబయట ఉంచుతారు. నడకతోపాటు కొన్ని రకాల కసరత్తులు చేయిస్తారు.

• సాయంత్రం 4 గంటలకు గింజమేత వేస్తారు.

ప్రత్యేక పెంపకం, శిక్షణ కేంద్రాలు

డేగ, నెమలి, కాకి, ముంగిస, సవల, కొక్కిరాయి. . ఇలా పలు రకాల జాతుల కోళ్లతో పందేలు వేస్తుంటారు. వీటిని పందేలకు సిద్ధం చేసేందుకు భారీస్థాయిలో కేంద్రాలు వెలిశాయి. భీమవరం చుట్టుపక్కల ప్రాంతాల్లోనే 200కుపైగా, ఉమ్మడి కృష్ణా జిల్లాలోని నున్న పరిసర ప్రాంతాల్లో 150 వరకు నాటుకోళ్ల పెంపకం కేంద్రాలు/కాక్ ట్రైనింగ్ కేంద్రాలు నిర్వహిస్తున్నారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోనూ దాదాపు 200 వరకు ఉన్నాయి.



కోళ్లకు 'శాక'తీత ప్రక్రియ చేపడుతూ..

• ఆ తర్వాత తెల్లవారేవరకు విశ్రాంతినిస్తారు.

• జనంలో ఉన్నప్పుడు భయపడకుండా ఉండేందుకు చేత్తో మేత పెడతారు. బెరుకును పోగొడతారు.

• చురుగ్గా ఉండేలా చేసేందుకు వారానికి ఒకటి రెండు సార్లు నీటిలో ఈత కొట్టిస్తారు. రింగులో ఐదారు కోళ్లను వదిలేసి, ఏది చివరి వరకూ ఉంటుందో చూస్తారు. మిగిలినవీ అలా ఉండేలా అలవాటు చేస్తారు.

• సంక్రాంతికి వారం ముందు నుంచి పందేనికి వెళ్లే వరకు కోడికి పూర్తిగా విశ్రాంతినిస్తారు.

విటమిన్ ట్యాబ్లెట్లు, యాంటీబయాటిక్స్ రక్షణ

శిక్షణలో భాగంగా కోళ్లకు గస (ఆయాసం) రాకుండా, కొవ్వు పెరగకుండా, నరాలు ఫ్రీ అయ్యేందుకు నాలుగైదు రోజులకోసారి బి విటమిన్, మల్టీ విటమిన్ ట్యాబ్లెట్లు, ఇంజక్షన్లూ ఇస్తుంటారు. చలికాలం కావడంతో కోళ్లకు కొక్కెర వ్యాధి, కొరేగా, ఫంగల్ ఇన్ఫెక్షన్లు రాకుండా నివారించడానికి, వస్తే నియంత్రణ కోసం యాంటీబయాటిక్స్‌నూ వాడతారు.

నీరు'పోత'.. 'శాక'తీత

పోటీలో ఉన్నప్పుడు అవతలి కోడి పొడిచే కత్తిపోట్లు, కాలిగోటి దెబ్బలకు నొప్పి తెలియకుండా ఉండేందుకు శరీరాన్ని సిద్ధం చేసేందుకు నీళ్లపోతలు, 'శాక'లు తీస్తారు. వీటితో కోళ్ల శరీరం గట్టిపడి, దెబ్బ తగిలినా నొప్పి తెలియక పోరాడుతూనే ఉంటాయి.

• నీరుపోతలను ఒక్కో ప్రాంతంలో ఒక్కో రకంగా చేస్తుంటారు. యూకలిప్టస్, కుంకుడు, వెదురు చెట్ల ఆకులు, జామాయిల్, పసుపుకొమ్ములు, తుమ్మ బెరడు వంటి 15-20 రకాలను కలిపి నీటిలో మరిగిస్తారు. ఆ ద్రావణాన్ని చల్లార్చి గోరువెచ్చగా ఉన్నప్పుడు అందులో కోడిని ముంచడం, లేదా కోడిపై పోయడం చేస్తుంటారు. 10-15 రోజులకోసారి ఇలా చేస్తుంటారు.

• పెనం/మూకుడు వేడి చేసి దానిపై చీప్ లిక్కర్ పోసి, వచ్చే ఆవిరిని వస్త్రంతో కోడి శరీరానికి అద్దుతారు. దీన్ని శాక తీయడం అంటారు.

కుక్కుటశాస్త్రమూ ఉందండోయ్!

పందెంలో గెలవాలంటే కోడిని ఏ దిక్కు నుంచి బరిలోకి దించాలి, ఏ రోజు ఏ రకం కోడి పందెం కొడుతుంది, ఏ జాతి కోడి ఏ జాతి కోడితో సరిగా కలబడుతుంది.. ఇలాంటి వాటన్నింటికీ లెక్కలుంటాయి. దీన్ని 'కుక్కుటశాస్త్రం' చూసి నిర్ణయిస్తుంటారని చెబుతారు. ఈ శాస్త్ర ప్రకారం వారాలు, పక్షాల ప్రకారం కొన్ని జాతుల కోడి పుంజుల జీర్ణశక్తి మందగించే రోజులు ఏవో గుర్తిస్తుంటారు.. అలాంటి సమయంలో వాటిని బరిలోకి దింపితే ఓడిపోతాయంటుంటారు. ఉభయగోదావరి జిల్లాల్లో కోడి పందేలను ప్రారంభించే ముందు ఈ కుక్కుటశాస్త్రాన్ని చదువుతుంటారు.

కాలి 'కాటా'తోనే పందేనికి సై

పందేల్లో కోళ్ల కాళ్లకు కత్తులు కట్టి బరిలోకి దింపుతుంటారు. ఉమ్మడి కృష్ణా జిల్లాలోని నున్న తదితర ప్రాంతాల్లో కత్తి కట్టకుండానే పందేనికి సై అంటారు. కోడి కాళ్లకు సహజంగా పెరిగే 'కాటా'నే ఆయుధంగా ఈ పోటీ నిర్వహిస్తుంటారు. కాటాలు పెరుగుతున్నప్పుడు వాటిని షేప్ చేస్తూ.. బరిలోకి దింపే సమయానికి దాన్ని మొనదేలుస్తారు. ఆ కాటాతోనే ఎదుటి కోడిపై దాడి చేసి దెబ్బ తీయాలి కాబట్టి ఈ పోటీ చాలాసేపు కొనసాగుతుంది.

కొత్త జిల్లాల్లో నేటి నుంచే పాలన

(మొదటి పేజీ తరువాయి)

మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. గెజిట్ జారీ చేయాలని ఆదేశాలిచ్చారు.

కొత్త రెవెన్యూ డివిజన్లు

1. అడ్డరోడ్డు జంక్షన్, అనకాపల్లి జిల్లా
2. అద్దంకి, ప్రకాశం జిల్లా
3. పీలేరు, అన్నమయ్య జిల్లా
4. మడకశిర, శ్రీసత్యసాయి జిల్లా
5. బనగానపల్లి, నంద్యాల జిల్లా

తిరుపతి జిల్లా, రెవెన్యూ డివిజన్‌లోకి రైల్వేకోడూరు

ఇప్పటి వరకు అన్నమయ్య జిల్లాలో ఉన్న రైల్వేకోడూరు నియోజకవర్గం.. ఇక నుంచి తిరుపతి జిల్లాలోకి వస్తుంది. కోడూరు, పెనగలూరు, చిట్వేలు, పుల్లంపేట, ఓబులవారిపల్లె మండలాలు తిరుపతి రెవెన్యూ డివిజన్‌లో చేరతాయి.

వైఎస్సార్ కడప జిల్లాలోకి రాజంపేట నియోజకవర్గం, రెవెన్యూ డివిజన్

అన్నమయ్య జిల్లాలో ఉన్న రాజంపేట నియోజకవర్గం, రెవెన్యూ డివిజన్లు.. ఇక నుంచి వైఎస్సార్ కడప జిల్లాలో భాగమవుతాయి. ఇప్పటికే ఈ నియోజకవర్గంలోని ఒంటిమిట్ట, సిద్దవటం మండలాలు కడప రెవెన్యూ డివిజన్‌లో ఉన్నాయి. ఇప్పుడు నందలూరు, రాజంపేట, వీరబల్లి, టి.సుండుపల్లి మండలాలతో రాజంపేట డివిజన్ కూడా కలుస్తుంది. దీంతో వైఎస్సార్ కడప జిల్లాలో మొత్తం 5 రెవెన్యూ డివిజన్లు ఉంటాయి.

తూర్పుగోదావరి జిల్లాలోకి మండపేట నియోజకవర్గం

ఇప్పటి వరకు అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో ఉన్న మండపేట నియోజకవర్గం తూర్పుగోదావరి జిల్లాలో భాగమవుతుంది. ఈ నియోజకవర్గంలోని మండపేట, రాయవరం, కపిలేశ్వరపురం మండలాలు రామచంద్రాపురం రెవెన్యూ డివిజన్ నుంచి రాజమహేంద్రవరం రెవెన్యూ డివిజన్‌లో విలీనమవుతాయి.

ప్రకాశం జిల్లాలోకి కందుకూరు, అద్దంకి నియోజకవర్గాలు

• బాపట్ల జిల్లాలోని అద్దంకి నియోజకవర్గాన్ని ప్రకాశం జిల్లాలో విలీనం చేస్తున్నారు. అద్దంకి కొత్త రెవెన్యూ డివిజన్‌గా ఏర్పాటవుతోంది. ఇందులో అద్దంకి, దర్శి నియోజకవర్గాలు ఉంటాయి.

• శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలోని కందుకూరు నియోజకవర్గం రెవెన్యూ డివిజన్‌తోపాటు ప్రకాశం జిల్లాలో విలీనమవుతుంది. గూడూరు నియోజకవర్గంలోని మూడు మండలాలు డివిజన్‌తో సహా తిరుపతి జిల్లా నుంచి నెల్లూరు జిల్లాలో కలుస్తాయి.

తిరుమలలో నైవేద్యం, ప్రసాదాల నాణ్యతపై పిటిషన్..

రిజిస్ట్రీ అభ్యంతరాలపై తెలంగాణ హైకోర్టు నిర్ణయం వాయిదా

ఈనాడు, హైదరాబాద్: తిరుమలలో నైవేద్యం, ప్రసాదాల తయారీలో నాణ్యత ఉండటం లేదంటూ దాఖలైన ప్రజాప్రయోజన వ్యాజ్యాన్ని స్వీకరించడంలో రిజిస్ట్రీ అభ్యంతరాలపై వాదనలను విన్న హైకోర్టు నిర్ణయాన్ని వాయిదా వేసింది. ఆగమశాస్త్రం ప్రకారం నైవేద్యం సమర్పించకపోవడంపై యుగతులసి ఫౌండేషన్ ఛైర్మన్ కె.శివకుమార్ తదితరులు వ్యాజ్యం దాఖలు చేశారు. రిజిస్ట్రీ అభ్యంతరాలపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేశ్ కుమార్ సింగ్, జస్టిస్ జి.ఎం.మొహియుద్దీన్‌లతో కూడిన ధర్మాసనం విచారణ చేపట్టింది. పిటిషనర్ తరఫు న్యాయవాది సుశీలారామ్ వాదనలు వినిపిస్తూ.. గతంలో బోర్డు ఆమోదించిన తీర్మానాలను అమలుచేయడం లేదన్నారు. పిటిషనర్ స్వయంగా బోర్డు సమావేశంలో ఉండగా చేసిన తీర్మానాలను అమలుచేయడం లేదన్నారు. ఈ దశలో ధర్మాసనం జోక్యం చేసుకుంటూ 'ఏదైనా వినతిపత్రం సమర్పించారా' అని ప్రశ్నించగా. . పిటిషనర్ బోర్డు సమావేశంలోనే మౌఖికంగా విజ్ఞప్తి చేసినట్లు తెలిపారు. భక్తుల విశ్వాసాలను పరిరక్షించాల్సి ఉందని, ఇందులో జోక్యం చేసుకోవాలని కోరారు. వాదనలను విన్న ధర్మాసనం రిజిస్ట్రీ అభ్యంతరాలపై నిర్ణయాన్ని వాయిదా వేసింది.

కొత్త జిల్లాలకు కలెక్టర్లు.. ఎస్పీల నియామకం

ఈనాడు, అమరావతి: కొత్తగా ఏర్పాటు చేసిన పోలవరం, మార్కాపురం జిల్లాలకు కలెక్టర్లు, ఎస్పీలు, జాయింట్ కలెక్టర్లను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ మంగళవారం రాత్రి ఆదేశాలు జారీ చేశారు.

• అల్లూరి సీతారామరాజు (ఏఎస్ఆర్) జిల్లా కలెక్టర్ ఎ.ఎస్. దినేష్‌కుమార్‌కు పోలవరం జిల్లా ఇన్‌ఛార్జ్ కలెక్టర్‌గా బాధ్యతలు అప్పగించారు.

• ఏఎస్ఆర్ జిల్లా జాయింట్ కలెక్టర్‌గా ఉన్న తిరుమణి శ్రీ పూజను పోలవరం జిల్లా ఇన్‌ఛార్జ్ జేసీగా నియమించారు.

• ఏఎస్ఆర్ జిల్లా ఎస్పీగా ఉన్న అమిత్ బర్దర్‌కు పోలవరం జిల్లా ఇన్‌ఛార్జ్ ఎస్పీగా బాధ్యతలు అప్పగించారు.

• ప్రకాశం జిల్లా కలెక్టర్ పి.రాజాబాబును మార్కాపురం జిల్లా ఇన్‌ఛార్జ్ కలెక్టర్‌గా నియమించారు. • ప్రకాశం జిల్లా జాయింట్ కలెక్టర్ రోనంకి గోపాలకృష్ణకు మార్కాపురం జిల్లా ఇన్‌ఛార్జ్ జేసీగా బాధ్యతలు అప్పగించారు.

• ప్రకాశం జిల్లా ఎస్పీ వి.హర్షవర్ధన్‌రాజును మార్కాపురం జిల్లా ఇన్‌ఛార్జ్ ఎస్పీగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి.

ఈనాడు

భిన్నత్వమే భారతావని బలం

'భారతదేశం నా మాతృభూమి... భారతీయులందరూ నా సహోదరులు' అన్న ప్రతిజ్ఞ నోటిమాటగా మిగిలిపోతోంది. భారతావనికి బలిమీ కలిమీ అయిన భిన్నత్వంలో ఏకత్వ భావన బీటలువారుతోంది. రంగు, రూపం, భాష, వస్త్రధారణ, ఆహార అలవాట్లు, వ్యక్తిగత విశ్వాసాలు, ప్రాంతాల ఆధారంగా తోటి భారతీయులను చిన్నచూపు చూస్తూ దాడులకు పాల్పడుతున్న ప్రబుద్ధ మూకలు పలు రాష్ట్రాల్లో చెలరేగిపోతున్నాయి. జాతీయ సమైక్యత, సమగ్రతలను అవి ప్రమాదంలో పడేస్తున్నాయి. వ్యక్తిగత భద్రతపై భయాందోళనలతో చెన్నై, బెంగళూరు, హైదరాబాద్, పుణె తదితర నగరాల్లోని వేల మంది ఈశాన్య రాష్ట్రాలవాసులు ఒక్కసారిగా స్వస్థలాలకు తరలిపోయిన దృశ్యాలు 2012లో దేశమంతా కలకలం సృష్టించాయి. ఆపై రెండేళ్లకు అరుణాచల్ ప్రదేశ్‌కు చెందిన ఓ విద్యార్థిని దిల్లీలో కొట్టిచంపిన దారుణ ఘటన జాతీయస్థాయిలో చర్చనీయాంశమైంది. స్వదేశంలోనే తీవ్రస్థాయి వివక్షను ఎదుర్కొంటూ; తరచూ మానసిక, భౌతిక దాడులకు గురవుతున్న ఈశాన్య భారత ప్రజానీకానికి రక్షణ కల్పించేందుకు వ్యవస్థాగతంగా తీసుకోవాల్సిన చర్యలపై అప్పట్లో బజ్‌బారువా కమిటీ ఏర్పాటైంది. జాతి విద్వేష నేరాల కట్టడికి ఆ సంఘం చేసిన సూచనలు నేటికీ పూర్తిగా అమలులోకి రాలేదు. ఈశాన్య భారత విద్యార్థులు, కార్మికులు, వృత్తినిపుణులపై ఇతర ప్రాంతాల్లో వేధింపుల పర్వాలూ ఆగలేదు. ఉత్తరాఖండ్‌లో ఓ అరాచక గుంపు చేతుల్లో ప్రాణాలు కోల్పోయిన త్రిపుర విద్యార్థి విషాదోదంతమే దీనికి తాజా తార్కాణం!

'నడుచుకుంటూ వెళ్తున్న నా దగ్గరికి ఇద్దరు వచ్చి ఉత్తరాది వాడివా అని అడిగారు. ఈశాన్య భారత్ నుంచి వచ్చాననంటే... ఓ అదా! చైనా ఏరియా' అనేసి గట్టిగా కొట్టి వెళ్లిపోయారు'- బెంగళూరులో తనకు ఎదురైన చేదు అనుభవాన్ని ఇలా సామాజిక మాధ్యమాల్లో పంచుకున్నాడొక వ్యక్తి. దిల్లీలో ఒకేరోజు తాను రెండు సార్లు 'చింగ్ చాంగ్ చైనా' అనే వికృత వ్యాఖ్యలకు బాధితురాలైన సంగతిని మేఘాలయకు చెందిన ఓ మహిళ కన్నీళ్లతో వెల్లడించారు. దేశ రాజధాని నగరంలోనే లుంగీలు ధరించారని, హిందీలో మాట్లాడలేదని ఇద్దరు కేరళ విద్యార్థులపై స్థానికులు, కొందరు పోలీసులు ఇటీవల దాడిచేశారు. కొద్దిరోజుల క్రితం ఒడిశాకు చెందిన వలస కార్మికుణ్ని తమిళనాడులో కొందరు కుర్రాళ్లు కొట్టి గాయపరిచారు. కశ్మీరీ విద్యార్థులూ చిరువ్యాపారులపై హిమాచల్ ప్రదేశ్‌లో దాష్టీకాలు జరుగుతున్నట్లు కథనాలు వెలువడుతున్నాయి. తప్పుడు అభిప్రాయాలూ అపనమ్మకాలతో పరాయి ప్రాంతాలవారిపై అకృత్యాలకు తెగబడే పెడపోకడలు అవాంఛనీయమైనవి. కిందటి నెలలో సుప్రీంకోర్టు వ్యాఖ్యానించినట్లు- ప్రజలంతా కలిసిమెలిసి జీవించే చోట ఇలాంటివి అసలు ఆమోదనీయమే కావు!

'ఈశాన్య రాష్ట్రాలు భారతదేశ వైవిధ్యానికి ప్రతీకలు' అని ప్రధాని మోదీ గతంలో అభివర్ణించారు. జాతీయ ప్రధాన స్రవంతితో అవి సమైక్యం కావాలని ఆకాంక్షించారు. చూడటానికి భిన్నంగా కనిపిస్తున్నారనో, వేరే భాష మాట్లాడుతున్నారనో సాటి భారతీయుల పట్ల అమానవీయంగా ప్రవర్తిస్తే- భారత జాతీయతను అవమానించినట్లే! జాతి ఐక్యతను చేజేతులా దెబ్బతీసినట్లే! రాష్ట్రాల సమాహారమైన భారత్‌లో ఎక్కడి వారైనా ఎక్కడికైనా వెళ్లి, స్థిరపడి, శాంతియుతంగా పనిచేసుకోవచ్చునని సుప్రీంకోర్టు సైతం గతంలో స్పష్టీకరించింది. ఆ విధంగా న్యాయపాలిక పట్టంకట్టిన రాజ్యాంగ స్ఫూర్తికి కట్టుబడటం భారతీయులందరి కర్తవ్యం. జనభారత సాంస్కృతిక సామాజిక వైవిధ్యాన్ని గౌరవించడమే నిజమైన దేశభక్తుల లక్షణం. ఆ సంగతిని స్మరణలో ఉంచుకుంటూ నూతన సంవత్సరానికి సమరసాలోచనలతో స్వాగతం పలుకుదాం!



గౌరవం ఎవరికి వారు సంపాదించుకునేది కానీ బలవంతాన తీసుకునేది కాదు. వ్యక్తి చర్యలతో, నైతిక నిష్ఠతో మాత్రమే నిజమైన గౌరవాన్ని పొందుతాడు. అధికారంతోనో, హోదాతోనో తప్పనిసరై ఇచ్చే గౌరవం తాత్కాలికమే.

– జస్టిస్ మదన్ బి.లోకూర్

కొత్త దృష్టితో చూద్దాం!

సంవత్సరం మారే క్షణం గడియారంలో కాదు, మన లోపల జరుగుతుంది. చివరి అర్ధరాత్రి, ఆకాశంలో బాణాసంచా వెలుగులు విరుస్తుంటే, మనసులో మాత్రం ఒక మౌనదీపం వెలుగుతుంది. అది వెలుగూ కాదు, చీకటీ కాదు. అనుభూతి. జీవితం తనను తాను చూసుకునే క్షణం.

పాత సంవత్సరం మనకు కేవలం రోజులు ఇవ్వలేదు. అది మనల్ని మనమే ఎదుర్కొనేలా చేసింది. నవ్వించింది, కన్నీరు పెట్టించింది. కొన్ని సందర్భాల్లో దేవుణ్ని నిందించాం. కొన్ని సందర్భాల్లో ఆయన్నే శరణు వేడాం. అయినా జీవితం నడిచింది. శ్వాస ఆగలేదు. ఆశ చావలేదు. అదే పాత సంవత్సరం మనకిచ్చిన అతిపెద్ద వరం. వీడ్కోలు అనేది విస్మరణ కాదు. విడిచిపెట్టడం. మనసులో పేరుకుపోయిన బాధలు, అపార్థాలు, అపజయాల బరువును మెల్లగా దించేయడం. గతించిన ఏడాదికి మనం చెప్పాల్సింది ఒకటే. ధన్యవాదాలు!

కొత్త సంవత్సరం తలుపు తట్టదు. ఆకాశం నుంచి దిగిరాదు. అది మెల్లగా మన హృదయంలోకి అడుగుపెడుతుంది... ఖాళీ కాగితంలా. దానిపై ఏమి రాయాలో మనమే నిర్ణయించుకోవాలి. కొత్త సంవత్సరం అంటే కొత్త దుస్తులు ధరించడం కాదు. కొత్త మాటలు చెప్పడం కాదు. కొత్త దృష్టితో జీవితాన్ని చూడటం. అదే మనలో జరిగే నిజమైన మార్పు. ఉదయం లేచి శ్వాస తీసుకుంటున్నామంటే, అదొక ఆశీర్వాదం! సాయంత్రం మనసు ప్రశాంతంగా ఉంటే, అదొక సాధన. రోజూ సాటివారి పట్ల కాస్త మానవత్వం చూపగలిగితే... అదే ఆధ్యాత్మికత. కొత్త సంవత్సరంలో మనం పెద్ద సంకల్పాలు చెప్పుకోకపోయినా ఫరవాలేదు. రోజుకు ఒక మంచి ఆలోచన చాలు. మనసుకు నచ్చని దారిలో నడవకుండా ఆగే నిజాయతీ చాలు.



అంతర్యామి

మనలో మనం ఒక మాట చెప్పుకొందాం... 'ఇప్పటివరకు ఎలా ఉన్నానో కాదు, ఇకపై ఎలా ఉండాలో నేనే నిర్ణయిస్తాను'. అదే కొత్త సంవత్సరానికి హృదయపూర్వక ఆహ్వానం. మన జీవితపుస్తకమూ సంవత్సరం లాంటిదే. కొన్ని పుటలు వెలుతురుతో నిండితే, మరికొన్ని చీకటితో మసకబారినవిగా ఉంటాయి. ఈ రెండింటి మధ్యే అవగాహన పుడుతుంది. పాత సంవత్సరం మనల్ని కొన్ని నిజాల ముందు నిలబెట్టింది. మన బలహీనతలు, భయాలు, లోపలి ఖాళీలు... వాటిని అంగీకరించి, ముందుకు నడవాలి. ప్రతి గాయం ఒక జ్ఞాపకం, ప్రతి ఓటమి ఒక మౌనపాఠం. ఇవన్నీ లేకపోతే మన ప్రయాణం ఉపరితలంలోనే ఉండిపోయేది. అందుకే పాత సంవత్సరానికి కన్నీళ్లతో కాదు, అవగాహనతో వీడ్కోలు పలకాలి.

ఆనందాన్నిస్తాననో, బాధల్లేకుండా చూస్తాననో కొత్త సంవత్సరం మనకేమీ మాటివ్వదు. కానీ చైతన్యంగా జీవించే అవకాశం మాత్రం ఇస్తుంది. ప్రతి క్షణాన్నీ యాంత్రికంగా కాకుండా, అనుభూతితో జీవించే అవకాశం. మాటలు తక్కువైనా మన మౌనం లోతుగా ఉండే అవకాశం. మన ప్రార్థనలు పదాలతో కాకుండా, ప్రవర్తనతో చేసే అవకాశం. ఆ అవకాశం చేతిలో పడినప్పుడు దాన్ని గట్టిగా పట్టుకోవడమే కొత్త సంవత్సరానికిచ్చే నిజమైన స్వాగతం!

– ఆనందసాయి

ఆయుధోత్పత్తిలో ఆత్మనిర్భరతే లక్ష్యం

భారతదేశ రక్షణోత్పత్తుల విధానం రూపాంతరం చెందుతోంది. ఈ మేరకు రక్షణ శాఖ 2025ను సంస్కరణల సంవత్సరంగా ప్రకటించింది. ఆయుధ సేకరణలో వ్యూహాత్మక మార్పులు చేపట్టింది. ఆయుధోత్పత్తి రంగంలో ఆత్మనిర్భరత సాధనే లక్ష్యంగా నూతన ఏడాదిలో మరింత వడివడిగా అడుగులు పడాలి.

రక్షణ శాఖ ఆయుధ సేకరణ విధానాన్ని (డీఏపీ) మూడు అంచెల వ్యూహంగా రూపొందిస్తోంది. ఇంతకాలం, భారతలో విదేశీ సంస్థల భాగస్వామ్యంతో ఆయుధాలను ఉత్పత్తి చేస్తే, వాటిపై మేధాపరమైన, యాజమాన్య పరమైన హక్కులు ఎవరికి చెందుతాయనే మీమాంస ఉండేది. దాన్ని తొలగించడానికి విదేశీ భాగస్వాములను ప్రాథమిక కాంట్రాక్టర్లుగా వర్గీకరించారు. వ్యూహంలో రెండో అంచె కింద రక్షణ ఉత్పత్తులను వేగంగా తయారు చేసి, ఎగుమతి చేయడానికి ప్రాధాన్యమిస్తారు. మూడో అంచె కింద విదేశీ భాగస్వాములు విధిగా సాంకేతిక పరిజ్ఞానాన్ని భారతకు బదిలీ చేయాలనే షరతు విధిస్తారు. విదేశీ సాంకేతికతతో ఇక్కడ తయారయ్యే ఆయుధాలలో భారతీయ విడి భాగాలు, సాంకేతికతలను తప్పనిసరిగా ఉపయోగించాల్సి ఉంటుంది.



భారతదేశం 2001లోనే నిర్దిష్ట శాతం విదేశీ యాజమాన్యంతో స్థానికంగా ఆయుధ తయారీకి అనుమతించింది. విదేశీ వాటాను పెంచుతూ వచ్చింది. 2020 వచ్చే సరికి విదేశీ యాజమాన్యాన్ని 74శాతానికి పెంచింది. అత్యాధునిక టెక్నాలజీ వాడే సందర్భాల్లో దీన్ని నూరు శాతానికి అనుమతించింది. ఇది వందశాతం విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు (ఎఫ్‌డీఐ) పెట్టిన సందర్భాలకు వర్తిస్తుంది. నూరు శాతం పెట్టుబడితో విదేశీ కంపెనీలకు పూర్తి యాజమాన్య హక్కు లభిస్తుంది కాబట్టి, అవి మన దేశానికి ఆధునిక సాంకేతికతలను అందిస్తాయని ఆశించారు. గతంలో ఆయుధోత్పత్తి రంగంలో విదేశీ భాగస్వామ్యం ఎలాంటి ఫలితాలను ఇచ్చిందో ఒకసారి సింహావలోకనం చేసుకుంటే, తాజా విధానంపై ఒక అంచనాకు రావచ్చు.


ఎఫ్‌డీఐలపై ఆశలు వమ్ము

భారతీయ రక్షణ పరిశ్రమల్లోకి 2001-2025 సెప్టెంబరు మధ్య కాలంలో ప్రవహించిన మొత్తం ఎఫ్‌డీఐలు కేవలం 2.65 కోట్ల డాలర్లు మాత్రమే. అందులో 1.64 కోట్ల డాలర్ల పెట్టుబడులు 2020 సరళీకరణ తరవాత వచ్చినవే. రక్షణ పరిశ్రమల్లో మెజారిటీ యాజమాన్యం ఇస్తామన్నా విదేశీ కంపెనీలు ముందుకు రాకపోవడం గమనార్హం. సాధారణ కంపెనీల్లా రక్షణ సంస్థలు మార్కెట్ కోసం పనిచేయకపోవడమే దీనికి కారణం. అధునాతన రక్షణ సాంకేతికతలను ఇతర దేశాలకు ఎంతమేర ఇవ్వాలనేది ఆ కంపెనీల మాతృదేశ విధానాలు, ప్రయోజనాలపై ఆధారపడి ఉంటుంది. రక్షణ సాంకేతికతల ఎగుమతి, లైసెన్సింగ్‌పై ఆ కంపెనీల మాతృదేశాలు నియంత్రణ, పరిమితులు విధించవచ్చు. భౌగోళిక రాజకీయాలు, రక్షణ వ్యూహాలపై ఆధారపడి ఆయా దేశాలు తమ విధానాలను రూపొందించుకుంటాయి. వాటిని సదరు కంపెనీలు ఆచరించకతప్పదు. చైనా దూకుడును చూసి పాశ్చాత్య దేశాలు పౌర, రక్షణ ప్రయోజనాలు రెండింటికీ ఉపయోగపడే సాంకేతికతల బదిలీపై నియంత్రణ విధిస్తున్నాయి. ఎలక్ట్రానిక్స్, డేటా, కృత్రిమ మేధ పరిజ్ఞానాల బదిలీపై జాగ్రత్త వహిస్తున్నాయి. అధునాతన పారిశ్రామిక రీతులను అందజేయడానికి వెనకాడుతున్నాయి. తమ కంపెనీలు రక్షణ రంగంలో ఇతర దేశాల్లో పెట్టే పెట్టుబడులపై నిఘా వేస్తున్నాయి. ఇలాంటి వాతావరణంలో కేవలం నూరు శాతం ఎఫ్‌డీఐని, విదేశీ యాజమాన్యాన్ని అనుమతించినంత మాత్రాన అధునాతన రక్షణ పరిజ్ఞానాలు మనకు అందుతాయని ఆశించడం అడియాసే అవుతుంది. భారతీయ భాగస్వాములకు మెజారిటీ వాటాలు ఉన్న రక్షణ పరిశ్రమల్లో సైతం అధునాతన సాంకేతికతలను అందించే విదేశీ భాగస్వాములకు వీటో అధికారం ఉంటోంది. సదరు సాంకేతికతలు విదేశీ సంస్థల దగ్గరే ఉంటాయి. ఈ పరిస్థితిని నివారించడానికి 2025 రక్షణ విధానం కొన్ని నియంత్రణలు విధించినా వాటిని నిక్కచ్చిగా అమలు చేస్తే విదేశీ ఆయుధ కంపెనీలు భారతకు దూరమైపోవచ్చు. విదేశీ కంపెనీలు స్వదేశంలోని ప్రభుత్వ విధానాలను, ఎగుమతి కంట్రోళ్లను అనుసరిస్తాయే తప్ప ఇండియా కోసం వాటిని వదులుకుంటాయని భావించలేం!

సాంకేతికతల బదిలీయే ముఖ్యం

రక్షణ రంగంలోనే కాదు పౌర పరిశ్రమల్లోనూ సొంత సాంకేతికతలను వృద్ధి చేసుకోవడానికి భారతీయ కంపెనీలు పట్టుదల చూపడం లేదనే విమర్శలున్నాయి. మార్కెట్ బాగా ఉండే ఆటోమొబైల్ రంగంలో కూడా ఇదే పరిస్థితి. భారతీయ కంపెనీలు సొంతంగా పరిశోధన, అభివృద్ధి(ఆర్‌అండ్‌డీ)కి పెట్టుబడులు కేటాయించకుండా విదేశీ ఆటోమొబైల్ కంపెనీలకు రాయల్టీలు, సాంకేతిక ఫీజులు చెల్లించడంతో సరిపెట్టేస్తున్నాయి. దక్షిణ కొరియా, తుర్కియేలు ఆర్‌అండ్‌డీకి, ఎగుమతులకూ ప్రాధాన్యమిస్తూ సొంతంగా బలమైన పారిశ్రామిక పునాదిని నిర్మించుకున్నాయి. తుర్కియే మొదట విదేశీ కంపెనీలతో కలిసి సంయుక్త పరిశ్రమలను ప్రారంభించినా క్రమంగా సొంత కంపెనీలను అభివృద్ధి చేసుకుంది. విదేశీ సహకారం, భాగస్వామ్యం తాత్కాలికమే తప్ప శాశ్వతం కాదు. బ్రెజిల్, ఇజ్రాయెల్, సింగపూర్‌లలో ప్రభుత్వాలే పెద్ద పాత్ర పోషించాయి. మొత్తంగా, ఎఫ్‌డీఐ, విదేశీ భాగస్వామ్యాలు తాత్కాలికమేనని గ్రహించాలి. దీర్ఘకాలంలో సొంత కాళ్లపై నిలబడటమే ధ్యేయంగా పని చేస్తూ, ఆత్మనిర్భరత సాధించాలి.

మన దేశంలో ఆయుధాల తయారీకి ముందుకొచ్చే విదేశీ కంపెనీలు (లేదా ఒరిజినల్ ఎక్విప్‌మెంట్ తయారీదారులు-ఓఈఎంలు) భారత్‌లో నెలకొల్పే పరిశ్రమల్లో 74శాతం వాటా ఉన్నా 100 శాతం వాటా ఉన్నా తమ మేధాహక్కులను మాత్రం వదులుకోవు. తమ మాతృదేశ ప్రభుత్వాలు అనుమతించిన మేరకే టెక్నాలజీని మనకు బదిలీ చేస్తాయి. కాబట్టి యుద్ధ విమానాలు, ఇతర అత్యాధునిక ఆయుధాల డిజైన్‌నూ, సోర్స్ కోడ్‌నూ, ఆధునికీకరణ హక్కులనూ మనకు ఇవ్వాలని పట్టుబట్టాలి. స్వదేశీ ఆయుధోత్పత్తి కంపెనీలను బలోపేతం చేసుకోవాలి. ఈ విషయంలో చైనా సాధించిన విజయాల నుంచి పాఠాలు నేర్చుకోవాలి. భారత్‌లో పూర్తిగా విదేశీ యాజమాన్యంతో రక్షణ పరిశ్రమలను అనుమతించేకన్నా సాంకేతికతను మనకు బదిలీ చేసే విదేశీ కంపెనీలతో సంయుక్త పరిశ్రమలను నడపాలి. మన ప్రభుత్వ, ప్రైవేటు రక్షణ పరిశ్రమలకే అధిక ప్రాధాన్యమివ్వాలి. కీలక ఆయుధాల విషయంలో ప్రభుత్వానికి ప్రత్యేక హక్కులు, వాటాలు ఉండాలి. అధునాతన సాంకేతికతల బదిలీ కోసం స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలలో పట్టుబట్టాలి. దీర్ఘకాలిక ప్రయోజనాలకే పట్టం కట్టాలి.



ప్రొఫెసర్ కె.ఎస్.చలపతిరావు
సీనియర్ రీసెర్చ్ ఫెలో, అకాడమీ ఆఫ్ బిజినెస్ స్టడీస్, దిల్లీ
విశ్రాంత ఆచార్యులు, ఐఎస్ఐడీ



టాటా... వీడుకోలూ..!

ఐస్‌క్రీమో, చిప్స్ పాకెట్టో హ్యాపీగా తినడం మొదలెడతాం. తినేశాక అయ్యో అప్పుడే అయిపోయాయే... అనిపిస్తుంది. ఈ అయిపోయిన దిగులు తిన్న ఆనందాన్ని డామినేట్ చేసేస్తుంది. చుట్టాలొస్తే ఎగిరిగంతేస్తాం. అదే వాళ్లు వెళ్లిపోతుంటే చెప్పలేనంత గుబులు గుండెను కమ్మేస్తుంది. ఆపకుండా కబుర్లు చెబుతూ వీడ్కోలు ఘట్టంలోనే గంటలు గంటలు గడుపుతాం. టూర్ వెళ్లాలంటే హుషారుగా బయల్దేరతాం. తీరా ముగించుకుని వచ్చేటప్పుడు నీరసంగా కాళ్లీడ్చుకుంటూ వస్తాం. అలసటకన్నా టూర్ అయిపోయింది, రేపటినుంచి మళ్లీ రొటీన్ మొదలు అన్న బాధ ఎక్కువగా ఉంటుంది. ఆరంభం ఇచ్చే హుషారు అంతిమం ఎందుకివ్వదు? నిజానికి చూసిన, అనుభూతి చెందిన అంశం మరింత ఎక్కువ తృప్తినీ, సంతోషాన్నీ ఇవ్వాలి కదా? ఇప్పుడెందుకు ఈ సందేహం వచ్చిందంటే... ఒక వారం రోజులుగా ఈ సంవత్సరాంతం సందర్భం కూడా అలాగే బాధపెడుతోంది మరి!

'ఏంటో నిన్నగాక మొన్న వచ్చినట్టుంది. అప్పుడే అయిపోతోందంటే దిగులుగా ఉంది' అన్నమాట చాలామంది నోట వినిపించింది. ఎందుకలా? అన్ని సంవత్సరాల్లాగే ఇదీ 365 రోజులూ ఉంది, మూడు కాలాల్నీ రుచి చూపించింది. అయినా ఎందుకీ అసంతృప్తి? అంటే- ఇది కొత్తేం కాదు... చాలా సహజమైన ఫీలింగేనంటున్నారు నిపుణులు. 'ఎండ్ ఆఫ్ ద ఇయర్ బ్లూస్' అని దీనికో పేరూ ఉంది. ఈ పరిస్థితికి కారణమేంటో తెలిస్తే పరిష్కరించుకోవడం తేలికవుతుంది కదా. భౌతికంగానూ మానసికంగానూ దీనికి రెండు రకాల కారణాలున్నాయి. సహజంగా సంవత్సరం మారేదెప్పుడూ చలికాలమే కాబట్టి ఎండ తక్కువ, చలెక్కువ. దాంతో 'హ్యాపీ కెమికల్' అయిన సెరెటోనిన్ ఉత్పత్తి తగ్గి, నిద్రకు తోడ్పడే మెలటోనిన్ పెరుగుతుంది. ఫలితంగా మూడ్ ఉత్సాహంగా ఉండదు. ఎప్పుడూ నిద్రపోవాలనిపిస్తుంది. ఈ పరిస్థితిని 'సీజనల్ ఎఫెక్టివ్ డిజార్డర్- శాడ్' అంటారు. 'శీతవేళ రానీయకు, శిశిరానికి చోటీయకు...' అని మన కవులు హెచ్చరించిందీ దీని గురించే.

ఇక సైకలాజికల్, ఎమోషనల్ విషయానికొస్తే... మనిషి ఆశాజీవి. కొత్త ఏడాదిని ఎన్నెన్నో ఆశలతో ఆహ్వానిస్తాడు. అన్నీ అనుకున్నట్లు జరిగితే అది జీవితం ఎందుకవుతుంది? ఊహించని ఉపద్రవాలేవో ముంచుకు రావొచ్చు, అనుకున్నది సాధించడంలో విఫలమై ఉండొచ్చు. కొందరికి ప్రియతములు దూరమై ఉండవచ్చు, చేదు అనుభవాలు ఎదురై ఉండవచ్చు. ఆర్థికనష్టాలో ఆరోగ్య సమస్యలో వేధించి ఉండవచ్చు. తెలిసో తెలియకో పొరపాట్లు చేసి ఉండొచ్చు. ఆరంభంలో ఆశలు పెట్టుకున్నట్లే చివరలో వెనక్కి తిరిగి చూసుకోవడమూ మనిషి నైజం. ఆ క్రమంలోనే అనుకున్నంత సంతోషంగా ఏడాదిని గడపలేక పోయామన్న అసంతృప్తి ఇయర్ ఎండ్ బ్లూస్‌కి కారణమై వేధిస్తుంది. అలాగని కేలెండర్‌ని తిప్పకుండా ఉన్నంతమాత్రాన పొద్దు పొడవకుండా ఉండదు కదా! సినీ కవి చెప్పినట్లు- నిన్న మరల రాదు, రేపు మనది కాదు... నేడే నిజం! దాన్ని మనసారా ఆస్వాదించడమే మనం చేయగల పని. అందుకే పాత ఏడాదికి హ్యాపీగా టాటా చెప్పేద్దాం!

– విస్మయ



తీరని వ్యథ

దేశీయంగా ఆహార వృథా పెద్ద సమస్యగా మారింది. సరైన నిల్వ వసతులు లేకపోవడం వల్ల ఏటా పెద్దమొత్తంలో సాగు, ఇతర ఉత్పత్తులు చెత్తబుట్టలపాలవుతున్నాయి. దానివల్ల పెట్టుబడులతో పాటు నీరు, భూమి వంటి విలువైన వనరులు వృథా అవుతున్నాయి. ఆహార ధరలు వినియోగదారులకు భారంగా మారుతున్నాయి. గ్రీన్‌హౌస్ వాయువులు కట్టుతప్పడానికీ అవి కారణం అవుతున్నాయి. నాబార్డ్ కన్సల్టెన్సీ సర్వీసెస్ (నాబ్‌కాన్) అధ్యయనం-2022 ప్రకారం ఇండియాలో చేతికొచ్చిన తరవాత ఆయా ఉత్పత్తులు ఎంత శాతం మేర వృథా అవుతున్నాయంటే...

తృణధాన్యాలు	3.89–5.92
పప్పుధాన్యాలు	5.65–6.74
నూనె గింజలు	2.87–7.51
పండ్లు	6.02–15.05
కూరగాయలు	4.87–11.61
టీ, కాఫీ లాంటి తోటపంటలు, సుగంధ ద్రవ్యాలు	1.29–7.33
పాలు	0.87
మంచినీటి మత్స్య ఉత్పత్తులు	4.86
సముద్ర మత్స్య ఉత్పత్తులు	8.76
మాంసం	2.34
కోళ్లు	5.63
గుడ్లు	6.03

(ఆధారం: లోక్‌సభలో కేంద్రం వెల్లడించిన వివరాలు)

ప్రవాస నిపుణులకు సాదర స్వాగతం!

ఇంతవరకు వివిధ మంత్రిత్వ శాఖలు, విభాగాలు ఎవరికి వారే అన్నట్లుగా పరిశోధన ప్రాజెక్టులను విడివిడిగా నిర్వహిస్తున్నాయి. ఇలాంటి వాటిని సమన్వయ పరచడం భారత్ టాలెంట్ ఫ్రేమ్‌వర్క్ లక్ష్యం. ఇది రెండు మూలస్తంభాలపై ఆధారపడింది. ఒకటి- భారత్ స్టే, రెండు భారత్ రిటర్న్. దేశంలోని ప్రతిభావంతులైన పట్టభద్రులు, శాస్త్రవేత్తలు, పరిశోధకులను స్వదేశంలోనే ఉండేలా ప్రోత్సహించడానికి భారత్ స్టే ఉపకరిస్తుంది. దీనికింద దీర్ఘకాల పరిశోధనలకు గ్రాంట్లు ఇస్తారు. పరిశ్రమలకూ విద్యాలయాలకూ మధ్య అనుసంధానత ఏర్పరుస్తారు. వృత్తి అవకాశాలు కల్పించడం, నవీకరణ కారిడార్ల ఏర్పాటు వంటి చర్యలూ చేపడతారు. భారత్ రిటర్న్ పథకం కింద విదేశాల్లోని భారతీయ శాస్త్రజ్ఞులు, పరిశోధకులను స్వదేశానికి ఆకర్షిస్తారు. వారికి సత్వర వీసాల జారీ, పన్ను రాయితీలు, నైపుణ్యాల మెరుగు కోసం సౌకర్యాలు, జీవిత భాగస్వాములకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తారు.

తోడ్పాటు అందితేనే...

కేంద్ర విద్య, సైన్స్, టెక్నాలజీ శాఖలు విదేశాల్లో లబ్ధప్రతిష్ఠులైన భారత సంతతి శాస్త్రవేత్తలను, విద్యావేత్తలను కనీసం స్వల్పవ్యవధి కోసమైనా స్వదేశం రప్పించడానికి సన్నాహాలు చేస్తున్నాయి. వారికి ఐఐటీలు, ఐఐఎస్‌సీ, జాతీయ ప్రయోగశాలల్లో నాయకత్వ స్థానాలను కల్పిస్తారు. పోస్ట్ డాక్టోరల్ ఫెలోషిప్‌లు ఇస్తారు. ఇది మన దేశంలో పరిశోధన, అభివృద్ధి (ఆర్‌అండ్‌డీ) ఊపందుకోవడానికి తోడ్పడుతుంది. బ్రెయిన్ గెయిన్ భారత్ పథకం కింద ప్రవాస భారత నిపుణులు, విదేశీ ప్రతిభావంతులను భారీ వేతనాలతో ఆకర్షిస్తారు. ఇక్కడ పరిశోధన, అంకుర సంస్థలను నెలకొల్పడానికి, పరిశోధనలు చేపట్టడానికి గ్రాంట్లు ఇస్తారు. ఇంతకు ముందు ఇదే లక్ష్యంతో చేపట్టిన వజ్ర ఫ్యాకల్టీ పథకాన్ని మరింతగా ప్రోత్సహిస్తారు. అయితే ప్రభుత్వ అధికారులు, ఉద్యోగుల్లో అలసత్వం, పరిశోధకులకు తగిన ప్రోత్సాహం దక్కకపోవడంతో పలు కార్యక్రమాలు పరిమిత ఫలితాలనే అందించాయి. ప్రవాస భారతీయ ప్రతిభావంతులతో పాటు స్వదేశంలో ప్రజ్ఞావంతులను పరిశోధనలను

మేధోవలసను అడ్డుకుని విదేశాల నుంచి ప్రజ్ఞావంతులను స్వదేశానికి రప్పించడానికి కేంద్రం బహుముఖ వ్యూహాల్ని అనుసరిస్తోంది. జాతీయ ప్రతిభా నైపుణ్యాలను వాడుకోవడానికి భారత్ టాలెంట్ ఫ్రేమ్‌వర్క్‌ను, దాన్ని సమన్వయ పరచడానికి భారత్ టాలెంట్ అలయన్స్‌ను ఏర్పాటు చేసింది. నిపుణ మానవ వనరుల సృష్టి, పరిశోధన, నవీకరణల సాధనే ఈ బృహత్ ప్రయత్న లక్ష్యం.



ప్రోత్సహించడానికీ ప్రభుత్వం పలు కార్యక్రమాలను చేపట్టింది. ప్రధానమంత్రి రీసెర్చ్ ఫెలోస్, సైన్సులో అధునాతన పరిశోధనల కోసం స్టార్స్, 'ఇన్‌స్పైర్', ఎం.కె.భాన్ యంగ్ రీసెర్చర్ ఫెలోషిప్ వంటి కార్యక్రమాలను అమలు చేసింది. పరిశోధనలు, నవీకరణల సాధనలో పెట్టుబడులను ప్రోత్సహించడానికి పలు విధానపరమైన చర్యలు, సంస్కరణలు చేపట్టారు. సైన్స్, టెక్నాలజీ విభాగంతోపాటు పలు సంస్థల భాగస్వామ్యంతో కొత్త ప్రయోగశాలలు, ఉత్కృష్ట కేంద్రాలు, సహకార కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నారు. స్టార్టప్ ఇండియా, మేకిన్ ఇండియా, ఆత్మనిర్భర్ భారత్ కార్యక్రమాలు వ్యవస్థాపకులను ప్రోత్సహిస్తున్నాయి. నవీకరణకు ఊతమిస్తున్నాయి. ప్రవాసీ భారతీయ దివస్, వైభవ్ శిఖరాగ్ర సభ, గ్యాన్ (గ్లోబల్ ఇనీషియేటివ్ ఫర్ అకాడమిక్ నెట్‌వర్క్స్) భారతీయ పరిశోధనా సంస్థలతో ప్రవాస భారతీయ నిపుణులకు భాగస్వామ్యాన్ని ఏర్పరుస్తున్నాయి. స్టడీ ఇన్ ఇండియా కార్యక్రమం విదేశీ విద్యార్థులను భారత్‌కు ఆహ్వానిస్తోంది. ఇలాంటి కార్యక్రమాలను సమర్థంగా అమలు చేయడానికి రాష్ట్ర ప్రభుత్వాలు కూడా తోడ్పాటు అందిస్తేనే మెరుగైన ఫలితాలు వస్తాయి.

దీర్ఘకాలిక ప్రణాళిక అవసరం

రాష్ట్రాల్లోని ప్రభుత్వ విశ్వవిద్యాలయాలు నిధుల కొరత, అనుమతుల ఆలస్యం, తాత్కాలిక బోధనా సిబ్బందితో సరిపెట్టుకోవాల్సి వస్తోంది. ఈ పరిస్థితుల్లో స్వదేశం తిరిగి రావాలనుకునే శాస్త్రజ్ఞులకు పాలనాపరంగా సరైన మద్దతు దక్కాలి. పరిమిత స్వయంనిర్ణయాధికారం పరిశోధనలో ముందడుగు పడనీయదు. ప్రాజెక్టుల విషయంలో స్పష్టమైన సహకారం కొరవడుతుందనే విమర్శలున్నాయి. కొత్తగా ఏర్పాటైన కేంద్ర విశ్వవిద్యాలయాలు మారుమూల ప్రాంతాల్లో ఉండటంతో ప్రవాస శాస్త్రజ్ఞులు అక్కడికి వెళ్లడం కష్టమవుతోంది. భారత్ అగ్రశ్రేణి శాస్త్రజ్ఞులను ఆకర్షించాలంటే కేంద్ర, రాష్ట్రాలు ఇలాంటి సమస్యలను, లోపాలను సరిదిద్దాలి. చైనా గతంలో చేపట్టిన థౌజండ్ టాలెంట్స్ ప్రణాళిక విజయం నుంచి పాఠాలు నేర్చుకోవాలి. ప్రోత్సాహకాలు, పరిశోధనా వసతులు, వివిధ మంత్రిత్వ శాఖల సమన్వయ కృషి ఆ ప్రణాళికను విజయవంతం చేసి చైనాను నవీకరణ కేంద్రంగా తీర్చిదిద్దాయి. డ్రాగన్‌లా దీర్ఘకాలిక ప్రణాళికతో పట్టుదలగా కృషి చేస్తే సృజనాత్మకత వెల్లివిరుస్తుందని గుర్తించాలి. ఇంతకాలం ప్రతిభను ఎగుమతి చేసే దేశంగా ఉన్న భారత్ ఇకపై ప్రజ్ఞావంతులను పరాయి దేశాల నుంచి ఆకర్షించాలి. వారి ప్రతిభ ఇక్కడ వికసించడానికి అనుకూలమైన వాతావరణాన్ని సృష్టించాలి. వారి సృజనాత్మకతకు అన్ని విధాలుగా అండగా నిలవాలి. అంతిమంగా అది వికసిత భారత ఆవిష్కరణకు అక్కరకొస్తుంది.




ఆచార్య అప్పారావు పొదిలె
హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయ పూర్వ ఉపకులపతి

ఇది ఎడారి సరస్సు...

హాయ్ నేస్తాలూ! ఎడారి మధ్యలో నీళ్లు.. దాని చుట్టూ పచ్చని చెట్లు, పొదలు ఉన్నాయేంటి వింతగా. ఇది నిజంగా ఎడారేనా? లేదంటే వేరే ఏదైనా ప్రదేశమా.. అనుకుంటున్నారా? ఇది ఎడారి ప్రాంతమే, అవన్నీ నీళ్లే! మనం వీటిని ఒయాసిస్‌లు అని పిలుస్తాం!

ఎడారి భూగర్భం నుంచి నీరు పైకి వచ్చినప్పుడు ఇలా సహజ ఒయాసిస్‌లు ఏర్పడతాయి. ఒక విధంగా ఎడారిలో ఇవి సారవంతమైన ప్రదేశాలు అన్నమాట. అయితే ఇందులో కొన్ని శాశ్వతంగా ఉండిపోతాయి. ఇంకొన్నేమో కొన్ని రోజులే ఉంటాయి. వాటికి నీటి సరఫరా స్థిరంగా కొనసాగితేనే శాశ్వతంగా ఉంటాయి. లేకపోతే కొన్ని రోజులు మాత్రమే ఉండి మాయమైపోతాయి. ఎడారి అంటేనే మొత్తం ఇసుక ప్రాంతం. ఎప్పుడూ అక్కడ చాలా వేడిగా ఉంటుంది. కానీ ఒయాసిస్‌లు ఉన్న చుట్టుపక్కల మాత్రం చల్లగా ఉంటుంది. పచ్చని చెట్లూ ఉంటాయి. అందుకే వాటి దగ్గర కొంతమంది నివాసాలు కూడా ఏర్పాటు చేసుకుంటారు. ఎడారిలో ఉండే జంతువులకు ఇవి నీటిని, ఆహారాన్ని అందిస్తాయి. ఎడారుల గుండా ప్రవహించే నదులు ఒక్కోసారి ఒయాసిస్‌లకు నీటిని అందిస్తాయి. ఇక్కడ అకాసియా, ఖర్జూర, దౌమ్ తాటి, ఆలివ్ లాంటి అరుదైన చెట్లు పెరుగుతాయి.



హాయ్! బుజ్జీ!!

'నీళ్లు ఉన్నాయి కాబట్టి చెట్లు పెరుగుతాయి సరేగానీ.. మరి అక్కడికి విత్తనాలు ఎలా వస్తాయి?' అనే సందేహం వచ్చింది కదా ఫ్రెండ్స్! మరేం లేదు.. వలస పక్షుల ద్వారా అవి అక్కడికి చేరతాయంతే. సౌదీ అరేబియాలో ఉన్న అల్-అహ్సా ఒయాసిస్ ప్రపంచంలోనే అతిపెద్దది. గతంలో ఈ ఒయాసిస్‌ల దగ్గరే ఇతర దేశాలకు సరకులు ఎగుమతి చేసేవారు. అలా క్రమంగా ఒయాసిస్‌ల చుట్టుపక్కల ప్రాంతాలు అభివృద్ధి చెందుతూ గ్రామాలు, పట్టణాలు.. ఆ తరవాత సమర్కండ్ వంటి పురాతన నగరాలు ఏర్పడ్డాయి.

– పి.పవిత్ర



అక్షరాల చెట్టు

ఈ అక్షరాలతో అర్థవంతమైన పదం తయారు చేయండి.

జవాబు: INNOVATION

ఈనాడు అమరావతి

ఎన్టీఆర్

బుధవారం డిసెంబరు 31, 2025 5

ఇల వైకుంఠం.. ఇదే వైభోగం..





జిల్లాలోని వైష్ణవాలయాల్లో వైకుంఠ ఏకాదశి వేడుకలు వైభవంగా జరిగాయి. పర్వదినాన్ని పురస్కరించుకుని భక్తులు వేకువజామునే స్వామివారి దర్శనానికి బారులుదీరారు. విజయవాడ లబ్బీపేట వెంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రీదేవి, భూదేవి సమేత వెంకటేశ్వర స్వామిని ఇలా ప్రత్యేకంగా అలంకరించారు. -ఈనాడు, అమరావతి

స్కానింగ్ పాయింట్ వద్ద లడ్డూల పంపిణీ

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే: ఇంద్రకీలాద్రి భక్తులకు మెరుగైన సేవలు అందించడంలో భాగంగా రూ.500 టికెట్ తీసుకున్న భక్తులకు టికెట్ స్కాన్ చేసిన వెంటనే రెండు లడ్డూలు అందించే ప్రక్రియను మంగళవారం ప్రారంభించారు. గతంలో భక్తులకు టికెట్లు ఇచ్చిన తర్వాత వారు తిరిగి ఆ కౌంటరు వద్దకు వచ్చినప్పుడు మాత్రమే లడ్డూలను అందజేసేవారు. కొంత మంది భక్తులు ప్రసాదం తీసుకోకుండా వెళ్లినప్పటికీ వాటి లెక్క తేలక పోవడాన్ని పరిగణనలోకి తీసుకొని స్కానింగ్ పాయింట్ వద్ద మాత్రమే లడ్డూ ప్రసాదాలు భక్తులకు అందజేయాలని సిబ్బందికి ఈవో శీనానాయక్ ఆదేశించారు. దీంతో రూ.500 టికెట్ తీసుకున్న ప్రతి ఒక్కరికి రెండు లడ్డూలు అందుతున్నాయని భక్తులు హర్షం వ్యక్తం చేశారు.

నేరాలు తగ్గించి.. న్యాయాన్ని దరిచేర్చి..

ఎన్టీఆర్ కమిషనరేట్ వార్షిక నేర గణాంక నివేదిక విడుదల

ఈనాడు, అమరావతి, న్యూస్‌టుడే, విజయవాడ నేరవార్తలు

ఈ ఏడాది ఎన్టీఆర్ కమిషనరేట్‌లో నేరాల సంఖ్య తగ్గింది. గత సంవత్సరంతో పోలిస్తే 2025లో 21.66శాతం తక్కువ నమోదైంది. గతేడాది మొత్తం 11,977 కేసులు నమోదు కాగా.. ఈ ఏడాది 9,503 కేసులే రిజిస్టర్ అయ్యాయి. వార్షిక నేర గణాంకాలను ఎన్టీఆర్ పోలీసు కమిషనర్ రాజశేఖర్‌బాబు మంగళవారం నిర్వహించిన మీడియా సమావేశంలో విడుదల చేశారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని విస్తృతంగా వినియోగించడం ద్వారా తగ్గించగలిగామని సీపీ వివరించారు. గత ఏడాదితో పోలిస్తే.. ప్రాపర్టీ నేరాలు 39.83 శాతం తగ్గాయి. భౌతిక దాడులు.. 12.53 శాతం, మహిళలపై నేరాలు.. 15.11 శాతం, పోక్సో కేసులు.. 23.64 శాతం, రోడ్డు ప్రమాదాలు.. 23.39 శాతం, సైబర్ నేరాలు 45.05 శాతం మేర తగ్గాయి. ఆర్థిక నేరాలు 12.68 శాతం, నార్కోటిక్స్ కేసులు 19.57 శాతం పెరిగాయి.

నేరం చేసిన నిందితులకు శిక్షలు పడే శాతంలో గణనీయమైన మెరుగుదల నమోదైంది. ప్రతి రెండో కేసులో శిక్ష పడుతోంది. 2024లో మొత్తం 1,395 శిక్షలు పడ్డాయి. శిక్షల శాతం 37శాతం ఉంది. 2025లో గణాంకాలు మెరుగయ్యాయి. 2,123 శిక్షలు పడ్డాయి. దీంతో శిక్షల శాతం 50కు పెరిగింది. యావజ్జీవ, మరణించే వరకు శిక్షలు తొమ్మిది కేసుల్లో పడ్డాయి. పదేళ్లు అంతకంటే ఎక్కువ.. 18 కేసుల్లో, 3 నుంచి 7 ఏళ్లు.. 27 కేసుల్లో శిక్షలు పడ్డాయి. ✦ రోడ్డు ప్రమాదాల్లో గుర్తు తెలియని వాహనాలు ఢీకొని చనిపోయిన, గాయపడిన కుటుంబాలకు పరిహారం మంజూరులో కమిషనరేట్ దేశంలోనే మూడో స్థానంలో నిలిచింది.



'గ్లింప్సెస్ ఆఫ్ 2025' పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సీపీ రాజశేఖరబాబు తదితరులు

పెరుగుదల/తగ్గుదల

	2024	2025	శాతం
భౌతికదాడులు			
హత్యలు	39	34	-14.71
నేరపూరిత హత్య	7	4	-75
అల్లర్లు	11	4	-175
కిడ్నాప్	54	46	-17.39
గాయపరచటం	87	71	-22.54
స్వల్పంగా ॥	733	655	-11.91
హత్యాయత్నం	84	88	+4.55
మహిళలపై నేరాలు			
వివాహ సంబంధ	877	796	-10
అత్యాచారం	106	103	-3
వ్యక్తిత్వానికి భంగం	823	670	-19
రోడ్డు ప్రమాదాలు			
తీవ్రమైనవి	428	357	-16.58
మరణాలు	454	366	-19.38
సాధారణ	937	738	-21.23

సైబర్ క్రైం..

	2024	2025
1930కి ఫిర్యాదులు	4797	4308
ఆపిన సొమ్ము (రూ.కోట్లు)	8.26	9.54



సైబర్ నేరాలపై పోలీసు అధికారులు విస్తృతంగా ప్రచారం చేశారు. కాలనీల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. బ్యాంకర్లతో కలిసి డిజిటల్ అరెస్టు, పెట్టుబడుల మోసాలు వంటి సైబర్ నేరాలపై పోస్టర్లు ముద్రించి విస్తృతంగా ప్రచారం చేశారు. గత ఏడాదితో పోలిస్తే సైబర్ నేరాల సంఖ్య తగ్గింది. రికవరీ/ ఫ్రీజ్ చేసిన సొమ్ము పెరిగింది.

మొత్తం 328కు గాను 238 కేసుల్లో రూ.2కోట్ల మేర పరిహారం మంజూరైంది. ✦ 'డ్రోన్ కమాండ్ కంట్రోల్ సెంటర్' అనే డ్యాష్‌బోర్డును కేఎల్ డీమ్డ్ విశ్వవిద్యాలయం విద్యార్థులు అభివృద్ధి చేశారు. కమిషనరేట్ పరిధిలోని అన్ని డ్రోన్లను దీని ద్వారా పర్యవేక్షణకు వీలవుతుంది. ఇవి చిత్రీకరించే దృశ్యాలనూ వీక్షించేందుకు అవకాశం కలిగింది.

మృతుల్లో ద్విచక్ర వాహన చోదకులే ఎక్కువ



2025లో జరిగిన రోడ్డు ప్రమాదాల్లో 366 మంది మరణించగా వారిలో పాదచారులు 107 మంది, ద్విచక్ర వాహన చోదకులు 209 మంది ఉన్నారు. వీరుకాక త్రీవీలర్స్ 18, నాలుగు చక్రాల వాహనచోదకులు 13, హెవీ వెహికల్స్ 4, ఇతర వాహనాలపై మరణాలు 15 ఉన్నాయి.



ఇటువంటి వినూత్న సాంకేతిక ఆవిష్కరణల కోసం రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్‌తో ఒప్పందం చేసుకున్నారు. ఇంజినీరింగ్ విద్యార్థులకు ఇంటర్న్‌షిప్ కార్యక్రమాన్ని కూడా చేపట్టారు. తద్వారా వీరి సృజనను వివిధ అవసరాలకు వినియోగించుకునేందుకు వీలు కలుగుతోంది.

నార్కోటిక్స్

	2024	2025
నమోదు చేసిన కేసులు	111	138
పిట్ ఎన్డీపీఎస్ యాక్ట్ నమోదు	0	22



మాదకద్రవ్యాలపై ఉక్కుపాదం మోపేందుకు ఎన్టీఆర్ జిల్లా పోలీసులు కఠిన చర్యలకు శ్రీకారం చుట్టారు. ఈగల్ బృందాలు, టాస్క్‌ఫోర్స్, శాంతిభద్రతల విభాగం పోలీసులు విస్తృతంగా తనిఖీలు చేపట్టడంతో కేసులు పెరిగాయి. గంజాయి విక్రయాలతో పోలీసులకు సవాలుగా నిలిచిన వారిపై పిట్ ఎన్డీపీఎస్ యాక్ట్ నమోదు చేసి జైలుకు పంపించారు.

ఇదిగో పింఛను.. అందుకో శుభాకాంక్షలు

ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పండగ నేడు

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే : నూతన సంవత్సరం నేపథ్యంలో 2026, జనవరి ఒకటో తేదిన ఇవ్వాల్సిన ఎన్టీఆర్ భరోసా పింఛన్లను ఈ నెల 31వ తేదీ బుధవారం ఒక రోజు ముందుగానే ఇవ్వనున్నట్లు కలెక్టర్ జి.లక్ష్మీశ తెలిపారు. దీనిపై నగరంలోని కలెక్టరేట్ నుంచి మంగళవారం టెలికాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ.. 303 కొత్త పింఛన్లతో కలిపి జిల్లాలో మొత్తం 2,28,592 మందికి రూ.98.95 కోట్లు పంపిణీ చేయనున్నట్లు వెల్లడించారు. ఈ ప్రక్రియను విజయవంతం చేయాలని కోరారు. లబ్ధిదారులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేయాలని పేర్కొన్నారు. విజయవాడ, తిరువూరు, నందిగామ ఆర్డీవోలు కావూరి చైతన్య, కె.మాధురి, కె.బాలకృష్ణ, డీఆర్డీఏ పీడీ ఎ.ఎన్.వి.నాంచారరావు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు తదితరులు పాల్గొన్నారు.

కీలక ప్రగతి సూచికను ఏ+ గ్రేడ్‌కు తీసుకెళ్లాలి

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే : జిల్లాలో ప్రతి కీలక ప్రగతి సూచిక (కేపీఐ)ను ఏ+ గ్రేడ్‌కు తీసుకెళ్లాలని కలెక్టర్ జి.లక్ష్మీశ అధికారులకు దిశానిర్దేశం చేశారు. స్వర్ణాంధ్ర దార్శనిక ప్రణాళికల స్ఫూర్తిని మరవద్దని, జీఎస్‌డీపీ, తలసరి ఆదాయం వృద్ధి లక్ష్యాలపై దృష్టి సారించాలన్నారు. ప్రగతిని పరుగులు పెట్టిస్తూ విశ్లేషణతో ముందుకు వెళ్లాలని సూచించారు. నగరంలోని కలెక్టరేట్‌లో కేపీఐ, జిల్లా ప్రగతి, ప్రజల క్షేమం, సంక్షేమానికి ఏడాది కాలంగా చేపట్టిన ప్రత్యేక కార్యక్రమాలు, సాధించిన విజయాలు, వాటి స్ఫూర్తితో కొత్త ఏడాది కార్యాచరణపై మంగళవారం సమీక్షించారు. 12 నెలల్లో మైలురాళ్లను గుర్తుకు తెచ్చారు. రాబోయే ఏడాదిలో స్వప్నమైన లక్ష్యాలను నిర్దేశించుకుని ముందుకెళ్లాల్సిన ఆవశ్యకతను ఉద్ఘాటించారు. ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ ప్రాధాన్యతలకు అనుగుణంగా, స్వర్ణాంధ్ర లక్ష్యాలను చేరుకునే క్రమంలో సంక్షేమ పథకాల సమర్థ అమలుతో పాటు అన్ని రంగాల్లో చెప్పుకోదగ్గ ఫలితాలను సాధించామన్నారు. ఇందుకు కేపీఐల్లో రాష్ట్రంలోనే మొదటి స్థానంలో నిలవడం నిదర్శనమన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ లక్ష్మీశ. పక్కన జేసీ ఇలక్కియా, వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర

యోగాంధ్రలో ప్రపంచ రికార్డు నమోదు: జిల్లా నిర్వహణలో యోగాంధ్రలో ప్రపంచ రికార్డు నమోదు, స్వచ్ఛ సర్వేక్షణ్ జాతీయ పురస్కారాలు, ఆకాంక్షిత మండలాల అభివృద్ధి సూచీల్లో నీతి ఆయోగ్ బంగారు పతకాల సాధన ఇలా ఎన్నో గుర్తింపులు సాధించిన అంశాలను ఉదహరించారు. జేసీ ఎస్.ఇలక్కియా, వీఎంసీ కమిషనర్ హెచ్.ఎం.ధ్యానచంద్ర, సీపీవో వై.శ్రీలత, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

కేపీఐ స్కోర్లు మండలాలు: కేపీఐలో నవంబరు వరకు ఎ.కొండూరు మండలం 129 సూచికల్లో 92 స్కోరు, నందిగామ 136 సూచికల్లో 90 స్కోరు, తిరువూరు 124 సూచికల్లో ఏ+ గ్రేడ్ సాధించినట్లు కలెక్టర్ వివరించారు.

యూరియా సరిహద్దులు దాటిస్తే చర్యలు

ఎన్టీఆర్ కలెక్టరేట్: జిల్లాకు చెందిన యూరియా కోటాను ఇక్కడి రైతులకే విక్రయించాలని, ఇతర జిల్లాలు లేదా ఇతర రాష్ట్రాలకు తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ లక్ష్మీశ హెచ్చరించారు. నగరంలోని కలెక్టరేట్‌లో ఎరువుల కంపెనీల ప్రతినిధులు, హోల్ సేల్, రిటైల్ డీలర్లు, సొసైటీ సీఈవోలతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. నిర్ణీత ధరకు మాత్రమే యూరియాను విక్రయించాలన్నారు. ఇ-పోస్ ద్వారా విక్రయాలు జరపాలని పేర్కొన్నారు. డీఏవో విజయకుమారి పాల్గొన్నారు.

గుండెలదిరాయ్..




తోటమూలకు చెందిన గీతాంజలి విద్యాలయం బస్సు మంగళవారం అదుపు తప్పి విద్యుత్తు స్తంభాన్ని ఢీకొట్టింది. అదృష్టవశాత్తు పిల్లలు ప్రాణాపాయం నుంచి బయటపడ్డారు. - న్యూస్‌టుడే, గంపలగూడెం

వివరాలు 6లో

కొత్త ఏడాదికి.. పాసు పుస్తకాల కానుక

జనవరి 2–9 వరకు పంపిణీ



వైకాపా రంగులు..జగన్ చిత్రాలతో పట్టాదారు పాసుపుస్తకాన్ని గత వైకాపా సర్కారు భ్రష్టు పట్టించింది. ఇందుకు భిన్నంగా ప్రభుత్వ, రాజముద్ర ప్రమేయం లేకుండా రాజముద్రతో, 'రైతులు, రైతు కూలీల క్షేమం- ప్రభుత్వ ధ్యేయం' నినాదంతో పాసుపుస్తకాలను అందించే దిశగా కూటమి సర్కారు రంగం సిద్ధం చేసింది. రీసర్వే పూర్తి చేసిన గ్రామ సభలే వేదికగా.. గ్రామాల్లో జనవరి 2 నుంచి 9వ వరకు మంజూరైన ప్రాంతాల్లో పంపిణీ చేయాలని నిర్ణయించారు. గతంలో వైకాపా ప్రభుత్వం ఇచ్చిన పత్రాలు మొత్తం వెనక్కి తీసుకుని ఈ పాసుపుస్తకాలు ఇస్తారు. పంపిణీకి గ్రామసభలు పెట్టి అధికారులు, ప్రజాప్రతినిధుల సమక్షంలో అందజేస్తారు. రైతులు ఇవి తీసుకున్నట్లు బయోమెట్రిక్ ద్వారా నమోదు చేస్తారు. వెబ్‌ల్యాండ్‌లో ఉన్న వివరాల ప్రకారం తప్పులు లేని పాసుపుస్తకాలను ఇస్తారు. జిల్లాలో మొత్తం 21,275 పుస్తకాలు ఇవ్వనున్నారు. డివిజన్ల నుంచి మండల కేంద్రాలు, గ్రామాలకు సరఫరా చేస్తారు. దాదాపు 10 నెలలుగా పాసు పుస్తకాలు లేక రుణాలు, క్రయవిక్రయాల విషయంలో ఇబ్బంది పడుతున్న రైతులకు ప్రభుత్వ నిర్ణయంతో ఊరట దక్కనుంది. - ఈనాడు, అమరావతి

డివిజన్	పుస్తకాలు
నందిగామ	11,184
తిరువూరు	9,677
విజయవాడ	414
మొత్తం	21,275

ఆకుపచ్చ కవచం.. ఆపేను ప్రమాదం..



నాలుగు, ఆరు వరుసల జాతీయ రహదారుల మధ్యలో డివైడర్ నిర్మాణానికి నిబంధనల మేరకు స్థలం వదిలి అందులో మొక్కలు పెంచుతారు. దీనివల్ల పక్క వరుసలో వచ్చే వాహనాల లైట్లు ఇటు వెళ్లే వారి కళ్లపై పడకుండా రక్షణ కల్పిస్తాయి. రాత్రివేళ ప్రయాణం సాఫీగా సాగుతుంది. జాతీయ రహదారుల్లోని వంతెనపై ఇంత ఖాళీ స్థలం వదిలే అవకాశం ఉండదు. ఈ నేపథ్యంలో ఇలా రేడియం స్టిక్కర్లు ఉండే గ్రీన్ ప్యాడ్లు అమర్చుతున్నారు. -ఈనాడు, అమరావతి

రోడ్డు దాటాలంటే.. నిత్యం గండమే..



విజయవాడ-మచిలీపట్నం జాతీయ రహదారిలో సిద్ధార్థ ఇంజినీరింగ్ కళాశాల మొదలుకొని ఉప్పులూరు వరకు రోడ్డుకు ఇరువైపులా పాఠశాలలు, కళాశాలలు ఉన్నాయి. సాయంత్రం 4గంటల నుంచి 6గంటల మధ్య విద్యార్థులు రోడ్డు దాటాలంటే భయపడుతున్నారు. ఆటోలను రోడ్డు మధ్యలో నిలిపేస్తున్నారు. వాహనాలు తప్పించే క్రమంలో ప్రమాదాలు జరుగుతున్నాయి. గంగూరు, ధనేకుల ఇంజినీరింగ్ కళాశాల జంక్షన్ల వద్ద ఈ పరిస్థితి నెలకొంది. ఆ సమయంలో కానిస్టేబుల్‌ను పెట్టి ట్రాఫిక్‌ను నియంత్రిస్తే ప్రమాదాలకు ఆస్కారం ఉండదు. -ఈనాడు, కృష్ణా



అక్రమాల జలధార

వైకాపా హయాంలో ఆర్‌డబ్ల్యూఎస్ శాఖలో జలగలు

ఈనాడు, అమరావతి

గ్రామీణ నీటి సరఫరా శాఖలో కొందరు అధికారులు వైకాపా పాలనలో అడ్డగోలుగా దోచుకున్నారు. పైపులైన్ల పనుల చాటున ఇష్టారాజ్యంగా స్వాహా చేశారు. నాణ్యతకు నీళ్లొదిలి, నిబంధనలు గాలికొదిలారు. నాసిరకం పనులు చేయించి కొందరు గుత్తేదారులకు అక్రమంగా బిల్లులు చేయించి వారి ద్వారా లబ్ధి పొందారు.

స్వాహాకార పర్వం.. ✸ జి.కొండూరు మండలం గడ్డమణుగులో గుత్తేదారులు కొనుగోలు చేసిన పైపులకు నాణ్యతా ధ్రువపత్రాలు లేవు. ఐజీఎస్టీ చెల్లింపు పత్రాలు, బిల్లులు సవ్యంగా లేవు. అధికారులు గుత్తేదారులతో కుమ్మక్కై బిల్లులు మంజూరు చేయించి రూ.70లక్షలు స్వాహా చేశారు. ✸ గన్నవరం డివిజన్‌లోని ఎన్ఎపేటలో సింటెక్స్ ట్యాంకుల నిర్మాణంలో 5వేల లీటర్లకు బదులు రూ.3వేల లీటర్ల సామర్థ్యంలో నిర్మాణం చేపట్టి సొమ్ము చేసుకున్నారు. గంపలగూడెం మండలం తునికిపాడులో జడ్పీ, ఎంపీ నిధులు అనుసంధానం చేసి చేపట్టాల్సిన పైపులైను పనులకు ఎంపీ నిధులు మాత్రమే మంజూరు కాగా జడ్పీ నిధులు మంజూరు కాకుండానే టెండర్లు పిలిచారు. పనులు చేయించి గుత్తేదారులు చెల్లించే టెండర్ల డిపాజిట్ మొత్తం నుంచి రూ.లక్షల్లో బిల్లులు చెల్లించినా ఇప్పటికీ చర్యలు లేవు. ✸ పోరంకి పంచాయతీ నుంచి పురపాలికలో చేరినా ప్రజారోగ్య విభాగం చేయాల్సిన పనులను పంచాయతీ చేస్తున్నట్లు మాయ చేసి 2లక్షల లీటర్ల ట్యాంకు నిర్మాణ పనులకు రూ.58లక్షల మంజూరు చేయించారు. విషయం బయటికి రాకుండా ఆన్‌లైన్ టెండర్‌కు బదులు బాక్స్ టెండర్ పిలిచి భారీగా దోచుకున్నారు. ✸ అప్పట్లో జిల్లాలో బోర్లు, మోటార్లు ఏర్పాటు చేశారు. రూ.5లక్షలు దాటితే టెండర్లు పిలవాలని, పనుల విలువను రూ.86,500 రూ.40,290, రూ.49,000, రూ.1,81,620 విడదీసి నామినేషన్ పద్ధతిలో అక్రమంగా వారికి నచ్చిన వారితో చేయించుకున్నారు. నామినేషన్ పద్ధతిలో పనులు చేయించినా అడ్డగోలుగా రూ.13.62శాతం కాంట్రాక్టర్ ప్రాఫిట్ పేరుతో పక్కదారి పట్టించారు.

తిలాపాపం..

వైకాపా పాలనలో పని చేసిన మైలవరం, విజయవాడ, గన్నవరం డివిజన్ల పరిధిలోని ఈఈ, డీఈ, ఏఈలు అకౌంట్స్ అధికారులలో కొందరు కథ నడిపించారు. మిగిలిన వారితో పోలిస్తే ఓ ఈఈ అడ్డదిడ్డంగా దోచుకున్నారు. అప్పట్లో ఉద్యోగ విరమణ దగ్గరలో ఉండడంతో గుత్తేదారుల నుంచి రూ.లక్షల్లో మింగేసి బిల్లుల మంజూరు చేశారు. విజయవాడ నడిబొడ్డున రూ.3కోట్లతో విల్లా కొన్నారు. చివరికి కార్యాలయంలో టీవీ ఎత్తుకుపోయాడు.. తాజాగా ప్రభుత్వం ఈ అక్రమాలపై విచారణకు ఆదేశించడంతో అధికారుల గుండెల్లో గుబులు పుడుతోంది.

వంశీ కోసం ముమ్మరంగా గాలింపు

ఈనాడు - అమరావతి: వైకాపా నేత వల్లభనేని వంశీ, అతని అనుచరుల కోసం నగర పోలీసులు ముమ్మరంగా గాలిస్తున్నారు. గన్నవరం తెదేపా ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు అనుచరులపై హత్యాయత్నానికి పాల్పడిన ఘటనలో మాచవరం పోలీసులు ఇటీవల కేసు నమోదు చేశారు. ఇందులో వంశీతో పాటు ఆయన అనుచరులను నిందితులుగా చేర్చారు. ఈ కేసులో అరెస్టు కాకుండా తప్పించుకునేందుకు గత కొన్ని రోజులుగా పరారీలో ఉన్నారు. వైకాపా నేతను అరెస్టు చేసేందుకు మొత్తం మూడు బృందాలు రంగంలోకి దిగాయి. విశాఖపట్నం, హైదరాబాద్, బెంగళూరులో పోలీసులు గాలిస్తున్నారు. ఈ నగరాల్లో తలదాచుకునే అవకాశం ఉందని అనుమానిస్తున్నారు. వంశీ సన్నిహితులు, బంధువుల ఫోన్లపై నిఘా పెట్టారు. వారికి వస్తున్న కాల్స్‌ను విశ్లేషిస్తున్నారు. ఫోన్ ఉపయోగించడం లేదని భావిస్తున్నారు. ఇతరుల ఫోన్ల ద్వారా కొందరితో టచ్‌లో ఉన్నారన్న అనుమానంతో నిఘా పెట్టారు. ఈ కేసులో నిందితులుగా ఉన్న అతని అనుచరులు కూడా ఫోన్లు స్విచాఫ్ చేసి గన్నవరం నుంచి అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు.

ఉన్నత చదువుకు.. 'విద్యాలక్ష్మి' ఆసరా

మచిలీపట్నం కార్పొరేషన్, న్యూస్‌టుడే

ప్రతిభ ఉన్న విద్యార్థుల చదువు ఆర్థిక సమస్యల కారణంగా ఆగిపోకూడదన్న లక్ష్యంతో వారిని ప్రోత్సహించేందుకు కేంద్ర ప్రభుత్వం విద్యాలక్ష్మి పథకాన్ని అందుబాటులోకి తెచ్చింది. ఇందులో భాగంగా రుణం ఎలా పొందాలి? ఎవరిని సంప్రదించాలి? ఏయే పత్రాలు ఉండాలో తెలుసుకుందాం.

ఎప్పుడైనా దరఖాస్తు చేయవచ్చు...

ఈ పథకానికి ఇప్పట్లో తుది గడువు అంటూ ఏమీలేదు. అవసరం ఉన్నవారు ఎప్పుడైనా దరఖాస్తు చేయవచ్చు. పేద విద్యార్థులు సైతం వినియోగించుకుని ఉన్నత విద్యను అభ్యసించవచ్చు. కేంద్ర ఆర్థిక శాఖ, మానవ వనరుల అభివృద్ధి మంత్రిత్వ శాఖలు ఈ పథకం అమలుకు ప్రత్యేక పోర్టల్ అందుబాటులోకి తెచ్చాయి. ఆసక్తిగల విద్యార్థులు www.vidyalakshmi.co.in వెబ్‌సైట్‌లోకి లాగిన్ అయి అడిగిన పూర్తి వివరాలు నమోదు చేయాలి. ఒక విద్యార్థి ఒకేసారి గరిష్ఠంగా మూడు బ్యాంకులకు రుణం కోసం దరఖాస్తు చేసుకునే వెసులుబాటు కల్పించింది. మనకు నచ్చిన బ్యాంకులు ఎంపిక చేసుకున్న తరువాత రుణ సమాచారం చరవాణి, ఈ-మెయిల్‌కు ఎప్పటికప్పుడు వస్తుంది. ఈ పథకంలో 36కు పైగా బ్యాంకులు నమోదై ఉన్నాయి. ఎస్‌బీఐ, కెనరా బ్యాంకు, ఐవోబీ, యూనియన్, సెంట్రల్ బ్యాంకు, పంజాబ్ నేషనల్ బ్యాంకు, యాక్సిస్ బ్యాంకు, బ్యాంక్ ఆఫ్ బరోడా, హెడీఎఫ్‌సీ, ఇలా అనేక బ్యాంకుల నుంచి రుణాలు పొందవొచ్చు.

రూ.10 లక్షల వరకు..

ఈ పథకంలో రూ.10 లక్షల వరకు రుణం పొందడానికి అవకాశం ఉంది. రూ.4.5 లక్షల రుణం వరకు కేంద్ర ప్రభుత్వమే వడ్డీ భరిస్తుంది. కుటుంబ వార్షిక ఆదాయం రూ.4లక్షల లోపు ఉండి డిగ్రీ, ఇంజినీరింగ్, ఎంబీబీఎస్ ఇలా వివిధ కోర్సులు చదివే వారు అందరూ దరఖాస్తు చేసుకోవచ్చు.

ఏ పత్రాలు సమర్పించాలి..

విద్యా సంస్థ అందించే టీసీ, మార్కుల జాబితా, ఇప్పటి వరకు ఏవైనా ఉపకారవేతనాలు పొందితే ఆ వివరాలు, ఉన్నత విద్యకు సంబంధించిన ర్యాంకు కార్డు, ప్రవేశ అనుమతి పత్రాలు, కోర్సుకు సంబంధించిన ఫీజుల అంచనా వివరాలు, తల్లిదండ్రులు, సంరక్షకుని వివరాలు అందజేయాలి. విద్యార్థి పాస్‌పోర్టు సైజు ఫొటోలు, ప్రభుత్వ ఉద్యోగులైతే వేతన ధ్రువపత్రాలు అందించాల్సి ఉంటుంది. వీటితో పాటు నివాస ధ్రువపత్రం లేదా ఓటరు గుర్తింపు కార్డు, ఆధార్‌కార్డు, పాన్‌కార్డు, డ్రైవింగ్ లైసెన్స్, పాస్‌పోర్టు జతచేయాలి.

పతకాల మోత... బహుమతుల ఈత

విజయవాడకు చెందిన క్రీడామణులు 2025లో జాతీయ స్థాయిలో సత్తా చాటారు. అంతర్జాతీయ వేదికపై రాణించడమే లక్ష్యంగా ముందుకు సాగారు. కుటుంబ సభ్యుల సహకారంతో సాధన చేస్తూ. . భవిష్యత్తులో అనుకున్నది సాధించాలని నిత్యం శ్రమించారు. ఒకరు షూటింగ్‌లో పతకాల మోత మోగించగా.. మరొకరు ఆక్వాటిక్స్‌లో అదరగొట్టారు. 2025లో మెరిసిన ఇద్దరి క్రీడాకారిణులపై 'న్యూస్‌టుడే' కథనం.

- న్యూస్‌టుడే-విజయవాడ క్రీడలు

షూటింగ్.. ఆక్వాటిక్స్‌లో రాణిస్తున్న విద్యార్థినులు

కాకినాడ నుంచి నగరానికి వచ్చి..



ఇంటర్ చదువుతున్న అక్షయి దాయం కాకినాడకు చెందిన దాయం రాజేంద్రం, శాంతకుమారి దంపతుల కుమార్తె. కోచ్ నాగిశెట్టి సుబ్రహ్మణ్యేశ్వరరావు వద్ద శిక్షణ తీసుకుంటోంది. అందు కోసం తల్లి విజయవాడలోనే ఉంటూ ప్రోత్సహిస్తున్నారు. 2023లో కేరళలోని తిరుచునాపల్లిలో జరిగిన జాతీయ షూటింగ్ ఛాంపియన్‌షిప్‌లో తలపడి మిక్స్‌డ్ యూత్ కేటగిరీలో పసిడి సాధించింది. ఈ ఏడాది జూన్‌లో హైదరాబాద్‌లో జరిగిన రాష్ట్ర స్థాయి రైఫిల్ షూటింగ్ పోటీలో సీనియర్స్, జూనియర్స్ (అండర్-19) విభాగాల్లో రెండు రజతం, యూత్ (అండర్-17) విభాగంలో పసిడి సొంతం చేసుకుంది. అక్టోబరులో ఒంగోలులో జరిగిన రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్‌లో తలపడి 10 మీ. పీప్ సైట్ ఈవెంట్‌లో పసిడి సాధించింది. రాష్ట్ర స్థాయిలో ఇప్పటి వరకు 6 పసిడి, 4 రజత పతకాలు కైవసం చేసుకుంది. వచ్చే నెల 1న నుంచి 10వ తేదీ వరకు భోపాల్‌లో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో పతకాలు సాధించాలనే లక్ష్యంతో సాధన చేస్తోంది

అంతర్జాతీయ వేదికపై మెరవడమే లక్ష్యం..



ఉండవల్లికి చెందిన నడకుదిటి టీటీ, గాయిత్రి శ్రీదేవి దంపతుల కుమార్తె పావని సరయు (16). 2013లో ఆక్వాటిక్‌లో శిక్షణ ప్రారంభించింది. అహ్మదాబాద్‌లో ఆగస్టులో జరిగిన జాతీయ స్థాయి పోటీలో 200 మీ. బ్రెస్ట్ స్ట్రోక్‌లో రజతం సాధించింది. డిసెంబరు 12న దిల్లీలో జరిగిన జాతీయ స్కూల్ గేమ్స్ స్విమ్మింగ్ పోటీల్లో తలపడి 200 మీ. బ్రెస్ట్ స్ట్రోక్‌లో రజతం కైవసం చేసుకుంది. మంగళూరులో డిసెంబరు 20 నుంచి 22వ తేదీ వరకు జరిగిన జాతీయ ఫిన్ స్విమ్మింగ్ పోటీలో 200 మీ. 'బై ఫిన్'లో పసిడి, 50 మీ. 'అప్నియా'లో రజతం, 200 మీ. 'సర్ఫేస్'లో కాంస్యం సాధించింది. ఇప్పటి వరకు రాష్ట్ర స్థాయిలో సుమారు 90 పసిడి, 7 రజత పతకాలు, జాతీయ స్థాయిలో సుమారు పది పసిడి, ఏడు రజత, మూడు కాంస్య పతకాలు గెలుచుకుంది. ప్రస్తుతం మంగుళూరులో కోచ్ పి. అభిలాష్ వద్ద శిక్షణ పొందుతోంది.

కొత్త విధానంలో.. ఇంటర్ పరీక్షలు

ప్రథమ ఏడాది విద్యార్థులకే మార్పులు

ఇంటర్ ప్రథమ ఏడాది విద్యార్థులకు పరీక్ష విధానంలో నూతన మార్పులు తీసుకొచ్చారు. ప్రశ్నపత్రం రూపొందించే తీరు మారింది. పరీక్షల షెడ్యూల్‌ను ఇంటర్ బోర్డు ఇప్పటికే విడుదల చేసింది. కొత్త పద్ధతి విద్యార్థులకు ఉపయోగపడుతుందని అధికారులు చెబుతున్నారు.

– ఈనాడు డిజిటల్, మచిలీపట్నం

32 పేజీలతో బుక్‌లెట్..

భౌతిక, రసాయన శాస్త్రాలకు 85 మార్కుల ప్రశ్నపత్రం ఇస్తారు. ప్రస్తుత విధానంలో 1, 2, 4, 8 మార్కుల ప్రశ్నలకు జవాబులు రాయాలి. ★ గణితం, భౌతిక, రసాయన శాస్త్రాలు, చరిత్ర, కామర్స్, రాజనీతి శాస్త్రం, ఎకనామిక్స్ పరీక్ష రాసే వారికి 32 పేజీలతో కూడిన బుక్‌లెట్ ఇస్తారు. గతంలో 24 పేజీలే ఉండేవి. ప్రశ్నల సంఖ్య పెరగడంతో ఈ మార్పులు చేశారు. ★ భౌతిక, రసాయన, జీవ శాస్త్రాల్లో 29 (85) మార్కులు వస్తే ఉత్తీర్ణత సాధించనట్టే.

- ★ జిల్లాలో ప్రభుత్వ కళాశాలలు: 10
- ★ ప్రైవేటు: 134 ★ ఆదర్శ: 2
- ★ ప్లస్ వన్: 24 ★ కేజీబీవీలు: 3
- ★ గురుకులాలు: 8
- ★ ఇంటర్(1) విద్యార్థులు: 36,726

100 మార్కులకే గణితం

గతంలో 150 మార్కులకు ఉండేది. ఆ తరువాత గణితం-1ఏ, 1బీగా మార్చి 75 మార్కులకు ఒక్కో పేపర్ చొప్పున ప్రథమ, ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు అమలు చేశారు. ప్రస్తుతం మొదటి ఏడాది విద్యార్థులకు గణితంలో ఒకే పేపర్ విధానాన్ని తెచ్చారు. 100 మార్కులకు కుదించారు.

నమూనా పరీక్షలు నిర్వహించాం

ఇంటర్ మొదటి ఏడాది విద్యార్థులకు కొత్త విధానంపై అవగాహన కల్పిస్తున్నాం. ఇప్పటికే పలు మార్లు నమూనా పరీక్షలు నిర్వహించాం.

- ప్రభాకర్ ఆర్ఐవో, ఉమ్మడి కృష్ణా జిల్లా

ఏఎన్నార్ కళాశాలకు ఎ.ఎస్.నారాయణ రూ.లక్ష విరాళం



డాక్టర్ ఎ.ఎస్.నారాయణను సత్కరిస్తున్న వజ్రోత్సవ కమిటీ ఛైర్మన్ కొల్లి శ్రీనివాస్

గుడివాడ, న్యూస్‌టుడే: అక్కినేని నాగేశ్వరరావు కళాశాలకు హైదరాబాద్‌కు చెందిన పద్మశ్రీ పురస్కార గ్రహీత డాక్టర్ ఎ.ఎస్.నారాయణ రూ.లక్ష విరాళం ఇచ్చారని కళాశాల వజ్రోత్సవ కమిటీ ఛైర్మన్ కొల్లి శ్రీనివాస్ తెలిపారు. హైదరాబాద్‌లో నారాయణను ఆయన మంగళవారం ఘనంగా సత్కరించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ అక్కినేని నాగేశ్వరరావుకు స్నేహితుడైన నారాయణ కళాశాల వజ్రోత్సవాలకు రాలేక పోయారన్నారు. కళాశాల అభివృద్ధికి విరాళం ఇవ్వడం ఆనందంగా ఉందన్నారు. అక్కినేని నాగేశ్వరరావు స్వగ్రామం అయిన రామాపురంలో కూడా గతంలో నారాయణ ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించారన్నారు. ఈ కార్యక్రమంలో ఆయన స్నేహితుడు ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు జీవితం.. యువతకు స్ఫూర్తిదాయకం



పుస్తక ఆవిష్కరణలో ఎంపీ శివనాథ్, దూదేకుల కార్పొరేషన్ ఛైర్మన్ నాగుల్‌మీరా, రచయిత శేఖర్‌బాబు తదితరులు

చిట్టినగర్, న్యూస్‌టుడే: ముఖ్యమంత్రి చంద్రబాబు జీవిత చరిత్ర నేటి యువతకు స్ఫూర్తిదాయకమని విజయవాడ పార్లమెంటు సభ్యుడు కేశినేని శివనాథ్ అన్నారు. నగరాల సంఘం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి, పుస్తక రచయిత బాయన శేఖర్‌బాబు ఆధ్వర్యంలో మంగళవారం చిట్టినగర్‌లోని నగరాల సీతారామస్వామి మహాలక్ష్మి అమ్మవారి కల్యాణ మండపంలో మూడు సార్లు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా చేసిన చంద్రబాబు నాయుడుకు సంబంధించిన పుస్తక ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ.. దేశంలో ఆదర్శవంతంగా ఉన్న నాయకుల్లో చంద్రబాబు ఒకరని అన్నారు. ఆయన విజన్‌తో 20 ఏళ్ల ముందు చూపుతో రాష్ట్రాన్ని అభివృద్ధి దిశగా తీసుకు వెళ్తున్నారని చెప్పారు. డ్వాక్రా సంఘాలు, నదుల అనుసంధానం, పనికి ఆహార పథకం వంటి వాటిని కేంద్రప్రభుత్వం అధ్యయనం చేయడం ముఖ్యమంత్రి చంద్రబాబు విజన్‌కు నిదర్శనమని పేర్కొన్నారు. శేఖర్‌బాబు పుస్తకం రచించడం అభినందనీయమని అన్నారు. కొండ ప్రాంత నివాసితులకు రిజిస్ట్రేషన్ సౌకర్యం కల్పించేందుకు తన వంతు కృషి చేస్తున్నట్లు ఎంపీ తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర దూదేకుల కార్పొరేషన్ ఛైర్మన్ కె.నాగుల్‌మీరా, నగరాల సంఘం ఆంధ్రప్రదేశ్ అధ్యక్షుడు ఎన్.వి.రావు, చిట్టినగర్ అమ్మవారి గుడి ప్రధాన కార్యదర్శి హనుమంతరావు, కోశాధికారి పిళ్లా శ్రీనివాసరావు, సంఘం ప్రధాన కార్యదర్శి పోతిన వెంకటేశ్వరరావు, నాయకులు కొంగిటి రామారావు, అమ్మిశెట్టి వాసు, కార్పొరేటర్ మరుపిళ్ల రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

అరకు కాఫీతో ఎంతో మందికి ఉపాధి

విజయవాడ వైద్యం, న్యూస్‌టుడే: అరకు కాఫీతో ఎంతో మందికి జీవనోపాధి దొరుకుతోందని ఎంపీ కేశినేని శివనాథ్, విజయవాడ తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ అన్నారు. మంగళవారం విజయవాడ కొత్త ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో జీసీసీ (గిరిజన కోఆపరేటివ్ కార్పొరేషన్) ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అరకు కాఫీ స్టాల్‌ను వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ప్రభుత్వ ఆసుపత్రి వంటి ప్రజా కేంద్రాల్లో అరకు కాఫీ అందుబాటులోకి తీసుకురావడం గొప్ప విషయమని తెలిపారు. రూ.పదికే కాఫీ అందిస్తున్న నిర్వాహకులను అభినందించారు. తెదేపా నాయకులు పాల్గొన్నారు.

ధర వరలు



వంకాయలు-20/24, టమాటా-45, బెండ-36, పచ్చిమిర్చి-40, కాకర-50, బీర-36/42, క్యాలీ ఫ్లవర్-30/25, క్యాబేజీ-22, క్యారెట్-34, దొండ-36, బంగాళదుంప-24, ఉల్లిపాయలు-30, గోరుచిక్కుడు-40, దోస-32/40, సొర-18/20, పొట్ల-35, అరటికాయ-7/8, చామదుంప-24, అల్లం-76, మునగ-14/15, ఆకు కూరలు (కట్ట)-2.50, కంద-44, బీట్ రూట్-32, కీరదోస-34, బీన్స్-76, క్యాప్సికమ్-58, చింతకాయలు-60, నిమ్మ (డజను)-20/18, కొత్తిమీర-6/12, పుదీనా-5/15, ముల్లంగి-8, పచ్చిమామిడి-20/22 (నిన్నటివి). నగరంలోని రైతుబజార్లలో ఈ ధరలు (రూ.ల్లో) వర్తిస్తాయి. **- ఎన్టీఆర్ కలెక్టరేట్, విజయవాడ**

ఈఎస్ఎల్ క్రికెట్ టోర్నీ... తుది పోరు నేడే



న్యూస్‌టుడే- విజయవాడ క్రీడలు

కానూరులోని కేసీపీ సిద్ధార్థ ఆదర్శ్ రెసిడెన్షియల్ స్కూల్ మైదానంలో జరుగుతున్న ధనిక్ భారత్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ (ప్రజెంట్స్) 'ఈనాడు' స్పోర్ట్స్ లీగ్ (ఈఎస్ఎల్)-2025 జిల్లా స్థాయి పోటీలు ముగింపు దశకు చేరుకున్నాయి. మంగళవారం జరిగిన సెమీ ఫైనల్లో వీఆర్ సిద్ధార్థ ఇంజినీరింగ్ కళాశాల, నలంద డిగ్రీ కళాశాల జట్లు సీనియర్స్ విభాగంలో ఫైనల్స్‌కు ప్రవేశించాయి. జూనియర్ విభాగంలో ఎన్ఆర్ఐ జూనియర్ కళాశాల జట్టు తుదిపోరుకు చేరుకుంది. ఇప్పటికే ఆంధ్రా లయోలా జూనియర్ కళాశాల జట్టు ఫైనల్‌కు చేరింది.

ధనిక్ భారత్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ స్టార్ క్రికెటర్ ఆఫ్ ది మ్యాచ్ వీరే..



ఎస్.సుజన్ | జె.బన్నీ | సీహెచ్ వైభవ్ రాజ్



14 పరుగుల తేడాతో విజయం

తొలి మ్యాచ్‌లో వీఆర్ సిద్ధార్థ ఇంజినీరింగ్ కళాశాల జట్టు 14 పరుగుల తేడాతో పొట్టి శ్రీరాములు చలవాది మల్లికార్జునరావు ఇంజినీరింగ్ కళాశాల జట్టుపై విజయం సాధించింది. టాస్ గెలిచిన పొట్టి శ్రీరాములు జట్టు బౌలింగ్ ఎంచుకోగా.. బ్యాటింగ్‌కు దిగిన వీఆర్ సిద్ధార్థ జట్టు పది ఓవర్లలో ఏడు వికెట్ల నష్టానికి 71 పరుగులు చేసింది. ఎం.కుమారస్వామి 18, ఎస్.తరుణ్ సాయి 14 పరుగులతో క్రీజ్‌లో నిలవగా.. ప్రత్యర్థి బౌలర్లు పి.ప్రభు ఏడు పరుగులు ఇచ్చి రెండు, పి.నిఖిల్ తొమ్మిది పరుగులు ఇచ్చి రెండు వికెట్లు కూల్చారు. బదులుగా బ్యాటింగ్‌కు దిగిన పొట్టి శ్రీరాములు కళాశాల జట్టు ఐదు వికెట్ల నష్టానికి 57 పరుగులే చేసింది. పి.ప్రభు 16 పరుగులు చేశాడు. ప్రత్యర్థి బౌలర్ ఎస్.సుజన్ పది పరుగులు ఇచ్చి రెండు వికెట్లు పడగొట్టాడు. మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా ఎస్.సుజన్ ఎంపికయ్యాడు.

బ్యాటింగ్.. బౌలింగ్‌లో రాణించి...

రెండో మ్యాచ్‌లో నలంద డిగ్రీ కళాశాల జట్టు 26 పరుగుల తేడాతో శ్రీవాసవి ఇంజినీరింగ్ కళాశాల జట్టుపై గెలిచింది. టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన నలంద జట్టు పది ఓవర్లలో ఎనిమిది వికెట్ల నష్టానికి 80 పరుగులు చేసింది. బి.నిఖిల్ 18 పరుగులతో క్రీజ్‌లో నిలవగా.. జె.బన్నీ 12 పరుగులు జోడించాడు. ప్రత్యర్థి బౌలర్ జె.రోహిత్‌బాబు పది పరుగులు ఇచ్చి నాలుగు వికెట్లు కూల్చాడు. బదులుగా బ్యాటింగ్‌కు దిగిన శ్రీవాసవి జట్టు ఆరు వికెట్లు కోల్పోయి 54 పరుగులకే పరిమితమైంది. ఎస్‌కే రాకిబ్ 20 పరుగులు చేయగా.. ప్రత్యర్థి బౌలర్లు సీహెచ్ గోపాల్, జె.బన్నీ చెరో వికెట్ పడగొట్టారు. మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా జె.బన్నీ ఎంపికయ్యాడు.





7.5 ఓవర్లలోనే లక్ష్యాన్ని చేరుకొని..

మూడో మ్యాచ్‌లో ఎన్ఆర్ఐ జూనియర్ కళాశాల జట్టు ఏడు వికెట్ల తేడాతో విశ్వశాంతి జూనియర్ కళాశాల జట్టుపై గెలిచింది. టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన విశ్వశాంతి జట్టు పది ఓవర్లలో ఏడు వికెట్ల నష్టానికి 61 పరుగులు చేసింది. ఎస్.హేమనాథ్ సాయి 14, వరుణ్ కిండో 12 పరుగులతో రాణించగా.. ప్రత్యర్థి బౌలర్ సీహెచ్ వైభవ్‌రాజ్ ఆరు పరుగులు ఇచ్చి రెండు వికెట్లు పడగొట్టాడు. బదులుగా బ్యాటింగ్‌కు దిగిన ఎన్ఆర్ఐ జట్టు 7.5 ఓవర్లలో మూడు వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని చేరుకుంది. సీహెచ్ వైభవ్ రాజ్ 20 పరుగులతో క్రీజ్‌లో నిలవగా.. ప్రత్యర్థి బౌలర్లు ఎండీ సిద్ధిక్, ఎ.తనూజ్‌రెడ్డి చెరో వికెట్ పడగొట్టారు. మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా సీహెచ్ వైభవ్ రాజ్ ఎంపికయ్యాడు.

నేటి ఫైనల్ మ్యాచ్‌ల వివరాలు (జిల్లా స్థాయి)

- ★ నలంద డిగ్రీ కళాశాల × వీఆర్ సిద్ధార్థ ఇంజినీరింగ్ కళాశాల (మొదటి మ్యాచ్)
- ★ ఆంధ్రా లయోలా జూనియర్ కళాశాల × ఎన్ఆర్ఐ జూనియర్ కళాశాల (రెండో మ్యాచ్)

సయ్యద్ షాబుఖారీ దర్గా ఉరుసు ఉత్సవం

కొండపల్లి, న్యూస్‌టుడే : సయ్యద్ షాబుఖారీ దర్గా ఉరుసు ఉత్సవం వేలాది మంది భక్తులతో మంగళవారం కిటకిటలాడింది. వివిధ జిల్లాల నుంచి ముస్లింలు పెద్ద ఎత్తున దర్గా వద్దకు చేరుకున్నారు. విజయవాడ పార్లమెంటు సభ్యుడు కేశినేని శివనాథ్(చిన్ని), మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్, కొండపల్లి మున్సిపల్ ఛైర్మన్ చిట్టిబాబు, తెదేపా సీనియర్ నాయకుడు సీతారామయ్య దర్గా ఆవరణలో నిర్వహించిన పూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా లంగర్ ఖానా ఆవరణలో ఏర్పాటు చేసిన ప్రసాద పంపిణీ కార్యక్రమాన్ని సబ్ కలెక్టర్ చైతన్య, ఏసీపీ దుర్గారావు ప్రారంభించారు. ఉరుసు మహోత్సవంలో భాగంగా గుర్రాల స్వారీ ఆకర్షణగా నిలిచింది. రాత్రి సమయానికి గంధం మహోత్సవాన్ని దర్గా అభివృద్ధి కమిటీ, ఉరుసు కమిటీ, ముజావర్లు, మత పెద్దలు అల్తాఫ్ రజా ఆరంభించారు.

ముక్త్యాలలో రెండు చోట్ల చోరీ

ఓ ఇంట్లో 15 తులాల బంగారం మాయం

జగ్గయ్యపేట గ్రామీణం: మండలంలోని ముక్త్యాలలో మంగళవారం దొంగలు హల్‌చల్ చేశారు. తెల్లవారుజామున వడెల్లి దుర్గాప్రసాద్ కిరాణ దుకాణంలో రూ.20 వేలు చోరీ చేశారు. మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో జంగాల వెంకటేశ్వర్లు ఇంట్లో ఎవరూ లేని సమయంలో చొరబడి బీరువా తాళం పగలగొట్టి రూ.1.20 లక్షల నగదు, 15 తులాల బంగారం చోరీ చేశారు. వారు పొలం పనికి వెళ్లి ఇంటికి వచ్చి చూడగా బీరువా తాళం పగలగొట్టి ఉంది. వారి ఫిర్యాదు మేరకు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. ఒకే రోజే గ్రామంలో రెండు చోట్ల దొంగతనాలు జరగడంతో గ్రామస్థులు ఆందోళన చెందుతున్నారు.

జిల్లాలో పారిశ్రామిక అభివృద్ధికి చొరవ

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే : జిల్లాలో పారిశ్రామిక రంగ అభివృద్ధికి చొరవ చూపుతున్నట్లు కలెక్టర్ జి.లక్ష్మీశ తెలిపారు. ప్రభుత్వ దార్శనికతతో పాటు, సీఎం చంద్రబాబు ఆకాంక్ష అయిన స్పీడ్ డూయింగ్ బిజినెస్, ఒక కుటుంబం-ఒక పారిశ్రామికవేత్త నినాదాలకు అనుగుణంగా నడుచుకుంటున్నట్లు చెప్పారు. ఇటీవల విశాఖపట్నం పార్ట్నర్‌షిప్ సమ్మిట్-2025 సందర్భంగా ఎంవోయూ కుదుర్చుకున్న పారిశ్రామికవేత్తలతో నగరంలోని కలెక్టరేట్‌లో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. పారిశ్రామికవేత్తలకు అవసరమైన సహాయ సహకారాలపై చర్చించి, పటిష్ఠ ప్రణాళిక ప్రకారం కార్యచరణ చేపట్టాలన్నారు. విజయవాడ, నందిగామ, తిరువూరు రెవెన్యూ డివిజన్ల పరిధిలో ల్యాండ్ బ్యాంకు వివరాలతో సమగ్ర నివేదికను సిద్ధం చేయాలని ఆర్డీవోలకు సూచించారు. స్థానికంగా ఉపాధి అవకాశాలను విస్తృతం చేయడం, జిల్లా స్థూల ఉత్పత్తి వృద్ధి తదితర లక్ష్యాలకు అనుగుణంగా పారిశ్రామికరంగ ప్రగతిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. పలువురు పారిశ్రామికవేత్తలు, అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో గద్దె అనూరాధ, ఎంపీ శివనాథ్, కార్పొరేషన్ల ఛైర్మన్లు, నాయకులు

కూటమి ప్రభుత్వానికి ప్రజల ఆదరణ

పటమట: ఇచ్చిన ప్రతి హామీని కూటమి ప్రభుత్వం అమలు చేసి ప్రజాదరణ పొందుతోందని ఎంపీ కేశినేని శివనాథ్, తెదేపా జిల్లా అధ్యక్షురాలు గద్దె అనూరాధ అన్నారు. ఏడాదిన్నర కాలంలో కూటమి ప్రభుత్వం సాధించిన విజయాలను గురునానక్ కాలనీలోని పార్టీ కార్యాలయంలో మంగళవారం వారు విలేకరులకు వెల్లడించారు. ఎంపీ మాట్లాడుతూ సూపర్ - 6 పథకాలను సూపర్ హిట్ చేసిన ఘనత చంద్రబాబుకే దక్కుతుందన్నారు. తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ, ఉచిత గ్యాస్ సిలిండర్లు, ఇమామ్, మౌజన్లు, పాస్టర్లకు వేతనాలు, గీత కార్మికులకు ఆర్థిక సాయం తదితర పథకాల గురించి వివరించారు. జనగణన తర్వాత గ్రేటర్ విజయవాడపై సీఎం నిర్ణయం తీసుకుంటారని తెలిపారు. అనూరాధ మాట్లాడుతూ.. గత ప్రభుత్వం విధ్వంసం వైపు రాష్ట్రాన్ని తీసుకెళ్తే.. ముఖ్యమంత్రి చంద్రబాబు వికాసం వైపు నడిపిస్తున్నారని తెలిపారు. ఉచిత బస్సు సౌకర్యంతో మహిళలు ఎంతో ఆనందంగా ఉన్నారని తెలిపారు. జిల్లా ప్రధాన కార్యదర్శి చెన్నుబోయిన చిట్టిబాబు, వివిధ కార్పొరేషన్ల ఛైర్మన్లు ఫరూక్ షిబ్లీ, సావల దేవదత్, గొట్టుముక్కల రఘురామరాజు, ఎరుబోతు రమణారావు, పోతుల బాలకోటయ్య తదితరులు పాల్గొన్నారు.

సుబాబుల్ ధర నేలచూపు

టన్నుకు రూ.1500 తగ్గించి కొనుగోలు ☛ భారీగా నష్టపోతున్న రైతులు

నందిగామ గ్రామీణం, జగ్గయ్యపేట, వత్సవాయి, న్యూస్‌టుడే



ట్రాక్టర్లలో లోడు చేస్తున్న కర్ర

సుబాబుల్ కర్ర ధర మరింత పతనమైంది. మూడు నెలల క్రితం ఉన్న ధర కంటే టన్నుకు రూ.1500 తగ్గించారు. దీంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. కంపెనీలు సిండికేట్‌గా మారి ధరలు తగ్గించడంతో ఇటీవల మార్కెటింగ్ శాఖ అధికారులు సమావేశం నిర్వహించి ధర తగ్గకుండా చూడాలని ఆదేశించారు. కానీ క్షేత్ర స్థాయిలో పరిస్థితి అందుకు భిన్నంగా ఉంది.

ఎన్టీఆర్ జిల్లాలో ఎక్కువగా నందిగామ, జగ్గయ్యపేట నియోజకవర్గాల్లో 40 వేల ఎకరాల్లో సుబాబుల్ తోటలు సాగు చేస్తున్నారు. ఎకరాకు సగటున 30 టన్నుల కర్ర దిగుబడి వస్తుంది. ఈ ప్రాంతంలో కొన్ని కంపెనీలు ట్రేడర్ల ద్వారా ఆర్సీపై కర్రను కొనుగోలు చేస్తున్నాయి. మూడు నెలల క్రితం టన్ను రూ.6500లకు కొనుగోలు చేశాయి. పక్షం రోజులుగా ఓ కంపెనీ టన్ను రూ.4900కు కొనుగోలు చేస్తోంది. మిగిలిన కంపెనీలు రూ.5400లకు ధరకు కొనుగోలు చేస్తున్నాయి. ఒక్కసారిగా టన్నుకు రూ.1500 ధర తగ్గడంతో రైతులు ఎకరానికి రూ.45 వేలు నష్టపోతున్నారు. గతంలో మార్కెట్ యార్డుల పర్యవేక్షణలో కర్ర కొనుగోలు చేసేవారు. కొంతకాలంగా కంపెనీలు ఆర్సీలున్న ట్రేడర్ల ద్వారా కర్రను కొనుగోలు చేస్తున్నాయి. దీని వల్ల ధర పతనం అవుతున్నా అధికారులు పట్టించుకోని పరిస్థితి ఏర్పడింది. ఖరీఫ్ ప్రారంభంలో ధర ఆశాజనకంగా ఉండడంతో కంపెనీలు సుబాబుల్ సాగును ప్రోత్సహించాయి. ఇప్పుడు ధర తగ్గడంతో సాగుచేస్తున్న రైతులు ఆందోళన చెందుతున్నారు. రెవెన్యూ, మార్కెటింగ్ శాఖ అధికారులు కంపెనీలతో ధరపై సమీక్ష నిర్వహించి ధర స్థిరంగా ఉండేలా చూడాలని సాగు రైతులు కోరుతున్నారు.

పేపరు పరిశ్రమలు ఏర్పాటు చేస్తే మేలు

నందిగామ, జగ్గయ్యపేట, మైలవరం నియోజకవర్గాల్లో ఎక్కువగా సుబాబుల్, జామాయిల్ తోటలను సాగు చేస్తున్నారు. సుబాబుల్ కర్రకు గిట్టుబాటు ధర స్థిరీకరణకు పేపరు పరిశ్రమలు ఏర్పాటు చేయాలి. ఆ దిశగా అధికారులు, ప్రజాప్రతినిధులు కృషి చేస్తే రైతులకు మేలు జరుగుతుంది.

అద్విక కేసులో మరో ఏజెంట్ అరెస్టు

బ్రాయిలర్ ధరలు (కిలో 1కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -140 రిటైల్ ధర 167 చికెన్ విత్ స్కిన్ - 242, చికెన్ స్కిన్‌లెస్ - 276.
అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 157, 166, 177 చికెన్ విత్ స్కిన్ - 304 చికెన్ స్కిన్‌లెస్ - 314.

పటమట: అద్విక ట్రేడింగ్ కంపెనీ మోసం కేసులో మరో ఏజెంట్‌ని సిట్ పోలీసులు అరెస్టు చేశారు. గుంటూరుకు చెందిన రామిరెడ్డి హైదరాబాద్‌లో స్థిరపడ్డారు. అక్కడ సుమారు 140 మందితో అద్విక ట్రేడింగ్ కంపెనీలో పెట్టుబడి పెట్టించారు. దాదాపు రూ.2 కోట్ల మేర కమీషన్ రూపంలో లబ్ధి పొందాడు. ఆ నగదు తిరిగి ఇచ్చేందుకు నిరాకరించారు. ఈ నేపథ్యంలో మంగళవారం సిట్ పోలీసులు అతన్ని అరెస్టు చేశారు.

మొక్కుబడి తనిఖీలు.. ఎవరి కోసం?

నాలుగు దుకాణాలకు నోటీసులిచ్చి మమ

ఈనాడు, అమరావతి, న్యూస్‌టుడే, నందిగామ, తిరువూరుటౌన్, విస్సన్నపేట



నందిగామ : ఎరువుల దుకాణంలో తనిఖీలు చేస్తున్న టాస్క్‌ఫోర్స్ అధికారులు

యూరియా అధిక ధరలకు విక్రయించడం, రాష్ట్ర సరిహద్దులు దాటించడం..కృత్రిమ కొరత సృష్టించడం..యూరియా ఇవ్వాలంటే ఇతర ఎరువులు కొనుగోలు చేయాలని మెలిక పెట్టడం తదితర అడ్డగోలు వ్యవహారాలపై 'యూరియా దందా..అంతే లేదయా' శీర్షికన ఈనాడులో ప్రచురితమైన కథనానికి కలెక్టర్ స్పందించారు. అధికారులు, డీలర్లను గట్టిగా హెచ్చరించారు. మంగళవారం టాస్క్‌ఫోర్స్, వ్యవసాయశాఖ, రెవెన్యూ అధికారులు జిల్లాలోని ఎరువుల దుకాణాల్లో ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. నందిగామ, విస్సన్నపేట తిరువూరు మండలం, పట్టణం పరిధిలో 10 దుకాణాల్లో తనిఖీలు చేశారు. దుకాణాల్లో ఉన్న నిల్వ, దస్త్రాల్లో నమోదు చేసిన నిల్వలు పరిశీలించగా తిరువూరులో రెండు, నందిగామలో రెండు దుకాణాల్లో వ్యత్యాసాలు కనిపించాయి. ఆయా దుకాణాల్లో నిల్వల వ్యత్యాసాలకు గల కారణాలు తెలిపే వరకు అమ్మకాలు నిలిపివేయాలని నోటీసులు జారీ చేశారు.

అసలు విషయాలు వదిలేశారు

ఆకస్మికంగా తనిఖీలు చేసేందుకు వెళ్లిన బృందాలు కేవలం నిల్వలు, దస్త్రాలు పరిశీలించడంతోనే సరిపెట్టారు. అధిక ధరలకు విక్రయాలు, ఇతర ఎరువులు కొనాలన్న ఆంక్షలు, తెలంగాణ తరలిస్తున్న వ్యవహారాలను అసలు పట్టించుకోలేదు. దస్త్రాల పరిశీలనలో గుర్తించిన అంశాల్లోనూ పూర్తి స్థాయిలో చర్యలు తీసుకోలేదు. నిల్వలకు, అమ్మకాలకు తేడాలున్నప్పుడు చర్యలు తీసుకోవడం మాని నోటీసులు ఇచ్చి మమ అనిపించడం ఎందుకు? నిల్వల్లో వ్యత్యాసాలు ఉన్నాయంటే లెక్కాపత్రం లేకుండా తెలంగాణకు తరలించారని స్పష్టంగా తెలుస్తున్నా నామమాత్రపు చర్యలపై విమర్శలు వస్తున్నాయి. రైతులతో మాట్లాడినా అక్రమాల గురించి లోపాయికారిగా చెప్పే పరిస్థితి ఉన్నా ఆ ప్రయత్నం చేయలేదు. వ్యవసాయశాఖ అధికారులు తనిఖీల సమాచారాన్ని దుకాణ యజమానులకు ముందే చేరవేయడంతో వారు అప్రమత్తమయ్యారని జిల్లాలో ఓ ఉన్నతాధికారి తెలిపారు. కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ..'తనిఖీలు జరుగుతూనే ఉంటాయి. అక్రమాలకు పాల్పడిన డీలర్లపై చర్యలు తీసుకుంటామని' పేర్కొన్నారు.

పండగ వేళ తప్పిన పెను ప్రమాదం

విద్యుత్తు స్తంభాన్ని ఢీకొట్టిన పాఠశాల బస్సు



ఘటనా స్థలంలో భయంతో విలపిస్తున్న విద్యార్థులు

గంపలగూడెం, న్యూస్‌టుడే : ముక్కోటి ఏకాదశి నాడు విద్యార్థులకు పెను ప్రమాదం తప్పింది. మంగళవారం ఉదయం మండలంలోని తోటమూలకు చెందిన గీతాంజలి విద్యాలయం బస్సు పెనుగొలను నుంచి విద్యార్థులను పాఠశాలకు తీసుకొస్తుండగా, చల్లగుండ్లవారిపాలెం సమీపంలో ఎదురుగా వస్తున్న మరో పాఠశాల బస్సుకు దారిచ్చే క్రమంలో వేగంగా దూసుకెళ్లి రోడ్డు అంచులోనున్న విద్యుత్తు స్తంభాన్ని బలంగా ఢీకొట్టింది. ఆ సమయంలో గీతాంజలి విద్యాలయం బస్సులో సుమారు 50 మందికి పైగా విద్యార్థులు ఉన్నట్లు సమాచారం. ప్రమాదం జరగ్గానే చిన్నారులు భయంతో కేకలు వేయగా సమీప పొలాల్లోని వ్యవసాయ కూలీలు పరుగున వచ్చి పిల్లలను బయటకు దింపి ఓదార్చారు. బస్సును అతి వేగంగా నడపడంతోనే అదుపు తప్పి ప్రమాదానికి గురైందని తెలుస్తోంది. ప్రమాద ధాటికి 11 కేవీ తీగలు అమర్చిన స్తంభం కూడా మధ్యకు విరిగింది. అదృష్టవశాత్తు పిల్లలంతా ప్రాణాపాయం నుంచి బయటపడ్డారు. ఈ సంఘటనను అధికారులు తీవ్రంగా పరిగణించక పోవడంతో విద్యాలయ యజమానులు ప్రమాద స్థలం నుంచి బస్సును తీసుకెళ్లారు.



తిరువూరు
• తిరువూరు • మైలవరం

ప్రతిభ చాటడానికి పోటీ పరీక్షలు దోహదం


గెలుపొందిన వారితో ఉపాధ్యాయులు

మైలవరం, న్యూస్‌టుడే : విద్యార్థులు పాఠశాల స్థాయి నుంచే పోటీల్లో పాల్గొని ప్రతిభ చాటాలని స్థానిక ఎస్వీఆర్ జీఎన్నార్ జడ్పీ ఉన్నత పాఠశాల హెచ్ఎం కె.సతీష్ పేర్కొన్నారు. 'ఈనాడు- ఈటీవీ' ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రతిభా పాటవ పోటీల్లో భాగంగా మంగళవారం ఆ పాఠశాలలోని విద్యార్థులకు జనరల్ నాలెడ్జి అంశంపై క్విజ్ పోటీలు జరిగాయి. ఇందులో షేక్ నాగుల్‌షరీఫ్(9వ తరగతి), ఎం.ఏసుబాబు(10వ తరగతి), బి.నరేష్(8వ తరగతి) వరుసగా మొదటి మూడు స్థానాలు సాధించారు. వారికి ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులు ఎం.గోపాలరత్తయ్య, ఆర్వీఎస్ఆర్ రామకృష్ణారావు, ప్రకాశరావు, పి.శ్రీనివాసరావు బహుమతులు అందజేసి ప్రత్యేకంగా అభినందించారు.

కాలమానిని.. దైనందిని ఆవిష్కరణ



మండల కేంద్రంలోని విద్యా శాఖ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో రాష్ట్రోపాధ్యాయ సంఘం ముద్రించిన 2026 సంవత్సరం దైనందిని, కాలమానిని ఎంఈవోలు ఎం.రాజశేఖర్, ఇ.కేశవరావు ఆవిష్కరించారు. ఎస్టీయూ జిల్లా, మండల నాయకులు ఎం.బసవయ్య, ఎన్.జార్జివాషింగ్టన్, బి.రామ్‌నాయక్, బి.జ్ఞానప్రసూన, ఎం.శేఖర్‌రెడ్డి పాల్గొన్నారు. **- న్యూస్‌టుడే, ఎ.కొండూరు**

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

తిరువూరు: 98853 28820 మైలవరం: 80085 74705

? పాత నాగులూరులోని ఎస్సీ కాలనీలో వారం రోజులుగా వీధి దీపాలు వెలగక ఇబ్బందులు పడుతున్నాం. **- స్థానికుడు, డేవిడ్ రాజు** ✔ ఆ గ్రామంలో విద్యుత్తు లైను పనులు జరుగుతున్నాయి. సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం. **- కృష్ణ నాయక్, పంచాయతీ కార్యదర్శి, పాతనాగులూరు - న్యూస్‌టుడే, రెడ్డిగూడెం**

? మునగపాడు గ్రామం ఎస్సీ కాలనీలోని పంచాయతీ బోరు పాడైపోయి నీటి కోసం అవస్థలు పడుతున్నాం. **- కోటేశ్వరరావు, గ్రామస్థుడు.** ✔ సమస్య మా దృష్టికి వచ్చింది. సిబ్బందితో బోరుకు మరమ్మతులు చేపడతాం. **- మనోజ్, పంచాయతీ కార్యదర్శి - న్యూస్‌టుడే, జి.కొండూరు**

❖ రెడ్డిగూడెం 6 వార్డులోని డ్రెయినేజీలో పూడిక పేరుకుందని, దీంతో మురుగు పారడం లేదని స్థానికులు 'ఈనాడు' మేమున్నాం...మీకు తోడుగా ద్వారా సమస్యను అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. పంచాయతీ ఇన్‌ఛార్జి కార్యదర్శి ఎస్.నాగరాజు స్పందించి పారిశుద్ధ్య కార్మికులను పంపించి పూడిక తీయించి సమస్య పరిష్కరించారు.

❖ రెడ్డిగూడెం పంచాయతీ 8వ వార్డులోని డ్రెయిన్లలో పూడిక పేరుకుందని స్థానికులు 'మేమున్నాం...మీకు తోడుగా' ద్వారా సమస్యను అధికారులకు తెలిపారు. పంచాయతీ ఇన్‌ఛార్జి కార్యదర్శి ఎస్.నాగబాబు స్పందించి పారిశుద్ధ్య కార్మికులను పంపించి పూడిక తొలగించారు. **- న్యూస్‌టుడే, రెడ్డిగూడెం**

కళావిహీనం.. ఆహ్లాదం దూరం

సేద తీరేందుకు చోటు లేక అవస్థలు పడుతున్న ప్రజలు

కొండపల్లి, న్యూస్‌టుడే

కొండపల్లి పురపాలిక వ్యాప్తంగా ఉద్యానవనాలు కళావిహీనమయ్యాయి. పురపాలికతో పాటు ఎన్టీటీపీఎస్ కాలనీల్లో ఉన్న వాటి పరిస్థితి ఇలానే తయారయ్యింది. ముఖ్యంగా గజరాజు చెరువు, బి.కాలనీ పార్కులు చెత్త, వ్యర్థాలతో నిండిపోయాయి. దీంతో ఉదయం, సాయంత్రం వేళల్లో వాకింగ్ చేసే వారికి తీవ్ర అసౌకర్యంగా ఉంటుంది. చిన్నారులు సైతం వీటికి దూరమయ్యారనే చెప్పాలి. ఇంతకు ముందు గజరాజు చెరువు ప్రాంగణంలో ఏర్పాటు చేసిన బెంచీలు సైతం మాయమయ్యాయి. ఇదిలా ఉంటే ఏదో విధంగా వాకింగ్ చేయాలని భావించి అక్కడికి వచ్చిన వారికి మరో సమస్య దర్శనమిస్తోంది. ఆయా ప్రదేశాల్లో ఖాళీ మద్యం బాటిళ్లు ఉండటంతో సేద తీరలేక, వాకింగ్ చేయలేక పోతున్నారు. మద్యం బాటిళ్ల వ్యర్థాలు కాళ్లలో గుచ్చుకొంటే కొత్త సమస్యను ఎదుర్కొవాలని భావించి గజరాజు చెరువుతో పాటు కాలనీ పార్కులకు దూరమై రహదారులపైనే వాకింగ్ చేస్తున్నారు. కాలనీ రోడ్ల పక్కన, పురపాలిక వీధుల్లో ఏర్పాటు చేసిన బెంచీలపైనే వీరు సేద తీరుతున్నారు.


అధ్వానంగా కొండపల్లి గజరాజు చెరువు ప్రాంగణంలోని వాకింగ్ ట్రాక్

ఎక్కడికక్కడ పగుళ్లు

ఇబ్రహీంపట్నం, ఎన్టీటీపీఎస్ కాలనీలకు చెందిన అత్యధికులు పవిత్ర సంగమం రోడ్డునే వాకింగ్‌కు, సేద తీరేందుకు ఉపయోగిస్తుంటారు. ప్రస్తుతం అక్కడి పరిస్థితులు వీరికి ప్రతికూలంగానే ఉన్నాయి. రెండు కిలో మీటర్ల సంగమం రహదారి ఎక్కడికక్కడ భారీగా పగుళ్లు ఇచ్చింది. పర్యవేక్షణ లేక డివైడర్‌లో ఉన్న చెట్లు, గ్రీనరీ అధ్వానంగా మారాయి. దీంతో పురపాలిక వాసులు సంగమం రహదారికి వెళ్లేందుకు కూడా సాహసించడం లేదు. ఎన్టీటీపీఎస్‌కు చెందిన ఏ, సీ కాలనీల్లో పార్కులు ఉన్నాయి. అయితే వాటిల్లోకి వెళ్లేందుకు భద్రతా పరమైన నిబంధనలను సంస్థ అవలంబిస్తుండటంతో ప్రజలు వాటికి దూరంగా ఉంటున్నారు.

పరిస్థితిని పరిశీలిస్తాం

గజరాజు చెరువు పార్కులోని వాకింగ్ ట్రాక్‌ను గతంలోనే అభివృద్ధి చేశాం. వర్షాకాలంలో ఆ ప్రాంతాన్ని వినియోగించుకోక పోవడంతో కంప చెట్లు పెరిగాయి. అక్కడి ట్రాక్‌ను పరిశీలించి తిరిగి మనుగడలోకి తీసుకువస్తాం.
- వెంకటరత్నం, ఇన్‌ఛార్జి మున్సిపల్ కమిషనర్, చిట్టిబాబు, ఛైర్మన్, కొండపల్లి

రాష్ట్ర స్థాయి పోటీల్లో సత్తా

కొండపల్లి, న్యూస్‌టుడే : రాష్ట్ర స్థాయి కౌశల్ పోటీల్లో తృతీయ స్థానం సాధించిన విద్యార్థిని ఎన్.కోమలికను కొండపల్లి బాలికోన్నత పాఠశాల ఉపాధ్యాయులు మంగళవారం అభినందించారు. ఈ నెల 27న తిరుపతిలో రాష్ట్ర స్థాయి కౌశల్ పోటీలు జరిగ్గా అందులో సైంటిఫిక్ హెరిటేజ్ అనే అంశంపై రీల్‌ను విద్యార్థిని ప్రదర్శించింది.

4న హిందూ సమ్మేళనం

ఇబ్రహీంపట్నం, న్యూస్‌టుడే : ఇబ్రహీంపట్నంలో జనవరి 4న హిందూ సమ్మేళనం నిర్వహించనున్నట్లు సమ్మేళన నిర్వహణ కమిటీ సభ్యులు మంగళవారం తెలిపారు. ఆర్ఎస్ఎస్ వందేళ్లు పూర్తి చేసుకున్న నేపథ్యంలో ఇబ్రహీంపట్నంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నామని వారు చెప్పారు.

ఎన్నిక ఏకగ్రీవం


ఏడుకొండలును సన్మానిస్తున్న సంఘ నాయకులు

మైలవరం, న్యూస్‌టుడే : ఆంధ్రప్రదేశ్ పద్మశాలీయ సేవా సంఘం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శిగా మైలవరానికి చెందిన దునక ఏడుకొండలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. తిరుపతిలో ఇటీవల జరిగిన సంఘం రాష్ట్ర సమావేశంలో ఈ మేరకు ఎన్నికైనట్లు ఏడుకొండలు తెలిపారు. ఈ సందర్భంగా స్థానిక పద్మశాలీయ సేవా సంఘం నాయకులు మంగళవారం ఆయన్ను అభినందిస్తూ సన్మానించారు.

తెదేపా నాయకుడి నేత్రదానం

ఎ.కొండూరు, న్యూస్‌టుడే : మండలంలోని పోలిశెట్టిపాడుకు చెందిన తెదేపా నాయకుడు మల్లెల్లి శ్రీనివాసరావు(51) మంగళవారం మృతి చెందగా అతని నేత్రాలను కుటుంబ సభ్యులు విజయవాడ ఎల్వీ ప్రసాద్ కంటి ఆసుపత్రికి దానం చేశారు.

బ్యాంకుల్లో అయిదు రోజుల పని అమలు చేయండి


తిరువూరులో ఆందోళన చేస్తున్న వాణిజ్య, గ్రామీణ బ్యాంకు ఉద్యోగులు

తిరువూరు టౌన్, న్యూస్‌టుడే : యునైటెడ్ ఫోరం ఆఫ్ బ్యాంక్ యూనియన్స్ పిలుపు మేరకు మంగళవారం తిరువూరు పట్టణంలోని భారతీయ స్టేట్ బ్యాంకు వద్ద ఉద్యోగులు తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఆందోళన చేపట్టారు. బ్యాంకుల్లో వారానికి అయిదు రోజులు పని అమలు చేయాలని, వివిధ స్థాయిల్లోని ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని, పొరుగు సేవల ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని నినాదాలు చేశారు. ఎస్బీఐ ఉద్యోగుల సంఘం ప్రాంతీయ కార్యదర్శి బీఎల్‌హెచ్.ప్రసాద్, పట్టణంలోని వాణిజ్య, గ్రామీణ బ్యాంకుల ఉద్యోగులు పాల్గొన్నారు.

సాయం అందించేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు

గొల్లపూడి, న్యూస్‌టుడే : అనారోగ్యంతో బాధపడుతున్న వారు వైద్యం చేయించుకునేందుకు, వారికి సాయం అందించేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు చేపడుతుందని మైలవరం శాసన సభ్యుడు వసంత కృష్ణప్రసాద్ పేర్కొన్నారు. నియోజకవర్గంలోని పలువురికి మంజూరైన ఎల్ఓసీ, సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేసే కార్యక్రమం మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా కృష్ణప్రసాద్ మాట్లాడుతూ ఆసుపత్రిలో చికిత్స చేయించుకుంటున్న వారికి వీలుగా ఎల్ఓసీలు, చికిత్స పొందిన వారు బిల్లులు అందిస్తే ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా చెక్కులు అందించడం జరుగుతుందని చెప్పారు. అనంతరం ఐదుగురికి రూ.11 లక్షల 40 వేల ఎల్ఓసీలను ఆయన అందించారు.


బాధితురాలికి ఎల్ఓసీ అందిస్తున్న ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్

జి.కొండూరు, న్యూస్‌టుడే : మండలంలో అనారోగ్యంతో బాధపడుతున్న వారికి సీఎం సహాయ నిధి నుంచి మంజూరైన ఎల్‌వోసీలను మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ ఆయన కార్యాలయంలో మంగళవారం అందజేశారు. కవులూరుకు చెందిన కొండ్రు కోటేశ్వరరావుకు రూ.2.99 లక్షలు, కనికెళ్ల నరేంద్రకు రూ.2 లక్షలు, వెలగలేరుకు చెందిన కొండేటి రామకృష్ణకు రూ.3 లక్షలు మంజూరు కాగా వారి కుటుంబ సభ్యులకు ఎల్‌వోసీలను కూటమి నాయకులతో కలిసి ఎమ్మెల్యే ఇచ్చారు.

'తెదేపా బలోపేతానికి అంకితభావంతో పని చేస్తాం'


పార్టీలో చేరిన వారితో తెదేపా నాయకులు

గంపలగూడెం, న్యూస్‌టుడే : మండలంలోని కొణిజెర్లకు చెందిన వైకాపా నాయకుడు, మాజీ ఎంపీటీసీ సభ్యుడు బొల్లా కరుణాకర రావు(బుజ్జి), పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు బొల్లా సుధాకరరావు తమ అనుచరులతో మంగళవారం తెదేపాలో చేరారు. వైకాపా ఆవిర్భావం నుంచి కొణిజెర్లలో కరుణాకరరావు ఆ పార్టీకి కీలకంగా ఉన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేపట్టిన ప్రజా సంక్షేమ పథకాలు, పరిపాలనకు ఆకర్షితులై వారిద్దరు తెదేపాలో చేరారు. తోటమూల ఎస్ఆర్ కల్యాణ మండపంలో జరిగిన కార్యక్రమంలో తెదేపా మండల అధ్యక్షుడు ఎం.రామకృష్ణ, తెలుగు రైతు జిల్లా అధ్యక్షుడు సీహెచ్.రాజేశ్వరరావు, ఏఎంసీ వైస్ ఛైర్మన్ ఆర్.ఉత్తేజ్‌అనిల్, పార్టీ గ్రామ అధ్యక్షుడు వి.అనిల్ కుమార్, సొసైటీ అధ్యక్షుడు ఎన్.హరిప్రసాద్ తదితరుల సమక్షంలో వారిని పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీ అధిష్ఠానం ఆదేశం మేరకు తెదేపా బలోపేతానికి అంకితభావంతో పని చేస్తామని కొత్తగా చేరిన వారు ప్రమాణం చేశారు.

చేనేత కార్మికులకు పథకాల అమలు


వస్త్రాలు పరిశీలిస్తున్న సుబ్బారావు, నాయకులు

గొల్లపూడి, న్యూస్‌టుడే : చేనేత కార్మికులకు కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని తెదేపా రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బొమ్మసాని సుబ్బారావు పేర్కొన్నారు. శ్రీపాదుక అఖిల భారత హస్తకళ, చేనేత ప్రదర్శనను గొల్లపూడిలోని పద్మావతి కల్యాణ మండపంలో సుబ్బారావు మంగళవారం ప్రారంభించి మాట్లాడారు. చేనేత కార్మికులను ఆదుకునేందుకు వీలుగా సంక్షేమ పథకాలు ప్రవేశ పెడుతున్నట్లు వెల్లడించారు. నాయకులు తిరుపతిరావు, జి.కె.ప్రసాద్, శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థికి ఆర్థిక సాయం

మైలవరం, న్యూస్‌టుడే : మైలవరానికి చెందిన విద్యార్థి నరేంద్ర ఎంబీబీఎస్ నాలుగో ఏడాది చదువుతున్నాడు. ఈ మేరకు స్థానిక విశ్రాంత ఉద్యోగుల సంఘం ద్వారా రూ.10 వేల ఆర్థిక సాయాన్ని విద్యార్థి తండ్రికి మంగళవారం అందజేశారు. సంఘం అధ్యక్షుడు జడ్.నాగిరెడ్డి, సభ్యులు సురేష్ బాబు, వెంకటేశ్వరరావు, పి.గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

పగలే వెలుగులు.. లేవు చర్యలు!



తిరువూరు పట్టణంలో పగలు కూడా వీధి దీపాలు వెలుగుతుండటం ప్రజలను ఆశ్చర్యానికి గురి చేస్తోంది. ప్రధానంగా ఫ్యాక్టరీ సెంటర్ నుంచి బొంబేడయింగ్ వరకు వెలుగుతుండటంతో విద్యుత్తు వృథా అవుతుందని పట్టణవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పలు ప్రాంతాల్లోని ఆటోమేటిక్ సెన్సార్లు పని చేయకపోవడం, పర్యవేక్షణ లోపించడమే దీనికి కారణమని తెలుస్తోంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి దీపాల నిర్వహణపై దృష్టి సారించాలని, సెన్సార్లు సరి చేయించాలని ప్రజలు కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, తిరువూరు టౌన్**

రహదారిలో ఇలా.. వెళ్లేదెలా?



కొండపర్వ-చిత్తపూరు ప్రధాన రహదారి ఇరువైపులా పిచ్చిచెట్లు దట్టంగా పెరిగాయి. దీంతో వాహనదారులు, గ్రామస్థులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా ఈ రోడ్డు వెంబడి చిత్తపూరు, తుమ్మగూడెం, జనార్దనవరం, చాట్రాయి వరకు ప్రతి రోజు వివిధ ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల బస్సులు తిరుగుతుంటాయి. ప్రజలు చాట్రాయి నుంచి నూజివీడు వెళ్లడానికి కూడా ఇదే ప్రధాన రహదారి. ఈ నేపథ్యంలో ఆర్అండ్‌బీ అధికారులు తక్షణమే స్పందించి రెండు మండలాల వారికి ఉపయోగకరమైన మార్గం ఇరువైపులా ఉన్న పిచ్చిచెట్లను తొలగింపజేయాలని పలువురు విజ్ఞప్తి చేస్తున్నారు. **- న్యూస్‌టుడే, విస్సన్నపేట**

ట్యాంకు శిథిలం.. ఎన్నటికో పదిలం



మండలంలోని హెచ్.ముత్యాలంపాడు గ్రామంలో నాలుగు దశాబ్దాలుగా సేవలందించిన కృష్ణా తాగునీటి ట్యాంకు శిథిలావస్థకు చేరుకుంది. ఈ క్రమంలో గ్రామస్థుల వినతుల మేరకు అందులో నీరు నింపకుండా స్థానిక అధికారులు చర్యలు తీసుకున్నారు. దీంతో గ్రామంలో విస్తరించిన జీఏ పైపులైన్‌కు అనుసంధానం చేసి కృష్ణా జలాలు, పంచాయతీ నీరు సరఫరా చేస్తున్నారు. రెండు రకాల నీటిని ఒకే పైపులైనులో సరఫరా చేయడంతో శుద్ధమైన కృష్ణా జలాలు అందించడం లేదని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. తక్షణమే శిథిల ట్యాంకును తొలగించి, కొత్తది నిర్మిస్తే తమ అవస్థలు తొలగుతాయని ప్రజలు కోరుతున్నారు. దీనిపై ఎంపీడీవో బీవీ రామకృష్ణ నాయక్‌ను 'న్యూస్‌టుడే' వివరణ కోరగా ఇలా స్పందించారు. ట్యాంకు తొలగించేందుకు ఏర్పాటు చేశామని, నూతన ట్యాంకు నిర్మాణానికి నిధులు మంజూరు కాగానే పనులు ప్రారంభిస్తామన్నారు. **- న్యూస్‌టుడే, జి.కొండూరు**

వైకుంఠనాథుని దర్శనం.. సర్వపాప హరణం


వెల్లటూరు : వేణుగోపాల స్వామి


నరసాపురంలో..


గోసవీడు: మదన వేణుగోపాల స్వామి


రెడ్డిగూడెం: శ్రీరాజగోపాల స్వామి దేవాలయంలో..


జూపూడిలో..


తిరువూరులో..


మైలవరం : దర్శనానికి బారులు తీరిన భక్తులు


గంపలగూడెం రామాలయంలో..

వైకుంఠ ఏకాదశి పర్వదిన వేడుకలను తిరువూరు, మైలవరం నియోజకవర్గాల్లోని ఆలయాల్లో మంగళవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. భక్తులు వేకువజాము నుంచి దేవాలయాల్లోని ఉత్తర ద్వారంలో వివిధ అవతారాల్లోని స్వామి వారిని దర్శించుకున్నారు. **- న్యూస్‌టుడే, బృందం**

జనాలకు ఉపయోగపడే పనులకు ప్రాధాన్యం

తిరువూరు టౌన్, న్యూస్‌టుడే : తిరువూరు మున్సిపల్ కార్యాలయంలో ఛైర్‌పర్సన్ కె.నిర్మల అధ్యక్షతన మంగళవారం మున్సిపల్ కౌన్సిల్ బడ్జెట్ సమావేశం నిర్వహించారు. 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన బడ్జెట్‌ను అధికారులు సభ ముందు ఉంచారు. పట్టణంలో అభివృద్ధి, పారిశుద్ధ్యం, తాగునీటి సరఫరా, వీధి దీపాలు, డ్రెయినేజీ పనులకు అధిక ప్రాధాన్యం ఇచ్చినట్లు తెలిపారు. ఈ సందర్భంగా అధికార, ప్రతిపక్ష కౌన్సిలర్లు తమ వార్డుల్లో నెలకొన్న సమస్యలను సభ దృష్టికి తీసుకొచ్చారు. రహదారుల మరమ్మతులు, కాలువల శుభ్రతకు తగినన్ని నిధులు కేటాయించాలని కోరారు. మున్సిపాలిటీకి ఆదాయ వనరైన ఇంటి, కుళాయి పన్నులు సకాలంలో వసూలు అయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం ఛైర్‌పర్సన్ నిర్మల మాట్లాడుతూ ప్రజలకు ఉపయోగపడే పనులను ప్రాధాన్య క్రమంలో చేపట్టాలని అధికారులకు చెప్పారు. మున్సిపల్ కమిషనర్ కె.మనోజ, కౌన్సిలర్లు, అధికారులు పాల్గొన్నారు.


బడ్జెట్ సమావేశంలో పాల్గొన్న కౌన్సిలర్లు, అధికారులు

మత్తు పదార్థాలతో అనర్థాలు అధికం

ఎ.కొండూరు, న్యూస్‌టుడే : మండలంలోని కంభంపాడు జడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం ఎస్ఎఫ్ఐ, జేవీవీ సంయుక్త ఆధ్వర్యంలో ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలలు, పాఠశాలల విద్యార్థులకు మత్తు పదార్థాల అనర్థాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. మాదక ద్రవ్యాలు వినియోగం, రవాణా చట్టపరంగా విరుద్ధమని, విద్యార్థులు వీటికి దూరంగా ఉండాలని వక్తలు సూచించారు. ఆయా సంఘాల ప్రతినిధులు వంశీ, కుమార్ నాయక్, వెంకటేశ్వరరావు, ఇన్‌ఛార్జి హెచ్ఎం రాజారావు మాట్లాడారు.

పోరాటాలతో సమస్యలు పరిష్కారం


మైలవరంలో సీఐటీయూ నాయకుల బైక్ ర్యాలీ

మైలవరం, న్యూస్‌టుడే : విశాఖపట్నంలో నిర్వహించనున్న సీఐటీయూ మహాసభలను విజయవంతం చేయాలని కోరుతూ జిల్లా ఉపాధ్యక్షుడు సీహెచ్.సుధాకర్ ఆధ్వర్యంలో మైలవరంలో మంగళవారం ద్విచక్ర వాహనాల ప్రదర్శన నిర్వహించారు. సీఐటీయూ నిత్యం, ఆందోళనలు పోరాటాలతో కార్మికుల పక్షాన నిలుస్తోందని సుధాకర్ తెలిపారు.

స్నేహ పూర్వక వాతావరణం ఉండాలి


సూచనలిస్తున్న డీసీపీ లక్ష్మీనారాయణ

గంపలగూడెం, న్యూస్‌టుడే : శాంతి భద్రతల పరిరక్షణలో పోలీసులు అనుక్షణం అప్రమత్తంగా ఉండాలని విజయవాడ గ్రామీణ డీసీపీ బి.లక్ష్మీనారాయణ ఆదేశించారు. వార్షిక తనిఖీల్లో భాగంగా ఆయన మంగళవారం గంపలగూడెం పోలీసు స్టేషన్‌ను సందర్శించారు. పలు దస్త్రాలను తనిఖీ చేశారు. సిబ్బంది నిబద్ధతతో పని చేస్తూ ప్రజలతో స్నేహ పూర్వకంగా ఉండాలని సూచించారు. ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించి న్యాయం జరిగేలా చూడాలని కోరారు. ప్రజల విశ్వాసం పొందేలా పోలీసుల పనితీరు ఉండాలని చెప్పారు. ఏసీపీ ప్రసాదరావు, ఎస్సై అనిల్, సిబ్బంది పాల్గొన్నారు.

వేడుకలు శ్రుతి మించితే చర్యలు

ఎ.కొండూరు, న్యూస్‌టుడే : నూతన ఏడాది వేడుకల పేరుతో ప్రజాశాంతికి భంగం కలిగించే దుశ్చర్యలకు పాల్పడితే బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్సై జి.మహాలక్ష్మణుడు హెచ్చరించారు. శబ్ద కాలుష్యం చేస్తూ అనుమతి లేకుండా డీజేలు ఏర్పాటు చేస్తే వాటిని సీజ్ చేస్తామని తెలిపారు. వేడుకలు శ్రుతి మించినా, బహిరంగా ప్రదేశాల్లో ప్రజలకు అసౌకర్యంగా కలిగించేలా కార్యక్రమాలు నిర్వహించినా సహించబోమన్నారు. బుధవారం సాయంత్రం నుంచి గురువారం ఉదయం వరకు మండలంలోని గ్రామాల్లో పోలీసులు ముమ్మర తనిఖీలు నిర్వహిస్తారన్నారు.

యూరియా అధిక ధరలకు విక్రయించరాదు


రెడ్డిగూడెం పీఏసీఎస్ గోదాములో తనిఖీ చేస్తున్న తహసీల్దార్ సుశీలాదేవి

రెడ్డిగూడెం, న్యూస్‌టుడే : యూరియా అధిక ధరలకు అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ జె.సుశీలాదేవి, ఏవో డి.శ్రీనివాసరావు అన్నారు. రెండో రోజు మంగళవారం రెడ్డిగూడెం పీఏసీఎస్, సీతారామాంజనేయ ఎరువుల దుకాణంలో వారు తనిఖీలు చేపట్టారు. రెవెన్యూ, వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

its@eenadu.in

ఈనాడు

జేబులోని స్మార్ట్‌ఫోన్, బల్ల మీది డెస్క్‌టాప్, ఒడిలోని ల్యాప్‌టాప్, మణికట్టుకు చుట్టిన స్మార్ట్‌వాచ్, చెవిలో ఇయర్‌బడ్స్.. ఏ పరికరాలైనా కావొచ్చు. అన్నింటిలో ఒదిగిపోయి, సంచలనం సృష్టించిన ఈ ఏటి మేటి పరిజ్ఞానం కృత్రిమ మేధే. ఇవి ఒకరకంగా మన రోజువారీ పనులను పునర్ నిర్వచించాయన్నా అతిశయోక్తి కాదు. మరి ఏఐతో కూడిన ఇలాంటి డిజిటల్ పరికరాల్లో బాగా ఆకట్టుకున్నవేంటో చూద్దామా.

పరికరం టెక్కు



ఐఫోన్ 17 ప్రొ మ్యాక్స్

సుదీర్ఘ నిరీక్షణకు తెరదించిన ఐఫోన్ 17 ప్రొ మ్యాక్స్ అభిమానుల అంచనాలకు తగినట్టుగానే అవతరించింది. పూర్తి కొత్త హార్డ్‌వేర్‌తో పలకరించింది. వినూత్న ఏ19 ప్రొ చిప్ సామర్థ్యం ఆకట్టుకుంది. భారీ గేమ్స్‌ను ఆడినా, 8కే వీడియోలను ఎడిట్ చేసినా అంతరాయమనేదీ లేదు. మూడు 48ఎంపీ లెన్సులతో ప్రొఫెషనల్ ఫొటోగ్రాఫర్ల స్థాయిలో ఫొటోలు వీడియోలు, తీసుకోవచ్చు. 24 ఎంపీ సెల్ఫీ కెమెరాతో కూడా ఆకట్టుకుంది. ప్రత్యేకమైన కెమెరా బటన్, రోజంతా వచ్చే బ్యాటరీ మరింతగా ఆకర్షించాయి.



వన్‌ప్లస్ 13ఎస్

ఇదో కంప్యూటర్ ఫోన్. భారీ గ్రాఫిక్స్‌తో కూడిన గేమ్స్, ఒకేసారి పలు పనులకు వీలు కల్పించే స్నాప్‌డ్రాగన్ 8 ఎలైట్ చిప్‌తో వన్‌ప్లస్ 13ఎస్ టెక్ ప్రియులను బాగా ఆకట్టుకుంది. ఒకసారి ఛార్జ్ చేస్తే దాదాపు రోజున్నర వరకూ వచ్చే 5850ఎంఏహెచ్ బ్యాటరీ కాలం మరో ఆకర్షణ. 80డబ్ల్యూ ఛార్జర్‌తో సత్వరం ఛార్జ్ అవుతుంది. ఆక్సిజన్‌ఓఎస్ 15తో కూడిన ఇది కొద్ది థర్డ్ పార్టీ యాప్స్‌తో క్లీన్‌గా కనిపిస్తుంది. షార్ట్ కట్స్‌ను తేలికగా వాడుకోవటానికి తోడ్పడే ప్లస్ కీ, తక్కువ కాంతిలో స్పష్టమైన చిత్రాలు తీసే 2ఎక్స్ టెలిఫొటో కెమెరా యూజర్లకు నచ్చాయి.



గూగుల్ పిక్సెల్ బడ్స్ 2ఏ

ఇవి గూగుల్ పరిచయం చేసిన రెండో టీడబ్ల్యూఎస్ ఇయర్‌బడ్స్. ఎక్కువకాలం పనిచేస్తాయి. ఫాస్ట్ పెయిరింగ్, మల్టీపాయింట్ కనెక్టివిటీ, ఆడియో స్విచింగ్, స్పేషియల్ ఆడియో, యాక్టివ్ నాయిస్ క్యాన్సిలేషన్ వంటి ఫీచర్లు.. ప్రీమియం లుక్‌తో అదరగొట్టాయి.



సామ్‌సంగ్ గెలాక్సీ జడ్ ఫోల్డ్ 7

ఇది ఫోన్ మాత్రమే కాదు, ట్యాబ్లెట్ అనీ అనుకోవచ్చు. వినూత్న మడత ఫోన్లలో ఓ మైలురాయిగా పేరు తెచ్చుకుంది మరి. పలుచగా, తేలికగా ఉండటమే కాకుండా పెద్ద తెరతో ఆకట్టుకుంది. తెరచినప్పుడు 8 అంగుళాల డైనమిక్ ఎమోలెడ్ 2ఎక్స్ తెర మినీ ల్యాప్‌టాప్‌ను తలపిస్తుంది. ఫ్లెక్స్ మోడ్‌తో తెరను వేర్వేరు పనుల కోసం విభజించుకోవచ్చు. స్నాప్‌డ్రాగన్ 8 ఎలైట్ చిప్‌తో కూడిన దీని బ్యాటరీ సామర్థ్యం 4400ఎంఏహెచ్. ఒకసారి ఛార్జ్ చేస్తే 12 గంటలకన్నా ఎక్కువసేపు వాడుకోవచ్చు.



ఐకూ 13

గేమర్స్‌ను ప్రత్యేకంగా దృష్టిలో పెట్టుకొని రూపొందించిన ఇది అంచనాలకు తగ్గట్టుగా రాణించింది. స్నాప్‌డ్రాగన్ 8 ఎలైట్ చిప్, 16జీబీ ర్యామ్, 50ఎంపీ ట్రిపుల్ కెమెరా, 120డబ్ల్యూ ఛార్జింగ్ సపోర్టు గల 6000ఎంఏహెచ్ బ్యాటరీ వంటి ఫీచర్లతో ఆకట్టుకుంది.

గూగుల్ పిక్సెల్ 10

ఇది ఏఐ పవర్‌హౌజ్. వచ్చీ రావటంతోనే టెన్సర్ జీ5 చిప్, 12జీబీ ర్యామ్, 48ఎంపీ మెయిన్ కెమెరా, 4970ఎంఏహెచ్ బ్యాటరీతో అలరించింది. ఫొటోగ్రఫీ, సాఫ్ట్‌వేర్ మీద ప్రత్యేక దృష్టిసారించింది.

ఎయిర్‌పాడ్స్ ప్రొ 3

ఇవి ఇయర్‌బడ్స్ మాత్రమే కాదు, ఆరోగ్య పరికరం కూడా. వీటిల్లోని హార్ట్ రేట్ సెన్సర్ వ్యాయామం చేస్తున్నప్పుడు గుండె వేగాన్ని పసిగడుతుంది. అంతేకాదు, కేలరీలు ఖర్చవుతున్న తీరునూ గమనిస్తుంది. ఇక సౌండ్ విషయానికి వస్తే నాణ్యతకు పెట్టింది పేరు. లైవ్ ట్రాన్స్‌లేషన్ కూడా చేస్తుంది.



మ్యాక్‌బుక్ ఎయిర్ ఎం4

వ్యక్తిగత, వృత్తిగత పనులేవైనా తేలికగా చేసుకోవటానికి తోడ్పడే యాపిల్‌కు చెందిన మ్యాక్‌బుక్ ఎయిర్ ఎం4 మంచి పేరు కొట్టేసింది. ఎం4 చిప్‌తో కూడిన దీని డిస్‌ప్లే చాలా షార్ప్‌గా, శోభాయమానంగా ఉండటంతో పాటు బ్యాటరీ లైఫ్ కూడా యూజర్లకు నచ్చింది. విద్యుత్తు కట్ అయినా నిరంతరాయంగా గంటల కొద్దీ వాడుకోవచ్చు.

సైన్స్@2025

ఒకవైపు మానవ ఆసక్తి, అవసరాలు. మరోవైపు జ్ఞానాన్వేషణ, అభివృద్ధి. అన్నీ కలిసి శాస్త్రరంగాన్ని పరుగులు పెట్టిస్తున్నాయి. పలు రంగాల్లో మన అవగాహనను కొత్త శిఖరాలకు తీసుకెళ్తున్నాయి. కొత్త కొత్త ఆవిష్కరణలకు పురుడు పోస్తున్నాయి. ఈ సంవత్సరంలో వెలుగుచూసిన అద్భుతమైన శాస్త్రీయ ఆవిష్కరణలే ఇందుకు నిదర్శనం. వైద్యం, అంతరిక్షం, పర్యావరణం, సాంకేతిక రంగాల్లో ఇవెలాంటి ప్రభావం చూపుతున్నాయో ఓసారి మననం చేసుకుందాం.

ఆరోగ్యం అద్భుతం

- ఆయా రోగులకు అనుగుణంగా క్యాన్సర్ చికిత్స చేయటంలో పరిశోధకులు గొప్ప ముందడుగు వేశారు. అరుదైన అండాశయ క్యాన్సర్ కోసం కొత్త టార్గెటెడ్ మందుల మిశ్రమానికి అమెరికాలో ఆమోదం లభించింది. మరోవైపు తీవ్ర ప్రొస్టేట్ క్యాన్సర్‌కు సంబంధించిన జన్యు సూచికలను లాలాజల పరీక్షతోనే గుర్తించగల 'ఉమ్మి పరీక్ష' మీద పెద్ద ఎత్తున ప్రయోగ పరీక్షలు మొదలయ్యాయి. అంతేనా? రక్తక్యాన్సర్ చికిత్సలో జన్యు సవరణ కార్-టి సెల్స్ అద్భుతంగా పనిచేస్తున్నట్టూ తేలింది.
- నెలసరి నిలిచిన మహిళల్లో తలెత్తే వేడి ఆవిర్ల వంటి ఇబ్బందులను తొలగించటానికి హార్మోన్లతో సంబంధం లేని కొత్త మాత్ర 'ఎలింజానెటాంట్'కు అమెరికా ఎఫ్‌డీఏ అనుమతించింది. హార్మోన్ చికిత్సకు సరిపడనివారికిది ప్రత్యామ్నాయ ఔషధంగా ఉపయోగ పడుతుంది.
- ప్రాణాంతక జీవక్రియ జబ్బుతో బాధపడుతున్న ఒక శిశువుకు ప్రత్యేక క్రిస్పర్ జన్యు సవరణ విధానంతో చికిత్స చేయటంలో వైద్యులు విజయం సాధించారు. ఐవీ ఇన్ఫ్యూషన్ ద్వారా ఎల్ఎన్‌పీ-ప్యాకేజ్డ్ క్రిస్పర్ చికిత్సను చేయటం ద్వారా కీలకమైన సీపీఎస్1 ఎంజైమ్‌ను కాలేయం ఉత్పత్తి చేసేలా పురికొల్పారు. అరుదైన జన్యు సమస్యలతో బాధపడుతున్న లక్షలాది మందికి వారి అవసరాలకు అనుగుణమైన చికిత్సలను రూపొందించటానికిది కొత్త ద్వారాలు తెరిచింది.
- ప్రయోగశాలలో వృషణాల కణాల నుంచి 'టెస్ట్ ట్యూబ్ టెస్టిస్'ను పరిశోధకులు సృష్టించారు. సంతానలేమి చికిత్సలో ఇది కొత్త అవకాశాలకు ఆస్కారం కలిగించనుంది.

సాంకేతికం రయ్ రయ్

- క్వాంటమ్ కంప్యూటింగ్‌లో శాస్త్రవేత్తలు గొప్ప ముందడుగులు వేశారు. క్వాంటమ్ తప్పులను సరిచేయటంలో, క్యూబిట్ల స్థిరత్వంలో పురోగతి సాధించారు. ఔషధాల ఆవిష్కరణ, మెటీరియల్ సైన్స్ వంటి రంగాల్లో క్వాంటమ్ కంప్యూటింగ్ ఆచరణీయ అప్లికేషన్లకు ఇది దారి చూపింది.
- ఐబీఎం సంస్థ 'క్వాంటమ్ సెంట్రిక్ సూపర్‌కంప్యూటర్' ఆర్కిటెక్చర్‌ను ప్రదర్శించింది. ఇది సంప్రదాయ సీపీయూలు, జీపీయూలతో పలు క్వాంటమ్ ప్రాసెసింగ్ యూనిట్స్‌ను అనుసంధానం చేస్తుంది.
- మైక్రోసాఫ్ట్ సంస్థ మజోరానా 1 అనే క్వాంటమ్ చిప్‌ను రూపొందించింది. పరిశ్రమల స్థాయిలో సంక్లిష్ట సమస్యలకు పరిష్కారం చూపేలా దీన్ని రూపొందించారు. వైరింగ్ విభాగంలో పురోగతుల మూలంగా 10వేల క్యూబిట్ ప్రాసెసర్స్ రూపకల్పన సాధ్యమైంది.



నవోన్మేష అంతరిక్షం

- జేమ్స్ వెబ్ స్పేస్ టెలిస్కోప్ అంతరిక్షానికి సంబంధించి అద్భుత చిత్రాలను, సమాచారాన్ని అందిస్తూనే ఉంది. పాలపుంత ఆవల సుదూర అంతరిక్షంలోని మంచులో కర్బన అణువులను గుర్తించింది. ఈ టెలిస్కోప్ సాయంతో శాస్త్రవేత్తలు 120 కాంతి సంవత్సరాల దూరంలో ఉన్న కే2-18బీ అనే గ్రహం వాతావరణం గుండా సాగుతున్న నక్షత్ర కాంతిని విశ్లేషించి.. మిథేన్, కార్బన్ డయాక్సైడ్ గుణాలను పసిగట్టారు. దాని ఉపరితలం సముద్రంతో కూడి ఉండొచ్చని నమ్ముతున్నారు. సముద్రజీవుల నుంచి పుట్టుకొచ్చే డైమిథైల్ సల్ఫైడ్ ఆనవాళ్లనూ కనుగొన్నారు.
- జేమ్స్ వెబ్ స్పేస్ టెలిస్కోప్ ఇంతకుముందు మనకు తెలియని మామ్-జడ్14 అనే సుదూర నక్షత్ర మండలాన్నీ గుర్తించింది. యురేనస్ చుట్టూ తిరుగుతున్న ఎస్/2025 యూ 1 అనే చిన్న చంద్రుడి జాడనూ పసిగట్టింది.
- అమెరికా అంతరిక్ష సంస్థ నాసా అంగారకుడి అయస్కాంత క్షేత్రం, వాతావరణ వివరాలను సేకరించటానికి బ్లూ, గోల్డ్ అనే అంతరిక్ష వాహనాలతో కూడిన ఎస్కపేడ్ ప్రయోగాన్ని చేపట్టింది. మున్ముందు మానవ సహిత ప్రయోగాలకు అవసరమైన కీలకమైన సమాచారాన్ని సంగ్రహించటం దీని ఉద్దేశం.
- మన సౌర మండలం ఆవలి నక్షత్రం చుట్టూ భ్రమిస్తున్న గ్రహాల సంఖ్య 6వేలకు దాటింది. శని గ్రహం చుట్టూ 128 కొత్త చంద్రుళ్లనూ ఖగోళ శాస్త్రవేత్తలు గుర్తించారు మరి. దీంతో శని గ్రహం చంద్రుళ్ల సంఖ్య 274కు చేరుకుంది.
- బెన్నూ గ్రహశకలం నుంచి సేకరించిన నమూనాల్లో ఆర్ఎన్ఏ, జీవులకు అత్యవసరమైన రైబోజ్ వంటి చక్కెరలు ఉన్నట్టు బయటపడటం గమనార్హం. జీవం పుట్టుకకు అవసరమైన అంశాలు సౌరవ్యవస్థ తొలిదశలో ఎలా ఏర్పడ్డాయో రుజువు చేసుకోవటానికిది ఉపయోగపడుతోంది.

పర్యావరణం భేష్

- కొత్తరకం సోడియం అయాన్, సాలిడ్ స్టేట్ బ్యాటరీలను శాస్త్రవేత్తలు రూపొందించారు. విద్యుత్ వాహనాల్లో వాడుతున్న లిథియం అయాన్ బ్యాటరీలకు ఇవి సురక్షితమైన, చవకైన ప్రత్యామ్నాయాలు కావటం గమనార్హం.
- ఇంగ్లాండ్‌లోని సఫోల్క్ ప్రాంతంలో ఆదిమ మానవులు మంటను పుట్టించటానికి 4లక్షల ఏళ్ల క్రితం ఉపయోగించిన పరిజ్ఞానాన్ని శాస్త్రవేత్తలు గుర్తించారు. మనం ఊహిస్తున్న దాని కన్నా చాలా ఏళ్ల కిందటే మానవులు మంటను వాడుకున్నట్టు ఇది రుజువు చేస్తోంది.
- పాత ప్లాస్టిక్ బాటిళ్ల నుంచి బీపీఈటీపీ పదార్థాన్ని సృష్టించారు. ఇది గాలిలోంచి కార్బన్ డయాక్సైడ్‌ను సంగ్రహించటానికి తోడ్పడుతుంది.
- అతి చల్లటి -15 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత గల మంచులోనూ ఆల్గే కదులుతున్నట్టు పరిశోధకులు కనుగొన్నారు. ఇంత చల్లటి ఉష్ణోగ్రత వద్ద సంక్లిష్ట కణాల్లో కదలికలను గుర్తించటం ఇదే తొలిసారి. జీవుల పరిమితిని మరింత లోతుగా అర్థం చేసుకోవాల్సిన అవసరముందని ఇది నిరూపించింది. ఐస్లాండ్‌లో అగ్ని పర్వతం నుంచి వెలువడిన లావా చల్లబడిన కొద్ది గంటల్లోనే అందులో సూక్ష్మక్రిములు వృద్ధి చెందటం మొదలైనట్టూ పరిశోధకులు గుర్తించారు.

12న మన శంకర వరప్రసాద్ గారు వస్తున్నారు..



మాట్లాడుతున్న దర్శకుడు అనిల్ రావిపూడి

విజయవాడ సిటీ, న్యూస్‌టుడే : మన శంకర వరప్రసాద్ గారు.. పండగకి వస్తున్నారు చిత్రం ప్రచారంలో భాగంగా దర్శకుడు అనిల్ రావిపూడి నగరానికి వచ్చారు. ఎంజీ రోడ్డులోని ఓ హోటల్లో విలేకరులతో మాట్లాడారు. జనవరి 12న సినిమా ప్రేక్షకుల ముందుకు రానుందని వెల్లడించారు. దర్శకుడిగా చిరంజీవితో సినిమా తీయడం అదృష్టంగా భావిస్తున్నానని పేర్కొన్నారు. చిరంజీవిలోని అద్భుతమైన కామెడీ టైమింగ్‌ని బయటకు తీశామని తెలిపారు. నయనతార శశిరేఖ పాత్రలో జీవించిందని ప్రశంసించారు. చివరి 13 నిమిషాల్లో విక్టరీ వెంకటేష్ ప్రేక్షకులను ఆకట్టుకుంటారని పేర్కొన్నారు. త్వరలో ట్రైలర్ విడుదల చేస్తామని చెప్పారు. భగవంత్ కేసరి తరహాలో మరో డ్రామా చిత్రాన్ని నిర్మించాలనే ఆలోచన ఉందన్నారు. టికెట్ ధరల విషయమై ప్రభుత్వ నిర్ణయానికి కట్టుబడి ఉంటామని స్పష్టం చేశారు. చిత్ర పరిశ్రమకు చిరంజీవి, బాలకృష్ణ, వెంకటేష్, నాగార్జున నాలుగు స్తంభాల్లాంటి వారని పేర్కొన్నారు. వారిలో ముగ్గురితో చిత్రాలు చేశానని, నాగార్జునతో హలో బ్రదర్ తరహా సినిమా చేయాలని ఉందన్నారు. ప్రభాస్ నటించిన రాజా సాబ్ చిత్రం కూడా హిట్ కావాలని ఆకాంక్షించారు.

అధికారుల్లో సమన్వయం అవసరం

దుర్గగుడి విద్యుత్తు వివాదంపై మంత్రి సూచన

సూర్యారావుపేట, న్యూస్‌టుడే : దుర్గగుడి, విద్యుత్తు శాఖల మధ్య బిల్లుల చెల్లింపుల విషయంలో ఏర్పడ్డ వివాదంపై.. రెండు శాఖల అధికారులు సమన్వయంతో వ్యవహరించాలని మంత్రి గొట్టిపాటి రవికుమార్ సూచించారు. మంగళవారం తాడేపల్లిలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో రెండు శాఖల అధికారులు భేటీ అయ్యారు. మంత్రి వారితో మాట్లాడారు. భక్తుల మనోభావాలతో ముడిపడి ఉన్న విషయం కావటంతో.. సమన్వయం చేసుకోవాలని చెప్పారు. సౌర విద్యుత్తును తీసుకునే విషయమై.. విద్యుత్తు శాఖాధికారులు చెప్పిన రెండు విధానాల్లో ఒక దానిని ఎంపిక చేసుకుని, వివాదాన్ని ఒక కొలిక్కి తీసుకురావాలని మంత్రి సూచించినట్లు సమాచారం. త్వరలో దీనికి ముగింపు పలకాలని మంత్రి సూచించటంతో.. అధికారులు అంగీకరించారు. తుది నిర్ణయం తీసుకుని, మరోసారి సమావేశమయ్యేందుకు వారు నిర్ణయించుకున్నారు.

ట్రాఫిక్ చలాన్ పేరుతో రూ.లక్షల్లో టోకరా

ఏపీకే ఫైల్స్ పంపి క్రెడిట్ కార్డుల హ్యాక్

విజయవాడ నేరవార్తలు, న్యూస్‌టుడే : ఈ-చలాన్ పేరుతో ఏపీకే ఫైల్స్ పంపి క్రెడిట్ కార్డులను హ్యాక్ చేసి సైబర్ నేరగాళ్లు దోచేస్తున్నారు. తాజాగా నగరంలో ఈ తరహా మోసాలు వెలుగులోకి వచ్చాయి. వివరాలు ఇలా ఉన్నాయి.. కృష్ణలంకకు చెందిన ఓ వ్యక్తి (47) ఫార్మా కంపెనీలో సేల్స్ మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్‌గా పని చేస్తున్నారు. అతనికి ఎస్‌బీఐ, ఎస్ బ్యాంకు క్రెడిట్ కార్డులు ఉన్నాయి. ఈ నెల 25న గుర్తు తెలియని నంబరు నుంచి ట్రాఫిక్ ఉల్లంఘన పేరుతో ఒక వాట్సాప్ మెసేజ్ వచ్చింది. దాన్ని పట్టించుకోలేదు. తర్వాత రోజు అతని కారు నంబరుతో ఎం పరివాహన్ చలాన్ పెండింగ్ ఉందంటూ.. ఏపీకే ఫైల్ రూపంలో మరో మెసేజ్ వచ్చింది. కారు నంబరు ఉండటంతో దాన్ని క్లిక్ చేసి, వివరాలన్నీ నమోదు చేశారు. అతనికి తెలియకుండానే రెండు క్రెడిట్ కార్డుల ద్వారా రూ.2.1 లక్షల లావాదేవీలు జరిగిపోయాయి. దీన్ని ఆలస్యంగా గుర్తించి.. సోమవారం రాత్రి సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేయగా వారు కేసు నమోదు చేశారు.

● నగరానికి చెందిన మరో వ్యాపారికి కూడా ఇదే తరహాలో ఏపీకే ఫైల్ పంపారు. దానిని క్లిక్ చేయగానే అతని క్రెడిట్ కార్డుల నుంచి రూ.3.14 లక్షలు వాడినట్లు మెసేజ్ వచ్చింది. దీనిపై ఆయన సైబర్ క్రైం పోలీసులను ఆశ్రయించారు.

వాటితో జరభద్రం: ఈ-చలాన్, ఎం పరివాహన్ పేరిట ఏపీకే ఫైల్స్ పంపి చరవాణులను హ్యాక్ చేస్తున్నారు. ఏపీకే ఫైల్స్ అని వస్తే.. దాన్ని అసలు క్లిక్ చేయవద్దు. ఏపీకే పేరుతో వచ్చే మెసేజ్‌ల పట్ల అప్రమత్తంగా ఉండండి. రవాణాశాఖ, ట్రాఫిక్ పోలీసులు ఏపీకే ఫైల్స్ రూపంలో చలాన్‌లు పంపించరు. ఎవరైనా పంపినా.. ట్రాఫిక్ పోలీసులను లేదా రవాణాశాఖ అధికారులను సంప్రదించి నిర్ధారించుకోవాలని సైబర్ క్రైం పోలీసు అధికారులు సూచిస్తున్నారు.

చోరీలకు అడ్డుకట్ట

రైల్వేస్టేషన్లలో ఏఐ ఆధారిత సీసీ కెమెరాలు

విజయవాడ(రైల్వేస్టేషన్), న్యూస్‌టుడే

రైల్వేస్టేషన్లలో నేరాలు అరికట్టేందుకు రైల్వే శాఖ కసరత్తు చేస్తుంది. ప్రయాణికుల భద్రతను దృష్టిలో పెట్టుకొని ఏఐ ఆధారిత సీసీ కెమెరాలను ఏర్పాటు చేయనుంది. దొంగతనాలు అరికట్టడంతో పాటు ప్రమాదాలు, వైద్య సహాయం వంటి అత్యవసర పరిస్థితులను అంచనా వేయడానికి ఇది ఎంతో ఉపకరిస్తుంది. ప్రయాణికుల జన సమూహం ఎక్కువగా ఉన్నప్పుడు రద్దీ గుర్తించడం, నియంత్రించడంలో ఈ వ్యవస్థ ఎంతగానో ఉపయోగపడుతుంది. దీని ద్వారా రైల్వేస్టేషన్‌లో ఏ చిన్న ఘటన జరిగినా ఏఐ ఆధారిత కెమెరా ఇట్టే పసిగట్టి భద్రతా అధికారులకు సమాచారం అందిస్తుంది. విజయవాడ రైల్వేస్టేషన్‌లో ఈ వ్యవస్థ ఏర్పాటు ద్వారా గణనీయమైన మార్పులు వచ్చే అవకాశాలు ఉన్నాయి.

నేరస్థుల గుర్తింపు: ప్రస్తుతం రైల్వేస్టేషన్‌లో దొంగతనాలు పోలీసులకు సవాలుగా మారాయి. టికెట్ కౌంటర్లలో రద్దీగా ఉన్న సమయాల్లో దొంగలు తమ చేతివాటం చూపుతున్నారు. ఇకపై వాటిని నియంత్రిస్తుంది. రైళ్లలో దొంగతనాలకు పాల్పడే పాత నేరస్థుల ముఖాలను ఇట్టే గుర్తు పట్టేస్తాయి. ఇంటర్నెట్ ప్రోటోకాల్(ఐపీ), కంప్యూటర్ల నెట్‌వర్క్ ద్వారా ఈ కెమెరాలు పని చేస్తాయి. ఒక్కో కెమెరాకు ఒక ఐపీ ఆధారిత నెట్‌వర్క్‌ను అనుసంధానం చేస్తారు. లాన్, వాన్, ఇంటర్నెట్ ద్వారా డిజిటల్‌గా వీడియో డేటాను పంపుతుంది.

త్వరలో విజయవాడలో ఏర్పాటు

విజయవాడ రైల్వేస్టేషన్‌లో మరో నెలరోజుల్లో ఈ వ్యవస్థను ఏర్పాటు చేసేందుకు అధికారులు ప్రణాళిక రూపొందిస్తున్నారు. వీటిని కంట్రోల్ రూమ్ ద్వారా భద్రతా అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ఉంటారు.

ఏయే ప్రాంతాల్లో.. అన్ని ప్లాట్‌ఫారాలు, ద్వారాలు, సర్క్యులేటింగ్ ఏరియా, తారాపేట, పార్శిల్ కార్యాలయం తదితర కీలక ప్రాంతాల్లో ఏఐ ఆధారిత సీసీ కెమెరాలు అమర్చనున్నారు. తొలుత రైల్వేస్టేషన్లలో ఏర్పాటు చేసి భవిష్యత్తులో రైల్వే యార్డులు, కార్యాలయాలు, వర్క్‌షాప్‌ల్లో ఈ వ్యవస్థను ఏర్పాటు చేయనున్నారు.

అనువాద మిత్ర మండలి సేవలు అభినందనీయం



పుస్తకాలు ఆవిష్కరిస్తున్న జస్టిస్ ఆకుల వెంకట శేషసాయి, ప్రసాద్, శమంతకమణి, ఇంతియాజ్, నారాయణరావు

గవర్నర్‌పేట, న్యూస్‌టుడే : తెలుగు హిందీ తెలుగు కవితా మాలిక 'అనుస్వరం-2025'ను అయిదుగురు అనువాదకులు స్వేచ్ఛానువాదం చేసి.. మంచి కవిత్వాన్ని సాహితీలోకానికి అందించారని జస్టిస్ ఆకుల వెంకట శేషసాయి పేర్కొన్నారు. మంగళవారం రాత్రి గవర్నర్‌పేటలోని విజయవాడ పుస్తక మహోత్సవ గ్రంథాలయంలో అనుస్వరం-2025, అనువేదం అనే రెండు పుస్తకాలు ఆవిష్కరించారు. జస్టిస్ వెంకట శేషసాయి మాట్లాడుతూ.. 47 కవితలున్న ఈ తెలుగు సాహిత్య పుస్తకాన్ని హిందీ, ఇతర భాషల్లోకి అనువాదం చేసేందుకు పూనుకున్న అనువాద మిత్రమండలిని అభినందించారు. రాబోయే రోజుల్లో మరిన్ని పుస్తకాలను అనువదించి సాహిత్య ప్రియులకు అందించాలని సూచించారు. ఆంగ్లం నుంచి తెలుగులోకి అనువాదం చేసిన వ్యాస సంపుటి 'అనువేదం' పుస్తకాన్ని తానా ప్రపంచ సాహిత్యవేదిక నిర్వాహకులు ప్రసాద్ తోటకూర, ప్రముఖ రచయిత్రి దుట్టా శమంతకమణిలు ఆవిష్కరించారు. సమకాలీన సమాజంలోని రాజకీయాలపై ఈ పుస్తకం అవగాహన కలిగిస్తుందని వివరించారు. అనువాద మిత్రమండలిలో భాగంగా ఉన్న శమంతకమణి వెబ్‌సైట్‌ను విశ్రాంత ఐఏఎస్ అధికారి ఎ.ఎం.డి.ఇంతియాజ్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రెండు దశాబ్దాల సాహిత్య కృషిని ఈ వెబ్‌సైట్ పొందుపరిచిందని తెలిపారు. ఇందులో పుస్తకాలను ప్రపంచంలో ఎక్కడ నివసించే వారైనా ఉచితంగా చదువుకోవచ్చని వివరించారు. అనువాద మిత్రమండలి అధ్యక్షుడు గోళ్ల నారాయణరావు మాట్లాడుతూ.. ఏటా అనుస్వరం కవితా మాలికలతో పాటు అనువాద పుస్తకాలను తమ బృందం సాహిత్య ప్రపంచానికి అందిస్తుందని తెలిపారు. అనుస్వరం తెలుగు కవిత్వాన్ని వడ్లమూడి పద్మావతి, హిందీ కవిత్వాన్ని గోపాల్ శ్రీవాత్సవ, అనువేదం పుస్తకాన్ని సాహితీ ప్రవంతి రాష్ట్ర కార్యదర్శి కె.సత్యరంజన్ పరిచయం చేశారు.

నల్లనయ్య దర్శనం.. పులకించిన భక్తజనం



వేణుగోపాల స్వామి గ్రామోత్సవంలో అధికారులు, భక్తులు

నెమలి(గంపలగూడెం): వైకుంఠ ఏకాదశి పర్వదిన వేడుకలను నెమలి వేణుగోపాల స్వామి ఆలయంలో మంగళవారం నిర్వహించారు. తెలుగు రాష్ట్రాల నుంచి వచ్చిన భక్తులు ఉత్తర ద్వారంలో స్వామిని దర్శించుకున్నారు. ఆలయ అర్చకుడు గోపాలచార్యులు ఆధ్వర్యంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు చేపట్టారు. పాలకవర్గ అధ్యక్షురాలు కాపూరి శశిరేఖ, సహాయ కమిషనర్ ఆధ్వర్యంలో నెల సంధ్య ఏర్పాట్లు చేశారు. తహసీల్దార్ వి.రాజకుమారి, తెదేపా నాయకులు బెల్లం మధుసూదనరావు, వి.రాజశేఖర్, వి.చినబాబు, పి.కొండలరావు పాల్గొన్నారు.

2 నుంచి కృష్ణా వర్సిటీ క్రికెట్ జట్టు ఎంపిక

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: స్థానిక నలంద డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో వచ్చే నెల 2 నుంచి 5వ తేదీ వరకు ఆంధ్రా లయోలా కళాశాల మైదానంలో కృష్ణా విశ్వవిద్యాలయం క్రికెట్ జట్టు ఎంపిక పోటీలు నిర్వహిస్తామని జట్టు ఎంపిక కమిటీ ఛైర్‌పర్సన్ మండవ అనురాధ తెలిపారు. ఆసక్తిగల క్రీడాకారులు మూడు సెట్ల అర్హత పత్రాలతో పాటు నాలుగు పాస్ పోర్టు సైజు ఫొటోలు, కళాశాల గుర్తింపు కార్డులతో 2వ తేదీ ఉదయం 8.30 గంటలకు మైదానంలో కళాశాల వ్యాయామ విద్యా సంచాలకుడు ఎన్.వెంకటేశ్వరరావుకు రిపోర్టు చేయాలని ఆమె సూచించారు.

జాతీయ బ్యాడ్మింటన్ పసిడి విజేతకు సన్మానం



సూర్య చరిష్మకు బహుమతి అందిస్తున్న కిషన్‌బాబు, కృష్ణ ప్రభు తదితరులు

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: నగరంలో ఈ నెల 24 నుంచి 28వ తేదీ వరకు జరిగిన జాతీయ సీనియర్ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్ మహిళల వ్యక్తిగత విభాగంలో పసిడి పతకం కైవసం చేసుకున్న నగరానికి చెందిన తమిరి సూర్య చరిష్మను మంగళవారం గురునానక్ కాలనీలోని గేట్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ అండ్ సైన్సెస్‌లో ఘనంగా సన్మానించారు. గేట్స్ ఛైర్మన్ టి.కిషన్ బాబు, డైరెక్టర్ కృష్ణప్రభు మాట్లాడుతూ.. జాతీయ స్థాయిలో తలపడి పసిడి పతకం సాధించడమనేది కేవలం క్రీడా నైపుణ్యమే కాకుండా.. అంకితభావానికి నిదర్శనమని అన్నారు. క్రీడా రంగంలో విజయాలు సాధించిన వారిని గౌరవించడం తమ సంస్థ ముఖ్య లక్ష్యాల్లో ఒకటని పేర్కొన్నారు. గేట్స్ అకడమిక్ డీన్ జ్యోత్స్న, అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

ఓవరాల్ ఛాంపియన్ గుడ్లవల్లేరు

ముగిసిన పాలిటెక్నిక్ కళాశాలల స్పోర్ట్స్ మీట్



ట్రోఫీ అందుకుంటున్న విజేత జట్టు

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో రెండు రోజుల పాటు జరిగిన ఉమ్మడి కృష్ణా జిల్లా రీజనల్ స్థాయి పాలిటెక్నిక్ కళాశాలల స్పోర్ట్స్ మీట్-2025లో గుడ్లవల్లేరు ఏఏఎన్ఎం అండ్ వీవీఆర్ఎస్ఆర్ పాలిటెక్నిక్ కళాశాల జట్టు ఓవరాల్ ఛాంపియన్‌షిప్ కైవసం చేసుకుంది. స్త్రీ, పురుషుల విభాగాల్లోనూ టీమ్ ఛాంపియన్‌షిప్ సొంతం చేసుకుంది. పురుషుల వ్యక్తిగత ఛాంపియన్‌షిప్‌ను బాణావతు చరణ్ తేజ, మహిళల వ్యక్తిగత ఛాంపియన్‌షిప్‌ను డి.వర్ష వెంకట దుర్గ కైవసం చేసుకున్నారు. మంగళవారం జరిగిన కబడ్డీ ఫైనల్‌లో ఏఏఎన్ఎం అండ్ వీవీఆర్ఎస్ఆర్ పాలిటెక్నిక్ కళాశాల జట్టు.. ఆర్కే పాలిటెక్నిక్ కళాశాల జట్టుపై గెలుపొందింది. వాలీబాల్‌లో నూజివీడు ప్రథమ, గుడ్లవల్లేరు ద్వితీయ, ఖోఖోలో గుడ్లవల్లేరు ప్రథమ, ఎంవీఆర్ కళాశాల ద్వితీయ స్థానాల్లో నిలిచాయి. కార్పొరేటర్ చెన్నుపాటి ఉషారాణి విజేతలకు బహుమతులు అందజేశారు. విజేతగా నిలిచిన జట్లు, క్రీడాకారులు వచ్చే నెల 28, 29వ తేదీల్లో తిరుపతిలో జరిగే రాష్ట్ర స్థాయి మీట్‌లో తలపడనున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ ఎం.విజయసారధి ప్రకటించారు.

భక్తులపైకి దూసుకొచ్చిన ఎద్దు

అమ్మవారి ఊరేగింపులో అపశ్రుతి



తిరుపతమ్మ గ్రామోత్సవం


పెనుగంచిప్రోలు, న్యూస్‌టుడే: ముక్కోటి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని మంగళవారం పెనుగంచిప్రోలులోని నిర్వహించిన తిరుపతమ్మ గ్రామోత్సవంలో అపశ్రుతి చోటుచేసుకుంది. వేడుకలు ఘనంగా జరుగుతున్న వేళ.. ఓ ఎద్దు బెదిరి అక్కడున్న వారిపై పరుగులు తీసింది. దీంతో ఆలయ అధికారులు, సిబ్బంది, భక్తులు భయంతో నలు దిశలా పరుగులు పెట్టారు. మంగళవారం రాత్రి ప్రధాన ఆలయం నుంచి గోపయ్య, తిరుపతమ్మ ఉత్సవ మూర్తులను ఆలయ ఉప కమిషనర్ మహేశ్వరరెడ్డి, సిబ్బంది, మేళతాళాలతో ఊరేగింపుగా రథం వద్దకు తీసుకొచ్చారు. ప్రత్యేకంగా అలంకరించిన రథంపై అమ్మవారి ఉత్సవ మూర్తులను ఉంచి పూజలు చేశారు. అనంతరం ప్రారంభమైన ఊరేగింపులో రథానికి కట్టిన ఎద్దు బెదిరి భక్తులపైకి దూసుకెళ్లింది. దీంతో ఆలయ ఈఈ రమాదేవి, తిరుపతయ్య, పేరాబత్తిన గురునాథంలకు స్వల్ప గాయాలయ్యాయి. వెంటనే తిరుపతయ్య, గురునాథంలను 108 అంబులెన్స్‌లో స్థానిక ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పోలీసులు, సిబ్బంది, రైతులు వెంటనే అప్రమత్తం కావడంతో పెద్ద ప్రమాదం తప్పింది. అనంతరం యథావిధిగా గ్రామోత్సవం ఘనంగా జరిగింది. ఆలయ ప్రధాన అర్చకుడు గోపిబాబు, పూజారి అంజిబాబు పాల్గొన్నారు.



అంబులెన్స్‌లో క్షతగాత్రులు

వసుంధర

vasundhara@eenadu.in



ఈ ఏడాది ప్రపంచ వేదికపై భారతీయ మహిళలెందరో తమ సత్తా చాటారు. పర్యావరణ పరిరక్షణ, సామాజిక సాధికారత, సాంకేతికత... ఇలా అన్ని రంగాల్లో మార్పు తీసుకురావడానికి ప్రయత్నిస్తూ... తమ నాయకత్వాన్ని చాటి చెప్పారు. అంతర్జాతీయ స్థాయిలో ప్రతిష్ఠాత్మక అవార్డులు అందుకున్నారు.

నాయిక 2025

ఆమెదే గెలుపు!

కజిరంగాను కాపాడుతూ...



వందల ఏళ్ల ఘనచరిత్ర కలిగిన కజిరంగా నేషనల్ పార్క్‌కి తొలి మహిళా ఫీల్డ్ డైరెక్టర్ **సోనాలీ ఘోష్**. బాధ్యతలు తీసుకున్నాక వృక్ష వైవిధ్యం, అరుదైన పక్షి జాతులకు నిలయమైన ఈ పార్క్‌ని సంరక్షించడమే కాదు... సందర్శకులను ఆకర్షించడంపైనా దృష్టిపెట్టారు. ఈ ఏడాది ఇంటర్నేషనల్ యూనియన్ ఫర్ కన్జర్వేషన్ ఆఫ్ నేచర్ (ఐయూసీఎన్) కెంటన్ మిల్లర్ అవార్డుని అందుకున్నారామె. పర్యావరణ రంగంలో అంతర్జాతీయ స్థాయిలో అందించే అత్యున్నత పురస్కారాల్లో ఇదీ ఒకటి. ఈ ఘనత సాధించిన తొలి భారతీయురాలు సోనాలీనే. ఐఎఫ్ఎస్ అధికారిణి అయిన ఆమె... వైల్డ్‌లైఫ్ సైన్స్, ఫారెస్ట్రీల్లో డ్యూయెల్ డిగ్రీలను అందుకున్నారు. యూకేలో జాగ్రఫీలో పీహెచ్‌డీ చేశారు.

లింగ వివక్షకు వ్యతిరేకంగా...



మహారాష్ట్రలోని సతారాకు చెందిన ప్రముఖ మహిళా హక్కుల కార్యకర్త **వర్ష పాండే**. లింగనిర్ధరణతో జరిగే గర్భస్రావాలను ఆపడానికి, లింగ సమానత్వాన్ని ప్రోత్సహించడానికి ఆమె చేసిన కృషికి యూఎన్ పాపులేషన్ అవార్డు-2025 లభించింది. దళిత మహిళా వికాస్ మండల్ కార్యదర్శిగా మూడు దశాబ్దాలకు పైగా ఆమె బాల్యవివాహాలు, లింగవివక్షకు వ్యతిరేకంగా పోరాడుతున్నారు. ముఖ్యంగా అణగారిన వర్గాలకు చెందిన మహిళలు, బాలికల జీవితాలను మెరుగుపరచడానికి కృషి చేస్తున్నారు. లింగనిర్ధరణ, గర్భ స్రావాలను అడ్డుకోవడానికీ, చట్టవిరుద్ధమైన పద్ధతులను బహిర్గతం చేయడానికీ సాహసాలెన్నో చేశారామె. ఈ ప్రయత్నాలన్నీ మహిళలు, బాలికల పునరుత్పత్తి హక్కుల్నీ, గౌరవాన్నీ కాపాడాయి అంటారామె.

కొంగల సోదరి...



అసోం, బిహార్ రాష్ట్రాల్లో కనిపించే అరుదైన కొంగ జాతి గ్రేటర్ అడ్జుటెంట్ సార్క్ (హర్గిలా) పక్షుల్ని రక్షిస్తూనే... వేల మంది మహిళలకు ఉపాధినీ కల్పిస్తున్నారు **డాక్టర్ పూర్ణిమా దేవి బర్మన్**. చిన్నప్పుడు నానమ్మ చెప్పిన పక్షి కథలతో వాటిపై ప్రేమ పెంచుకున్న ఆమె... గువాహటి యూనివర్సిటీ నుంచి జువాలజీ(ఎకాలజీ, వైల్డ్‌లైఫ్ బయాలజీ)లో పీజీ చేశారు. ఆపై హర్గిలా కొంగలపై పీహెచ్‌డీ ప్రారంభించారు. అయితే, ఆ జాతి అంతరించిపోతోందని తెలుసుకుని రిసర్చ్‌ను మధ్యలోనే వదిలేసి ఈ పక్షుల సంరక్షణ కోసం పనిచేస్తున్నారు. అందుకే స్థానికులంతా పూర్ణిమను 'హర్గిలా బైదు (కొంగల సహోదరి)'గా పిలుస్తారు. ఈ కృషికే టైమ్స్ జాబితా 'విమెన్ ఆఫ్ ది ఇయర్-2025'లో చోటు సంపాదించుకున్నారు.

రామ్‌సర్ సైట్‌లుగా గుర్తింపు...



జయశ్రీ వెంకటేశన్... మద్రాస్ యూనివర్సిటీ నుంచి బయోడైవర్సిటీ అండ్ బయోటెక్నాలజీలో పీహెచ్‌డీ చేశారు. డాక్టర్ డేనియల్స్‌తో కలిసి 'కేర్ ఎర్త్' ట్రస్ట్‌ని స్థాపించారు. ఈ సంస్థ చిత్తడి నేలల రక్షణ కోసం పనిచేస్తుంది. చెన్నైలోని పల్లికరణైతో సహా కనుమరుగైపోతున్న 44 చిత్తడి నేలల్ని పునరుజ్జీవం పొందేలా చేశారామె. వీటిలో పదమూడింటికి రామ్‌సర్ సైట్స్‌గా గుర్తింపు దక్కింది. ఈ కృషి ఫలితంగానే రామ్‌సర్ వెట్‌ల్యాండ్ కన్జర్వేషన్ అవార్డు-2025 (వెట్‌ల్యాండ్ వైజ్ యూజ్ విభాగంలో) గెలుచుకున్నారు. ఈ ఘనత సాధించిన మొదటి భారతీయురాలిగానే కాదు... తొలి మహిళగానూ గుర్తింపు దక్కించుకున్నారు.

లెక్క కట్టేస్తారు...



గణిత శాస్త్రవేత్త **రాజులా శ్రీవాత్సవ**ను... ఈ ఏడాది మర్యామ్ మిర్జాఖానీ న్యూ ఫ్రాంటియర్స్ అవార్డు వరించింది. హార్మోనిక్ అనాలిసిస్, అనలిటిక్ నంబర్ థియరీ రంగాల్లో ఆమె పలు పరిశోధనలు చేశారు. భువనేశ్వర్‌లోని నైసర్‌లో మాస్టర్స్ చేశారు. ఆపై అమెరికా, జర్మనీల్లో ఉన్నత చదువులు చదివారు. ప్రస్తుతం ఆమె విస్కాన్సిన్ మాడిసన్ యూనివర్సిటీలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు. స్మూత్ మానిఫోల్డ్స్ సమీపంలో రేషనల్ పాయింట్లను లెక్కించడం... ఆమె కీలక పరిశోధనల్లో ఒకటి.

మడ అడవులు పెంచుతూ...



అందరూ ఏకమైతేనే పర్యావరణ పరిరక్షణ, వన్య ప్రాణి సంరక్షణ... సాధ్యమవుతుంది అంటారు ఐఏఎస్ అధికారిణి **సుప్రియా సాహు**. ఇందుకు అనుగుణంగానే తమిళనాడు రాష్ట్ర పర్యావరణ, వాతావరణ మార్పులు, అటవీశాఖ అదనపు చీఫ్ సెక్రటరీగా విప్లవాత్మక మార్పులెన్నో తీసుకొచ్చారు. 'తమిళనాడు గ్రీన్ క్లైమేట్ కంపెనీ'ని ఏర్పాటుచేసి పరిశ్రమలు పర్యావరణ హిత విధానాలను అనుసరించేలా చర్యలు తీసుకున్నారు. అలానే భూతాపం తగ్గే వ్యవస్థల ఏర్పాటు, దెబ్బతిన్న పర్యావరణ వ్యవస్థను పునరుద్ధరించడం, ప్లాస్టిక్ నివారణ కార్యక్రమాలను సమర్థంగా నిర్వహించారు. కొత్తగా మడ అడవులను పెంచడం, 65 నూతన రిజర్వ్ ఫారెస్ట్‌ల ఏర్పాటు వంటివి ఆవిడ విజయాలు. ఈ సేవలకు గుర్తింపుగానే 'యూఎన్ ఛాంపియన్స్ ఆఫ్ ది ఎర్త్ - 2025' అవార్డుని అందుకున్నారు సుప్రియ.

బడిబాట పట్టిస్తూ...



మన దేశంలో బాలికల విద్యకోసం పనిచేస్తున్న 'ఎడ్యుకేట్ గర్ల్స్' ఎన్‌జీవో ఈ ఏడాదికి గానూ ప్రతిష్ఠాత్మక రామన్ మెగసెసే అవార్డుని గెలుచుకుంది. ఈ పురస్కారాన్ని అందుకున్న మొట్టమొదటి భారతీయ సంస్థగా రికార్డు సృష్టించింది. దీని నిర్వాహకురాలు **సఫీనా హుస్సేన్**. దిల్లీకి చెందిన ఆమె బాల్యంలో పేదరికాన్నీ, హింసను అనుభవించారు. ఆపై బంధువు సాయంతో చదువుకున్న ఆమె... లండన్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్ నుంచి పట్టా అందుకున్నారు. కార్పొరేట్ రంగంలోనూ కొన్నాళ్లు పనిచేసినా, అది సఫీనాకు సంతృప్తినివ్వలేదు. తన నేపథ్యం గుర్తుకొచ్చి... ఏ ఆడపిల్లా చదువుకునే అవకాశాన్ని కోల్పోకూడదని భావించారు. ఇందుకోసమే 2007లో ముంబయి కేంద్రంగా 'ఎడ్యుకేట్ గర్ల్స్' ఎన్‌జీవోను ప్రారంభించారు. డ్రాపవుట్స్‌ని గుర్తించి చదువు కొనసాగించేలా చేస్తున్నారు. ముఖ్యంగా బిహార్, మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఉత్తర్‌ప్రదేశ్ రాష్ట్రాల్లో 30 వేల గ్రామాల్లో ఈ సంస్థ సేవల్ని అందిస్తోంది. ఇప్పటి వరకూ 20 లక్షల మందికిపైగా పిల్లల్ని తిరిగి బడిబాట పట్టించిందీ సంస్థ.

చేపల సంరక్షణతో...



భారతీయ మెరైన్ బయాలజిస్ట్, కన్జర్వేషన్ సైంటిస్ట్ అయిన **దివ్యా కర్నాడ్** 'విమెన్ ఆఫ్ డిస్కవరీ-2025' అవార్డుని అందుకున్నారు. సైన్స్, ఎక్స్‌ప్లోరేషన్, కన్జర్వేషన్ రంగాల్లో ప్రతిభ కనబరిచేవారికి ఇచ్చే అంతర్జాతీయ గౌరవం. వింగ్స్ వరల్డ్ ఆర్గనైజేషన్ దీన్ని అందించింది. దివ్య భారత్‌లోని షార్క్స్, రే-చేపల సంరక్షణకు ఎంతో కృషిచేశారు. ఆమె స్థాపించిన ఇన్‌సీజన్ ఫిష్ ప్రాజెక్టు ద్వారా స్థిరమైన మత్స్య సంపదను ప్రోత్సహిస్తూ మత్స్యకారులు, వినియోగదారుల మధ్య వారధిగా నిలుస్తున్నారు. సముద్ర జీవ వైవిధ్యాన్ని కాపాడేందుకు శాస్త్రీయ, సామాజిక పద్ధతులను ఎంచుకున్నారీమె.



'మంచి ఆహారాన్ని తినండి, లేబుల్స్ చదవండి, డిస్‌క్లెయిమర్ చూడండి, ఆహారం కారాదు ప్రాణాంతకం...' అని చెబుతూనే ఓఆర్ఎస్‌గా విక్రయిస్తోన్న తీపి పానీయాలమీద అలుపెరుగని పోరాటం చేసి ఈ ఏటి విజేతగా నిలిచారు పీడియాట్రీషియన్ డా. శివరంజనీ సంతోష్. ఈ విషయమై ఆమె ఏమంటున్నారంటే...

పూర్తిగా సాధించలేదు కానీ...

నా విజయం

నేను పూర్తి విజయం సాధించలేదు. ఇప్పటికీ మార్కెట్లో ఓఆర్ఎస్ పేరుతో అమ్మే పానీయాల స్టాక్ రూ.180 కోట్లపైనే. ప్రభుత్వ ఆర్డరున్నా దిల్లీ హైకోర్టు విక్రయించొద్దని చెప్పినా ఆ స్టాక్‌ని రీకాల్ చేయలేదన్న నిరాశ ఉంది. కానీ డబ్ల్యూహెచ్‌వో ఫార్ములాతో ఉన్నవి తప్ప నాన్- కార్బొనేటెడ్, ఫ్రూట్‌బేస్‌డ్, రెడీటూడ్రింక్... వంటి పానీయాలమీద ఓఆర్ఎస్ ముద్ర తీయాలని ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఎఫ్ఎస్ఎస్ఏఐ) ఆదేశించడం సంతోషకరం. ఇక, కొత్తవి రావు కాబట్టి భావి తరాల్ని రక్షించగలిగానని సంతోషపడుతున్నా. ప్రజలు, తల్లితండ్రుల మద్దతుతోనే ఇది సాధ్యమైంది.

నా ఈ పోరాటం 2016లో మొదలైంది. ప్రజల్లో అవగాహన కలిగించేందుకు అనేక కార్యక్రమాలు చేపట్టా. హైకోర్టులో పిల్‌నీ ఫైల్ చేశా. 2022లో నిషేధించారు కూడా. మూడు నెలలు తిరగకుండానే డిస్‌క్లెయిమర్‌తో మళ్లీ మార్కెట్లోకి వచ్చాయి. ఎంతమంది దాన్ని చదివి అర్థం చేసుకోగలరు? ఫార్మసీలు ఎందుకు విక్రయిస్తున్నాయి? అందుకే దీన్ని ప్రధాని ఆఫీసు దృష్టికీ తీసుకెళ్లా. కంపెనీల బెదిరింపులకీ లొంగలేదు. ఎట్టకేలకు ఎఫ్ఎస్ఎస్ఏఐ స్పందించి నిబంధనలు విధించింది.

అవి ఎందుకు వద్దంటే...



నేను ఓఆర్ఎస్ వ్యతిరేకిని కాదు. విరేచనాలు, వాంతులు అయ్యేటప్పుడు- డీహైడ్రేషన్ రాకుండా ఓరల్ రీహైడ్రేటెడ్ సాల్ట్(ఓఆర్ఎస్) తప్పక తీసుకోవాలి. కానీ బదులుగా అధిక మోతాదులో చక్కెర కలిపినవి తీసుకుంటే పిల్లల ప్రాణానికే ప్రమాదం. దీనిమీద గతంలోనూ దిల్లీలో ఓ తల్లి కేసు వేసింది. ఎఫ్ఎస్ఎస్ఏఐని చూడమని కోర్టు ఆదేశించింది కూడా. అయినా కంపెనీలు పేరు మార్చకుండా డిస్‌క్లెయిమర్ పెట్టి అమ్ముతున్నాయి.

లేబుల్ ఎలా ఉండాలంటే...

మెక్సికో, జపాన్... ఇలా కొన్ని దేశాల్లో ప్యాకేజ్‌డ్ ఫుడ్స్‌కి ఫ్రంట్ లేబులింగ్ నిబంధన పాటిస్తున్నారు. మనదేశంలో అంతా లేబుల్స్ చదవలేరు. పిక్టోరియల్ రిప్రజెంటేషన్ ఉండాలి. బెల్లం వేసి నో షుగర్ అన్నా తప్పే.. అందులో ఉన్నదీ చక్కెరే కదా. కాబట్టి హై షుగర్, ఫ్యాట్, సాల్ట్, ప్రిజర్వేటివ్స్; ట్రాన్స్ ఫ్యాట్స్, అల్ట్రా ప్రాసెస్డ్, అలర్జన్స్.. వంటివి ఉంటే హెచ్చరిక సింబల్స్ అంటే, ఎర్ర చుక్కల్లాంటివి ముద్రించాలి. ఈ సంకేతాల గురించి జనంలో ప్రభుత్వం అవగాహన కలిగించాలి. అలాగే క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేస్తే... ఆడియో రూపంలో వివరాలు వచ్చేలా ఉండాలి.

ఓఆర్ఎస్ ఎలా వాడాలంటే...

'సోడియం గ్లూకోజ్ కోట్రాన్స్‌పోర్టర్' అనేది పేగులో ఉంటుంది. మోతాదులో తీసుకున్నప్పుడే అది చక్కగా పని చేస్తుంది. చక్కెర ఎక్కువున్నవీ, జీరో షుగర్, లో గ్లూకోజ్, స్టీవియా... వంటివి తీసుకుంటే ప్రయోజనం ఉండదు. ముఖ్యంగా డీహైడ్రేషన్ సమయంలో చక్కెర ఎక్కువున్న వాటివల్ల నీళ్లవిరేచనాలు మరింత పెరుగుతాయి. అలాగే స్టీవియా వల్ల వికారం కలిగి పిల్లలు వాంతులు చేసుకుంటారు. అందుకే డబ్ల్యూహెచ్‌వో ఫార్ములా ఉన్న సాషే లేదా టెట్రాప్యాక్‌లే వాడాలి. సాషేలు దొరకనప్పుడే టెట్రాప్యాక్‌లకి వెళితే మేలు. మన దగ్గర 4.1 గ్రా., 20.5 గ్రా. ప్యాక్‌లు దొరుకుతున్నాయి. మొదటిది 200 మి.లీ. నీళ్లలోనూ, రెండో ప్యాక్‌ని లీటరు నీళ్లలోనూ ఒకేసారి కలపాలి. 24 గంటల్లోనే తాగాలి. మిగిలితే పారబోయాలిగానీ వాడకూడదు. చిటికెడు తీసుకుని కొన్ని నీళ్లలో కలపడం సరైన పద్ధతి కాదు. కాబట్టి దీన్ని తప్పనిసరిగా పాటించాలి. మనదేశంలో డీహైడ్రేషన్ వల్ల ఒక్క బిడ్డకూడా చనిపోకూడదు అన్నదే నా ఆశయం.

పార్టీకి వెళ్తున్నారా...

కొత్త సంవత్సరం... అంతా ఉల్లాసంగా, ఆనందంగా సాగిపోవాలి. అలా జరగాలంటే అంతే సంబరంగా ఆహ్వానించాలిగా మరి! అయితే స్నేహితులతో జాలీగా అలా బయటికి వెళ్లాల్సిందే అంటారా? ఈ జాగ్రత్తలు తీసుకోవాలి మరి!



ఫలానా చోట అందరం కలుసుకుందాం, క్యాబ్‌లో వెళదాం, డ్రెస్ కోడ్ ఇది... ఇలా వెళ్లేముందు ప్లాన్ వేసుకుంటారు కదా! ఏ సమయానికి తిరుగు ప్రయాణం మొదలుపెట్టాలి, ఎలా రావాలన్నదీ ముందే నిర్ణయించుకోండి. మీ ప్రణాళిక మొత్తం వెళ్లే స్నేహితుల పేర్లతో సహా ఇంట్లోవాళ్లు లేదా ఎప్పుడూ మీకు అందుబాటులో ఉండే స్నేహితులు, బంధువులతో పంచుకోండి. లొకేషన్ షేర్ చేస్తే... మరీ మంచిది.

ఇవి చూసుకోండి

మ్యాప్, రైడ్ బుకింగ్, అత్యవసరమై ఎవరికైనా కాల్ చేయాలన్నా, చెల్లింపులకైనా ఫోన్ ముఖ్యం కాబట్టి, మొబైల్ ఛార్జింగ్ పెట్టడం మర్చిపోవద్దు. పవర్ బ్యాంక్, పెప్పర్ స్ప్రేలనీ వెంట తీసుకెళ్తే మంచిది. అత్యవసర నంబర్లను సేవ్ చేసుకోండి. త్వరగా స్పందించేవాళ్ల నంబర్లు స్పీడ్ డయల్‌లో పెట్టుకోండి. సేఫ్టీ యాప్‌లనూ వేసుకుంటే మేలు.

గమనించుకోండి

ఈవెంట్ పార్టీలంటేనే మ్యూజిక్, డ్యాన్స్‌లతో నిండిపోతుంది. గుంపులుగా పోగయ్యే జనాలు సరేసరి. ఆ గుంపులకు దూరంగా ఉండండి. అసభ్య ప్రవర్తన, తొక్కిసలాటల నుంచి తప్పించుకోవచ్చు. అలాగని ఒంటరిగా అసలే ఉండొద్దు. ఇలాంటిచోట్ల కొత్త పరిచయాలు సహజమే. అయితే వ్యక్తిగత సమాచారాన్ని పంచుకోవద్దు. భయం, అసౌకర్యంగా తోస్తే వెంటనే అక్కణ్నుంచి వెళ్లిపోండి.

తినొద్దు... తాగొద్దు

పార్టీ అని దొరికిందల్లా పొట్టలో వేయకండి. తెలియనివాళ్లు ఇచ్చే తినుబండారాలు, డ్రింక్‌లను అసలే తీసుకోవద్దు. అంతేకాదు, తాగుతున్న డ్రింక్‌ను పక్కకు పెట్టి వెళితే... తిరిగి తాగొద్దు. ఏదైనా కలిపే ఆస్కారం ఉంది. వీలుంటే చేతిలోనే పట్టుకొని ఉండండి. లేదంటే పూర్తిగా పక్కన పెట్టేయండి.

చివరగా... త్వరగా ఇంటికి చేరాలన్న తొందరలో తెలియని వాళ్ల వాహనాలు ఎక్కొద్దు. క్యాబ్ నంబరు తప్పక సరిచూసుకోండి. డ్రైవర్ల ప్రవర్తన ఏమాత్రం తేడాగా ఉన్నా రైడ్ క్యాన్సిల్ చేయండి. ఎంత షార్ట్‌కట్ అయినా సరే... జన సంచారం లేని, చీకటి రోడ్లలో నడుచుకుంటూ వెళ్లొద్దు. ఎంతైనా మన భద్రత ముఖ్యం కదా!

సమయం శక్తిమంతమైన ఆయుధం. అత్యంత ఖరీదైన వస్తువు. దాన్నెలా వాడాలన్నది మన చేతుల్లోనే ఉంది.




మనం ఆనందంగా గడిపే కాలాన్ని వృథాగా భావించొద్దు!

రంగవల్లిక



13 చుక్కలు
7 వచ్చేవరకూ
మధ్య చుక్క

పి. మీనా కుమారి, శ్రీకాళహస్తి



మీ ముగ్గులు 9154091911కు వాట్సాప్ చేయొచ్చు.

మా చిరునామా: వసుంధర, ఈనాడు ప్రధాన కార్యాలయం, రామోజీ ఫిల్మ్‌సిటీ, అనాజ్‌పూర్, అబ్దుల్లాపూర్‌మెట్ మండలం, రంగారెడ్డి జిల్లా, తెలంగాణ - 501 512.
vasundhara@eenadu.in

ఛాంపియన్

5-0

● శ్రీలంకతో సిరీస్‌ను క్లీన్‌స్వీప్ చేసిన భారత మహిళలు

● అయిదో టీ20లోనూ విజయం

మెరిసిన హర్మన్‌ప్రీత్



మార్పేమీ లేదు. భారత అమ్మాయిలది అదే ఆధిపత్యం. చివరిదైన అయిదో టీ20లోనూ శ్రీలంకను ఓడించిన ఆతిథ్య జట్టు.. సిరీస్‌ను 5-0తో క్లీన్‌స్వీప్ చేసింది. హర్మన్‌ప్రీత్ కౌర్ కెప్టెన్ ఇన్నింగ్స్ ఆడింది. మెరుగైన ప్రదర్శనే చేసినా, లంకకు ఓటమి తప్పలేదు.

తిరువనంతపురం


హర్మన్‌ప్రీత్

భారత మహిళల జట్టు జోరు కొనసాగించింది. ఆఖరి టీ20లో 15 పరుగుల తేడాతో శ్రీలంకపై విజయం సాధించింది. కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ (68; 43 బంతుల్లో 9×4, 1×6) మెరవడంతో మొదట భారత్ 7 వికెట్ల నష్టానికి 175 పరుగులు చేసింది. అరుంధతి రెడ్డి (27 నాటౌట్; 11 బంతుల్లో 4×4, 1×6) బ్యాట్ ఝుళిపించింది. ఛేదనలో లంక 7 వికెట్లకు 160 పరుగులే చేయగలిగింది. హాసిని పెరీరా (65; 42 బంతుల్లో 8×4, 1×6), ఇమేషా (50; 39 బంతుల్లో 8×4) అర్ధశతకాలు చేసినా ఫలితం లేకపోయింది. దీప్తి, అరుంధతి, స్నేహ్, వైష్ణవి, శ్రీచరణి, అమన్‌జ్యోత్ తలో వికెట్ పడగొట్టారు. టీ20 క్రికెట్లో భారత్ 5-0తో సిరీస్ గెలవడం ఇది మూడోసారి. సొంతగడ్డపై మొదటిసారి. హర్మన్‌ప్రీత్ కౌర్‌కు 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు లభించింది. షెఫాలి వర్మ 'ప్లేయర్ ఆఫ్ ద సిరీస్'గా ఎంపికైంది.

తడబడిన లంక: ఛేదనలో 7 పరుగులకే ఓపెనర్ చమరి (2)ని కోల్పోయినా.. హాసిని, ఇమేషా రాణించడంతో శ్రీలంక 11 ఓవర్లలో 86/1తో బలమైన స్థితిలో నిలిచింది. కానీ ఇమేషాను ఔట్ చేయడం ద్వారా ఈ భాగస్వామ్యాన్ని అమన్‌జ్యోత్ విడదీయడంతో లంక ఇన్నింగ్స్ గతి తప్పింది. అక్కడి నుంచి క్రమం తప్పకుండా వికెట్లు కోల్పోయిన ఆ జట్టు.. ఛేదనలో వెనుకబడి పోయింది. సాధించాల్సిన రన్‌రేట్ క్రమంగా పెరుగుతూ పోయింది. నీలాక్షిక (3), కవిష (5) విఫలమయ్యారు. హాసిని అయిదో వికెట్‌గా వెనుదిరిగింది. 17 ఓవర్లలో 132/5తో నిలిచింది లంక. మిగతా ఆట లాంఛనమే. దీప్తి శర్మ మహిళల టీ20 క్రికెట్లో అత్యధిక వికెట్లు పడగొట్టిన బౌలర్‌గా నిలిచింది. ఆస్ట్రేలియాకు చెందిన మెగాన్ షట్ (151)ను ఆమె అధిగమించింది.

ఆదుకున్న హర్మన్‌ప్రీత్: భారత్ మెరుగైన స్కోరు సాధించిందంటే ప్రధాన కారణం కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ పోరాటమే. చిక్కుల్లో పడ్డ జట్టును ఆమె చక్కని బ్యాటింగ్‌తో ఆదుకుంది. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన భారత్‌కు ఆరంభం పేలవం. ఓపెనర్లు షెఫాలి వర్మ (5), కమలిని (12) విఫలమయ్యారు. ఏడో ఓవర్లో హర్లీన్ డియోల్ (13) నిష్క్రమించేటప్పటికి స్కోరు 41. ఓ వైపు హర్మన్ నిలిచినా.. రిచా ఘోష్ (5), దీప్తి శర్మ (7) కూడా పెవిలియన్ బాట పట్టడంతో భారత్ 11వ ఓవర్లో 77/5తో తక్కువకే ఆలౌటయ్యే ప్రమాదంలో పడింది. కానీ పట్టుదలతో నిలిచిన హర్మన్‌ప్రీత్ చక్కని షాట్లతో అలరించింది. చకచకా బౌండరీలు కొట్టింది. చమరి ఓవర్లో వరుసగా రెండు ఫోర్లు కొట్టిన ఆమె.. సింగిల్‌తో అర్ధశతకం సాధించింది. అమన్‌జ్యోత్ (21; 18 బంతుల్లో 1×4, 1×6) ఆమెకు చక్కని సహకారాన్నిచ్చింది. అయితే 17వ ఓవర్లో అమన్‌జ్యోత్ ఔట్ కావడంతో 61 పరుగుల భాగస్వామ్యం విడిపోయింది. తర్వాతి ఓవర్లో హర్మన్ కూడా నిష్క్రమించినా.. అరుంధతి రెడ్డి విరుచుకుపడడంతో ఆఖరి రెండు ఓవర్లలో భారత్‌కు 32 పరుగులు లభించాయి. ఆఖరి ఓవర్లో మల్కీ బౌలింగ్‌లో అరుంధతి వరుసగా 6, 4, 4 బాదింది.

భారత్ ఇన్నింగ్స్: షెఫాలి వర్మ (సి) ఇమేషా (బి) నిమష 5; కమలిని ఎల్బీ (బి) కవిష 12; హర్లీన్ డియోల్ (బి) రష్మిక 13; హర్మన్‌ప్రీత్ (బి) కవిష 68; రిచా ఘోష్ (సి) కౌశిని (బి) చమరి 5; దీప్తి శర్మ (సి) నిమష (బి) చమరి 7; అమన్‌జ్యోత్ కౌర్ (సి) కవిష (బి) రష్మిక 21; అరుంధతి రెడ్డి నాటౌట్ 27; స్నేహ్ రాణా నాటౌట్ 8; ఎక్స్‌ట్రాలు 9 **మొత్తం:** (20 ఓవర్లలో 7 వికెట్లకు) 175; **వికెట్ల పతనం:** 1-5, 2-27, 3-41, 4-64, 5-77, 6-138, 7-142; **బౌలింగ్:** మల్కీ మదార 4-0-37-0; నిమష మీపగే 3-0-25-1; కవిష దిల్హరి 2-0-11-2; ఇనోకా 4-0-39-2; రష్మిక సెవాంది 4-0-42-2; చమరి ఆటపట్టు 3-0-21-2


శ్రీలంక ఇన్నింగ్స్: హాసిని (బి) శ్రీచరణి 65; చమరి (సి) దీప్తి (బి) అరుంధతి 2; ఇమేషా (సి) షెఫాలి (బి) అమన్‌జ్యోత్ 50; నీలాక్షిక ఎల్బీ (బి) దీప్తి 3; కవిష (బి) వైష్ణవి 5; హర్షిత (సి) హర్లీన్ (బి) స్నేహ్ 8; కౌశిని రనౌట్ 1; రష్మిక నాటౌట్ 14; మల్కీ నాటౌట్ 5; ఎక్స్‌ట్రాలు 7 **మొత్తం:** (20 ఓవర్లలో 7 వికెట్లకు) 160; **వికెట్ల పతనం:** 1-7, 2-86, 3-100, 4-107, 5-132, 6-140, 7-140; **బౌలింగ్:** దీప్తి శర్మ 4-0-28-1; అరుంధతి రెడ్డి 2-0-16-1; స్నేహ్ రాణా 4-0-31-1; వైష్ణవి శర్మ 4-0-33-1; శ్రీచరణి 4-0-31-1; అమన్‌జ్యోత్ 2-0-17-1

అర్జున్ మళ్లీ మెరిసెన్

● బ్లిట్జ్ టోర్నీలోనూ కాంస్యం సొంతం
● కార్ల్‌సన్, అసుబయెవాకు టైటిళ్లు

దోహా


కార్ల్‌సన్


అర్జున్

ప్రపంచ ర్యాపిడ్ ఛాంపియన్‌షిప్‌లో కాంస్యం గెలిచి పతకాల కరువు తీర్చుకున్న తెలంగాణ కుర్రాడు అర్జున్ ఇరిగేశి.. బ్లిట్జ్ విభాగంలోనూ కంచు మోగించి 'డబుల్' సాధించాడు. అసలు అర్జున్ ఆడిన ఆటకి పసిడి పతకం వరిస్తుందేమో అనిపించింది. అంతలా ఆధిపత్యం ప్రదర్శించాడీ భారత గ్రాండ్‌మాస్టర్. మాగ్నస్ కార్ల్‌సన్, ఫాబియానో కరువానా లాంటి టాప్ ప్లేయర్లు పోటీలో ఉన్నా.. అర్జున్ అదరగొట్టాడు. దిగ్గజ కార్ల్‌సన్‌ను సైతం కంగు తినిపించాడు. తొలి రోజు, సోమవారం 13 గేమ్‌లలో 10 పాయింట్లు సాధించిన అతడు.. రెండో రోజు, మంగళవారం నాలుగు గేమ్‌లు నెగ్గి, రెండు డ్రా చేసుకున్నాడు. మొత్తంగా 19 రౌండ్లలో 15 పాయింట్లతో అర్జున్ అజేయంగా అగ్రస్థానంలో నిలిచి సెమీఫైనల్‌కు దూసుకెళ్లాడు. కరువానా (అమెరికా, 14), కార్ల్‌సన్ (13.5), నొదిర్‌బెక్ అబ్దు సత్తారోవ్ (ఉజ్బెకిస్థాన్, 13) కూడా సెమీస్ చేరారు. అయితే అబ్దు సత్తారోవ్‌తో సెమీఫైనల్లో అర్జున్‌కు కలిసి రాలేదు. తొలి రోజు ఆటలో సత్తారోవ్‌ను ఓడించిన అర్జున్.. సెమీస్‌లో మాత్రం తడబడ్డాడు. మొదటి గేమ్‌లో తెల్ల పావులతో ఆడే అవకాశం వచ్చినా సద్వినియోగం చేసుకోలేకపోయాడు. 47 ఎత్తుల్లో గేమ్‌ను కోల్పోయాడు. ఇది భారత స్టార్‌పై ఒత్తిడిని పెంచింది. సుదీర్ఘంగా సాగిన రెండో గేమ్‌లో 75వ ఎత్తు వద్ద తప్పిదం చేసిన అర్జున్.. అదే క్రమంలో గేమ్‌ను చేజార్చుకుని 0-2తో వెనకబడ్డాడు. మూడో గేమ్‌ను సత్తారోవ్ 33 ఎత్తుల్లో డ్రాగా ముగించి అర్జున్‌కు నిరాశను మిగిల్చాడు. సెమీఫైనల్ చేరడం ద్వారా భారత కుర్రాడు కాంస్యాన్ని దక్కించుకోగలిగాడు. విశ్వనాథన్ ఆనంద్ (2017) తర్వాత ఒకే టోర్నీలో రెండు విభాగాల్లో పతకాలు గెలిచిన ఘనత అర్జున్‌దే.

కార్ల్‌సన్ తొమ్మిదోసారి: నార్వే స్టార్ మాగ్నస్ కార్ల్‌సన్ మరోసారి అదరగొట్టాడు. బ్లిట్జ్ టోర్నీలో రెండు గేమ్‌లు కోల్పోయినా.. ఫైనల్లోనూ తడబడినా.. అనుభవాన్ని రంగరించి ట్రోఫీని ఎగరేసుకుపోయాడు. 16 రౌండ్ల వరకు 10 పాయింట్లతోనే ఉన్న కార్ల్‌సన్.. తర్వాత తన అసలు ఆట బయటకు తీసి నాకౌట్ చేరాడు. కరువానాతో సెమీఫైనల్లో పోటీ ఎదురైనా నిలిచాడు. తొలి రెండు గేమ్‌లను డ్రా చేసుకున్న కార్ల్‌సన్.. మూడు, నాలుగో గేమ్‌లలో నెగ్గి ముందంజ వేశాడు. అబ్దు సత్తారోవ్‌తో ఫైనల్లో 2.5-1.5తో నెగ్గాడు. తొలి గేమ్‌లో ఓటమి ఎదురైనా కార్ల్‌సన్ పుంజుకున్నాడు. తర్వాతి మూడు గేమ్‌లలో రెండు గెలిచి విజేతగా నిలిచాడు. బ్లిట్జ్ టైటిల్ గెలవడం అతడికి తొమ్మిదోసారి. మొత్తంగా అతడికిది 20వ ప్రపంచ టైటిల్. మహిళల విభాగంలో బిబిసారా అసుబయెవా (కజకిస్థాన్) విజేతగా నిలిచింది. అనా ముజ్‌చుక్ (ఉక్రెయిన్)తో ఫైనల్లో తొలి మూడు గేమ్‌లను డ్రా చేసుకున్న అసుబయెవా.. నాలుగో గేమ్‌లో గెలిచి టైటిల్ కైవసం చేసుకుంది. సెమీస్‌లో ఓడిన ఎలిన్ రొబెర్స్ (నెదర్లాండ్స్), జు జినెర్ (చైనా) కాంస్య పతకాలు సొంతం చేసుకున్నారు. సెమీస్‌లో అసుబయెవా చేతిలో జినెర్ ఓడగా.. ముజ్‌చుక్‌కు రొబెర్స్ తలొంచింది.

2025లో.. మెరిశారు మురిపించారు

ఈనాడు క్రీడావిభాగం

కొత్త ఏడాది మొదలవుతుంటే క్రీడాభిమానులు.. ఈ ఏడాది పెద్ద ఈవెంట్లు ఏమున్నాయా అని చూస్తారు! అందులో మన క్రీడాకారుల అవకాశాలు గురించి చర్చించుకుంటారు! 2025 మొదలవుతున్నపుడు ఈ ఏడాది జరగనున్న పెద్ద ఈవెంట్లు చూస్తే.. భారత అథ్లెట్లపై ఎక్కువ ఆశలు పెట్టుకునే అవకాశాలు కనిపించలేదు! కానీ ఏడాది ముగిసేసరికి ఎన్నో అద్భుతాలు జరిగాయి. చప్పుడు లేకుండా బరిలోకి దిగి.. మైదానంలో బలంగా సౌండు చేశారు మన క్రీడాకారులు. ఆశ్చర్యపరిచే ప్రదర్శనలు, నమ్మశక్యం కాని విజయాలతో 2025 భారత క్రీడా చరిత్రలో ఒక ప్రత్యేక సంవత్సరంగా నిలిచిపోయింది.

కల నెరవేరె



పురుషుల క్రికెట్లో భారత జట్టు వన్డేలు, టీ20ల్లో కలిపి అయిదు ప్రపంచకప్‌లు సాధించింది. కానీ మహిళల క్రికెట్లో మాత్రం దేశానికి ఒక్క కప్పూ లేని పరిస్థితి. 2005లో, 2017లో చివరి మెట్టుపై బోల్తా కొట్టి వన్డే ప్రపంచకప్‌ను చేజార్చుకుంది భారత్. 2017లో వచ్చింది సువర్ణావకాశమే. ఎందుకంటే భీకర ఆస్ట్రేలియాను ఓడించి ఫైనల్ చేరింది మిథాలీసేన. కానీ అప్పుడు అవకాశం చేజారేసరికి తీవ్ర నిరాశ. మళ్లీ ఇలాంటి అవకాశం వస్తుందా అన్న సందేహం. ఈ ఏడాది ప్రపంచకప్‌నకు భారతే ఆతిథ్యం ఇచ్చినప్పటికీ.. ఆస్ట్రేలియా, ఇంగ్లాండ్, దక్షిణాఫ్రికా జట్లను దాటి కప్పు గెలవడం కష్టమే అని అంచనా వేశారు అభిమానులు. కానీ హర్మన్‌ప్రీత్ సేన నాకౌట్లో అద్భుతమే చేసింది. సెమీఫైనల్లో ప్రపంచ రికార్డు ఛేదనలో ఆస్ట్రేలియాను మట్టికరిపించి.. తుది పోరులో దక్షిణాఫ్రికాపైనా అద్భుత విజయం సాధించి ప్రపంచకప్ కలను నెరవేర్చుకుంది. ఇది మహిళల క్రికెట్ ముఖచిత్రాన్ని మార్చివేసే విజయం అనడంలో సందేహం లేదు. ఏడాది ఆరంభంలో జూనియర్ అమ్మాయిలు అండర్-19 ప్రపంచకప్‌ను చేజిక్కించుకోవడం విశేషం.

దుబాయ్‌లో ధమాకా



గత ఏడాది టీ20 ప్రపంచకప్ గెలిచి భారత అభిమానులను సంతోషంలో ముంచెత్తిన భారత పురుషుల జట్టు.. ఆ తర్వాత టెస్టు క్రికెట్లో పతనం కావడం పెద్ద షాక్. సొంతగడ్డపై న్యూజిలాండ్ చేతిలో వైట్‌వాష్ పరాభవంతో భారత జట్టు కుదేలైపోయింది. ఆ తర్వాత ఆస్ట్రేలియా పర్యటనలోనూ ఓటమి ఎదురు కావడం టీమ్‌ఇండియాకు మరో ఎదురు దెబ్బ. దీంతో అభిమానులను ఒక రకమైన నిస్తేజం ఆవహించింది. జట్టుపై అంచనాలు తగ్గిపోయాయి. ఆ స్థితిలో పెద్దగా అంచనాల్లేకుండా ఛాంపియన్స్ ట్రోఫీలో బరిలోకి దిగిన రోహిత్‌సేన.. ఆద్యంతం నిలకడగా ఆడి టైటిల్ సాధించింది. కఠిన పిచ్‌లు సవాలు విసిరినా తట్టుకుని సమష్టి ప్రదర్శన చేసిన భారత్.. ఒక్క ఓటమీ లేకుండా కప్పు గెలవడం విశేషం. టోర్నీకి ఆతిథ్యమిచ్చింది పాకిస్థాన్ అయినా, ఆ దేశానికి వెళ్లేది లేదని తేల్చి చెప్పిన భారత్.. దుబాయ్‌ని వేదికగా ఎంచుకుని అక్కడే మ్యాచ్‌లన్నీ ఆడింది. పాకిస్థాన్‌ను కూడా అక్కడికే రప్పించుకుని ఓడించి పంపించిన రోహిత్‌సేన.. ఫైనల్లో న్యూజిలాండ్‌ను మట్టికరిపించి ట్రోఫీని సాధించింది. ఈ టోర్నీలో రోహిత్, కోహ్లి చక్కటి ప్రదర్శన చేయడం అభిమానుల సంతోషాన్ని రెట్టింపు చేసింది. చివరగా 2013లో ఛాంపియన్స్ ట్రోఫీ గెలిచిన భారత్.. మళ్లీ ఇప్పుడే ఆ టైటిల్ సాధించింది.

ఇంతకంటే స్ఫూర్తి ఏముంది?



ఆర్చరీలో బాణం వేయాలంటే చేతులే అత్యంత కీలకం. ఒక చేత్తో విల్లును పట్టుకుని, ఇంకో చేత్తో బాణాన్ని విసరాల్సి ఉంటుంది. కానీ రెండు చేతులూ లేని ఓ వ్యక్తి ఈ ఆటలోకి అడుగు పెట్టడం అంటే ఊహకు అందని విషయం! అదే ఆశ్చర్యం అంటే.. చేతులు ఉన్న పారా ఆర్చర్లతో పోటీ పడి ఒలింపిక్ పతకం గెలవడం, ప్రపంచ ఛాంపియన్‌గా నిలవడమంటే చిన్న విషయమా! శీతల్ దేవి ఈ అసాధారణ ఘనతలే సాధించింది. కానీ ఆమె అద్భుతాలు అంతటితో ఆగిపోలేదు. ఈ ఏడాది ఆమె అన్ని అవయవాలు సరిగా ఉన్న సాధారణ ఆర్చర్లతో పోటీ పడి తన ప్రతిభను చాటుకుంది. ఆసియా ఆర్చరీలో వైకల్యం లేని ఆర్చర్లతో పోటీ పడే అరుదైన అవకాశాన్ని సాధించింది. రెండు చేతులూ లేకపోయినా తన సంకల్ప బలంతో ఆర్చరీలో అద్భుతాలు చేస్తున్న శీతల్ దేవికి మించిన స్ఫూర్తి గాథ ఏముంటుంది?

అందరూ తమవైపు చూసేలా..



ఈ ఏడాది హర్మన్‌ప్రీత్ సేన మాత్రమే కాదు.. మరో భారత మహిళల క్రికెట్ జట్టు కూడా ప్రపంచ కప్ సాధించింది. తొలిసారిగా అంధ మహిళల కోసం నిర్వహించిన టీ20 ప్రపంచకప్‌ను భారత అమ్మాయిలే సొంతం చేసుకున్నారు. కొలంబోలో ఆరు దేశాలు పాల్గొన్న ఈ టోర్నీలో భారత్.. ఫైనల్లో నేపాల్‌ను 7 వికెట్ల తేడాతో ఓడించి విజేతగా నిలిచింది. ఆ జట్టుకు కెప్టెన్ తెలుగమ్మాయి అయిన దీపికనే కావడం విశేషం. మరో తెలుగు క్రికెటర్ కరుణ కుమారి జట్టు సభ్యురాలు. ఈ టోర్నీ జరుగుతున్నపుడు అంధ మహిళల కోసం ఒక ప్రపంచకప్ ఉన్నట్లే ఎవరికీ తెలియదు. కానీ దీపిక బృందం కప్పు గెలిచి అందరి చూపునూ తమ వైపు తిప్పుకుంది. ట్రోఫీతో స్వదేశానికి వచ్చిన అంధుల జట్టుకు గొప్ప ఆదరణే దక్కింది. ప్రధాని నరేంద్ర మోదీ వారిని కలిసి అభినందనలు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సైతం ఈ జట్టును సత్కరించడం విశేషం.

అవన్నీ ఒకెత్తు.. ఇదొక ఎత్తు



ఆర్చరీలో ప్రపంచ స్థాయిలో ఎన్నో ఘనతలు సాధించింది విజయవాడ అమ్మాయి వెన్నం జ్యోతి సురేఖ. ప్రపంచ ఛాంపియన్‌షిప్, ప్రపంచకప్, ఆసియా క్రీడలు.. ఇలా అత్యున్నత టోర్నీల్లో ఆమె ఎన్నో పతకాలు కొల్లగొట్టింది. ఈ ఏడాది ఆమె ఇంకా అత్యున్నతమైన పతకాన్ని అందుకుంది. ప్రపంచకప్ ఫైనల్స్‌లో వ్యక్తిగత పతకం సాధించిన తొలి భారత ఆర్చర్‌గా ఆమె చరిత్ర సృష్టించింది. చైనాలోని నాన్‌జింగ్‌లో జరిగిన ఆర్చరీ ప్రపంచకప్ ఫైనల్స్‌లో జ్యోతి కాంస్యం సాధించింది. అయితే ఇన్ని ఘనతలు సాధించినా.. దేశ అత్యున్నత క్రీడా పురస్కారం 'ఖేల్‌రత్న' మాత్రం ఈ తెలుగమ్మాయికి దక్కకపోవడమే విచారకరం.

పిల్లోడు కాదు పిడుగు



14 ఏళ్ల పిల్లాడు ఏం చేస్తాడు? స్కూలుకెళ్లి చదువుకుంటూ.. ఖాళీ దొరికినపుడు తన వయసు పిల్లలతో సరదాగా ఆడుకుంటూ ఉంటాడు. కానీ వైభవ్ సూర్యవంశీ మాత్రం ప్రపంచవ్యాప్తంగా క్రికెట్ అభిమానులు సంభ్రమాశ్చర్యాలకు గురి చేసే ప్రదర్శన చేశాడు. ఐపీఎల్‌లో అరంగేట్రం చేసిన అత్యంత పిన్న వయస్కుడిగా రికార్డు సృష్టించడమే కాదు.. ఈ లీగ్‌లో శతకం సాధించిన అత్యంత చిన్నవాడిగానూ ఘనత సాధించాడు. ఐపీఎల్‌లో 38 బంతుల్లో సెంచరీ కొట్టిన సూర్యవంశీ.. ఆసియా కప్ రైజింగ్ స్టార్స్ టోర్నీలో కేవలం 42 బంతుల్లోనే 144 పరుగులతో సంచలనం రేపాడు. అతడి దూకుడు చూస్తే.. టీ20ల్లో డబుల్ సెంచరీ కొట్టే తొలి బ్యాటర్ అవుతాడనే అంచనాలు కలుగుతున్నాయి. ఈ ఏడాది భారత్ అనే కాక అంతర్జాతీయ క్రికెట్లోనూ అతి పెద్ద సంచలనంగా సూర్యవంశీని చెప్పొచ్చు.

ఎవరో అనుకుంటే..



ఈ ఏడాది జార్జియా వేదికగా మహిళల చెస్ ప్రపంచకప్ మొదలవుతున్నపుడు భారత క్రీడాకారులపై ఏ అంచనాలు లేవు. కానీ అనూహ్యంగా ఇద్దరూ భారత క్రీడాకారులే ఫైనల్‌కు చేరడంతో అభిమానుల దృష్టి ఆ టోర్నీపై పడింది. అపార అనుభవానికి తోడు కెరీర్లో అనేక గొప్ప ఘనతలు సాధించిన కోనేరు హంపి వైపే ఎక్కువ మొగ్గు కనిపించింది. ఆమె ముందు జూనియర్ అయిన దివ్య దేశ్‌ముఖ్ నిలవలేదనే అంతా అనుకున్నారు. కానీ ఫైనల్లో అసాధారణ ప్రదర్శన చేసిన దివ్య.. హంపికి షాకిచ్చింది. ఫైనల్లో రెండు గేమ్‌లూ డ్రా అయ్యాక టైబ్రేక్‌లోనూ తొలి గేమ్‌లో ఫలితం తేలలేదు. కానీ చివరి గేమ్‌లో హంపిని ఓడించిన దివ్య.. కప్పును ఎగరేసుకుపోయింది. టోర్నీలో నాకౌట్‌కైనా వెళ్తుందా అనుకున్న దివ్య.. హేమాహేమీలైన క్రీడాకారులను ఓడించి టైటిల్ గెలవడం అనూహ్యం!

సౌండు లేకుండా కప్పు కొట్టేశారు



ప్రపంచ స్క్వాష్‌లో భారత్ అంత బలమైన జట్టేమీ కాదు. డిసెంబరులో చెన్నై వేదికగా ఈ ఆటలో ప్రపంచకప్ జరుగుతుంటే జనం పెద్దగా పట్టించుకోలేదు. కానీ అనూహ్య ప్రదర్శనతో ఫైనల్‌కు దూసుకెళ్లిన భారత్.. హాంకాంగ్‌ను ఓడించి కప్పు ఎగరేసుకుపోయింది. జోష్న చిన్నప్ప, అనాహత్, అభయ్ సింగ్, సెంథిల్ కుమార్‌లతో కూడిన జట్టు 3-0తో నెగ్గి, టైటిల్ సాధించింది. ఈ కప్పు సాధించిన తొలి ఆసియా జట్టు భారతే కావడం విశేషం. మరోవైపు ఈ ఏడాది ఖోఖో ప్రపంచకప్‌లోనూ భారత్ విజేతగా నిలిచింది.


సదరన్ స్ట్రైకర్స్‌కు టైటిల్



ట్రోఫీతో సదరన్ స్ట్రైకర్ జట్టు

అనంతపురం క్రీడలు, న్యూస్‌టుడే: ఏఎస్ఏ మహిళల టీ20 క్రికెట్ కప్‌లో అమెరికాకు చెందిన సదరన్ స్ట్రైకర్స్ జట్టు విజేతగా నిలిచింది. అనంతపురం స్పోర్ట్స్ విలేజ్ మైదానంలో జరిగిన ఈ టోర్నీలో ఎనిమిది జట్లు పోటీపడ్డాయి. ఫైనల్లో సదరన్ స్ట్రైకర్స్ 5 వికెట్ల తేడాతో టీమ్ ఏఎస్ఏను ఓడించింది. మొదట ఏఎస్ఏ 20 ఓవర్లలో 7 వికెట్లకు 127 పరుగులు చేసింది. నేహా (53), అర్షియా (49) రాణించారు. గీతిక (2/18) సత్తా చాటింది. బదులుగా సదరన్ స్ట్రైకర్స్ 18 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని అందుకుంది. గీతిక (41), సషా (28) స్ట్రైకర్స్ విజయంలో కీలకపాత్ర పోషించారు. అర్షియా (3/13) రాణించినా ఏఎస్ఏకు విజయాన్ని అందించలేకపోయింది. బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమంలో భారత మహిళల అంధుల జట్టు కెప్టెన్ టీసీ దీపిక, అంతర్జాతీయ క్రికెటర్ బి.అనూష, ఆర్డీటీ స్పోర్ట్స్ డైరెక్టర్ సాయికృష్ణ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా భారత అంధుల క్రికెట్ జట్టును విశ్వవిజేతగా నిలిపిన దీపికాకు రూ.లక్ష చెక్కును అందజేశారు.

శ్రేయస్ పునరాగమనం ఆలస్యం?


శ్రేయస్ అయ్యర్

బెంగళూరు: టీమ్‌ఇండియా వన్డే వైస్ కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ పునరాగమనం మరింత ఆలస్యం కానుంది. బెంగళూరులోని బీసీసీఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ (సీఓఈ) నుంచి అతడికి ఇంకా అనుమతి లభించలేదు. షెడ్యూలు ప్రకారం డిసెంబరు 30న శ్రేయర్ సీఓఈని వీడాలి. కానీ ఇప్పుడు అక్కడ మరో వారం గడపాల్సివస్తోంది. శ్రేయస్ ఎలాంటి అసౌకర్యం లేకుండా బ్యాటింగ్ చేస్తున్నాడు. కానీ కడుపులో గాయం కారణంగా అతడు బరువు వేగంగా తగ్గిపోయాడు. అతడి శక్తి తగ్గిపోయింది. వచ్చే వారం సీఓఈలో దానిపైనే దృష్టిపెట్టనున్నారు. ఆస్ట్రేలియా పర్యటనలో గాయపడ్డ శ్రేయస్ ఇప్పటికే రెండు నెలల ఆటకు దూరమయ్యాడు. గాయంతో ఆరు కిలోలు తగ్గిన అతడు.. తిరిగి కొంత పెరిగాడు.

డబ్ల్యూపీఎల్ నుంచి పెర్రీ, అనాబెల్ ఔట్

ముంబయి: వచ్చే ఏడాది జరిగే మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్) నుంచి ఎలిస్ పెర్రీ (రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు), అనాబెల్ సదర్లాండ్ (దిల్లీ క్యాపిటల్స్) వ్యక్తిగత కారణాలతో వైదొలిగారు. పెర్రీ స్థానంలో సయాలీ సత్ఘరె (రూ.30 లక్షలు), అనాబెల్‌కు బదులు అలానా కింగ్ (రూ.60 లక్షలు) డబ్ల్యూపీఎల్ ఆడతారు. గత సీజన్లో అలానా యూపీ వారియర్స్‌కు ప్రాతినిధ్యం వహించింది. యూపీ జట్టులో పేసర్ టారా నోరిస్ స్థానంలో చార్లీ నాట్ ఆడనుంది.



తిరుమల శ్రీవారిని దర్శించుకుని వస్తున్న క్రికెటర్ తిలక్ వర్మ, బీసీసీఐ పాలకమండలి సభ్యుడు చాముండేశ్వరీనాథ్ ● టీ20 కెప్టెన్ సూర్యకుమార్ దంపతులు

బుద్ధం శిల్పం నమామి



ఈటీవీ భారత్: గౌతమ బుద్ధుడు జ్ఞానోదయం పొందిన చోటుగా ప్రపంచ ప్రసిద్ధి గాంచిన గయలో యువ శిల్పి విజయకుమార్ అంగుళం కంటే తక్కువ పరిమాణంలో ఉన్న బుద్ధుడి విగ్రహాల నుంచి 20 అడుగుల శిల్పాల వరకు జీవకళ ఉట్టిపడేలా రూపొందిస్తున్నారు. చెక్కబొమ్మల తయారీలోనూ ఈయన మంచి ప్రావీణ్యం సాధించారు. ఎక్కువగా గౌతమ బుద్ధుడి శిల్పాలు, స్థానిక విష్ణుపాద మందిరం వంటి శిల్పాలు విజయకుమార్ తయారుచేస్తుంటారు. దేశంలోని పలు ప్రాంతాలతో పాటు టిబెట్, థాయ్‌లాండ్, బంగ్లాదేశ్, శ్రీలంక, నేపాల్, భూటాన్, అమెరికా వంటి విదేశాలకు సైతం ఇవి ఎగుమతి అవుతున్నాయి. అయిదేళ్ల వయసు నుంచే తండ్రి బిర్జులాల్ చౌధరి వద్ద శిల్పకళను నేర్చుకొని, ఇప్పుడు తండ్రిని మించిన తనయుడిగా మారిన విజయ్ ఇతరులకూ శిక్షణ ఇస్తున్నారు. కంఠహారంలో ధరించే బుద్ధుడి చిన్ని శిల్పాలకు ఎక్కువ డిమాండు ఉంటోంది. బిహార్‌లోని గయా సమీప ఖిజసరాయ్ ప్రాంతానికి చెందిన విజయ్ కార్యశాల మహాబోధి ఆలయ సమీపంలోనే ఉంది. బిహార్ పర్యాటక శాఖ దుకాణాల్లోనూ దొరికే ఈయన శిల్పాల ధరలు రూ.100 నుంచి రూ.5 లక్షల వరకు ఉంటాయి. పేదరికం కారణంగా ఇంటర్మీడియేట్‌తో చదువు చాలించిన విజయ్ గయాకు ఎక్కువగా వచ్చే విదేశీ పర్యాటకులతో మాట్లాడేందుకు ప్రస్తుతం ఇంగ్లిష్ నేర్చుకొంటున్నారు.

18 ఏళ్ల ప్రాయంలోనే దక్షిణ ధ్రువానికి..



- నౌకాదళ అధికారి కుమార్తె ఘనత

దిల్లీ: ఎముకలు కొరికే చలిని తట్టుకుంటూ 18 ఏళ్ల వయసులోనే దక్షిణ ధ్రువానికి చేరుకోవడం ద్వారా భారత నౌకాదళానికి చెందిన ఓ అధికారి కుమార్తె కామ్య కార్తికేయన్ తాజాగా రికార్డు సృష్టించారు. స్కీయింగ్ చేస్తూ దక్షిణ ధ్రువానికి చేరుకున్న అతిపిన్న భారతీయ వ్యక్తిగా ఘనత సాధించారు. కామ్యకు అభినందనలు తెలుపుతూ నౌకాదళం 'ఎక్స్'లో మంగళవారం ఓ పోస్టు పెట్టింది. మైనస్ 30 డిగ్రీల ఉష్ణోగ్రతను, ప్రచండ శీతల గాలులను తట్టుకుంటూ ఆమె దాదాపు 115 కిలోమీటర్ల దూరం స్కీయింగ్ చేసిందని.. ఈ నెల 27న దక్షిణ ధ్రువానికి చేరుకుందని అందులో తెలిపింది. ప్రపంచంలో స్కీయింగ్ ద్వారా అక్కడికి చేరుకున్న రెండో అతిపిన్న వయసు మహిళ ఆమేనని వెల్లడించింది. కామ్య ఇప్పటికే ఏడు అత్యంత ఎత్తయిన శిఖరాల (ఎవరెస్టు శిఖరం సహా) అధిరోహణ సవాలును పూర్తిచేసింది.

అశ్లీల ప్రసారాలను అడ్డుకోండి

సోషల్ మీడియా సంస్థలకు కేంద్రం తాఖీదు

దిల్లీ: అశ్లీలత, అసభ్యత, లైంగిక విచ్చలవిడితనం, పసిపిల్లలతో లైంగిక కార్యకలాపాలు వంటి చట్ట సమ్మతంకాని అంశాల ప్రచురణ, ప్రసారాలను ఆన్‌లైన్ సంస్థలు, సోషల్ మీడియా వేదికలు నియంత్రించకుంటే చట్టపరంగా చర్యలు తప్పవని కేంద్ర ప్రభుత్వం హెచ్చరించింది. ఈ మేరకు కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఐటీ మంత్రిత్వశాఖ ఒక తాఖీదు జారీ చేసింది. ఈ ఆదేశాలను ఆయా సంస్థలు వెంటనే అమలు చేయాలని ఆ శాఖ స్పష్టం చేసింది. 'సోషల్ మీడియా సంస్థలతో సహా ఆన్‌లైన్ మధ్యవర్తిత్వ సంస్థలన్నీ.. థర్డ్ పార్టీలు తమ వేదికలపై అప్‌లోడ్ చేసిన, ప్రచురించిన, ప్రసారం చేసిన అంశాలకు సంబంధించి శిక్షార్హత నుంచి మినహాయింపు పొందాలంటే ఐటీ చట్టంలోని సెక్షన్ 79కి లోబడి పని చేయాలి' అని ఐటీశాఖ పేర్కొంది. అశ్లీల, అనుచిత, అసభ్యకర కంటెంట్‌పై సోషల్ మీడియా వేదికలు చర్యలు తీసుకోవడంలో విఫలమవుతున్న నేపథ్యంలో తాజా ఆదేశాలు జారీ చేసింది.

వీబీ జీ రాంజీతో రాష్ట్రాలకు మేలే

- రూ.17 వేల కోట్ల కేటాయింపులు పెరిగే అవకాశం
- తెలంగాణకు రూ.333 కోట్లు అదనంగా రావొచ్చు
- ఆంధ్రప్రదేశ్‌కు కొంత తగ్గొచ్చు
- ఎస్‌బీఐ ఎకనమిక్ రీసెర్చ్ నివేదిక



ఈనాడు, దిల్లీ: 'మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం' (ఎంజీనరేగా)తో పోలిస్తే కేంద్ర ప్రభుత్వం కొత్తగా తీసుకొచ్చిన 'వికసిత్‌భారత్- గ్యారెంటీ ఫర్ గ్రామీణ్ రోజ్‌గార్ అండ్ అజీవికా మిషన్ (గ్రామీణ్) చట్టం' (వీబీ జీ రామ్ జీ)తో రాష్ట్రాలకు ఏటా నిధులు పెరిగే అవకాశం ఉన్నట్లు ఎస్‌బీఐ ఎకనమిక్ రీసెర్చ్ నివేదిక వెల్లడించింది. 2026-27 సంవత్సరంలో ఈ పథకం అమలుకోసం కేంద్ర వాటాకింద రూ.96వేల కోట్లు కేటాయించే అవకాశం ఉన్నట్లు బిల్లులో ప్రభుత్వం చెప్పిందని, ఈ పథకానికి గత ఏడేళ్లలో కేటాయించిన సగటు మొత్తంతో పోలిస్తే ఇది దాదాపు రూ.17వేల కోట్లు అధికమని పేర్కొంది. పన్నుల్లో వాటా, గ్రాంట్ల కింద కేంద్రం 55% నిధులను రాష్ట్రాలకు పంపిణీ చేయనుందని, ఆ నిధులను వీబీ జీ రామ్‌జీ చట్టం కింద కేంద్రం ఇచ్చే 60% నిధులతో కలిపి ఇప్పుడు మరింత ఉత్పాదకంగా ఖర్చుచేయడానికి వీలవుతుందని పేర్కొంది. ఎంజీనరేగా కింద సగటు పనిదినాలు 45.9 రోజులే ఉంటున్నాయని, కొత్త పథకంలో ఇది కనీసం 50.4 రోజులకు పెరిగే అవకాశం ఉందని అంచనావేసింది.

ఏడు కొలమానాలు

కొత్త చట్టం ప్రకారం కేంద్రం రాష్ట్రాలకు వాటి పనితీరు ఆధారంగా నిధులు కేటాయించే అవకాశం ఉన్నట్లు ఎస్‌బీఐ రీసెర్చ్ నివేదిక అంచనావేసింది. సాధారణంగా కేంద్ర పన్నుల్లో వాటా పంపిణీ కోసం ఆర్థిక సంఘాలు వివిధ కొలమానాలను పరిగణనలోకి తీసుకుని రాష్ట్రాలకు వాటాను ఖరారు చేస్తుంటాయి. అదే తరహాలో ఈ ఉపాధి హామీ నిధుల పంపిణీకీ కేంద్రం ఏడు కొలమానాలను పరిగణనలోకి తీసుకోవచ్చని ఈ నివేదిక పేర్కొంది. అందులో గ్రామ పంచాయతీల సంఖ్య (15%), మహిళా కార్మికుల వాటా (20%), 100 రోజుల పనిదినాలు పూర్తిచేసిన కుటుంబాలు(8%), కల్పించిన పనిదినాలు (15%), పనికి డిమాండ్ (12%), వ్యక్తిగత ఆస్తుల సృష్టి (15%), గ్రామీణ జనాభా (15%)కు మార్కులు కేటాయించొచ్చని పేర్కొంది. ఆంధ్రప్రదేశ్ (-140 కోట్లు), తమిళనాడు (-909 కోట్లు) మినహా మిగిలిన రాష్ట్రాలన్నింటికీ గతంకంటే కేటాయింపులు పెరిగే అవకాశం ఉన్నట్లు తెలిపింది. తెలంగాణకు రూ.333 కోట్లు పెరగనున్నాయి.

పూర్తి వివరాలు www.eenadu.net లో

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌నకు ఇజ్రాయెల్ అత్యున్నత పౌర పురస్కారం

- శాంతి విభాగంలో అందిస్తామని నెతన్యాహు ప్రకటన



ఫ్లోరిడాలో నెతన్యాహుతో కలిసి మీడియాతో మాట్లాడుతున్న ట్రంప్

న్యూయార్క్: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌ను ఇజ్రాయెల్ తమ దేశ అత్యున్నత పౌర పురస్కారంతో సత్కరించనుంది. ఆయనకు 'ఇజ్రాయెల్ ప్రైజ్ ఫర్ పీస్'ను అందజేయనున్నట్లు ప్రధానమంత్రి బెంజమిన్ నెతన్యాహు ప్రకటించారు. అమెరికా పర్యటనకు వచ్చిన నెతన్యాహు ఫ్లోరిడాలోని మార్-ఎ-లాగో రిసార్టులో ట్రంప్‌తో సోమవారం భేటీ అయ్యారు. గాజా శాంతి ప్రణాళిక రెండో దశ, హమాస్ నిరాయుధీకరణ సహా పలు అంశాలపై చర్చించారు. అనంతరం- ట్రంప్‌నకు తమ దేశ అత్యున్నత పౌర పురస్కారమైన 'ఇజ్రాయెల్ ప్రైజ్'ను అందిస్తామని వెల్లడించారు. ఇందుకోసం శాంతి విభాగంలో తొలిసారి ఆ అవార్డును ఏర్పాటుచేస్తామన్నారు. ఇజ్రాయెల్, యూదుల కోసం చేసిన సేవలకు గుర్తింపుగా ట్రంప్‌ను ఇలా గౌరవించబోతున్నట్లు తెలిపారు. చరిత్రలో ఇప్పటివరకూ విదేశీ నేతలెవరికీ ఇజ్రాయెల్ తమ అత్యున్నత పౌర పురస్కారాన్ని అందించకపోవడం గమనార్హం. ద్వైపాక్షిక సమావేశానంతరం ట్రంప్, నెతన్యాహు సంయుక్తంగా విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. ఇజ్రాయెల్ తనకు అవార్డును ప్రకటించడం ఊహించని గౌరవమని ట్రంప్ పేర్కొన్నారు.

బంగ్లాదేశ్‌లో మరో మైనారిటీ వ్యక్తి హత్య?



బజేంద్ర బిశ్వాస్

ఢాకా: బంగ్లాదేశ్‌లో మరో మైనారిటీ వ్యక్తి హత్యకు గురయ్యారు. మైమెన్‌సింగ్ జిల్లాలోని ఒక కర్మాగారంలో సెక్యూరిటీ గార్డుగా విధులు నిర్వర్తిస్తున్న బజేంద్ర బిశ్వాస్(42)ను అతడి సహోద్యోగి నోమన్ మియా కాల్చి చంపాడు. సోమవారం సాయంత్రం 6.45 గంటల ప్రాంతంలో ఈ ఘటన చోటుచేసుకున్నట్లు తెలుస్తోంది. అయితే తామిద్దరం ఫ్యాక్టరీ బ్యారక్‌లో సరదాగా మాట్లాడుకుంటున్న సమయంలో భద్రత కోసం ఉపయోగించే తుపాకీని బిశ్వాస్ వైపు గురి పెట్టానని, అనుకోకుండా చేయి ట్రిగ్గర్‌కు తాకడంతో తుపాకీ పేలి, బుల్లెట్ అతడికి తగిలిందని నోమన్ మియా పేర్కొన్నాడు. వెంటనే బజేంద్రను ఆసుపత్రికి తరలించగా అతడు మరణించినట్లు వైద్యులు ధ్రువీకరించారని తెలిపాడు. కేసు నమోదు చేసిన పోలీసులు నోమన్ మియాను అరెస్టు చేశారు. బిశ్వాస్ మృతికి కారణాలపై దర్యాప్తు చేస్తున్నామని వెల్లడించారు.

దిల్లీ నుంచి ఢాకాకు బంగ్లాదేశ్ హైకమిషనర్

బంగ్లాదేశ్ హైకమిషనర్ రియాజ్ హమీదుల్లా అత్యవసరంగా భారత్ నుంచి ఢాకా వెళ్లారు. ఆ దేశ విదేశాంగ మంత్రిత్వశాఖ నుంచి అత్యవసర కాల్ రావడంతో సోమవారం రాత్రి ఆయన ఢాకా చేరుకున్నారు. ఇటీవల భారత్‌తో ద్వైపాక్షిక సంబంధాలు దెబ్బతిన్న నేపథ్యంలో ఆయనను అత్యవసరంగా ఢాకాకు పిలిపించారని బంగ్లా మీడియా వెల్లడించింది. ఆయన విదేశాంగశాఖ సలహాదారు (మంత్రి) ఎం.డి.తౌహిద్ హుసేన్, జాతీయ భద్రతా సలహాదారు ఖలీలుర్ రహ్మాన్‌లతో సమావేశమయ్యారు. అయితే ఏయే అంశాలపై చర్చించిందీ వెల్లడించలేదు.



మీ ప్రయత్నాన్ని బట్టే ఫలితం

ఏదైనా పనిపై మీకున్న ఇష్టం,
ఆ పనిలో మీ తీవ్ర ప్రయత్నాన్ని
అనుసరించే ఫలితం ఉంటుంది.
మీరు చేస్తున్న లేదా మీరు
చేయాలనుకునే పని కంటే
ముఖ్యమైన లేదా ఆసక్తి కలిగించే
పని మీకు మరొకటి ఉండకూడదు.
అటువంటి సందర్భంలో
మీ జీవితం ఆ పనికే
అంకితం అవుతుంది.

– బి.ఎస్.గుప్తా, రచయిత

ప్రియాంకా గాంధీ కుమారుడి నిశ్చితార్థం!

- స్నేహితురాలిని పెళ్లి చేసుకోబోతున్న రేహాన్ వాద్రా



దిల్లీ: కాంగ్రెస్ పార్టీ అగ్ర నాయకురాలు ప్రియాంకా గాంధీ, పారిశ్రామికవేత్త రాబర్ట్ వాద్రా దంపతుల కుమారుడు రేహాన్ వాద్రా (25) త్వరలో వివాహ బంధంలోకి అడుగుపెట్టబోతున్నట్లు తెలుస్తోంది. తాజాగా ఆయన వివాహ నిశ్చితార్థం జరిగినట్లు వారి కుటుంబ సన్నిహితులు వెల్లడించారు. రేహాన్ తన స్నేహితురాలైన అవీవా బేగ్‌ను పెళ్లి చేసుకోబోతున్నట్లు సమాచారం. ఫొటోగ్రాఫర్లు అయిన వీరిద్దరి మధ్య ఏడేళ్లుగా స్నేహం ఉందని, ఇరు కుటుంబాలు వివాహానికి అంగీకరించాయని తెలుస్తోంది. దీనిపై గాంధీ, వాద్రా కుటుంబాల నుంచి ఎలాంటి అధికారిక ప్రకటన రాలేదు. అవీవా కుటుంబ సభ్యులు దిల్లీకి చెందినవారని, వాద్రా కుటుంబంతో వీరికి సన్నిహిత సంబంధాలున్నాయని చెబుతున్నారు. కాగా, నూతన సంవత్సర వేడుకల నిమిత్తం ప్రియాంకా గాంధీ, ఆమె సోదరుడు రాహుల్, కుటుంబ సభ్యులు రాజస్థాన్‌లోని రణతంబోర్‌కు మంగళవారం చేరుకున్నారు. అవీవా కుటుంబ సభ్యులు కూడా వీరి వెంట వచ్చారు.

కలుషిత నీటితో ముగ్గురి మృతి

ఇండోర్: మధ్యప్రదేశ్‌లోని ఇండోర్‌లో భగీరథపుర కాలనీలో కలుషిత నీటిని తాగి ముగ్గురు మృతిచెందగా, వందమందికి పైగా ఆసుపత్రిపాలైనట్లు నగర మేయర్ పుష్యమిత్ర భార్గవ మంగళవారం మీడియాకు వెల్లడించారు. నర్మదా నది తాగునీటి పైపులైన్లలో మురుగునీరు కలిసినట్లుగా సమాచారం ఉందని, బాధ్యులపై చర్యలు తీసుకుంటామన్నారు. అయిదుగురు మృతిచెందినట్లుగా స్థానికులు చెబుతున్నారు. డిసెంబరు 25న సరఫరా చేసిన కొళాయి నీటిలో ఓ విధమైన వాసన ఉందని, ఆ నీటిని తాగి పలువురు అస్వస్థతకు గురైనట్లు పేర్కొన్నారు. డయేరియా ప్రబలినట్లు తమకు ఫిర్యాదులు రావడంతో దాదాపు 12,000 మందికి పరీక్షలు చేసినట్లు వైద్యాధికారి మాధవ్ ప్రసాద్ తెలిపారు. పరిస్థితి విషమంగా ఉన్న 111 మంది వివిధ ఆసుపత్రుల్లో చేరినట్లు వివరించారు. నీటి నమూనాలు సేకరించి పరీక్షలకు పంపామన్నారు.

చదువే అభివృద్ధికి సోపానం: రాష్ట్రపతి




రాంచీలో రాష్ట్రపతి ముర్ముతో ఝార్ఖండ్ సీఎం హేమంత్ సొరెన్, ఆయన సతీమణి కల్పన

గుమ్లా (ఝార్ఖండ్): గిరిజనుల అభివృద్ధికి చదువే సోపానమని, ప్రజలు వివిధ ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫలాలను అందుకోవడానికి విద్యావంతులు తోడ్పడాలని రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము పిలుపునిచ్చారు. గిరిజనుల సమ్మిళిత అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం అంకితమైందని తెలిపారు. ఝార్ఖండ్‌లో మూడు రోజుల పర్యటనను ముగించుకుని మంగళవారం ఆమె దిల్లీకి వెళ్లారు. అంతకుముందు గుమ్లా జిల్లాలో పలు రాష్ట్రాల గిరిజనుల సాంస్కృతిక సమ్మేళనాన్ని ఉద్దేశించి రాష్ట్రపతి ప్రసంగించారు. ఈ రోజుల్లో విద్యావంతులు నగరాలు, పట్టణాల్లో స్థిరపడి స్వగ్రామాలకు రావడానికి ఇష్టపడటం లేదని, వారంతా గ్రామాలకు వెళ్లి ప్రభుత్వ పథకాల ఫలాలను స్థానికులకు తెలియజెప్పాలని కోరారు. ప్రభుత్వం బిర్సా ముండా పేరిట ప్రారంభించిన సంక్షేమ పథకాలు గిరిజనులకే ఉద్దేశించినవి కావని, బడుగు వర్గాల వారికీ ఆ పథకాలతో లబ్ధి చేకూరుతుందని వివరించారు. ఛత్తీస్‌గఢ్‌లో నక్సలిజం అంత్య దశకు చేరుకుందని, అక్కడ 400కి పైగా గ్రామాలు నక్సలిజం నీడ నుంచి బయటపడి అభివృద్ధి పథంలో పురోగమిస్తున్నాయని తెలిపారు.

చొరబాటుదారులకు మమత దన్ను

- కేంద్రానికి భూమి ఇవ్వక కంచె వేయలేకపోతున్నాం
- మేం వచ్చాక పిట్టనైనా రానివ్వం: అమిత్‌షా
- ఉగ్రదాడుల్ని ఆపలేని షా రాజీనామా చేయాలి: మమత



కోల్‌కతా: ఎన్నికల్లో లబ్ధి పొందడానికి పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతాబెనర్జీ బంగ్లాదేశీ చొరబాట్లను ప్రోత్సహిస్తున్నారని కేంద్ర హోంమంత్రి అమిత్‌షా విమర్శించారు. దీనివల్ల గత కొన్నేళ్లలో రాష్ట్రంలో జనాభా కూర్పు ప్రమాదకర రీతిలో మారిపోతోందని చెప్పారు. పశ్చిమబెంగాల్ పర్యటనలో ఉన్న ఆయన మంగళవారం కోల్‌కతాలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. చొరబాట్లపై బెంగాల్ ప్రజల్లోనూ కలవరం ఉందని, 2026 ఎన్నికల్లో 2/3వ వంతు ఆధిక్యంతో భాజపా అధికారంలోకి వచ్చి ఈ బెడదకు అడ్డుకట్ట వేస్తుందని చెప్పారు. ఏప్రిల్‌లో ఎన్నికలు జరిగే అవకాశం ఉందని, చొరబాటుదారుల్ని తరిమికొట్టడమే ప్రధాన ఎజెండాగా నిలుస్తుందని తెలిపారు. "బెంగాల్ ప్రభుత్వం భూమిని ఇవ్వకపోవడం వల్లే భారత్-బంగ్లాదేశ్ సరిహద్దుల్లో కేంద్రం కంచె వేయలేకపోతోంది. ఇతర సరిహద్దు రాష్ట్రాల్లో లేని సమస్య ఇక్కడే ఎందుకు ఉందో మమత సమాధానమివ్వాలి. మేం అధికారంలోకి వచ్చాక చొరబాటుదారుల్ని కాదు కదా.. పక్షుల్ని కూడా రానివ్వనంత దృఢంగా దానిని నిర్మిస్తాం. చొరబాట్ల సమస్య యావద్దేశానిది. దీనివల్ల మన సంస్కృతి-సంప్రదాయాలు, ఆచార వ్యవహారాలు కనుమరుగవుతున్నాయి. మమత పాలనలో రాష్ట్రంలో హింస, అవినీతి రాజ్యమేలుతున్నాయి. ఆమె అవినీతి వల్లే 15 ఏళ్లుగా బెంగాల్ అభివృద్ధి కుంటుపడింది. భాజపాను గెలిపిస్తే బెంగాల్‌లో పరిశ్రమలు ఏర్పాటుచేసి, ఉద్యోగాలు కల్పిస్తుంది" అని హామీ ఇచ్చారు.

దుశ్శాసనుడు వచ్చారు: మమత



అమిత్ షా వ్యాఖ్యలపై మమత ఘాటుగా స్పందించారు. ఆయనను దుశ్శాసనుడితో పోల్చారు. దేశంలో ఉగ్రదాడుల్ని ఆపలేకపోయినందుకు ఆయన తప్పనిసరిగా రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. సరిహద్దులో కంచె ఏర్పాటుకు భూమి ఇవ్వడం లేదన్న వ్యాఖ్యలను తోసిపుచ్చారు. బంకురాలో ఒక సభలో ఆమె పాల్గొని అమిత్ షాపై నిప్పులు చెరిగారు. 'శకుని శిష్యుడైన దుశ్శాసనుడు సమాచారం సేకరించేందుకు బెంగాల్‌కు వచ్చారు. ఎన్నికలు రాగానే దుర్యోధన, దుశ్శాసనులిద్దరూ కనిపిస్తారు. బెంగాల్ నుంచే ఆక్రమణదారులు వస్తున్నారా? కశ్మీర్లో లేరా? పహల్గాంలో దాడులు చేసింది ఎవరు? ఎర్రకోట ఉగ్రదాడి వెనుక ఎవరున్నారు? బెంగాల్‌నే ఆడిపోసుకుంటారెందుకు?' అని ప్రశ్నించారు. కృత్రిమ మేధ (ఏఐ) సాయంతో జరుగుతున్న అతిపెద్ద కుంభకోణమే 'ఓటర్ల జాబితా ముమ్మర సవరణ' (ఎస్ఐఆర్) అని ఆరోపించారు. చట్టబద్ధమైన ఓటర్లలో ఒక్కరి పేరును జాబితా నుంచి తొలగించినా దిల్లీలోని ఈసీ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. "ఎస్ఐఆర్ పేరుతో రాష్ట్ర ప్రజలను వేధింపులకు గురిచేస్తున్నారు. దీని కారణంగా ఇప్పటికే 60 మంది మృతిచెందారు. పత్రాల పరిశీలన కోసం వృద్ధులను పిలుస్తున్నారు. ఇలాంటి వేధింపులను ప్రజలు సహించరు. పశ్చిమబెంగాల్‌లో భాజపా అధికారంలోకి రావడానికి వారు అనుమతించరు" అని ఆమె పేర్కొన్నారు.

లోయలో పడిన బస్సు



ఉత్తరాఖండ్‌లో ఏడుగురి మృతి

దేహ్రాదూన్: ఉత్తరాఖండ్‌లోని అల్మోరా జిల్లాలో బస్సు అదుపుతప్పి లోయలో పడింది. ఈ దుర్ఘటనలో ఏడుగురు మృతిచెందగా, మరో 12 మంది తీవ్రంగా గాయపడ్డారు. భికియాసైన్-వినాయక్ రోడ్డులో మంగళవారం ఉదయం ఈ ప్రమాదం చోటుచేసుకుంది. 19 మంది ప్రయాణికులతో బస్సు ద్వారహాట్ నుంచి రామ్‌నగర్‌కు వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. మృతుల్లో నలుగురు పురుషులు, ముగ్గురు మహిళలు ఉన్నారు.

అమెరికాకు వలసలను పదేళ్లు నిలిపివేయాలి

- ట్రంప్ మాజీ సలహాదారు స్టీవ్ బానన్ వ్యాఖ్య



ఇంటర్నెట్‌డెస్క్: అమెరికాకు 10 ఏళ్ల పాటు వలసలు నిలిపివేయాలని ఆ దేశ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మాజీ సలహాదారు స్టీవ్ బానన్ అభిప్రాయపడ్డారు. ఇమిగ్రేషన్ వ్యవస్థలో అవినీతి భారీగా పేరుకుపోయిందని ఆరోపించారు. శరణార్థి, క్షమాభిక్ష, ఆశ్రయం కల్పించే కార్యక్రమాలు పూర్తిగా అవినీతిమయం అయ్యాయని విమర్శించారు. ఈ విషయాలను తన వార్‌రూమ్ షోలో మాట్లాడారు. అమెరికన్ యువత స్థానంలో తక్కువ వేతనాలకు పనిచేసే విదేశీ కార్మికులను కంపెనీలు నియమించుకుంటున్నాయని, హెచ్-1బీ వీసా కార్యక్రమం ఇందుకు దోహదపడుతుందని పేర్కొన్నారు. వలసదారులపై కఠిన వైఖరిని అనుసరిస్తోన్న ట్రంప్ ప్రభుత్వం శరణార్థులకు, వలసదారులకు ఇచ్చే వర్క్ పర్మిట్‌ల కాలవ్యవధిని కుదిస్తున్నట్లు ప్రకటించిన సంగతి తెలిసిందే. అమెరికా తీసుకువస్తోన్న కొత్త విధానాలతో హెచ్-1బీ దరఖాస్తుదారులకు కష్టకాలం ఎదురవుతోంది. హెచ్-1బీ వీసా రుసుమును లక్ష డాలర్లకు యూఎస్ ప్రభుత్వం పెంచింది. ఈ నేపథ్యంలోనే ఈ కార్యక్రమాలన్నింటిని సరిదిద్దాలంటూ బానన్ వ్యాఖ్యలు చేశారు.



న్యూ ఇయర్ రేవ్ పార్టీలకు ఖరీదైన కార్లలో డ్రగ్స్ రవాణా

ఇంటర్నెట్ డెస్క్: కొత్త సంవత్సరాది వేడుకలు సమీపిస్తున్నాయి. డిసెంబరు 31న వివిధ ఫామ్‌హౌజ్‌లలో రేవ్ పార్టీల నిర్వహణకు ఎవరికీ అనుమానం రాకుండా ఖరీదైన కార్లలో హైబ్రిడ్ మాదక ద్రవ్యాలను రవాణా చేస్తున్న ముఠాను గుజరాత్ పోలీసులు పట్టుకున్నారు. అహ్మదాబాద్ శివార్లలో ఓ కారు నుంచి రూ.15 లక్షల విలువైన గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. అర్పిత్ అగర్వాల్ అనే ప్రధాన సరఫరాదారు థాయిలాండ్ నుంచి ఈ హైబ్రిడ్ గంజాయిని తీసుకువచ్చి.. అహ్మదాబాద్‌లోని పలు ప్రాంతాలకు తరలిస్తుంటాడని పోలీసులు తెలిపారు. ఈ కేసులో ముగ్గురిని అరెస్టు చేశామని.. పరారీలో ఉన్న ప్రధాన నిందితుడు అగర్వాల్ కోసం గాలింపు కొనసాగుతోందన్నారు.

యెమెన్ రేవుపై సౌదీ దాడి

- యూఏఈ ఆయుధ నౌకలే లక్ష్యం

దుబాయ్: సంక్షుభిత యెమెన్ దేశంలోని ముకుల్లా రేవుపై సౌదీ అరేబియా మంగళవారం వైమానిక దాడికి పాల్పడడంతో అరబ్బు జగతిలో మరో కల్లోలం ముప్పిరిగొంటున్న సంకేతాలు వెలువడుతున్నాయి. యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్(యూఏఈ) నుంచి యెమెన్ వేర్పాటువాదుల కోసం ఆయుధాలు సరఫరా చేస్తున్న నౌకను లక్ష్యంగా చేసుకొని ఈ దాడి చేసినట్టు సౌదీ ప్రకటించింది. ఆయుధాలతో నిండిన కొన్ని నౌకలు యూఏఈలోని ఫుజైరా రేవు నుంచి యెమెన్‌లోని ముకుల్లా రేవుకు చేరిన వెంటనే వైమానిక దాడి చేశామని సౌదీ ప్రెస్ ఏజెన్సీ విడుదల చేసిన ఒక సైనిక ప్రకటన తెలియజేసింది. యెమెన్‌లో వేర్పాటు వాదులు ఇటీవల సాధించిన పైచేయికి యూఏఈ కారణమని సౌదీ స్పష్టంచేసింది. దక్షిణ యెమెన్‌కు ప్రత్యేక దేశ స్థాయి కల్పించేందుకు పోరాటం సాగిస్తున్న సదరన్ ట్రాన్సిషనల్ కౌన్సిల్(ఎస్‌టీసీ)కు యూఏఈ మద్దతు తెలుపుతోంది. వేర్పాటువాద సంస్థ ఎస్‌టీసీని సౌదీ అరేబియా వ్యతిరేకిస్తోంది. ఆ సంస్థకు మద్దతుగా యూఏఈ తీసుకుంటున్న చర్యలు అత్యంత ప్రమాదకరమైనవని సౌదీ పేర్కొంది. సదరన్ ట్రాన్సిషనల్ కౌన్సిల్‌కు మద్దతుగా యూఏఈ నౌకలు ఆయుధాలు చేరవేశాయని ప్రకటన వివరించింది. తాజా పరిణామాలు సౌదీ అరేబియాకు, యూఏఈకీ మధ్య ఉద్రిక్తతల్ని పెంచేలా ఉన్నాయి. పశ్చిమాసియాకు సంబంధించిన అనేక ఇతర విషయాలపై కలిసికట్టుగా పనిచేస్తున్న ఈ రెండు దేశాల మధ్య ఆర్థిక, రాజకీయ విషయాల్లో విభేదాలు ఉన్నాయి.

సౌదీ సంయమనం పాటించాలి: యూఏఈ

సౌదీ సంయమనంతో, వివేకంతో వ్యవహరించాలని దాడిపై స్పందించిన యూఏఈ పేర్కొంది. యెమెన్ వేర్పాటు వాద సంస్థకు యూఏఈ ఆయుధాలు చేరవేసినట్టు సౌదీ చేసిన ఆరోపణను ఆ దేశం తోసిపుచ్చింది.



సౌదీ దాడితో యెమెన్‌లోని ముకుల్లా ఓడరేవులో అలముకున్న పొగ

బ్రిటిష్ ఇండియన్ నటి మీరాకు డేమ్‌హుడ్ అవార్డు

- మరో ఇద్దరికి కూడా సత్కారాలు



లండన్: ప్రముఖ బ్రిటిష్ ఇండియన్ నటి మీరా సియాల్ (64)ను ప్రతిష్ఠాత్మక డేమ్‌హుడ్ అవార్డు వరించింది. కొత్త సంవత్సరాది సందర్భంగా బ్రిటన్‌లో కింగ్ చార్లెస్-3 ప్రదానం చేసే అత్యున్నత పురస్కారాల్లో ఇదొకటి. ఈ మేరకు అవార్డు గ్రహీతల జాబితాను మంగళవారం లండన్‌లో విడుదల చేశారు. కమెడియన్‌గా, రచయిత్రిగా, ఫిలిం మేకర్‌గా సాహిత్యం, నాటకం, దాతృత్వ రంగాల్లో ఆమె అందించిన సేవలకుగాను ఈ అవార్డుకు ఎంపిక చేశారు. ఇంగ్లాండులో పంజాబీ దంపతులకు జన్మించిన మీరా 'గుడ్‌నెస్ గ్రేషియస్ మి', 'ది కుమార్స్ ఎట్ నం.42' కామెడీ సిరీస్‌ల ద్వారా గుర్తింపు పొందారు. ఈమె రచించిన 'అనిత అండ్ మి' పుస్తకానికి 1997లో 'మెంబర్ ఆఫ్ ది ఆర్డర్ ఆఫ్ ది బ్రిటిష్ ఎంపైర్' (ఎంబీఈ) అవార్డు వచ్చింది. మీరాతోపాటు మరో భారత సంతతి వైద్యురాలైన ప్రొఫెసర్ మీనా ఉపాధ్యాయకు కూడా ఈసారి డేమ్‌హుడ్ అవార్డు ప్రకటించారు. జన్యుశాస్త్రపరంగా అందించిన సేవలకుగాను ఆమెను ఈ అవార్డుకు ఎంపిక చేశారు. భారత్ నుంచి వచ్చి స్థిరపడిన టీఎల్‌సీ గ్రూప్ సీఈవో పావన్ పోపట్‌ను సైతం ఆఫీసర్ ఆఫ్ ది ఆర్డర్ ఆఫ్ ది బ్రిటిష్ ఎంపైర్ (ఓబీఈ) అవార్డు వరించింది. మొత్తంగా వివిధ రంగాల్లో సేవలందించిన 1,157 మందిని 2025 న్యూ ఇయర్ గౌరవ సత్కారాలకు ఎంపికచేసినట్లు డౌనింగ్ స్ట్రీట్ కార్యాలయం మంగళవారం వెల్లడించింది.

బెంగాలీలపై దాడులకు అడ్డుకట్ట వేయించండి

ప్రధానికి అధీర్ రంజన్ వినతి

దిల్లీ: దేశంలో వివిధ ప్రాంతాల్లో, ముఖ్యంగా భాజపా పాలిత రాష్ట్రాల్లో.. బెంగాలీ మాట్లాడే ప్రజలపై జరుగుతున్న దాడులకు అడ్డుకట్ట పడేలా చూడాలని కాంగ్రెస్ నాయకుడు, మాజీ ఎంపీ అధీర్ రంజన్ చౌధరి విజ్ఞప్తి చేశారు. బెంగాలీ మాట్లాడేవారందరినీ బంగ్లాదేశీయులుగా, చొరబాటుదారులుగా చూస్తున్నారని చెప్పారు. బెంగాల్లో వెనుకబడ్డ మతువా వర్గం ఎదుర్కొంటున్న ఇబ్బందుల్ని పరిష్కరించాలని కోరారు. ప్రధాని నరేంద్ర మోదీని మంగళవారం ఆయన కలిసి ఈ విషయాల్లో జోక్యం చేసుకోవాలని వినతిపత్రం అందజేశారు.

మావోయిస్టులకు పేలుడు పదార్థాల సరఫరా కేసు..

ఐదుగురిపై ఎన్ఐఏ ఛార్జిషీటు

దిల్లీ: ఛత్తీస్‌గఢ్‌లో గత సంవత్సరం పేలుడు పదార్థాలు సేకరించి వాటిని నిషిద్ధ సీపీఐ (మావోయిస్టు) సంస్థకు సరఫరా చేసిన కేసుకు సంబంధించి ఐదుగురిపై జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) ఛార్జిషీటు దాఖలు చేసింది. ఇందులో నలుగురు పరారీలో ఉన్నారు. గత జులైలో అరెస్టయిన మనీశ్ సోధీ ప్రస్తుతం పరారీలో ఉన్న సోధీ కేసా, మనిలా, మడకం కేసా, సోధీ లఖ్మాలతో కలిసి ఈ నేరానికి పాల్పడినట్లు ఎన్ఐఏ పేర్కొంది. ఈ ఐదుగురు నిందితులూ సీపీఐ (మావోయిస్టు) పీపుల్స్ లిబరేషన్ గెరిల్లా ఆర్మీ ఒకటో బెటాలియన్ సభ్యులకు సరఫరా చేసేందుకు చట్ట విరుద్ధంగా అక్రమ పేలుడు పదార్థాలు కలిగి ఉండగా గుర్తించామని అధికారిక ప్రకటన వెల్లడించింది.

వైకుంఠనాథుడి వైభోగం

తిరుమలేశుని సేవలో..



ఆలయం వద్ద కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు, రాష్ట్ర మంత్రి నిమ్మల రామానాయుడు

తిరుమల, న్యూస్‌టుడే: వైకుంఠ ఏకాదశి సందర్భంగా పలువురు ప్రముఖులు మంగళవారం తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. తెల్లవారుజామున వీఐపీ బ్రేక్ సమయంలో కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు, ఎంపీలు కలిశెట్టి అప్పలనాయుడు, వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి శ్రీవారిని దర్శించుకున్నారు. ఏపీ శాసనసభ స్పీకర్ అయ్యన్నపాత్రుడు, డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు, రాష్ట్ర మంత్రులు పయ్యావుల కేశవ్, కొండపల్లి శ్రీనివాస్, అచ్చెన్నాయుడు, కొల్లు రవీంద్ర, సత్యకుమార్ యాదవ్, నిమ్మల రామానాయుడు, సవిత, తెలంగాణ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, సినీనటులు రాజేంద్రప్రసాద్, నారా రోహిత్, శ్రీలీల, సినీ నిర్మాత బండ్ల గణేష్, భాజపా ఏపీ అధ్యక్షుడు మాధవ్, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య, పలువురు వైకాపా నేతలు, తెలంగాణ నేతలు స్వామిని దర్శించుకున్నవారిలో ఉన్నారు.

● భారత క్రికెటర్లు తిలక్‌వర్మ, సూర్యకుమార్ యాదవ్ కుటుంబ సభ్యులతో కలిసి స్వామిని దర్శించుకున్నారు. వ్యాపారవేత్త చాముండేశ్వరనాథ్ తదితరులు ఉన్నారు.



శాసనసభ స్పీకర్ అయ్యన్నపాత్రుడు, డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు



శ్రీవారి ఆలయంలో పుష్పశోభితం

తిరుమలలో వైకుంఠ ద్వార దర్శనాలు ప్రారంభం

ఈనాడు డిజిటల్, తిరుపతి; తిరుమల, న్యూస్‌టుడే: ముక్కోటి ఏకాదశిని పురస్కరించుకుని తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామివారిని భక్తులు వైకుంఠ ద్వారం ద్వారా దర్శించుకున్నారు. పది రోజుల పాటు కొనసాగే ఈ దర్శన భాగ్యం.. మంగళవారం గోవిందనామ స్మరణల మధ్య ప్రారంభమైంది. సోమవారం అర్ధరాత్రి దాటాక 12.05 గంటలకు తితిదే అధికారులు, అర్చకులు శ్రీవారి ఆలయం తెరచి, మూలమూర్తికి ధనుర్మాస కైంకర్యాలు పూర్తిచేశారు. అనంతరం వీవీఐపీలు, వీఐపీలకు వైకుంఠ ద్వారం మీదుగా దర్శనాలు ప్రారంభించారు. ఉదయం 7.20 గంటలకు ఈ-డిప్‌లో టోకెన్లు పొందిన భక్తులను సర్వదర్శనానికి అనుమతించారు.

■ ఈ పర్వదినం సందర్భంగా తిరుమాడ వీధుల్లో స్వర్ణ రథోత్సవం వైభవంగా జరిగింది. ఉదయం 9 నుంచి 10.30 గంటల వరకు శ్రీదేవి, భూదేవి సమేత శ్రీమలయప్ప స్వామివార్లకు రథరంగ డోలోత్సవాన్ని నేత్రపర్వంగా నిర్వహించారు. పెద్దసంఖ్యలో మహిళలు, భక్తులు రథాన్ని లాగారు.

అణువణువునా కనువిందుగా..

శ్రీవారి ఆలయంతో పాటు తిరుమల వ్యాప్తంగా ప్రత్యేక అలంకరణలు భక్తులను మంత్రముగ్ధులను చేస్తున్నాయి. ఆలయ మహద్వారం నుంచి ధ్వజస్తంభం వరకు, వైకుంఠ ద్వారంలో సంప్రదాయం ఉట్టిపడేలా పలురకాల పండ్లు, సువాసనలు వెదజల్లే రంగురంగుల పుష్పాలు, పత్రాలతో శోభాయమానంగా తీర్చిదిద్దారు. వైకుంఠ ప్రదక్షిణ చేసే భక్తులు దివ్యానుభూతికి లోనవుతున్నారు. తూర్పు మాడవీధిలో శ్రీరంగనాథస్వామి ఆలయ నమూనా అలంకరణ విశేషంగా ఆకట్టుకుంటోంది. తితిదే ఉద్యానవన విభాగం డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాసులు పర్యవేక్షణలో దాత సహకారంతో దీన్ని ముస్తాబు చేశారు. వైకుంఠ ద్వాదశి సందర్భంగా బుధవారం ఉదయం 4.30 నుంచి 5.30 గంటల నడుమ శ్రీసుదర్శన చక్రత్తాళ్వార్ల చక్రస్నాన మహోత్సవం శ్రీవారి పుష్కరిణిలో జరగనుంది.

ఏర్పాట్లపై భక్తుల సంతృప్తి: ఛైర్మన్ బీఆర్ నాయుడు

ప్రధాన ఆలయం, బయట క్యూలైన్లలో పరిస్థితిని తితిదే ఛైర్మన్ బీఆర్ నాయుడు, ఈవో అనిల్‌కుమార్ సింఘాల్, అదనపు ఈవో వెంకయ్యచౌదరి నిరంతరం పరిశీలించారు. మీడియాతో బీఆర్ నాయుడు మాట్లాడుతూ 'గతంలో ఎన్నడూ లేనివిధంగా ఈసారి భక్తులకు ఏ ఇబ్బందులూ తలెత్తకుండా అద్భుత ఏర్పాట్లు చేశాం. కట్టుదిట్టమైన పర్యవేక్షణ నడుమ భక్తకోటి స్వామివారి సేవలో తరిస్తున్నారు. ఏర్పాట్లపై సంతోషం వ్యక్తం చేస్తున్నారు' అని చెప్పారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడి ఆదేశాల మేరకు ఈసారి వైకుంఠ ద్వార దర్శనాల్లో సామాన్య భక్తులకు ప్రాధాన్యమిచ్చామని ఈవో సింఘాల్ తెలిపారు. వీఐపీలకు దాదాపు 4,750 టికెట్లు జారీ చేశామని చెప్పారు. కొత్తగా ప్రవేశపెట్టిన ఈ-డిప్ విధానం విజయవంతమైందని హర్షం ప్రకటించారు.



స్వామివారి దర్శనానికి వెళ్తున్న భక్తులు



ధ్వజస్తంభం, బలిపీఠానికి పుష్పాలంకరణ



శ్రీవారి ఆలయం ఎదుట కుటుంబసభ్యులతో సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ అరవింద్ కుమార్

శ్రీవారి సేవలో సుప్రీంకోర్టు న్యాయమూర్తి

తిరుమల, న్యూస్‌టుడే: వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకొని సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ అరవింద్‌కుమార్ మంగళవారం తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. తెల్లవారుజామున కుటుంబసభ్యులతో కలిసి ఆలయం వద్దకు చేరుకున్న న్యాయమూర్తికి తితిదే అధికారులు స్వాగతం పలికి, మూలమూర్తి దర్శనం చేయించారు. అనంతరం వైకుంఠద్వార దర్శనం చేసుకున్నారు. అనంతరం తితిదే అధికారులు తీర్థప్రసాదాలను అందజేశారు.





ఆలయం ఎదుట ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సి.మానవేంద్రనాథ్‌రాయ్ కుటుంబం. చిత్రంలో సినీ నిర్మాత డీవీవీ దానయ్య తదితరులు ★ జస్టిస్ కె.శ్రీనివాసరెడ్డి కుటుంబం

శ్రీవారిని దర్శించుకున్న ఏపీ హైకోర్టు న్యాయమూర్తులు

తిరుమల, న్యూస్‌టుడే: వైకుంఠ ఏకాదశి పురస్కరించుకొని ఏపీ హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ సి.మానవేంద్రనాథ్‌రాయ్, జస్టిస్ వి.సుజాత, జస్టిస్ టి.మల్లికార్జునరావు, జస్టిస్ కె.శ్రీనివాసరెడ్డి తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. మంగళవారం తెల్లవారుజామున కుటుంబసభ్యులతో కలిసి ఆలయం వద్దకు చేరుకున్న వారికి తితిదే అధికారులు స్వాగతం పలికారు. న్యాయమూర్తులు వైకుంఠ ద్వార దర్శనం చేసుకున్నారు. తితిదే అధికారులు తీర్థప్రసాదాలు అందజేశారు. వీరితోపాటు సినీ నిర్మాత డీవీవీ దానయ్య స్వామిని దర్శించుకున్నారు.



జస్టిస్ వి.సుజాత కుటుంబం



జస్టిస్ టి.మల్లికార్జునరావు కుటుంబం

పండగలా.. 'ప్రజల సేవలో ప్రభుత్వం'

తెదేపా రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు

ఈనాడు, అమరావతి: ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాల మేరకు డిసెంబరు 31, జనవరి 1 తేదీల్లో 'ప్రజల సేవలో ప్రభుత్వం' కార్యక్రమం పండగలా నిర్వహించాలని తెదేపా రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు శ్రేణులకు పిలుపునిచ్చారు. ప్రతి నాయకుడు, కార్యకర్త ప్రజల వద్దకు వెళ్లి.. ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు, సాధించిన విజయాలను వివరించాలని సూచించారు. ఈ మేరకు మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. 'కూటమి ప్రభుత్వంలో సూపర్ సిక్స్ పథకాల అమలుకు ఇప్పటి వరకు దాదాపు రూ.70 వేల కోట్లు ఖర్చుచేశాం. పింఛన్ల కోసమే 18 నెలల్లో రూ.51 వేల కోట్లు వెచ్చించాం. రూ.24 లక్షల కోట్ల పెట్టుబడులు తెచ్చి, 26 లక్షల ఉద్యోగాల కల్పనకు శ్రీకారం చుట్టాం. స్త్రీశక్తి ఉచిత బస్సు ప్రయాణం పథకానికి రూ.1,200 కోట్లు, ఇమామ్, మౌజమ్‌లకు రూ.135 కోట్లు, పాస్టర్ల గౌరవ వేతనానికి రూ.81 కోట్లు కేటాయించాం. మెగా డీఎస్సీలో 15,941 ఉపాధ్యాయ పోస్టులు భర్తీచేశాం. వైకాపా అడ్డంకులు సృష్టించినా 5,757 కానిస్టేబుల్ నియామకాలు పూర్తిచేశాం. ఖరీఫ్‌లో 34.06 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసి 5.59 లక్షల మంది రైతులకు 24 గంటల్లో రూ.8,206 కోట్లు జమ చేశాం. పోలవరం ప్రాజెక్టు ద్వారా 2027కి నీరిచ్చే లక్ష్యంతో ఇప్పటికి 88 శాతం పనులు పూర్తిచేశాం' అని పల్లా శ్రీనివాసరావు వెల్లడించారు.

మళ్లీ పెరిగిన వెండి ధర

ఈనాడు వాణిజ్య విభాగం: అంతర్జాతీయంగా ఉద్రిక్తతలు చల్లబడే సూచనలతో సోమవారం భారీగా దిగొచ్చిన వెండి ధర, మంగళవారం మళ్లీ దూసుకెళ్లింది. రష్యా, ఉక్రెయిన్ మధ్య శాంతి కుదరొచ్చనే అంచనాలు వెండి ధరను తగ్గించగా, ఏకంగా రష్యా అధ్యక్షుడి నివాసంపైకి డ్రోన్ దాడి జరగడం.. ధర పెరిగేందుకు కారణమైంది. హైదరాబాద్ బులియన్ విపణిలో సోమవారం రూ.2.28 లక్షలకు దిగి వచ్చిన కిలో వెండి ధర, మంగళవారం రాత్రి మళ్లీ రూ.2.50 లక్షలకు చేరింది. 10 గ్రాముల మేలిమి బంగారం ధర రూ.1.37 లక్షల నుంచి రూ.1.38 లక్షలకు పెరిగింది.

సంక్రాంతికి మరిన్ని ప్రత్యేక రైళ్లు

విజయవాడ(రైల్వేస్టేషన్), న్యూస్‌టుడే: సంక్రాంతి పండుగ రద్దీ దృష్ట్యా విజయవాడ మీదుగా మరిన్ని ప్రత్యేక రైళ్లు నడుపుతున్నట్లు విజయవాడ రైల్వే అధికారులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

■ రైలు నంబరు 08511 విశాఖపట్నం-చర్లపల్లి ప్రత్యేక రైలు జనవరి 10, 12, 17, 19 తేదీల్లో విశాఖపట్నంలో సాయంత్రం 5.30కి బయలుదేరి మరుసటి రోజు ఉదయం 8.15కి చర్లపల్లి చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో ఇదే రైలు 11, 13, 18, 20 తేదీల్లో చర్లపల్లిలో మధ్యాహ్నం 3.30కి బయలుదేరి మరుసటిరోజు ఉదయం 7 గంటలకు విశాఖపట్నం చేరుతుంది.

■ రైలు నంబరు 07416 అనకాపల్లి-వికారాబాద్ ప్రత్యేక రైలు జనవరి 18వ తేదీ రాత్రి 9.45కి అనకాపల్లిలో బయలుదేరి మరుసటిరోజు మధ్యాహ్నం 12.30కి వికారాబాద్ చేరుకుంటుంది.

తెలుగు మా జీవనాడి

- భాషతో మాది భావోద్వేగ ప్రయాణం
- హైదరాబాద్ ఆత్మీయ సమావేశంలో బర్మా తోబుట్టువులు

ఈనాడు, హైదరాబాద్: '150 ఏళ్ల క్రితం బ్రిటిష్ పాలనలో మా తాత ముత్తాతలు తెలుగు నేల నుంచి బర్మా(ప్రస్తుత మయన్మార్)కు వలస వెళ్లారు. అక్కడే ఉద్యోగ, వ్యాపారాలు చేస్తూ ప్రస్తుతం నాలుగో తరం నివసిస్తోంది. తరతరాలుగా అక్కడే నివసిస్తున్న మాలో తెలుగు రక్తం ప్రవహిస్తోందని గర్వంగా చెప్పగలం. అయితే కొత్తతరానికి మాతృభాషను అందించేందుకు మేం చేస్తున్న ప్రయత్నానికి తెలుగు ప్రభుత్వాల నుంచి తోడ్పాటు అందిస్తే విదేశీగడ్డపై తెలుగుజాతిని శాశ్వతంగా బతికించుకోగల్గుతాం' అని బర్మా నుంచి వచ్చిన తెలుగు అతిథులు అన్నారు. హైదరాబాద్‌లో ఇటీవల నిర్వహించిన విశ్వ సంఘ్ శిబిర్ 2025కు బర్మా నుంచి వచ్చి వంద మంది హాజరయ్యారు. వీరిలో పది మంది తెలుగువారు ఉన్నారు. మొదటిసారి ఈ నేలపై అడుగు పెట్టినవారే ఎక్కువ. ఈ సందర్భంగా తెలుగు జాతి ట్రస్ట్ ఆధ్వర్యంలో బర్మా తెలుగు తోబుట్టువులతో హైదరాబాద్ బంజారాహిల్స్‌లోని లామకాన్‌లో మంగళవారం ఆత్మీయ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు తమ అనుభవాలను పంచుకున్నారు. తెలుగు తమ జీవనాడి అని ఈ భాషతో తమది భావోద్వేగ ప్రయాణమని పేర్కొన్నారు. పూర్వీకులు అందించిన తెలుగును రాబోయే తరాలకు సజీవంగా చేర్చాలని తపన వారి మాటల్లో ధ్వనించింది. తెలుగు జాతి ట్రస్టీ అనూరాధ, బర్మాతో చాలా ఏళ్ల నుంచి వ్యాపారం చేస్తున్న అనూరాధ టింబర్స్ వ్యవస్థాపకులు సి.వి.రావు తదితరులు హాజరయ్యారు.



తెలుగు మూలాలున్న బర్మా ప్రజలతో సమావేశంలో ప్రసంగిస్తున్న ఎల్.సుబ్రమణి. చిత్రంలో వెంకటేశ్, అనూరాధ, గానలక్ష్మి, ఎల్.ప్రభావతి, ఎర్రంనాయుడు

ఆరేడేళ్ల వయసు పిల్లల్ని ఇండియాకు పంపించాం

– లండా సుబ్రమణి, తెలుగు పెద్ద

నేను అక్కడ స్థిరపడిన మూడోతరం వ్యక్తిని. తొలి తరంలో తెలుగు వెలిగినప్పటికీ మా తరం వచ్చేటప్పటికీ చిన్నచూపు మొదలైంది. ప్రస్తుతం లక్ష మంది తెలుగువారు ఉన్నారు. ఒకసారి మా నాన్న కమీజ్(చొక్కా) తీసుకురావాలని మా అబ్బాయికి చెబితే అంటే ఏంటి అని బర్మా భాషలో అడిగాడు. ఇది చూసి మా నాన్న నొచ్చుకున్నారు. తెలుగు భాష నేర్పించాలంటే పిల్లలను ఇండియాకు పంపాలని ఆ రోజు నిర్ణయించుకున్నాం. ఎవరూ తెలిసిన వాళ్లు లేరని ఆరేడు ఏళ్ల వయసున్న పిల్లల్ని విశాఖపట్నంలో హాస్టల్ ఉన్న పాఠశాలలో చేర్పించాం. తర్వాత మా పిల్లలు హైదరాబాద్‌లో చదువుతున్నారు. నేను ఇక్కడ తెల్లాపూర్‌లో ఒక ఫ్లాట్ కొనుక్కున్నా. మార్చిలో మా అబ్బాయి పెళ్లి. హిందూ సంప్రదాయ ప్రకారం అక్కడ పెళ్లి చేయడానికి ఇక్కడి నుంచి పురోహితుడిని తీసుకెళుతున్నాం.

బాధితులు పోగొట్టుకున్న సొత్తులో 80.70 శాతం రికవరీ

- ప్రాపర్టీ నేరాల ఛేదన, రికవరీల్లో ఎన్టీఆర్ కమిషనరేట్ రికార్డు
- 10వేల సీసీ కెమెరాల ఏర్పాటు వల్లే ఇది సాధ్యమైంది...
- ట్రాఫిక్ నిర్వహణ కోసం 'అస్త్రం ఏఐ'
- ఎన్టీఆర్ పోలీసు కమిషనర్ ఎస్వీ రాజశేఖరబాబు వెల్లడి

ఈనాడు, అమరావతి: 'చోరీలు, దొంగతనాలు, దోపిడీలు వంటి ప్రాపర్టీ నేరాల ఛేదన, ఆయా ఘటనల్లో బాధితులు పోగొట్టుకున్న సొత్తును నేరగాళ్ల నుంచి రికవరీ చేయడంలో ఎన్టీఆర్ పోలీసు కమిషనరేట్ రికార్డు సృష్టించింది. ఈ ఏడాదిలో ఈ నేరాలకు సంబంధించి మొత్తం 816 కేసులు నమోదు కాగా వాటిల్లో 596 (73 శాతం) ఛేదించింది. వాటిల్లో బాధితులు రూ.13.89 కోట్లు పోగొట్టుకోగా.. అందులో రూ.11.21 కోట్లు (80.70 శాతం) నేరగాళ్ల నుంచి రికవరీ చేసింది. ఇది దేశంలో ఎక్కడా సాధ్యం కాలేదు.. ఎన్టీఆర్ కమిషనరేట్ పరిధిలో చేసి చూపించాం' అని సీపీ ఎస్వీ రాజశేఖరబాబు వెల్లడించారు. కమిషనరేట్ పరిధిలో మొత్తం 10 వేల సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామని... నేరాలకు పాల్పడిన వారు కనీసం నాలుగైదు కెమెరాల్లో చిక్కుతున్నారని చెప్పారు. దీని వల్లే ఏడాది వ్యవధిలోనే అద్భుత ఫలితాలు సాధించామని చెప్పారు. ఎన్టీఆర్ కమిషనరేట్ పరిధిలో ఈ ఏడాదిలో జరిగిన నేరాల వివరాలతో కూడిన 'వార్షిక నేర గణాంక నివేదిక-2025'ను మంగళవారం ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం వచ్చాక ఎన్టీఆర్ కమిషనరేట్‌లో తీసుకొచ్చిన సాంకేతిక ఆవిష్కరణల వల్ల నేరాలు గణనీయంగా తగ్గాయని చెప్పారు. రాబోయే సంవత్సరంలో వాటిని మరింత ఉన్నతీకరిస్తామని వివరించారు. ఆయన చెప్పిన ప్రధాన అంశాలివి.

■ 'ట్రాన్స్‌ఫార్మింగ్ అర్బన్ మొబిలిటీ' పేరిట ట్రాఫిక్ రద్దీ నియంత్రణ, నిర్వహణ కోసం 'అస్త్రం యాప్' వినియోగిస్తున్నాం. దీని వల్ల నగరంలోని 83 ట్రాఫిక్ కూడళ్ల పరిధిలో గతేడాది అక్టోబరు నాటికి రోజుకు 97 కి.మీ.లుగా ఉన్న సగటు ట్రాఫిక్ కంజెషన్ పొడవును 48 కి.మీ.కు తగ్గించగలిగాం. వచ్చేఏడాది ఈ యాప్‌తో ముందస్తుగా ట్రాఫిక్‌ను అంచనా వేస్తాం. అంబులెన్సులు, ఇతర అత్యవసర వాహనాలు ట్రాఫిక్‌లో చిక్కుకోకుండా గ్రీన్ ఛానల్ ఇచ్చేందుకు 'ఈ పాథ్ ఎమర్జెన్సీ వెహికల్ ప్రయారిటీ' విధానాన్ని ప్రవేశపెడుతున్నాం.

■ 10 వేల సీసీ కెమెరాలు, 42 డ్రోన్లు, 100 ట్యాబ్‌లు సరిగ్గా పనిచేస్తున్నాయా లేదా అని తెలుసుకునేందుకు 'డిజిటల్ డివైసెస్ హెల్త్ మేనేజ్‌మెంట్ సిస్టమ్' తీసుకొస్తున్నాం. ఒకే డ్యాష్ బోర్డుపై ఈ కెమెరాల పనితీరు మొత్తం కనిపిస్తుంది. రాష్ట్రంలో ఇలాంటి ఆవిష్కరణ ఇదే తొలిసారి. జనవరి నెలలో ముఖ్యమంత్రి చంద్రబాబు చేతుల మీదుగా దీన్ని ప్రారంభింపజేస్తాం.



విలేకరులతో మాట్లాడుతున్న విజయవాడ నగర పోలీస్ కమిషనర్ ఎస్.వి.రాజశేఖర్‌బాబు, చిత్రంలో ఈస్ట్ డీసీపీ కృష్ణకాంత్ పటేల్

■ 1.30 లక్షల మంది పాత నేరగాళ్లకు సంబంధించిన ఫొటోలతో కూడిన డేటాను ఫేషియల్ రికగ్నిషన్ సిస్టమ్‌లో పొందుపరిచాం. దీనికి సంబంధించి కమిషనరేట్ పరిధిలో మొత్తం 126 కెమెరాలు ఏర్పాటు చేశాం. పాత నేరగాళ్లు ఎవరైనా ఆ కెమెరాలో కనిపిస్తే వెంటనే అప్రమత్తం చేస్తూ సందేశం వస్తుంది. భవానీ దీక్షల సమయంలో దీన్ని వినియోగించి పలువురు నేరగాళ్లను పట్టుకున్నాం.

■ సవాల్‌గా మారుతున్న డిజిటల్ అరెస్టుల నేరాల బారిన పడకుండా ముందుగానే నియంత్రించేందుకు, ప్రజలకు అవగాహన కల్పించేందుకు 'సైబర్ సురక్ష ఏఐ టూల్‌ను వినియోగిస్తున్నాం. భారీ మొత్తాల్లో డబ్బు విత్‌డ్రా చేయడానికి బ్యాంకులకు వచ్చేవారిని దీన్ని వినియోగించేలా ప్రోత్సహిస్తున్నాం.

■ ఆలయాలు, ఇతర రద్దీ ప్రాంతాల్లో తొక్కిసలాటలు జరగకుండా చూసేందుకు, సమూహ నిర్వహణ (క్రౌడ్ మేనేజ్‌మెంట్) కోసం రియల్ టైమ్ కౌంటింగ్ కెమెరాలు వినియోగిస్తున్నాం.

■ దేశంలోనే తొలిసారిగా పలు కార్యక్రమాలకు బందోబస్తును కాగితరహితంగా వేసేందుకు ఈ-డిప్లాయ్‌మెంట్ టూల్ వినియోగిస్తున్నాం.

చెంచులకు ఉచిత స్పర్శ దర్శనం



మల్లికార్జునస్వామి ఉచిత స్పర్శ దర్శనం కల్పించడంతో నృత్యం చేస్తున్న చెంచులు

శ్రీశైలం ఆలయం, న్యూస్‌టుడే: శ్రీశైల మహాక్షేత్రంలో ముక్కోటి ఏకాదశిని పురస్కరించుకొని స్థానిక చెంచు గిరిజనులకు శ్రీమల్లికార్జునస్వామి ఉచిత స్పర్శ దర్శనం కార్యక్రమానికి మంగళవారం శ్రీకారం చుట్టారు. మేకలబండ, సున్నిపెంట ప్రాంతాల నుంచి సుమారు 500 మంది చెంచు గిరిజనులు ఆలయం వద్దకు చేరుకోగా.. ట్రస్ట్ బోర్డు ఛైర్మన్ పోతుగుంట రమేశ్‌నాయుడు, ఈవో ఎం.శ్రీనివాసరావు వారికి స్వాగతం పలికారు. అనంతరం మల్లికార్జునస్వామి ఉచిత స్పర్శ దర్శనం చేయించారు. దీంతో చెంచులు నృత్యాలతో సంబరాలు చేసుకున్నారు. దేవస్థానం అన్నపూర్ణ భవన్‌లో చెంచులతో కలిసి ఛైర్మన్, ఈవో సహపంక్తి భోజనం చేశారు. ప్రతి నెలలో చివరి మంగళవారం చెంచు గిరిజనులకు ఉచిత స్పర్శ దర్శనం కల్పించనున్నట్లు వారు పేర్కొన్నారు.

సంక్రాంతి రోజుల్లో హైదరాబాద్-విజయవాడ హైవేపై ప్రత్యేక దృష్టి

- అవసరమైతే నేనే బైక్‌పై తిరుగుతూ ట్రాఫిక్‌ను పర్యవేక్షిస్తా..
- అధికారులతో తెలంగాణ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి



ఈనాడు, హైదరాబాద్: సంక్రాంతి పండుగకు టోల్‌ప్లాజాల వద్ద ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను తెలంగాణ రోడ్లు, భవనాలశాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఆదేశించారు. హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిపై ప్రధానంగా దృష్టి సారించాలన్నారు. మంగళవారం సచివాలయంలో అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించి పలు సూచనలు చేశారు. 'హైదరాబాద్-విజయవాడ హైవేపై జనవరి 8 నుంచి వాహనాల రద్దీ ఉంటుంది. సంక్రాంతికి వెళ్లే ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఇప్పటి నుంచే ముందస్తు చర్యలు చేపట్టాలి. వాహనాల రద్దీ ఎక్కువగా ఉన్నా.. ఎట్టి పరిస్థితుల్లో ట్రాఫిక్ ఆగడానికి వీల్లేదు. వాహనదారుల కోసం ప్రత్యేక కంట్రోల్ రూం ఏర్పాటు చేయాలి. వైద్య, రెవెన్యూ, పోలీసు, ఆర్అండ్‌బీ, ఎన్‌హెచ్ఏఐ అధికారులు నిరంతరం పర్యవేక్షించాలి. అవసరమైతే పండుగ సమయంలో నేనే స్వయంగా మోటార్ సైకిల్‌పై తిరుగుతూ పరిశీలిస్తాను' అని కోమటిరెడ్డి పేర్కొన్నారు.

కేంద్రమంత్రి గడ్కరీకి లేఖ..

హైదరాబాద్-విజయవాడ హైవేపై పంతంగి, కొర్లపహాడ్, చిల్లకల్లు టోల్‌గేట్ల వద్ద జనవరి 9 నుంచి 14 వరకు హైదరాబాద్-విజయవాడ మార్గంలో, జనవరి 16 నుంచి 18 వరకు విజయవాడ-హైదరాబాద్ మార్గంలో ప్రజల సౌకర్యార్థం టోల్‌ప్లాజాల వద్ద నేరుగా(టోల్‌ఫ్రీ) అనుమతించేలా చర్యలు తీసుకోవాలని కేంద్ర రోడ్డు రవాణాశాఖ మంత్రి నితిన్ గడ్కరీకి మంత్రి కోమటిరెడ్డి మంగళవారం లేఖ రాశారు.

శతమానం... సులువుగా!



ప్రపంచవ్యాప్తంగా వందేళ్లకు పైగా జీవిస్తున్నవారు ఎక్కువగా ఉన్న ఒకినావా (జపాన్), సర్దీనియా (ఇటలీ), ఇకారియా (గ్రీస్), నికోయా (కోస్టారికా)లను 'బ్లూ జోన్స్' అని పిలుస్తారు. ఇక్కడుండేవారి దృష్టి ఆరోగ్యంపై కాకుండా జీవన నాణ్యతపై ఉంటుంది.

- వీరెవరూ క్యాలరీలు లెక్కించుకొని తినరు...
- పదేపదే ఆహారపు అలవాట్లు, పద్ధతులు మార్చుకోరు.
- ఈరోజు ఏం తిందాం అని ఆలోచించకుండా... ఆయా సమయాల్లో స్థానికంగా దొరికే పదార్థాలు, సంప్రదాయ వంటకాలు తింటారు.
- వీరికి ఆహారమనేది ఆస్వాదనే తప్ప వ్యసనం కాదు. దానికి బానిస కారు
- కడుపు నిండేలోపు తిండి ఆపేస్తారు. జపాన్‌లో దాన్ని హర హచి బు అంటారు... అంటే 80% కడుపు నిండగానే సంతృప్తి చెందమన్నమాట.
- విటమిన్లు, పోషకాల కోసం సప్లిమెంట్లపై ఆధారపడరు....

ఇక్కడి ప్రజల జీవనశైలిని క్షుణ్నంగా పరిశీలించిన నిపుణులు వారి ఆరోగ్య రహస్యాలను డీకోడ్ చేశారు. వాటిలో అందరం అవలంబించదగ్గ విషయాలున్నాయి.

బలమైన బంధాలు: ఆత్మీయతలు, అనురాగాలతో కూడిన బలమైన కుటుంబ సంబంధాలు జీవితంపై మరింత ఉత్సాహాన్ని, ఉత్తేజాన్ని ఇస్తున్నాయి.

పనిలో తోడు: వయసు మీద పడిందని తిని కూర్చోవటం, పొద్దు పోవటం లేదని విచారపడటం కాకుండా కుటుంబానికి తమ వంతు సాయం చేస్తున్నారు. కూరగాయలు పండించటం, వంట చేయటం, పిల్లలను కనిపెట్టుకుని ఉండటం... ఇలా ఏదో ఒక పనిలో నిమగ్నమవుతున్నారు.

గాఢమైన నమ్మకాలు: మతపరమైనవో, తాత్వికమైనవో.. ఏవైనా గానీ జీవితంపై సానుకూల దృక్పథాన్ని పెంచే విశ్వాసాలు గాఢంగా కలిగి ఉంటున్నారు. ధార్మిక, ఆధ్యాత్మిక, తాత్విక దృక్పథాలు గలవారిలో దిగులు, నిరాశానిస్పృహలు తక్కువ. వీరిలో రోగనిరోధకశక్తి ఎక్కువగా, గుండెజబ్బులు తక్కువగా ఉంటున్నాయి.



శాకాహారం: వీరు డైటింగ్‌లు, ఉపవాసాలు చేయటం లేదు. ఐతేవీరు మాంసం ఎక్కువగా తినటం లేదు. నిత్యం కూరగాయలు, పీచు దండిగా ఉండే చిక్కుళ్లు, సోయా, బాదం, ఖర్జూరం వంటి ఎండు ఫలాలు ఎక్కువగా తింటున్నారు. మాంసాహారం పూర్తిగా మానెయ్యలేదు గానీ మితం పాటిస్తున్నారు. వారానికి ఒకట్రెండు సార్లు, విందు వినోదాల్లోనే మాంసం తింటున్నారు.

కడుపు కాస్త ఖాళీగా: ఉదయం పూట దండిగా తిని రోజు ఆరంభించటం, రాత్రిపూట తక్కువగా తినటం వీరిలో కనిపిస్తున్న మరో ప్రత్యేకత. పొట్టను మూడొంతుల ఆహారంతో నింపి, ఒక వంతు ఖాళీగా ఉంచుతున్నారు. చిన్న చిన్న ప్లేట్లలో భోజనం వడ్డించుకోవటం, నెమ్మదిగా నమిలి తినటం, కుటుంబ సభ్యులతో కలిసి కూర్చొని తినటం చేస్తున్నారు. చాలావరకూ ఇంట్లో వండుకున్న ఆహారమే తీసుకుంటున్నారు.

తిరగటం: వందేళ్ల దగ్గర పడుతున్నా ఎవరూ ఇంటికే, మంచానికి అతుక్కు పోవటం లేదు. రోజూ ఏదో ఒక వ్యాపకం పెట్టుకొని ఊళ్లో, పరిసరాల్లో తిరుగుతున్నారు. ఏ పని చేసినా ఏదో ఒక ప్రయోజనం, ఉపయోగం ఉండేలా చూసుకుంటున్నారు. వీరిలో ఎవరిలోనూ ఒత్తిడి మచ్చుకైనా కనిపించటం లేదు.

...కొత్త ఏడాదిలోకి అడుగు పెడుతున్న వేళ మనం కూడా శతాయుష్షు కోసం తీర్మానాలు చేద్దామా...

అత్యంత ఆరోగ్యవంతులు ఏం తింటారు? ఎలా ఉంటారు?

ఈ ప్రశ్నలతో ఆరోగ్యాన్ని శోధించేవారు కొందరైతే... ఆరోగ్యవంతుల దీర్ఘాయుష్షు రహస్యాన్ని ఛేదించి ఎక్కువ కాలం బతకడానికి పరిశోధనలు చేస్తున్నవారు మరికొందరు. కానీ... ప్రపంచంలో అత్యంత ఆరోగ్యవంతులైనవారిని విశ్లేషిస్తే... మూడు విషయాలు అర్థమవుతాయి.

- వీరెవరూ.... ఆరోగ్యంగా ఉండాలని ప్రత్యేకంగా ప్రయత్నించరు.
- ఆరోగ్యం అనేది ప్రత్యేకంగా టార్గెట్ పెట్టుకొని సాధించాల్సిన గమ్యమో... లక్ష్యమో కాదు. మంచి జీవనశైలికి ప్రతిబింబం అది!
- కేవలం తిండితోనే ఆరోగ్యం సమకూరదు. మంచి జీవనశైలిలో భాగమే ఆహారం కూడా!

అందుకే ఆరోగ్యవంతులు ఏమి తింటారని కాకుండా... ఎలా జీవిస్తున్నారో చూస్తే వారి జీవన రహస్యం బయటపడుతుంది.



ధ్యానోత్సాహం

నేటి ఉరుకుల పరుగుల జీవితంలో ప్రశాంతత అన్నదే కరవవుతోంది. ఇది నిత్య జీవన వ్యవహారాల్లో ఇబ్బంది కలిగించటమే కాదు.. శారీరక, మానసిక ఆరోగ్యాలనూ దెబ్బతీస్తుంది. ధ్యానం, ప్రాణాయామంతో వీటిని కాపాడుకోవచ్చు. నవోత్సాహంతో తొణికిసలాడొచ్చు.



పెద్దలకూ టీకాలు...

- **18 ఏళ్లు దాటిన వారికి..:** ఏటా ఫ్లూ టీకా వేయించుకోవాలి. ప్రతి పదేళ్లకు టెటనస్, డిఫ్తీరియా, టీడాప్; రోగ నిరోధక శక్తి తక్కువగా ఉంటే హెప్‌టైటిస్ బీ, హెపటైటిస్ ఏ
- **40 నుంచి 64 ఏళ్లు..:** షింగిల్స్, ఇన్‌ఫ్లూయెంజా ఫ్లూ టీకాలు.
- **65 ఏళ్లు దాటితే..:** నిమోకోకల్ కాంజుగేట్, షింగిల్స్, ఫ్లూ, టీడాప్ టీకాలు వేయించుకోవాలి



హాయిగా... మీతో మీరుగా!

- రోజూ పదివేల అడుగులు వేయాలి...
- కచ్చితంగా ఈ సమయానికి ఇన్ని క్యాలరీల డైట్ తీసుకోవాలి.
- బరువు తగ్గాలి... ఇన్ని రోజుల్లో ఇంత కొవ్వు తగ్గాలి.

ఇలా ఆలోచిస్తూ ఉంటే... అదే పనిగా ఆరోగ్యం అంటూ వెంటపడితే... అదో ఒత్తిడిగా మారొచ్చు...

- ఆరోగ్యవంతులైన వారు నడుస్తారు... కానీ వ్యాయామం కోసమనో... లెక్క కోసమనో కాదు.
- తింటారు.... కానీ డైట్ ప్లాన్ కోసంకాదు...
- సమయాన్ని పాటిస్తారు... కానీ హెల్త్ టిప్స్‌లో చెప్పారని కాదు.

ఇక్కడ ఒక్కసారి బుద్ధుడి అష్టాంగ మార్గాన్ని గుర్తు చేసుకుందాం... సరైన దృక్పథంతో, సరైన సంకల్పంతో, సరైన క్రియతో, సరైన ప్రయత్నంతో, సరైన బుద్ధితో...మన ఆయుష్షు కోసం, ఆరోగ్యం కోసం చేసే యజ్ఞంలా, మన కోసం మనం చేసుకునే ఉత్సవంలా చేస్తే చక్కటి ఫలితాలు సొంతమవుతాయి.

- నడకలో భాగంగా మన చుట్టూ ఉన్న ప్రకృతిని, పరిసరాలను ఆస్వాదించండి. చెట్ల మధ్యలోకి వెళ్లినప్పుడు అక్కడి పక్షుల కిలకిలలు, ఆకుల రంగులు, మట్టి వాసన అన్నిటినీ గమనిస్తూ వాకింగ్ చేస్తే వల్ల మరింత మంచి ఫలితం కనిపిస్తుంది.
- మనతో మనమే ప్రేమగా మాట్లాడుకోవడం... మనసులోని భావాలను కాగితం మీద రాయడం వంటివి మనసును తేలిక పరుస్తాయి. రోజంతా కావాల్సినంత ఉత్సాహాన్నిస్తాయి.
- వ్యాయామాన్ని పనిలా కాకుండా మంచి ప్రయత్నంగా భావించి చేయాలి. దీంతో మనసును ఉల్లాసపరిచే ఎండార్ఫిన్లు విడుదలవుతాయి. ఇవి కోపం, విచారం వంటి భావోద్వేగాలను తగ్గిస్తాయి.
- ఆటలు ఆడొచ్చు. తోటపనీ చేయొచ్చు. ధ్యానం, యోగా, ప్రాణాయామం వంటివీ మేలే. ఇవి మనసును కుదురుగా ఉంచి, అనవసర ఆలోచనలు తలెత్తకుండా చూస్తాయి.
- ఇష్టమైన పనులు చేస్తుంటే మానసిక ఆరోగ్యం మెరగవుతుంది. హాబీలు ఉన్న వాళ్లు తక్కువ ఒత్తిడికి గురవుతారు. వీరిలో ఆత్మవిశ్వాసం ఎక్కువగా ఉంటుంది. కుంగుబాటు తగ్గుతుంది.
- సేవా కార్యక్రమాల్లో పాల్గొంటే మనసుకు కొత్త ఉత్తేజం వస్తుంది. ఇతరులకు చిన్న సహాయం చేసినా, నవ్వుతూ పలకరించినా మంచి ఫలితం కనిపిస్తుంది. ఆత్మవిశ్వాసం ఇనుమడిస్తుంది.



- మద్యం, పొగ తాగటం వంటి వాటితో తాత్కాలికంగా ఆనందం కలగొచ్చుకానీ ఇవేవీ భావోద్వేగాలను తగ్గించవు. పైగా మరింత ఎక్కువ చేస్తాయి. కాబట్టి వాటి జోలికిపోవద్దు
- ఆలోచనలను, ఆందోళనలను దగ్గరి వారితో పంచుకోవాలి. మాట్లాడటం వల్ల మన దృక్కోణం, ఆయా పరిస్థితులకు సంబంధించిన భావాలు మారతాయి. ఎదుటి వ్యక్తులతో సంబంధాలూ బలపడతాయి.
- కుటుంబసభ్యులు, బంధువులు, మిత్రులతో మంచి సంబంధాలు ఏర్పరచుకోవాలి. విపత్కర పరిస్థితుల్లో ఆత్మీయులు తోడుంటే ఆ భరోసాయే వేరు.
- నిద్రలేమితో నిర్ణయాలు తీసుకోవడం, భావోద్వేగాల నియంత్రణ అదుపు తప్పుతున్నాయి. కాబట్టి కంటి నిండా నిద్రపోవాలి.



నిరాశ, నిస్పృహలకు సూర్యరశ్మి మంచి విరుగుడు. కళ్లకు ఎండ వెలుగు తాకినప్పుడు మెదడులో సెరటోనిన్ హార్మోన్ విడుదలవుతుంది. ఫలితంగా ఆనందం, సంతోషం కలగజేసే ఎండార్ఫిన్ల స్థాయులు పెరుగుతాయి. మనసు ఉల్లాస భరితమవుతుంది. ఆందోళన, ఉద్రిక్తత తగ్గి.. మానసిక ప్రశాంతత చేకూరుతుంది. ఏకాగ్రతా మెరుగవుతుంది. కాబట్టి నిరాశ చుట్టుముట్టినప్పుడు ఎండలోకి వెళ్లి 'వెలుగుల' ఉత్సాహాన్ని నింపుకోండి.

వయసుకో పరీక్ష..

అనారోగ్యకరమైన ఆహారపు అలవాట్లు, పెరుగుతున్న ఒత్తిడి, కమ్మేస్తున్న కాలుష్యం.. ఇలా పలు కారణాలతో చిన్న వయసులోనే వ్యాధులు చుట్టుముట్టేస్తున్నాయి. జీవనశైలి రుగ్మతలు పెనుముప్పుగా మారుతున్నాయి. శరీరంలో పొంచి ఉండి ప్రాణాలు తీస్తున్నాయి. ఈ నేపథ్యంలో 30 ఏళ్ల వయసు నుంచి ప్రతి ఒక్కరూ క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. ఏ వయసులో, ఏయే వైద్య పరీక్షలు చేయించుకోవాలో తెలుసుకుందామా..?

30– 45 ఏళ్లు: సీబీసీ, ఎఫ్‌బీఎస్, హెచ్‌బీఏ1సీ (షుగర్), కాలేయం, కిడ్నీ పనితీరు, థైరాయిడ్, యూరిన్, ఈసీజీ

46– 60 ఏళ్లు: సీబీసీ, ఎఫ్‌బీఎస్, హెచ్‌బీఏ1సీ (షుగర్), కాలేయం, కిడ్నీ పనితీరు, థైరాయిడ్, యూరిన్, ఈసీజీ, యూరిన్ ఫర్ మైక్రో ఆల్బుమిన్

60 ఏళ్లు దాటితే: సీబీసీ, ఎఫ్‌బీఎస్, హెచ్‌బీఏ1సీ (షుగర్), కాలేయం, కిడ్నీ పనితీరు, థైరాయిడ్, యూరిన్, ఈసీజీ, విటమిన్ డి, బీ12, ఎలక్ట్రోలైట్స్. ఎముకల సాంద్రత తెలుసుకునేందుకు బోన్ డెన్సిటీ స్కాన్

తిప్పలు లేని తిండి!


మనం తిన్న ఆహారమే
శక్తిగా మారుతుంది...
యుక్తిగా మారుతుంది...
ఆనందంగా ఉంచుతుంది...
ఆయుష్షును పెంచుతుంది.

- మన శరీరం సజావుగా పని చేయడానికి కావాల్సినవి ప్రొటీన్లు, పిండి పదార్థాలు, కొవ్వులు, విటమిన్లు, ఖనిజాలు, నీరు. మన ఆహారంలో ఇవన్నీ సరిపడా ఉండేలా చూసుకోవాలి. దీనికోసం ఆహారంలో సగం వరకు ఆకుకూరలు, పండ్లు ఉండేలా చూసుకోండి. మిగతా పావు భాగంలో బియ్యం, రాగులు, సజ్జల వంటి తృణ ధాన్యాలతో కూడిన పిండి పదార్థాలు... మరో పావు భాగంలో మాంసం, చేపలు, పాలు, పప్పులు, గుడ్ల వంటి ప్రొటీన్ పదార్థాలు ఉండేలా ప్లాన్ చేసుకోవాలి.
- మైదా వంటి శుద్ధి చేసిన పిండి పదార్థాలు, చక్కెరతో చేసిన పానీయాలతో కేలరీలు ఎక్కువవుతాయి. మితిమీరిన కొవ్వు పదార్థాలు, నూనెలతో కొలెస్ట్రాల్ పెరుగుతుంది. దీంతో బరువు పెరుగుతారు. అధిక బరువుతో వాపు ప్రక్రియ ముప్పు ఎక్కువవుతుంది. అందుకే ఆ ఆహారాన్ని వదిలేయాలి.

అధ్యయనాలు చెప్పేదీ అదే...



ఆయుష్షు పెంచడంలో జీన్స్ ప్రభావం 20– 25 శాతం ఉంటే.. జీవనశైలి ప్రభావం 75– 80 శాతం. ప్రపంచవ్యాప్తంగా 70 శాతం కంటే ఎక్కువ మరణాలకు శారీరక శ్రమ లేకపోవడం, చెడు ఆహార అలవాట్లు, ఒత్తిడి కారణాలని డబ్ల్యూహెచ్‌వో తేల్చింది. హార్వర్డ్ శాస్త్రవేత్తల అధ్యయనం ప్రకారం ఆరోగ్యకరమైన ఆహారం, వ్యాయామం, సరైన బరువు, మంచి అలవాట్లతో పురుషులు 12 ఏళ్లు, స్త్రీలు 14 ఏళ్లు ఆయుష్షు పెంచుకోవచ్చని తేలింది.



రోజూ ఓ అరగంట నడవండి. కూర్చుని చేసే పనైతే గంటకోసారి లేచి అటూఇటూ తిరగండి. వయసుకు తగ్గ వ్యాయామం చేస్తే వయసుతో సంబంధం లేకుండా ఉత్సాహంగా ఉండొచ్చు.

సిడ్నీ విశ్వవిద్యాలయం దాదాపు 50వేల మందిపై జరిపిన అధ్యయనంలో నెమ్మదిగా నడిచే వారిలో అకాల మరణం పొందే అవకాశం 20 శాతం తక్కువని.. వేగంగా నడిచేవారిలో 24 శాతం తక్కువని తేలింది.



రోజూ 7- 8 గంటల నిద్ర తప్పనిసరి. నిద్రలేమితో త్వరగా వృద్ధాప్యఛాయలు కమ్మేస్తాయి. రోజుకు 6 గంటల కంటే తక్కువ నిద్రపోతే అకాల మరణం ముప్పు 12 శాతం పెరుగుతుంది.

యూరోపియన్ హార్ట్ జర్నల్ అధ్యయనం ప్రకారం నిద్రలేమితో బాధపడేవారికి కార్టిసాల్ అనే ఒత్తిడి పెంచే హార్మోన్ పెరుగుతుంది. దీంతో గుండె జబ్బులు వచ్చే అవకాశం 24 శాతం ఎక్కువవుతుంది.



కోపం శ్రుతిమించినా.. ఒత్తిడి ఎక్కువైనా.. అనర్థాలే.. అందుకే రోజూ 10- 15 నిమిషాలు ధ్యానం చేయాలి. ఆలోచనలన్నీ పక్కనపెట్టి ప్రశాంతంగా ఉండాలి. ఆత్మీయులతో సంతోషంగా, సందడిగా గడపాలి.

ఒత్తిడి సైలెంట్ కిల్లర్ అని టెలోమేర్ పరిశోధనలు శాస్త్రీయంగా నిర్ధారించాయి. దీర్ఘకాలిక ఒత్తిడితో రక్షణ కణాలు (టెలోమేర్స్) చిన్నవై. శరీరం వేగంగా వృద్ధాప్యంలోకి జారుతుంది.



వ్యసనాలకు స్వస్తి చెప్పాలి. పొగ తాగితే ఆయుష్షు 10-12 ఏళ్లు తగ్గుతుంది. మద్యం తాగితే ప్రాణాపాయం ముప్పు పెరుగుతుంది. వయసు 40 ఏళ్లు దాటితే రక్తపోటు, మధుమేహం, కొలెస్ట్రాల్, బరువు, నడుము కొలత పెరిగే అవకాశం ఉంది. అందుకే ఎప్పటికప్పుడు అప్రమత్తం కావాలి.

జీన్స్‌కంటే జీవనశైలే ఎక్కువ ప్రభావం చూపుతుందని డబ్ల్యూహెచ్‌వో, హార్వర్డ్ విశ్వవిద్యాలయం అధ్యయనాల్లో తేలింది.



ఆకలి వేసినప్పుడే తినాలి. 70-80 శాతం మించి పొట్ట నిండనీయొద్దు. కూరగాయలు, ఆకుకూరలు, పప్పులకు ప్రాధాన్యం ఇవ్వాలి.

చక్కెర, మైదా, వేపుళ్లు, జంక్ ఫుడ్ తగ్గించాలి. ఇలా చేస్తే ఆరోగ్యం మెరుగవుతుందని, వృద్ధాప్యం నెమ్మదిస్తుందని కాలరీ (కాంప్రెహెన్సివ్ అసెస్‌మెంట్ ఆఫ్ లాంగ్ టర్మ్ ఎఫెక్ట్స్ ఆఫ్ రెడ్యూసింగ్ ఇన్‌టేక్ ఆఫ్ ఎనర్జీ) అధ్యయనంలో తేలింది.

కలిసి ఉంటే... కలదు ఆయుష్షు!

అమెరికాలోని పెన్సిల్వేనియాలో ఉన్న రోసెటో పట్టణం...అదో ప్రత్యేకమైన ప్రాంతం... ఎందుకంటే...

అక్కడ వృద్ధాప్యంతో తప్ప వ్యాధులతో ఎవరూ మరణించలేదు. విస్తృతంగా అధ్యయనం చేశాక వారి ఆరోగ్య రహస్యమేంటో తేల్చారు నిపుణులు.

రోసెటో వాసులు ఇటలీ నుంచి వలస వచ్చారు. పర్వత ప్రాంతం సమీపంలో ఆవాసం ఏర్పరచుకున్నారు. వీరి ఆరోగ్య రహస్యాన్ని గుర్తించటానికి డాక్టర్ వోల్ఫ్ సునిశితంగా అధ్యయనం చేశారు. జీవనశైలి, అలవాట్ల వంటి విషయాల్లో వీరు మిగతావారి మాదిరిగానే ఉంటున్నారు. అయినా కూడా వారికి జబ్బులేవీ ఎందుకు రావటం లేదు. దీనికి కారణం బలమైన కుటుంబ సంబంధాలే.



అక్కడ ఒకే ఇంట్లో మూడు తరాల వాళ్లు కలిసి జీవిస్తున్నారు. రోసెటోలో ఎవరూ ఒంటరివారు కాదు. ఇరుగుపొరుగుతో, స్నేహితులతో అన్యోన్యమైన సంబంధాలు కలిగి ఉంటారు. అసంతృప్తి, విచారం, ఒత్తిడి అనేవే తెలియదు. ఆధునిక ప్రపంచపు ఒత్తిళ్ల జాడ లేని సురక్షితమైన సామాజిక పరిస్థితులు అక్కడి ప్రత్యేకత. ఒకరకంగా వీరంతా తమ మధ్య సంబంధ బాంధవ్యాలతోనే పెరిగి పెద్దయ్యారు. మనిషి సంపూర్ణ ఆరోగ్యానికి, ఆయుర్దాయానికి కుటుంబ, సామాజిక సంబంధాల ప్రాధాన్యాన్ని రోసెటో జీవనం నొక్కి చెబుతోంది.

అమ్మతనానికి అంత ఆలస్యమా?

ఉద్యోగమనో, బాధ్యతలనో, ప్లానింగ్ అనో... కొంతమంది దంపతులు పిల్లలు కనడాన్ని ఆలస్యం చేస్తున్నారు. దీనివల్ల అసలు పిల్లలే పుట్టకపోవచ్చు లేదా సంతాన సాఫల్యతలో చాలా సమస్యలు ఎదురుకావచ్చు. పెళ్లి, పిల్లలు.. అన్నిటికీ పక్కాగా ప్రణాళిక.. ముందుచూపు రెండూ ఉండాలని నిపుణులు చెబుతున్నారు.



- సరైన వయసు రాకముందే...తొందరగా పెళ్లి చేయడం ఎంత తప్పో... వివాహాన్ని విపరీతంగా ఆలస్యం చేయడం కూడా అంతే ముప్పు. కెరీర్ ముఖ్యమే కానీ జీవితం ఇంకా ముఖ్యమని గ్రహించాలి. ముఖ్యంగా ఆడపిల్లలు సరైన సమయంలో సరైన నిర్ణయం తీసుకోవడం చాలా ముఖ్యం.
- మరీ చిన్న వయసులో గానీ, ఆలస్యంగా గానీ పిల్లల కోసం ప్రయత్నించడం మంచిది కాదు. యువతులు 21 ఏళ్లు దాటాకే పెళ్లి చేసుకోవాలి. అప్పటికి పునరుత్పత్తి అవయవాలు మెరుగ్గా ఉంటాయి. 18 ఏళ్లలోపు గర్భం ధరిస్తే గుర్రపువాతం, నెలలు నిండకముందే కాన్పవ్వడం వంటి సమస్యల ముప్పు ఎక్కువ. జనన మార్గం చిన్నగా ఉంటే కాన్పు కష్టం కావచ్చు, సిజేరియన్ చేయాల్సి రావొచ్చు. ఇక 37 ఏళ్ల తర్వాత గర్భం ధరించినా కష్టమే.
- తల్లి గర్భంలో ఉన్నప్పుడే ఆడ పిల్లల్లో అండాలు ఏర్పడతాయి. ఆ తర్వాత వీటి సంఖ్య పెరగదు. రజస్వల అయ్యాక రుతుక్రమం రూపంలో ప్రతినెలా అండాల సంఖ్య తగ్గుతూ వస్తుంది. వయసు మీద పడుతున్నకొద్దీ అండాల వయసూ పెరుగుతూ వస్తుంది. పురుషుల్లో కూడా 30 ఏళ్ల ముందైతే వీర్యకణాల నాణ్యత, కౌంట్ మెరుగ్గా, కదలిక చురుగ్గా ఉంటుంది. డీఎన్‌ఏ డ్యామేజ్ అత్యల్పంగా ఉంటుంది. 40ఏళ్లు దాటితే సమస్యలు మొదలవుతాయి.
- వయసు పెరిగే కొద్దీ పెల్విక్ బోన్స్ బలహీనపడి సాధారణ ప్రసవమయ్యే అవకాశాలు తగ్గిపోతాయి. ఎక్కువ రోజులు ఆసుపత్రిలో ఉండాల్సి వస్తుంది పుట్టబోయే పిల్లలకు ఎదుగుదల లోపం (డౌన్ సిండ్రోమ్) వంటివి రావచ్చు. కాబట్టి ఆడవాళ్లు 21 నుంచి 29 ఏళ్ల మధ్యలో గర్భం ధరించడం ఉత్తమం. ఈ వయసులో ఫలదీకరణ బాగుంటుంది. గర్భధారణ సమస్యలు తలెత్తే అవకాశం తక్కువ.
- ఆలస్యమైతే పిల్లల కోసం అండాశయాన్ని ఉత్తేజపరిచే మందులు వాడాల్సి వస్తుంది. అప్పుడు 'ఒవేరియన్ హైపర్ సిమ్యులేషన్ సిండ్రోమ్' ఎదురవుతుంది. అండం విడుదల కోసం ఉపయోగించే శక్తిమంతమైన హార్మోన్ల ఫలితంగా అండాశయ వాపు వస్తుంది. పొట్టలో నీరు చేరడం వంటి సమస్యలు రావచ్చు.
- గర్భధారణకు సన్నద్ధం కావటానికి ముందే దంపతులిద్దరూ డాక్టర్‌ను కలిసి సలహా (ప్రీకన్‌సెప్షన్ కౌన్సెలింగ్) తీసుకోవాలి. ఆరు వారాల ముందు నుంచే ఫోలిక్‌యాసిడ్ మాత్రలు ఆరంభించాలి. ఇవి పుట్టబోయే పిల్లల్లో నాడీ లోపాల వంటి అవకరాలు తలెత్తకుండా చూస్తాయి. బిడ్డకు బిడ్డకు మధ్య ఎడం ఉండాలి. కాన్పు తర్వాత అవయవాలు తిరిగి మామూలు స్థితికి రావటానికి 18 నెలలు పడుతుంది. కనీసం ఇంతవరకైనా గర్భం రాకుండా చూసుకోవాలి. మూడేళ్ల ఎడం ఉంటే ఇంకా మంచిది.

5-5

ఇవి తినేస్తాయి...	ఇవి బతికిస్తాయి...
ఊబకాయం.	సమతుల సేంద్రీయ ఆహారం
ఒత్తిడి ఎక్కువ కావడం	వ్యాయామం, యోగ సాధన.
అనారోగ్యకరమైన ఆహారపుటలవాట్లు	మద్యం, ధూమపానం నుంచి దూరంగా ఉండడం.
కలుషిత పరిసరాలు	నలుగురితో కలివిడిగా నవ్వుతూ గడపడం.
రసాయన ఎరువులు	సానుకూల దృక్పథం.

మంచి జీవనం అంటే...

- జిమ్‌లపై ఆధారపడకుండా శరీరానికి తగినంత కదలిక
- ఇతరులతో పోలిక లేకుండా తన పని తాను చేసుకోవటం
- చేసే పనిని ఎంజాయ్ చేయడం
- సామాజిక బంధాలు... కుటుంబ అనుబంధాలు
- నడక, ప్రార్థన, ధ్యానం, మానసిక ఒత్తిడిని నియంత్రణలో ఉంచుకోవటం.
- సరైన సమయానికి సహజ ఆహారం తీసుకోవడం.

అన్నిటికీ మించి... ప్రకృతితో సహజీవనం! అంటే అడవుల్లో, కొండల్లో, కోనల్లో విహరించడం అని కాదు. సహజంగా, ప్రకృతికి హాని చేయకుండా జీవించటం అని అర్థం!

ఇవన్నీ ఎక్కడుంటే... ఆరోగ్యం అక్కడ వచ్చి వాలుతుంది.

- ఈనాడు అమరావతి, హైదరాబాద్, సుఖీభవ డెస్క్

రాష్ట్ర చరిత్ర తిరగరాసేలా పారిశ్రామికాభివృద్ధి

- 2026లో మరిన్ని లక్ష్యాలతో ముందుకు..
- వెల్లడించిన ప్రభుత్వం



ఈనాడు, అమరావతి: 'రాష్ట్ర ప్రగతి, సంక్షేమాన్ని 2025వ సంవత్సరంలో పరుగులు పెట్టించాం. సూపర్ సిక్స్‌ను సూపర్ హిట్ చేశాం. రాష్ట్ర చరిత్రను తిరగరాసేలా పారిశ్రామికాభివృద్ధికి ముందడుగు వేశాం. 20 లక్షల ఉద్యోగాల సాధనకు పెట్టుబడుల్ని ఆకర్షించాం. 2026లోనూ ఘనమైన లక్ష్యాలను నిర్దేశించుకుని ముందుకు వెళుతున్నాం. రెవెన్యూ సమస్యలను వీలైనంత ఎక్కువ స్థాయిలో పరిష్కరించాలని, వివాదాల్లేని భూములను రైతులకు, భూ యజమానులకు అందించాలని నిర్ణయించాం. ప్రజలకు మరింతగా సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలు అందించడంతోపాటు.. సంపద సృష్టి, పారిశ్రామికాభివృద్ధి వంటి అంశాలపై దృష్టిపెట్టేలా ముందడుగు వేస్తున్నాం' అని ప్రభుత్వం మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొంది. వివరాలివి..

మూడు రీజియన్లుగా రాష్ట్రాభివృద్ధి ప్రణాళిక

భవిష్యత్ అభివృద్ధి ప్రణాళికల్లో భాగంగా విశాఖపట్నం, అమరావతి, తిరుపతి కేంద్రాలుగా 3 రీజియన్లుగా అభివృద్ధికి మాస్టర్ ప్లాన్ సిద్ధం చేశాం. కీలకమైన పూర్వోదయ పథకంలో రాష్ట్రానికి చోటు దక్కింది. రూ.50 వేల కోట్లకు పైగా వ్యయంతో అమరావతి రాజధాని నిర్మాణ పనులు వేగవంతం అయ్యాయి. అమరావతి క్వాంటమ్ వ్యాలీ దిశగా అడుగులు వేగవంతమయ్యాయి. విశాఖకు గూగుల్ ఏఐ డేటా సెంటర్, కాగ్నిజెంట్, టీసీఎస్ వంటి ఎన్నో ప్రతిష్ఠాత్మక ఐటీ కంపెనీలు తరలివచ్చాయి.

పరిశ్రమలకు రాయితీల కోసం ఎస్క్రో ఖాతాలు తెరవాలనే నిర్ణయం తీసుకున్నాం. విశాఖ సదస్సులో 610 ఒప్పందాలు. రూ.13.25 లక్షల కోట్ల పెట్టుబడులు, 16.13 లక్షల ఉద్యోగాలకు రోడ్ మ్యాప్ సిద్ధమైంది. ఇప్పటి వరకూ జరిగిన 13 ఎస్ఐపీబీ సమావేశాల్లో రూ.8.55 లక్షల కోట్ల పెట్టుబడులతో 8.23 లక్షల ఉద్యోగాలు ఇచ్చే సంస్థలకు ఆమోదం తెలిపాం.

- 100 రోజుల్లోనే హంద్రీనీవా కాలువ విస్తరణ పనులు చేపట్టి రికార్డు సృష్టించాం. చెరువులు, ప్రాజెక్టులనూ నింపి రాయలసీమకు సాగు, తాగు నీటిని అందించాం. పోలవరం పనులు పరుగులు పెట్టించాం.. ఇక్కడ ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ చెల్లింపులను వేగవంతం చేశాం.. వెలిగొండ పనులను ప్రారంభించి 2026లో పూర్తి చేయనున్నాం
- మార్కెట్ ఇంటర్వెన్షన్ ద్వారా పొగాకు, మామిడి, కోకో, ఉల్లి, ఇతర పంటలకు రూ.1,100 కోట్లకు పైగా సాయం అందించాం.
- వైకాపా సర్కారు నిర్లక్ష్యం కారణంగా దెబ్బతిన్న రహదారులకు రూ.1000 కోట్లతో మరమ్మతులు చేశాం. మరో రూ.3,000 కోట్లతో రహదారుల నిర్మాణానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చాం. పల్లె పండుగ ద్వారా గ్రామాల్లో 4,000 కి.మీ. రోడ్ల నిర్మాణాలు జరుగుతున్నాయి.
- వైకాపా ప్రభుత్వం విద్యుత్ ఛార్జీలు పెంచుతూ.. ప్రజలపై భారీ ఎత్తున ఆర్థిక భారాన్ని వేసింది. కూటమి ప్రభుత్వం తొలిసారిగా ట్రూడౌన్ అమలు చేసింది. దీంతో విద్యుత్ ఛార్జీలు కొంత మేర తగ్గాయి.
- వైకాపా ప్రభుత్వ హయాంలో క్రైమ్‌రేటు గరిష్ఠంగా ఉండేది. కూటమి ప్రభుత్వం తీసుకున్న చర్యలతో ఈ ఏడాది తగ్గింది. నేరస్థులకు శిక్షలు పడ్డాయి. గంజాయి-డ్రగ్స్ పై ఉక్కుపాదం మోపాం.

సంక్షేమం దిశగా వడివడిగా..

'తల్లికి వందనం కింద రూ.10,090 కోట్లను ఖర్చుచేశాం. 67.27 లక్షల మంది విద్యార్థులకు సాయం అందింది. స్త్రీశక్తి పథకం కింద 3.25 కోట్ల మంది మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యాన్ని కల్పించాం. దీనికి రూ.1,144 కోట్ల మేర వెచ్చించాం. దివ్యాంగులకు కూడా ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించాం. అన్నదాత సుఖీభవ పథకం కింద 46 లక్షల మంది రైతుల బ్యాంకు ఖాతాల్లో రూ.6,310 కోట్లు జమ అయ్యాయి. దీపం-2 పథకం కింద ఏడాదికి 3 ఉచిత సిలిండర్లను మహిళలకు ఉచితంగా అందించేందుకు రూ.2,684 కోట్లు ఖర్చు చేశాం. ఇప్పటికి దాదాపు 2 కోట్ల సిలిండర్ల పంపిణీ చేపట్టారు. చరిత్రలో ఎన్నడూ లేని విధంగా పింఛన్ల పంపిణీకి ఏడాదికి రూ.50 వేల కోట్లు వెచ్చించాం' అని వెల్లడించింది.

- మత్స్యకార భరోసా కింద ఏడాదికి రూ.20 వేల చొప్పున 1.25 లక్షల మందికి రూ.250 కోట్లు పంపిణీ చేశాం
- ఆటో డ్రైవర్ల సేవలో పథకం ద్వారా ఏడాదికి ఒక్కో లబ్ధిదారుకు రూ.15,000...చొప్పున 2.90 లక్షల మందికి రూ.436 కోట్లు జమ చేశాం.
- 8,427 మంది పాస్టర్లకు నెలకు రూ.5,000 చొప్పున గౌరవ వేతనం రూ.51 కోట్లు అందించాం. ఇమామ్‌లకు నెలకు రూ.10,000, మౌజమ్‌లకు రూ.5,000 చొప్పున ఏడాదికి రూ.90 కోట్లు వెచ్చించాం. పురోహితులకు నెలకు రూ.15,000 వేతనం, నాయీబ్రాహ్మణులకు నెలకు రూ.25,000 చొప్పున వేతనాలను అందించాం.
- నేతన్నల మర మగ్గాలకు నెలకు 500 యూనిట్లు, చేనేత మగ్గాలకు 200 యూనిట్ల విద్యుత్‌ను ఉచితంగా అందిస్తున్నాం.
- గీత కార్మికులకు 10 శాతం మద్యం షాపులు కేటాయించాం
- వివాదాలకు తావివ్వకుండా ఎస్సీ వర్గీకరణ
- స్వర్ణకారులకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు
- మైనారిటీ సంక్షేమానికి రూ.3,670 కోట్లు
- రాష్ట్రవ్యాప్తంగా 204 అన్న క్యాంటీన్లు ఏర్పాటు చేసి.. ఇప్పటి వరకు 4 కోట్ల మందికి భోజనాలు పెట్టాం
- ఎన్నో అడ్డంకుల్ని అధిగమించి మెగా డీఎస్సీ ద్వారా 15,491 మంది ఉపాధ్యాయులను నియమించాం
- 5,757 మంది కానిస్టేబుళ్లకు నియామక పత్రాలు అందించాం. శిక్షణ పొందే పోలీసు కానిస్టేబుళ్లకు స్టైపండ్‌ను రూ.4,500 నుంచి రూ.12,500కు పెంచాం
- అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశాలకు గ్రాట్యుటీ అమలు

వీఆర్వో నుంచి తహసీల్దారు దాకా.. 21 మందిపై క్రమశిక్షణా చర్యలు

ఆదేశించిన రెవెన్యూశాఖ

ఈనాడు, అమరావతి: ఒకే మండలంలో పనిచేసిన తహసీల్దారు, డిప్యూటీ తహసీల్దారు, ఇద్దరు ఆర్ఐలు, 14 మంది వీఆర్వోలు, సర్వేయరు, సీనియర్, జూనియర్ అసిస్టెంట్ల(మొత్తం 21 మంది)పై క్రమశిక్షణా చర్యలకు ప్రభుత్వం ఆదేశించింది. ఈ మేరకు రెవెన్యూశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సాయిప్రసాద్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. 2020 సెప్టెంబరు 2వ తేదీన విశాఖపట్నం జిల్లా (ప్రస్తుత అనకాపల్లి జిల్లా) కశింకోట మండలంలో ఏసీబీ తనిఖీలు నిర్వహించింది. ఈ సందర్భంగా ముగ్గురు ప్రైవేటు వ్యక్తులు అక్కడ పని చేస్తున్నట్లు గుర్తించారు. అప్పట్లో అక్కడ పనిచేస్తున్న తహసీల్దారు సుధాకర్ (ప్రస్తుతం పదవీవిరమణ చేశారు).. ప్రభుత్వ అనుమతి లేకుండానే ప్రైవేటు వ్యక్తిని కంప్యూటర్ ఆపరేటర్‌గా నియమించి నెలవారీ జీతం చెల్లిస్తున్నట్లు వెల్లడైంది. హాజరు రిజిస్టర్, పాస్‌పుస్తకాల పంపిణీ, మీసేవ దరఖాస్తులు నిర్వహించడంలో డీటీ, మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు విఫలమైనట్లు తేలింది. బీరువా, చేతి సంచుల్లో నగదును కూడా గుర్తించారు. పట్టాదారు పాసుపుస్తకాలను పెట్టెలో పెట్టి.. రిజిస్టర్‌లో నమోదు కూడా చేయలేదు. ఆన్‌లైన్‌లో వచ్చిన దరఖాస్తుల్ని కనీసం డౌన్‌లోడ్ కూడా చేయకుండానే గడువు ముగిసే సమయంలో తిరస్కరించారు. కుల ధ్రువీకరణ పత్రాలు, మ్యుటేషన్, పట్టాదారు పాసుపుస్తకాలకు కూడా నగదు వసూలు చేస్తున్నారు. రికార్డులు కూడా సరిగా నిర్వహించడం లేదని గుర్తించడంతో ఆధారాలతో కేసు నమోదు చేశారు.

లంచం ఇవ్వకపోతే ఇక అంతే..

వీఆర్వోలు సరైన పరిశీలన లేకుండానే మ్యుటేషన్ దరఖాస్తుల్ని తిరస్కరించినట్లు తేలింది. ఫారం-8 సృష్టించాక కూడా 226 మ్యుటేషన్ దరఖాస్తులను తిరస్కరించారు. 2020 జనవరి 1 నుంచి సెప్టెంబరు 1 వరకు పరిశీలించగా.. సబ్ డివిజన్ దరఖాస్తులు 21 వస్తే 13.. అడంగల్ దిద్దుబాటుకు 668 దరఖాస్తులు రాగా..566, ఎఫ్‌లైన్ దరఖాస్తులు 1,137 వస్తే.. 200 తిరస్కరించారు. వీఆర్వో, ఇతర రెవెన్యూ అధికారులకు డబ్బు ఇవ్వకపోతే దరఖాస్తులు తిరస్కరించినట్లు విచారణలో వెల్లడైంది.

వాహనాల జీవిత పన్నుపై మాత్రమే 10% రోడ్ సేఫ్టీ సెస్

- 18% జీవిత పన్నుంటే.. దానికి 1.8 శాతమే సెస్
- స్పష్టం చేసిన రవాణాశాఖ

ఈనాడు, అమరావతి: కొత్తగా వాహనాలకు ప్రస్తుతం వసూలు చేస్తున్న జీవిత పన్ను (లైఫ్ ట్యాక్స్)పై.. అదనంగా 10 శాతం రహదారి భద్రత సెస్ (రోడ్ సేఫ్టీ సెస్)ను ప్రభుత్వం తీసుకొచ్చిందని రవాణాశాఖ తెలిపింది. అంతే గాని జీవిత పన్నును మరో 10 శాతం పెంచినట్లు కాదని స్పష్టం చేసింది. ద్విచక్రవాహనాలు, కార్లు వంటి వ్యక్తిగత వాహనాలు కొత్తగా కొనుగోలు చేసి, రిజిస్ట్రేషన్ చేసుకునే సమయంలో వాటి ధర ఆధారంగా కనిష్ఠంగా 9 శాతం నుంచి గరిష్ఠంగా 18 శాతం వరకు జీవిత పన్ను వసూలు చేస్తున్నాం. ఆ పన్నుపై మాత్రమే 10 శాతం కొత్త సెస్ విధించినట్లు వెల్లడించింది. ఉదాహరణకు రూ.లక్ష విలువైన బైక్‌కు ప్రస్తుతం రూ.12 వేలు (12 శాతం) జీవిత పన్ను ఉండగా, ఇప్పుడు ఆ పన్నుపై అదనంగా మరో రూ.1,200 (10 శాతం) రోడ్ సేఫ్టీ సెస్‌గా వసూలు చేయనున్నట్లు తెలిపింది. అలానే జీఎస్టీ తగ్గింపు ముందు లక్ష విలువైన బైక్‌కు రూ.28 వేలు (28%) జీఎస్టీ ఉండేది, సెప్టెంబరు నుంచి అది రూ.18 వేలకు (18 శాతానికి) తగ్గిందని పేర్కొంది. అంటే ఓ కొత్త బైక్‌కు జీఎస్టీ రూపంలో రూ.10 వేలు తగ్గగా, జీవిత పన్నుపై అదనంగా విధించిన రోడ్ సేఫ్టీ సెస్ రూపంలో రూ.1,200 మాత్రమే భారం పడుతుందని తెలిపింది. కొత్తగా వసూలు చేయనున్న రోడ్ సేఫ్టీ సెస్‌ను.. పూర్తిగా రోడ్డు ప్రమాదాల నివారణకు అవసరమైన చర్యలు చేపట్టడం, రహదారుల అభివృద్ధి పనులకే వినియోగించనున్నట్లు రవాణాశాఖ పేర్కొంది.

ఇంటర్వ్యూల్లో ఇలా చేయొద్దు



ఉద్యోగం కోసం ఇంటర్వ్యూలకు వెళ్లినప్పుడు ఈ తప్పులు చేయకుండా జాగ్రత్త పడాలి. అవి.. ● ఆలస్యంగా వెళ్లడం. ● తీరువైన దుస్తులు ధరించకపోవడం. ● కళ్లలోకి సూటిగా చూడకుండా లో గొంతుకతో మాట్లాడటం. ● ఆందోళనగా కనిపించడం. ● మీ విద్యార్హతలపై కాకుండా మీ గొప్పలు చెప్పుకోవడం. ● సెల్‌ఫోన్‌ను నిశ్శబ్ద స్థితిలో ఉంచుకోకపోవడం. ● ఇంటర్వ్యూకు వెళ్లే ముందే సంస్థ గురించి పూర్తిగా తెలుసుకోకపోవడం. ● మీ మాజీ ఉద్యోగాలు లేదా యజమాని గురించి చెడుగా మాట్లాడటం. ● అనవసరపు విషయాలు చెప్పడం. – సైమన్స్, ఇన్‌ఫ్లుయెన్సర్

వైకాపా కీలక నేత విన్నపంతోనే చిన్న అప్పన్నకు సాయం

- కొనుగోళ్ల కమిటీలో నాలుగు నెలలే ఉన్నా
- కల్తీ నెయ్యి కేసులో సిట్‌కు చెప్పిన ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి

ఈనాడు – తిరుపతి; న్యూస్‌టుడే– తిరుపతి (నేర విభాగం): తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదానికి కల్తీ నెయ్యి సరఫరా కేసులో కోవూరు ఎమ్మెల్యే, తితిదే పాలకమండలి సభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డిని సిట్ అధికారులు ఇటీవల విచారించారు. నెల్లూరులో ఆమెను ప్రశ్నించినట్లు సమాచారం. 2019 సెప్టెంబరు నుంచి నాలుగు నెలపాటు ఆమె తితిదే కొనుగోళ్ల కమిటీ సభ్యురాలిగా ఉన్నారు. అప్పటి తితిదే కొనుగోళ్ల కమిటీ సభ్యులుగా ఉన్నవారిని విచారిస్తున్న క్రమంలో ఆమెను ప్రశ్నించారు. నెయ్యి కొనుగోలు టెండర్లు ఎలా పిలుస్తారు, నిబంధనలేమిటని అడిగినట్లు తెలుస్తోంది. తితిదే మాజీ అధ్యక్షుడు, వైకాపా రాజ్యసభ సభ్యుడు వైవీ సుబ్బారెడ్డి మాజీ పీఏ చిన్న అప్పన్న బ్యాంకు ఖాతాలో డబ్బులు జమ చేయడానికి కారణమేంటని ఆమెను ప్రశ్నించారు. వైకాపాలోని కీలక నేత విన్నవించడంతో తాను నెలకు రూ.50 వేలు, అనంతరం రూ.25 వేల చొప్పున కొంతకాలం ఇచ్చామని ప్రశాంతిరెడ్డి సమాధానమిచ్చారు. తాము ఎందరికో మానవతా దృక్పథంతో సాయం చేస్తుంటామని.. అందులో భాగంగానే అతనికీ డబ్బులు ఇచ్చామని తెలిపారు. చిన్న అప్పన్న ఎప్పుడూ తమ దగ్గర పనిచేయలేదని, పీఏగానూ లేరని బదులిచ్చారు. అతనికి దిల్లీలో ఉద్యోగం ఇవ్వాలని కూడా సిఫార్సు చేయలేదని స్పష్టం చేశారు. టెండర్ నిబంధనల సవరణలోనూ తనకు సంబంధం లేదని చెప్పారు.

మంత్రి పార్థసారథి సైతం..

కల్తీ నెయ్యి కేసులో ఈ నెల 23న మంత్రి పార్థసారథిని సైతం సిట్ ప్రశ్నించింది. వైకాపా హయాంలో 2019 సెప్టెంబరు నుంచి రెండేళ్లపాటు ఆయన కూడా తితిదే బోర్డు సభ్యుడిగా ఉన్నారు. అప్పట్లో ఆయన్ను కొనుగోళ్ల కమిటీలోనూ సభ్యుడిగా నియమించారు. 2020 మార్చిలో కొవిడ్ తర్వాత నుంచి తాను పెద్దగా బోర్డు వ్యవహారాల్లో జోక్యం చేసుకోలేదని, కల్తీ నెయ్యి గురించి తనకు తెలియదని పార్థసారథి చెప్పినట్లు సమాచారం. అధికారులతో అంతా మాట్లాడుకుంటూనే సమాధానం చెప్పారని తెలుస్తోంది.

ఫిర్యాదుదారే నిందితుడు కావడంతో..

మరోవైపు కల్తీ నెయ్యి కేసులో ఫిర్యాదు ఇచ్చిన మురళీకృష్ణ కూడా ఇందులో ప్రమేయం ఉందని సిట్ భావించడంతో ఆయనను నిందితుల జాబితాలో చేర్చింది. ఈ నేపథ్యంలో ఫిర్యాదు ఇచ్చిన సమయంలో తితిదే ఈవోగా ఉన్న శ్యామలరావును సాక్షిగా పేర్కొన్నారు. ఈ నేపథ్యంలోనే ఆయన్ను కూడా కొన్ని రోజుల క్రితం విచారించారు. కల్తీ గురించి అనుమానం ఎప్పుడు వచ్చింది? ఎందుకు వచ్చింది? నమూనాలను గుజరాత్‌లోని ఎన్‌డీడీబీ ల్యాబ్‌కు పంపడం వెనుక ఉన్న కారణాలేమిటి అని అడిగారు. ఆయన వద్ద ఉన్న సమాచారాన్ని అంతా ఆయన సిట్ అధికారులకు చెప్పారు.

కలవరపెడుతున్న స్క్రబ్ టైఫస్ విస్తృతి

- రాష్ట్రంలో 2 వేలకు మించి పాజిటివ్ కేసులు
- ఇప్పటికే 22కు చేరిన మరణాలు
- మూడేళ్లుగా అత్యధిక పీడితులు చిత్తూరు జిల్లాలోనే



పరీక్షలు.. పాజిటివ్ కేసులు

సంవత్సరం	పరీక్షలు	పాజిటివ్ కేసులు
2023	7,281	1,295
2024	10,150	1,613
2025	11,271	2,150

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో స్క్రబ్ టైఫస్ పాజిటివ్ కేసులు గణనీయంగా పెరిగాయి. గత రెండేళ్లలోనూ ఏటా వేయికి పైగా కేసులు వచ్చినా, అధికారికంగా మరణాలు నమోదు కాలేదు. ఈసారి ఏకంగా పాజిటివ్ కేసుల్లో మరణాల సంఖ్య 22కి చేరింది. అన్ని జిల్లాల్లోనూ కేసులు గుర్తిస్తున్నా.. గత మూడేళ్లుగా చిత్తూరు జిల్లాలోనే తీవ్రత ఎక్కువగా ఉంది. ఈ జిల్లాలో 2023లో 548 పాజిటివ్ కేసులు రాగా, 2024లో 514, ఈ ఏడాది ఇప్పటివరకు 491 వరకు నమోదయ్యాయి. అక్కడ వ్యాధి ఉద్ధృతికి మూలాలపై వైద్యారోగ్య, అనుబంధ శాఖలు దృష్టి సారించలేదన్న విమర్శలు వస్తున్నాయి. తిరుపతి జిల్లాలోనూ 2023లో 276, 2024లో 184, ఈ ఏడాది 99 కేసులు బయటపడ్డాయి. ఈ ఏడాది కేసుల తీవ్రతలో కాకినాడ (198), విశాఖపట్నం (158) జిల్లాలు రెండు, మూడు స్థానాల్లో ఉన్నాయి. స్క్రబ్ టైఫస్‌ను సకాలంలో గుర్తిస్తే సమస్య ఉండదని అవగాహన కల్పిస్తున్నప్పటికీ.. తొలుత జ్వరాలకు వాడే సాధారణ మందులు వేసుకొని, పరిస్థితి చేయిదాటాక ఆసుపత్రుల్లో చేరుతుండటంతో ప్రాణాల మీదకు వస్తోంది. పరిసరాల అపరిశుభ్రత, జాగ్రత్తలపై అవగాహన లేమి సమస్యగా మారుతున్నాయి.

అధ్యయనం దిశగా అడుగులు

శుభ్రత లేమి, తేమ ఉన్న పొదలు, వ్యవసాయ ఆధారిత ప్రాంతాల్లో తేవీటి పురుగు (చిగ్గర్ మైట్) సంచారం ఎక్కువ. ఇది కొత్తగా పుట్టుకొచ్చిన కీటకం కాదని, ఏళ్లుగా సంచరిస్తున్నదేనని నిపుణులు చెబుతున్నా.. కీటకం ప్రమాదకరంగా రూపాంతరం చెందడం వెనుక కారణాలు అంతుచిక్కడం లేదు. దేశవ్యాప్తంగా స్క్రబ్ టైఫస్ పాజిటివ్ కేసులు వస్తున్నా, ఏపీలోనే మరణాలు నమోదు కావడం కలవరపెడుతోంది. వ్యాధి పూర్వాపరాలపై లోతుగా అధ్యయనానికి, బ్యాక్టీరియాలో రకాలు గుర్తించడానికి జీనోమ్ సీక్వెన్సింగ్ పరీక్షలు నిర్వహిస్తామని రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే ప్రకటించింది. ఏటా ఏదో ఒక వ్యాధి, ప్రజారోగ్యానికి సవాలు విసిరే సమస్యలు వెలుగు చూస్తున్నందున వైద్య రంగంలో పలు విభాగాల నిపుణులను రాష్ట్ర ప్రభుత్వం సలహాదారులుగా నియమించి వారి సూచనలతో పరిస్థితిని చక్కదిద్దుతోంది. తాజాగా అంటువ్యాధుల కట్టడికి జాతీయ వైద్య సంస్థలు, కీలక రంగాల నిపుణులతో ప్రత్యేక టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటుచేసింది.

కేంద్ర నిధుల్లో 99.38% ఖర్చు

- 'పోలవరం'పై జలశక్తిశాఖ వెల్లడి

ఈనాడు, దిల్లీ: పోలవరాన్ని జాతీయ ప్రాజెక్టుగా ప్రకటించిన తర్వాత కేంద్రం ఇచ్చిన నిధుల్లో 99.38 శాతం ఖర్చుచేసినట్లు కేంద్ర జలశక్తిశాఖ వెల్లడించింది. కేంద్రం 2014 ఏప్రిల్ 1 నుంచి 2025 అక్టోబరు 31 వరకు రూ.20,658.67 కోట్లు విడుదల చేయగా, అందులో రూ.20,532.38 కోట్లు ఖర్చయినట్లు పేర్కొంది. 2025లో మంత్రిత్వశాఖ సాధించిన పురోగతిని వివరిస్తూ మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో ఈ విషయాన్ని వెల్లడించింది. 'ఈ ప్రాజెక్టు 2,467.50 మీటర్ల ఎర్త్ కం రాక్‌ఫిల్‌డ్యాం, 1,121.20 మీటర్ల పొడవైన స్పిల్‌వేతో ఉంటుంది. ఉమ్మడి తూర్పుగోదావరి, విశాఖపట్నం, పశ్చిమగోదావరి, కృష్ణా జిల్లాల్లోని 2.91 లక్షల హెక్టార్లకు సాగునీరు అందించడం దీని ప్రధాన లక్ష్యం. దీంతోపాటు మరిన్ని ప్రయోజనాలు ఉంటాయి. ఈ పనులకు కేంద్రం 100% నిధులను సమకూరుస్తోంది. భారత ప్రభుత్వం తరఫున ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రాజెక్టు పనులను చేస్తోంది. రివైజ్డ్ కాస్ట్ కమిటీ ఈ ప్రాజెక్టు వ్యయాన్ని ఈఎల్ + 45.72 మీటర్ల వరకు 2013-14 ధరల ప్రకారం రూ.29,027.95 కోట్లుగా, 2017-18 ధరల ప్రకారం రూ.47,725.74 కోట్లుగా ఆమోదించింది. దీన్ని జాతీయ ప్రాజెక్టుగా ప్రకటించిన తర్వాత 2024 జూన్ వరకు నిర్మాణ పనుల కోసం కేంద్ర ప్రభుత్వం రూ.15,605.96 కోట్లు విడుదల చేసింది. 2024 ఆగస్టు 28న జరిగిన కేంద్ర మంత్రివర్గ సమావేశంలో ఈ ప్రాజెక్టు వ్యయాన్ని ఈఎల్ +41.15 మీటర్ల వరకు నీటిని నిల్వ చేసేంత వరకు రూ.30,436.95 కోట్లుగా ఖరారు చేసింది. దాని ప్రకారం కేంద్రం ఇవ్వాల్సిన మిగిలిన గ్రాంట్లు రూ.12,157.53 కోట్ల వరకు ఉంటాయి. కేంద్ర మంత్రివర్గం ఆమోదం మేరకు జలశక్తిశాఖ మొదటిదశ పనుల కోసం 2024-25లో రెండు విడతల్లో రూ.5,052.71 కోట్లు విడుదల చేసింది. దీంతో 2014 ఏప్రిల్ 1 నుంచి 2025 అక్టోబరు 31 వరకు మొత్తం రూ.20,658.67 కోట్లు విడుదల చేసినట్లయింది. ఏపీ ప్రభుత్వం సమాచారం ప్రకారం ఈ ఏడాది అక్టోబరు 31 వరకు ఈ ప్రాజెక్టు పనుల కోసం మొత్తం రూ.20,532.38 కోట్లు ఖర్చయింది' అని కేంద్ర జలశక్తిశాఖ తెలిపింది.

కమ్మని కూతల 'గీతగాడు'!



నలుపు, బూడిద, తెలుపు రంగుల్లోని ఈ పక్షి బుచర్ బర్డ్స్ జాతికి చెందింది. అనంతపురంలోని శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం బొటానికల్ గార్డెన్‌లో కనిపించింది. స్థానికులు 'గీతగాడు' అని అంటారు. ఇది ఆహారం తినే విధానం మొదలు అన్నీ వైవిధ్యంగా ఉంటాయని జంతుశాస్త్ర విభాగ సహాయ ఆచార్యులు బాలసుబ్రహ్మణ్యం చెప్పారు. 'ఈ పక్షులు యూరప్, ఆసియా ఖండాల్లోని ఉత్తర ప్రాంతాల్లో ఎక్కువగా ఉంటాయి. అక్టోబరు, నవంబరులో కొన్ని మన ప్రాంతానికి వస్తాయి. ఏప్రిల్, మే నెలల్లో తిరిగి వెళ్లిపోతాయి. చిన్న పాములు, కప్పలు, తొండలను చంపి, వాటిని చెట్టుకు వేలాడదీసి పొడుచుకొని తింటాయి. వీటి కూత మాత్రం ఎంతో శ్రావ్యంగా ఉంటుంది. ఇతర పక్షుల అరుపులు, శబ్దాలనూ అనుకరిస్తాయి. కొమ్మల చివర గూడు కట్టుకుంటాయి' అని బాలసుబ్రహ్మణ్యం తెలిపారు.

– న్యూస్‌టుడే, ఎస్కేయూ

ఆదిత్య యూనివర్సిటీ ప్రో ఛాన్స్‌లర్ సతీష్‌రెడ్డికి ఎడ్యుకేషన్ ఛేంజ్‌మేకర్ పురస్కారం



నల్లమిల్లి సతీష్‌రెడ్డికి అవార్డు అందజేస్తున్న అతిథులు

కాకినాడ (గాంధీనగర్), న్యూస్‌టుడే: ఆదిత్య యూనివర్సిటీ ప్రో ఛాన్స్‌లర్ నల్లమిల్లి సతీష్‌రెడ్డికి ఐ.సి.టి. అకాడమీ నుంచి ప్రతిష్ఠాత్మక ఎడ్యుకేషన్ ఛేంజ్‌మేకర్ అవార్డు లభించినట్లు ఆదిత్య విద్యాసంస్థల ఛైర్మన్, ఆదిత్య యూనివర్సిటీ ఛాన్స్‌లర్ నల్లమిల్లి శేషారెడ్డి తెలిపారు. విజయవాడలో మంగళవారం నిర్వహించిన బ్రిడ్జి కాన్ఫరెన్స్‌లో సతీష్‌రెడ్డి ఈ అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉన్నత విద్యలో అసాధారణ నాయకత్వాన్ని, విద్యా నైపుణ్యాన్ని ముందుకు తీసుకెళ్లడంలో 'ఆదిత్య' అనుసరిస్తున్న విధానాలకు ఈ గుర్తింపు లభించడం సంతోషంగా ఉందన్నారు. ఈ అవార్డుతో మరింత ఉత్సాహంగా సంస్కరణలతో విద్యార్థులకు మెరుగైన విద్యను అందిస్తూ ముందుకు వెళతామన్నారు. అవార్డు గ్రహీతను ఆదిత్య విద్యా సంస్థల డైరెక్టర్ నల్లమిల్లి శ్రుతి, కార్యదర్శి నల్లమిల్లి కృష్ణదీపక్ రెడ్డి, ఆదిత్య డిగ్రీ, పీజీ కళాశాలల డైరెక్టర్ నల్లమిల్లి సుగుణ, ఆదిత్య యూనివర్సిటీ డిప్యూటీ ప్రో ఛాన్స్‌లర్ ఎం.శ్రీనివాసరెడ్డి, వైస్ ఛాన్స్‌లర్ ఎం.బి.శ్రీనివాసు, ప్రో వైస్ ఛాన్స్‌లర్లు ఎస్.రమాశ్రీ, ఆదిరెడ్డి రమేష్, రవి తంగజన్, రిజిస్ట్రార్ జి.సురేష్ తదితరులు అభినందించారు.

శివలింగాన్ని ధ్వంసం చేసిన దుండగులు

- ద్రాక్షారామ భీమేశ్వరాలయంలో ఘటన
- సాయంత్రానికి పునఃప్రతిష్ఠించిన అధికారులు



ధ్వంసమైన శివలింగాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ రాహుల్‌మీనా, అధికారులు

ద్రాక్షారామ, న్యూస్‌టుడే: ప్రసిద్ధ పంచారామ క్షేత్రమైన డా.బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని ద్రాక్షారామ భీమేశ్వరాలయంలో ఉత్తర గోపురం సప్తగోదావరి ఒడ్డున ఉన్న కపాలేశ్వర స్వామి లింగాన్ని సోమవారం అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. మంగళవారం ఉదయం స్థానికులు చూడటంతో ఈ విషయం వెలుగులోకి వచ్చింది. సమాచారం అందుకున్న కాకినాడ జిల్లా ఎస్పీ రాహుల్ మీనా హుటాహుటిన వచ్చి ధ్వంసమైన శివలింగాన్ని పరిశీలించారు. క్లూస్ టీమ్, డాగ్ స్క్వాడ్, ఫోరెన్సిక్ నిపుణులు ఆధారాలు సేకరించారు. ఘటనపై కేసు నమోదు చేశామని, 6 బృందాలతో నిందితుల కోసం అన్వేషిస్తున్నట్లు ఎస్పీ వివరించారు. శివలింగంపై సుత్తివంటి ఆయుధంతో కొట్టి ధ్వంసం చేసినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. ఘటన జరిగిన చోట సీసీ కెమెరాలు లేకపోవడంతో చుట్టు పక్కల ఉన్న కెమెరాల ఫుటేజీని విశ్లేషిస్తున్నారు. ధ్వంసమైన శివలింగం స్థానంలో మరో లింగాన్ని ప్రతిష్ఠించి, ఆలయ పండితులు ప్రత్యేక పూజలు చేశారు.

మంత్రి ఆనంతో మాట్లాడిన సీఎం

ఈనాడు, అమరావతి: ద్రాక్షారామలో దుండగులు శివలింగాన్ని ధ్వంసం చేయడంపై సీఎం చంద్రబాబు తీవ్రంగా స్పందించారు. ఈ ఘటనపై దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డితో మాట్లాడిన సీఎం.. బాధ్యులను గుర్తించి, కఠినంగా శిక్షించాలని ఆదేశించారు. తాను ఇప్పటికే కలెక్టర్, ఎస్పీతో పాటు జిల్లా మంత్రితోనూ మాట్లాడినట్లు మంత్రి ఆనం సీఎంకు వివరించారు. 'నిందితులను గుర్తించేందుకు నాలుగు ప్రత్యేక పోలీసు బృందాలను నియమించాం. ధ్వంసమైన శివలింగం స్థానంలో కొత్తది పునఃప్రతిష్ఠ చేశాం. దేవాదాయ శాఖ పర్యవేక్షణలో వేదపండితులు, అర్చకులతో శాస్త్రోక్తంగా ఈ క్రతువు నిర్వహించాం' అని ఆనం వివరించారు. దర్యాప్తు వివరాలు ఎప్పటికప్పుడు తనకు తెలియజేయాలని ముఖ్యమంత్రి సూచించారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా అన్ని ఆలయాల పరిసరాల్లో భద్రతా చర్యలు కట్టుదిట్టం చేయాలని అధికారులను మంత్రి ఆనం ఆదేశించారు.

అన్ని కోణాల్లో దర్యాప్తు చేయాలి: మాధవ్

ఈ ఘటనపై పోలీసులు అన్ని కోణాల్లో దర్యాప్తు చేయాలని భాజపా రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ డిమాండ్ చేశారు.

మీ అంతట మీరే నిర్ణయాలు తీసుకుంటారా!

- దుర్గగుడికి విద్యుత్ నిలిపేసిన అంశంపై గొట్టిపాటి ఆగ్రహం
- దేవాదాయ, విద్యుత్ శాఖ అధికారులతో సమావేశం
- బాధ్యుడిపై చర్యలకు ఆదేశం

ఈనాడు, అమరావతి: విజయవాడ దుర్గగుడికి విద్యుత్ సరఫరా నిలిపేసిన అంశంలో అధికారులపై మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనికి బాధ్యుడైన ఉద్యోగిపై చర్యలు తీసుకోవాలని డిస్కం సీఎండీని ఆదేశించారు. దేవాదాయ, విద్యుత్ శాఖ అధికారుల మధ్య సమన్వయ లోపం కారణంగా విద్యుత్ సరఫరా కొద్దిసేపు నిలిచిపోయింది. దీనికి దారితీసిన పరిస్థితిపై విద్యుత్, దేవాదాయ శాఖ అధికారులతో మంగళవారం మంత్రి సమీక్షించారు. రెండు శాఖల అధికారులపై మంత్రి అసహనాన్ని వ్యక్తం చేసినట్లు తెలిసింది. "మీరు చేసిన పని వల్ల క్యాబినెట్ సమావేశంలో నేను తలదించుకోవాల్సి వచ్చింది. విద్యుత్ శాఖ సిబ్బందిని రెచ్చగొట్టేలా దుర్గగుడి ఈవో మాట్లాడాల్సిన అవసరం ఎందుకు వచ్చింది? అలాగని భక్తులకు అసౌకర్యం కలిగించేలా విద్యుత్ సరఫరా నిలిపేయడం తప్పు కదా? సున్నితమైన అంశాల్లో చాలా జాగ్రత్తగా ఉండాలి. సమస్య ఉంటే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించుకోవాలి. జిల్లా సూపరింటెండెంట్ హోదాలో ఉన్న అధికారి ఎంత జాగ్రత్తగా ఉండాలి? మీరు చేసిన తప్పు వల్ల నేను అందరికీ సమాధానం చెప్పుకోవాల్సి వచ్చింది. రెండు శాఖల అధికారులు మీలో మీరు కొట్టుకుని కింది స్థాయిలో నిర్ణయాలు తీసుకుంటే ఎలా? మీ చర్యల వల్ల దేవాదాయశాఖ మంత్రి నాకు ఫోన్ చేస్తే.. నేను సమాధానం చెప్పుకోవాల్సి వచ్చింది. భవిష్యత్తులో ఇలాంటి పరిణామాలు ఎక్కడా తలెత్తడానికి వీల్లేదు" అని గొట్టిపాటి పేర్కొన్నట్లు సమాచారం. జనవరి 6, 7 తేదీల్లో దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, దుర్గగుడి ఈవో, ముఖ్య అధికారులతో మరోసారి సమావేశం కానున్నట్లు గొట్టిపాటి తెలిపారు.

తమిళనాడు వీసీల నియామక బిల్లును వెనక్కి పంపిన రాష్ట్రపతి

చెన్నై, న్యూస్‌టుడే: యూనివర్సిటీ వైస్‌ఛాన్స్‌లర్లను నియమించే, తొలగించే అధికారాలను రాష్ట్ర ప్రభుత్వానికి కల్పిస్తూ తమిళనాడు శాసనసభ ఆమోదించిన బిల్లును రాష్ట్రపతి తాజాగా వెనక్కి పంపారు. తమిళనాడులో ఉన్నత విద్యాశాఖ నియంత్రణలో ఉన్న 13 విశ్వవిద్యాలయాల్లో వీసీలను రాష్ట్ర ప్రభుత్వమే నియమించే, తొలగించే అధికారాలతో కూడిన బిల్లులను మద్రాసు యూనివర్సిటీకి ప్రత్యేకంగా, మిగతా 12 విశ్వవిద్యాలయాలకు ఉమ్మడిగా 2022 ఏప్రిల్ 25న శాసనసభలో ఆమోదించారు. వీటిని గవర్నర్ ఆమోదం కోసం పంపారు. ఆయన రాష్ట్రపతి పరిశీలనకు పంపించారు. ఈ నేపథ్యంలో మద్రాసు విశ్వవిద్యాలయానికి సంబంధించిన బిల్లును రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము సుమారు మూడేళ్ల తర్వాత తిప్పి పంపడం గమనార్హం.

మాజీ ఎమ్మెల్యే వెంకటేశ్వర ప్రసాద్ కన్నుమూత



పుల్లంపేట, న్యూస్‌టుడే: అన్నమయ్య జిల్లా రైల్వేకోడూరు మాజీ ఎమ్మెల్యే గుంటి వెంకటేశ్వర ప్రసాద్ (72) అనారోగ్యంతో తిరుపతిలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం కన్నుమూశారు. ఆయన 2004 ఎన్నికల్లో రైల్వేకోడూరు నుంచి కాంగ్రెస్ పార్టీ తరఫున ఎమ్మెల్యేగా గెలిచారు.

కర్మాగారాల డీసీఐ శివకుమార్ రెడ్డిపై క్రమశిక్షణ చర్యలకు ఆదేశాలు

ఈనాడు, అమరావతి: కర్మాగారాల తనిఖీల్లో నిబంధనలు సరిగా పాటించలేదని గుంటూరు ఫ్యాక్టరీల డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ శివకుమార్ రెడ్డిపై క్రమశిక్షణ చర్యలకు కార్మిక శాఖ ముఖ్య కార్యదర్శి శేషగిరిబాబు ఆదేశించారు. కర్మాగారాల తనిఖీల సమయంలో అయా కర్మాగారాల్లో నిర్దిష్ట లోపాలను పేర్కొనకుండా.. సాధారణ నివేదికలు రూపొందించారని సోమవారం జరిగిన సమీక్షలో శేషగిరి బాబు ఆగ్రహం వ్యక్తం చేశారు.

EENADU Vol: 52, Issue: 141 | Printed and Published by M Nageswara Rao on behalf of Ushodaya Publications, a division of Ushodaya Enterprises Pvt Ltd. Printed and Published at Ushodaya Publications, Eenadu Press, Survey No. 239/3, 240/3B & 240/4, Gudavalli Village, Vijayawada Rural Mandal, NTR District - 521 104, Andhra Pradesh. Editor: M Nageswara Rao. Phones: 0866-2494900, 2862111. Regd. No. VJ/013/2024-26. RNI No.32238/1978. Air Surcharge Extra. Mumbai, Kolkata, Goa. Re. 1.00, Portblair Rs. 10.00. | Founder Ramoji Rao

ఈనాడు సినిమా


వెంకటేశ్, చిరంజీవి

బాసూ...

అదిరిపోద్ది సంక్రాంతి

"ఇరగదీద్దాం సంక్రాంతి.. అదిరిపోద్ది సంక్రాంతి" అంటూ పండగ బరిలో కలిసికట్టుగా వినోదాలు పంచేందుకు సిద్ధమవుతున్నారు కథానాయకులు చిరంజీవి, వెంకటేశ్. ఇప్పుడీ ఇద్దరూ కలిసి నటించిన చిత్రం 'మన శంకర వరప్రసాద్ గారు'. అనిల్ రావిపూడి తెరకెక్కించిన ఈ సినిమాని సాహు గారపాటి, సుస్మిత కొణిదెల నిర్మించారు. నయనతార కథానాయిక. ఈ చిత్రం జనవరి 12న థియేటర్లలోకి రానుంది. ఈ నేపథ్యంలోనే చిరంజీవి, వెంకీ కలిసి సందడి చేసిన 'మెగా విక్టరీ మాస్ సాంగ్'ను మంగళవారం గుంటూరులో విడుదల చేశారు. "ఏంటి బాసూ సంగతీ.. అదిరిపోద్ది సంక్రాంతి.. ఏంటి వెంకీ సంగతీ.. ఇరగదీద్దాం సంక్రాంతి" అంటూ సాగిన ఈ మాస్ పాటకు భీమ్స్ సిసిరోలియో స్వరాలు సమకూర్చగా.. కాసర్ల శ్యామ్ సాహిత్యమందించారు. నకాశ్ అజీజ్, విశాల్ దద్లాని ఆలపించారు. విజయ్ పోలాకి నృత్యరీతులు సమకూర్చారు. ఈ సందర్భంగా దర్శకుడు అనిల్ రావిపూడి మాట్లాడుతూ.. "ఇది నాకెంతో ప్రత్యేకమైన సినిమా. చిరంజీవిని డైరెక్ట్ చేయడం.. ఆయన్ని నాకిష్టమైన వింటేజ్ ఎంటర్‌టైనర్ జానర్‌లో మీ ముందుకు తీసుకురావడం చాలా ఆనందంగా ఉంది. ఈ చిత్రం కోసం చిరు చాలా శ్రమపడి ఫిట్ లుక్‌లోకి మారారు. చీరంజీవి, వెంకటేశ్ కలిసి చేసిన ఈ పాటను అభిమానులు చాలా రోజులు గుర్తు పెట్టుకుంటారు. తప్పకుండా ఈ సంక్రాంతి అందరికీ గుర్తుండిపోతుంది" అన్నారు. ఈ కార్యక్రమంలో సాహు గారపాటి, విజయ్ పోలాకి తదితరులు పాల్గొన్నారు.

మూడోసారి


సిద్ధు జొన్నలగడ్డ

కథానాయకుడు సిద్ధు జొన్నలగడ్డ కొత్త కబురు వినిపించారు. 'ఏజెంట్ సాయి శ్రీనివాస ఆత్రేయ' చిత్రంతో అందర్నీ మెప్పించిన దర్శకుడు స్వరూప్ ఆర్ఎస్‌జేతో ఓ సినిమా చేయనున్నారు. దీన్ని సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మించనున్నారు. 'డీజే టిల్లు', 'టిల్లు స్క్వేర్' విజయాల తర్వాత ఈ బ్యానర్‌లో సిద్ధు చేస్తున్న హ్యాట్రిక్ చిత్రమిది. దీన్ని మంగళవారం అధికారికంగా ప్రకటించారు.

అందరి జీవితాల్లో ఓ భాగం.. నువ్వు నాకు నచ్చావ్


రవికిశోర్, త్రివిక్రమ్

"కొన్ని సినిమాలు డబ్బులు... మరికొన్ని సినిమాలు పేరునీ తీసుకొస్తాయి. గౌరవం మాత్రం చాలా కొన్ని సినిమాలే తీసుకొస్తాయి. 'నువ్వు నాకు నచ్చావ్' అలాంటి ఓ ప్రత్యేకమైన గౌరవాన్ని తీసుకొచ్చిన సినిమా" అన్నారు ప్రముఖ దర్శకుడు త్రివిక్రమ్. ఆయన రచయితగా, విజయ్ భాస్కర్.కె దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రమిది. వెంకటేశ్, ఆర్తి అగర్వాల్ జంటగా నటించారు. స్రవంతి రవికిశోర్ నిర్మాత. ఈ చిత్రం జనవరి 1న రీరిలీజ్‌గా మరోసారి ప్రేక్షకుల ముందుకొస్తోంది. ఈ నేపథ్యంలోనే చిత్రబృందం మంగళవారం హైదరాబాద్‌లో విలేకర్ల సమావేశం ఏర్పాటు చేసింది. ఈ సందర్భంగా నిర్మాత స్రవంతి రవికిశోర్ మాట్లాడుతూ "ఈ సినిమా విడుదలై పాతికేళ్లయింది. ఇప్పటికీ 'నువ్వు నాకు నచ్చావ్' నిర్మాత అంటే నన్ను చూసే విధానం వేరుగా ఉంటుంది. ఈ సినిమా రూపొందడానికీ, ఇంత బాగా రావడానికి ప్రధాన కారణం వెంకటేశ్. నటుడిగా ఎంతో అద్భుతంగా చేశారు. ఇతర నటులు, దర్శకుడు విజయ్‌భాస్కర్, రచయిత త్రివిక్రమ్, సంగీత దర్శకుడు కోటి... ప్రతి ఒక్కరి అత్యుత్తమ పనితీరు ఇందులో కనిపిస్తుంది. అందుకే ఈ సినిమా ఇప్పటికీ అలా నిలిచిపోయింది. ఇప్పటిలా అప్పుడు ఆస్ట్రేలియా, ఇంగ్లండ్ ఇతరత్రా దేశాల్లో విడుదల చేయలేదు. ఇప్పుడు మాత్రం అన్ని ప్రాంతాల్లోని ప్రేక్షకులూ చూసి ఆస్వాదించేలా భారీస్థాయిలో విడుదలకు సిద్ధం చేశాం" అన్నారు. త్రివిక్రమ్ మాట్లాడుతూ "ఈ సినిమా క్రెడిట్ అంతా కథానాయకుడు వెంకటేశ్‌కే దక్కుతుంది. కథ చెప్పిన వెంటనే ఆయన చేస్తానని ముందుకొచ్చారు. అందరి జీవితాల్లో భాగమైన ఓ సినిమా ఇది. కుటుంబ ప్రేక్షకులంతా కలిసి ఓటీటీ, టీవీ మాధ్యమాల్లో చూశారు. సామూహిక అనుభవం కోసం అందరూ కలిసి మరోసారి థియేటర్లలో చూస్తారు" అన్నారు.

ప్రతి తెలుగు ప్రేక్షకుడు చూడాల్సిన చిత్రం


కృష్ణ చైతన్య, రఘు కుంచె

"ఘంటసాల వ్యక్తిత్వాన్ని.. గొప్పదనాన్ని ఈతరానికి చెప్పాలన్న ఉద్దేశంతో చేసిన చిత్రమే 'ఘంటసాల ది గ్రేట్'" అన్నారు దర్శకుడు సీహెచ్ రామారావు. ఆయన ఘంటసాల జీవిత చరిత్రతో రూపొందించిన ఈ సినిమాలో కృష్ణ చైతన్య టైటిల్ పాత్ర పోషించారు. సీహెచ్ ఫణి నిర్మించారు. సుమన్ కీలక పాత్ర పోషించారు. ఈ సినిమా జనవరి 2న విడుదల కానున్న నేపథ్యంలో ఇటీవల హైదరాబాద్‌లో 'ఘంటసాల ది గ్రేట్ స్పెషల్ మ్యూజికల్ నైట్' వేడుకని నిర్వహించారు. సీహెచ్ రామారావు మాట్లాడుతూ.. "శ్రీశ్రీ ఓసారి ఘంటసాల వద్దకు వెళ్లినప్పుడు.. తను రాసిన పాటను ఆయన ఆలపించిన తీరు చూసి మంత్రముగ్ధులయ్యారు. 'నేనింత గొప్ప పాట రాశానా? అని మీరు పాడిన తర్వాతే అనిపిస్తోంది' అని శ్రీశ్రీ ప్రశంసించారు. అంత గొప్ప గాయకుడు ఘంటసాల" అన్నారు. ఈ కార్యక్రమంలో సి.కల్యాణ్, దర్శకుడు సముద్ర, శోభా రాణి, టీఎస్ రావు, కృష్ణ మోహన్, రఘు కుంచె తదితరులు పాల్గొన్నారు.

ఎన్టీఆర్‌కు ప్రైవసీ హక్కుల రక్షణ

● దిల్లీ హైకోర్టు ఆదేశం


ఎన్టీఆర్

దిల్లీ: ఎన్టీఆర్ ప్రైవసీ హక్కులకు భంగం కలగకుండా చూడాలని పలు వెబ్‌సైట్లు, ఆన్‌లైన్ వేదికలను దిల్లీ హైకోర్టు ఆదేశించింది. తదుపరి విచారణ జరిగే వరకు కృత్రిమ మేధ, డీప్ ఫేక్‌లను వినియోగించి ఆయన పేరు, చిత్రాలను, వీడియోలను, గుర్తులను వాడవద్దని 17 సంస్థలకు జస్టిస్ మన్మీత్ ప్రీతం సింగ్ అరోరా ధర్మాసనం ఈ నెల 22వ తేదీన ఆదేశాలు జారీ చేసింది. తన అనుమతి లేకుండా తన పేరు, చిత్రాలను వాణిజ్య ప్రయోజనాల కోసం వాడుతున్నారని, దీనివల్ల తన హక్కులకు భంగం కలుగుతోందని ఎన్టీఆర్ దిల్లీ హైకోర్టును ఆశ్రయించారు. దీనిపై విచారణ జరిపిన కోర్టు.. ఫిర్యాదుదారు పేరు, చిత్రాలు రక్షణ కల్పించదగ్గవని, ఆయన వ్యక్తిగత హక్కులను రక్షించాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడింది. ఈ విషయంలో ఇంజంక్షన్ ఉత్తర్వులకు ఆయన అర్హుడేనని స్పష్టం చేసింది. దేశంలో ఆయన అందరికీ సుపరిచిత నటుడని, ఎంతో గుడ్‌విల్, గౌరవం సంపాదించుకున్నారని, సెలబ్రిటీ హోదా కలిగి ఉన్నారని అభిప్రాయపడింది. ఆయన ప్రైవసీ హక్కులను రక్షించకపోతే ఆయనకు సరిదిద్దలేని నష్టం జరుగుతుందని స్పష్టం చేసింది. వెబ్‌సైట్లు, ఆన్‌లైన్ సంస్థలతోపాటు జాన్ డో లాంటి వ్యక్తులు (తాలూకా వివరాలు తెలియని వారు సెలబ్రిటీల పేర్లను దుర్వినియోగం చేసేవారు) ఆయన పేరు, చిత్రాలను వాడటాన్ని నిషేధించింది. తదుపరి విచారణను మే 19వ తేదీకి వాయిదా వేసింది. ఈ తీర్పుపై ఎన్టీఆర్ హర్షం వ్యక్తం చేస్తూ.. న్యాయ వ్యవస్థకు కృతజ్ఞతలు తెలిపారు. తన తరపున వాదనలను వినిపించిన సుప్రీం కోర్టు న్యాయవాదులు బాలజానకి శ్రీనివాసన్, అల్కా డాకర్, రాజేందర్‌ల కృషిని కొనియాడారు.


'రాజు వెడ్స్ రాంబాయి'


'మహావతార్ నరసింహ'

తెలుగు సినిమా కథ 2025లోనూ ఏమీ మారలేదు. ఎప్పట్లాగే 240కిపైగా సినిమాలు రూపొందితే... అందులో వేళ్లపై లెక్కపెట్టేటన్నే విజయాలు. భారీ అంచనాలతో వచ్చిన చాలా సినిమాలు బాక్సాఫీసు ముందు బోల్తా పడ్డాయి. విజయం అనే మాట అప్పుడప్పుడూ వినిపించినా... నిర్మాత నుంచి బయ్యర్ల వరకూ అందరికీ లాభాలు తెచ్చిపెట్టిన సినిమాలు చాలా తక్కువ. గత పదేళ్లుగా కొనసాగుతూ వస్తున్న పాన్ ఇండియా హవా ఈసారి కనిపించనేలేదు. చిన్న సినిమాలు మాత్రం పెద్ద కటౌట్‌లా మెరిశాయి. ఈ ఏడాది తెలుగు చిత్ర పరిశ్రమ సాధించిన చెప్పుకోదగ్గ పురోగతి అంటే చిన్న సినిమాలు సాధించిన ఫలితాలే.

రీల్ రివైండ్ 2025

చిన్న సినిమాలదే పెద్ద కటౌట్


'ది గర్ల్‌ఫ్రెండ్'

పాన్ ఇండియా... పాన్ ఇండియా... కొన్నేళ్లుగా గట్టిగా వినిపిస్తున్న మాట ఇది. తెలుగు చిత్ర పరిశ్రమ కూడా ఏటా భారీ హంగులతో సినిమాల్ని రూపొందిస్తూ...వాటిని ఇతర భాషల్లోనూ బలంగా మార్కెట్ చేసుకునేది. అలా ఎన్నో సినిమాలు ఘన విజయాల్ని సొంతం చేసుకొన్నాయి. అయితే ఈసారి మాత్రం తెలుగు సినిమాల పాచిక పారలేదు. మిగిలిన భాషలు సత్తా చాటినా... తెలుగు సినిమాలు అంచనాల్ని అందుకోలేకపోయాయి. 'గేమ్ ఛేంజర్' మొదలుకొని... 'అఖండ 2' వరకూ పాన్ ఇండియా కార్డ్‌తో సినిమాలు చాలానే వచ్చినా, ఒక ట్రెండు మాత్రమే ఓ మోస్తరు ఫలితాల్ని సాధించాయి. పరిమిత వ్యయంతో రూపొందిన సినిమాలది మాత్రం మరో లెక్క. చిన్న సినిమాలుగా పరిగణించే వీటితోనే చిత్రసీమకు మనుగడ. అయితే ఆ సినిమాకు విజయావకాశాలు ఒక ట్రెండు శాతమే. ఆ ఒకట్రెండు సినిమాలు సాధించే విజయాలే స్ఫూర్తిగా వందల మంది కొత్త దర్శకులు, నిర్మాతలు ఏటా చిత్ర పరిశ్రమలోకి అడుగు పెడుతుంటారు. అలా వచ్చిన కొత్తతరం ఈసారి సత్తా చాటింది. ఘన విజయాల్ని నమోదు చేసింది.

లాభాలు వీటికే...

ఈ సంవత్సరం మలయాళంలో రూ.30 కోట్లతో తెరకెక్కిన 'కొత్త లోక' రూ.300 కోట్లు వసూలు చేసింది. హిందీలో నిర్మితమై, కన్నడ సంస్థ హోంబలే ఫిల్మ్స్ నుంచి విడుదలైన 'మహావతార్ నరసింహ' రూ.40 కోట్ల వ్యయంతో తెరకెక్కగా, రూ.325 కోట్లు సాధించింది. కథలో బలం ఉంటే చిన్న సినిమాలకు ఆకాశమే హద్దు అని చాటిన సినిమాలివి. తెలుగులోనూ అలా భారీ విజయాల్ని నమోదు చేశాయి కొన్ని సినిమాలు. ఈటీవీ విన్ పతాకంపై రూపొందిన 'లిటిల్‌హార్ట్స్' రూ.2 కోట్లతో రూపొంది రూ.40కోట్లకుపైగా వసూళ్లు సాధించింది. సాయిమార్తాండ్ దర్శకత్వంలో మౌళి తనూజ్, శివానీ నాగారం జంటగా రూపొందిన చిత్రమిది. ఆదిత్య హాసన్ నిర్మాత. కథానాయకుడు నాని సొంత నిర్మాణ సంస్థ వాల్‌పోస్టర్ సినిమాపై రూపొందిన 'కోర్ట్' సినిమా రూ.8 కోట్లకంటే తక్కువ వ్యయంతోనే తెరకెక్కి రూ.50 కోట్లకుపైగా వసూలు చేసింది. ఈ చిత్రంతో రామ్ జగదీశ్ అనే ఓ కొత్త దర్శకుడు పరిచయం కాగా, ప్రియదర్శి ముఖ్యపాత్రని పోషించారు. హర్ష్ రోషన్ - శ్రీదేవి జోడీగా నటించారు. ఈటీవీ విన్ నుంచే వచ్చిన 'రాజు వెడ్స్ రాంబాయి' కూడా ఘన విజయాన్ని సొంతం చేసుకుంది. ఈ ఏడాది 'కోర్ట్' సినిమాతో మొదలైన చిన్న సినిమాల జోరు క్రిస్మస్ సీజన్ వరకూ కొనసాగింది. 'మ్యాడ్ స్క్వేర్', 'శుభం', 'ది గ్రేట్ ప్రి వెడ్డింగ్ షో' విజయాల్ని సొంతం చేసుకున్నాయి. ఏడాది చివర్లో విడుదలైన 'శంబాల', 'దండోరా', 'ఈషా', 'ఛాంపియన్' చిత్రాలూ బలమైన కంటెంట్‌తో ఆకట్టుకుంటున్నాయి. ఆది సాయికుమార్ 'శంబాల'తో మరోసారి ఫామ్‌లోకి వచ్చినట్టైంది. రోషన్ 'ఛాంపియన్'తో మెరిశాడు. మధ్యస్థ బడ్జెట్ సినిమాలతో ప్రయాణం చేస్తున్న కథానాయకుడు శ్రీవిష్ణు 'సింగిల్'తోనూ, కిరణ్ అబ్బవరం 'కె - ర్యాంప్' సినిమాతోనూ విజయాల్ని నమోదు చేశారు. బెల్లంకొండ సాయిశ్రీనివాస్ 'కిష్కింధపురి'తో అలరించారు. రష్మిక ప్రధాన పాత్రధారిగా తెరకెక్కిన 'ది గర్ల్‌ఫ్రెండ్' సినిమా విజయాన్ని సొంతం చేసుకుంది.


'లిటిల్‌హార్ట్స్'


'కోర్ట్'


'కె - ర్యాంప్'


'మ్యాడ్ స్క్వేర్'


'కొత్త లోక'

మంచి ప్రయత్నాలే...

విడుదలవుతున్న సమయం మొదలుకొని... ప్రచారం సాగే తీరు వరకూ ఒక సినిమా విజయానికి చాలా విషయాలు కలిసి రావల్సి ఉంటుంది. ఏ ఒక్కటి అనుకూలంగా లేకపోయినా ఆ ప్రభావం సినిమా ఫలితాలపై పడుతుంటుంది. అలా కొన్ని మంచి సినిమాలే అనిపించుకున్నా రకరకాల కారణాలతో ఆశించిన ఫలితాల్ని సొంతం చేసుకోలేకపోయాయి. అందులో రామ్ పోతినేని కథానాయకుడిగా మహేశ్‌బాబు.పి దర్శకత్వంలో రూపొందిన 'ఆంధ్ర కింగ్ తాలూకా' ఒకటి. పలువురు స్టార్లు నటించిన మంచు విష్ణు 'కన్నప్ప' చిత్రం మంచి ప్రారంభ వసూళ్లు అందుకుంది. సిద్ధు జొన్నలగడ్డ కథానాయకుడిగా, నీరజ కోన దర్శకత్వంలో రూపొందిన 'తెలుసు కదా', నారా రోహిత్ నటించిన 'సుందరకాండ' మంచి ప్రయత్నాలు అనిపించుకున్నాయి కానీ వసూళ్లు రాలేదు. చిన్న సినిమాల్లో 'పాంచ్ మినార్', 'ప్రేమంటే', 'గుర్రం పాపిరెడ్డి' సినిమాలూ మోస్తరు వినోదాన్ని పంచాయి. 'పరదా', 'సారంగపాణి జాతకం', 'కన్యాకుమారి', 'అనగనగా', '8 వసంతాలు' చిత్రాలు ఓటీటీలో ఆదరణని సొంతం చేసుకుంటున్నాయి.

అనువాదాలకీ వసూళ్లు

తెలుగులోకి ప్రతీ ఏడాది వందల సంఖ్యలో అనువాద చిత్రాలూ వస్తుంటాయి. బాగున్న సినిమాలు స్ట్రెయిట్ చిత్రాలకి దీటుగా వసూళ్లని సొంతం చేసుకొంటుంటాయి. ఈసారి యానిమేషన్ చిత్రం 'మహావతార్ నరసింహ' తోపాటు, రిషబ్‌శెట్టి కథానాయకుడిగా నటిస్తూ, దర్శకత్వం వహించిన 'కాంతార:చాప్టర్ 1', విక్కీ కౌశల్ 'ఛావా', రజనీకాంత్, నాగార్జున తదితరులు నటించిన 'కూలీ', ప్రదీప్ రంగనాథన్, మమిత బైజుల 'డ్యూడ్', ఎన్టీఆర్, హృతిక్‌రోషన్ కలిసి నటించిన 'వార్ 2' చిత్రాలు తెలుగులో మంచి వసూళ్లని సొంతం చేసుకొన్నాయి. దుల్కర్ సల్మాన్, రానా దగ్గుబాటి కలిసి చేసిన 'కాంత' విమర్శకుల్ని మెప్పించింది. కన్నడ నుంచే వచ్చిన 'సు ఫ్రమ్ సో' పర్వాలేదనిపించింది. 'అవతార్ 3' చిత్రంపై మొదట భారీ అంచనాలున్నా, పెద్దగా ప్రభావం చూపించలేదు.

రూ.వందల కోట్లు వచ్చాయి కానీ...

ఈసారి కూడా తారలు చేసిన సినిమాలకు ప్రారంభ వసూళ్లు అదిరిపోయాయి. అయితే కథల్లో సత్తా లేకపోవడంతో నిలదొక్కుకోలేకపోయాయి. ఆయా సినిమాలు భారీ నిర్మాణ వ్యయంతో రూపొందడంతో పెట్టుబడికీ... వచ్చిన వసూళ్లకీ పొంతన లేక, నష్టాల్ని మూటగట్టుకున్నాయి. మరోవైపు ప్రభాస్, చిరంజీవి, మహేశ్‌బాబు, అల్లు అర్జున్... తదితర అగ్ర తారలు ఈసారి తెరపై కనిపించనేలేదు. దాంతో పాన్ ఇండియా మార్కెట్‌పై మన ప్రభావం చాలా తక్కువగా కనిపించింది. తెలుగులో ఈసారి ఎక్కువ లాభాల్ని తెచ్చిపెట్టిన సినిమా అంటే వెంకటేశ్ కథానాయకుడిగా నటించిన... 'సంక్రాంతికి వస్తున్నాం'. అనిల్ రావిపూడి దర్శకత్వంలో తెరకెక్కిన ఆ చిత్రం రూ.300 కోట్లపైగా వసూళ్లు సాధించింది. ఆ తర్వాత పవన్‌కల్యాణ్ 'ఓజీ' కూడా సత్తా చాటింది. సుజీత్ దర్శకత్వంలో గ్యాంగ్‌స్టర్ డ్రామాగా రూపొందిన ఈ చిత్రం కూడా రూ.300 కోట్లు మార్క్‌ని అందుకుంది. తేజ సజ్జా కథానాయకుడిగా... కార్తీక్ ఘట్టమనేని దర్శకత్వంలో రూపొందిన 'మిరాయ్' పాన్ ఇండియా స్థాయిలో విడుదలై రూ.150 కోట్లు వసూళ్లతో విజయాన్ని సొంతం చేసుకుంది. బాలకృష్ణ కథానాయకుడిగా బాబీ దర్శకత్వంలో రూపొందిన 'డాకు మహారాజ్', నాని కథానాయకుడిగా... శైలేష్ కొలను దర్శకత్వంలో తెరకెక్కిన 'హిట్: ది థర్డ్ కేస్', నాగచైతన్య కథానాయకుడిగా చందు మొండేటి దర్శకత్వంలో రూపొందిన 'తండేల్', శేఖర్ కమ్ముల దర్శకత్వంలో ధనుష్, నాగార్జున ప్రధాన పాత్రధారులుగా తెరకెక్కిన 'కుబేర', పవన్‌కల్యాణ్ కథానాయకుడిగా నటించిన 'హరి హర వీర మల్లు' రూ.వంద కోట్లకుపైగా వసూళ్లు సాధించాయి. బాలకృష్ణ కథానాయకుడిగా బోయపాటి శ్రీను దర్శకత్వంలో 'అఖండ 2: తాండవం' కూడా ఆ మార్క్ వసూళ్లని దాటుకుని, ఇంకా థియేటర్లలో ప్రదర్శితమవుతోంది. వీటిలో చాలా సినిమాలు సాధించిన వసూళ్లు ఘనంగానే కనిపించినప్పటికీ, నిర్మాణానికీ ఆ స్థాయిలోనే వ్యయం కావడంతో లాభాలు రాలేదు.

◆ "ఈ సంవత్సరం చిత్ర పరిశ్రమ ఫలితాలు అందరినీ ఆలోచనలో పడేశాయి. అగ్ర హీరో, అగ్ర దర్శకుడు ఉంటే... సినిమా మేకింగ్ సులభమనీ, అందరి దృష్టిని ఆకర్షించవచ్చనీ అనుకుంటూ అలాంటి కలయికలపై దృష్టి పెడుతుంటాం కానీ, కథని మించిన ఆకర్షణ మరొకటి లేదని ఈ సారి చిత్రసీమ స్పష్టంగా చాటింది. ఈటీవీ విన్ సంస్థ ఒకప్పటిలా రూ.కోటిన్నరతో నాణ్యమైన సినిమాలు తీస్తూ స్ఫూర్తిగా నిలుస్తోంది. ఈ సినిమాలతో యువతరం ప్రతిభ పెద్దఎత్తున వెలుగులోకి వచ్చింది. చాలా చిన్న సినిమాలు పెద్ద విజయాల్ని అందుకున్నాయి". – ప్రముఖ నిర్మాత కె.ఎస్.రామారావు.

◆ "చిత్రసీమలో ఫలితాల శాతం ఎప్పట్లాగే ఉన్నా, చిన్న సినిమాలు మంచి విజయాల్ని అందుకున్నాయి. పరిశ్రమ ఆర్థిక ముఖచిత్రం కూడా మారింది. చిత్ర పరిశ్రమలోకి కార్పొరేట్ కంపెనీలు వస్తున్నాయి. ఇప్పటివరకూ ఉన్న ఫైనాన్షియర్ల స్థానంలో, ఇప్పుడు కార్పొరేట్ సంస్థలు ముందుకొచ్చి ఫైనాన్స్ చేస్తున్నాయి. ఈ సంవత్సరం చిన్న సినిమాలు విజయాల్ని అందుకున్నా, ఇవన్నీ గత రెండు మూడేళ్లుగా రూపొందుతూ వచ్చిన సినిమాలు. 2026లో ఇలాంటి సినిమాల విడుదలలు తగ్గే అవకాశం ఉంది. ఈమధ్య ప్రారంభమవుతున్న సినిమాల సంఖ్య బాగా తగ్గడమే అందుకు కారణం". – బన్నీ వాస్, నిర్మాత

చైనాకు భారత్ కౌంటర్

● 'బ్యాటిల్ ఆఫ్ గల్వాన్' సినిమాపై చైనా మీడియా ఆరోపణలు


సల్మాన్ ఖాన్

భారత్‌లో భావ వ్యక్తీకరణ స్వేచ్ఛ ఉందని, తమ భావాలను కథల రూపంలో వ్యక్తపరచడం కూడా ఇందులో భాగమే అంటూ చైనా మీడియాకు భారత్ గట్టిగా బదులిచ్చింది. 2020లో జరిగిన గల్వాన్ యుద్ధం ఆధారంగా రూపొందుతున్న చిత్రం 'బ్యాటిల్ ఆఫ్ గల్వాన్'. సల్మాన్ ఖాన్ హీరోగా నటిస్తున్న ఈ సినిమాపై చైనా మీడియా 'గ్లోబల్ టైమ్స్' అభ్యంతరం వ్యక్తం చేస్తూ.. తమ సంపాదకీయంలో పలు ఆరోపణలు చేసింది. ఈ చిత్రాన్ని జాతీయవాద మెలోడ్రామా అని పేర్కొంటూ చైనాపై వ్యతిరేకతను రెచ్చగొట్టేందుకు చరిత్రను వక్రీకరిస్తున్నారంటూ ఆరోపించింది. గల్వాన్ ఘర్షణలకు భారత బలగాలే కారణమంటూ తమ దేశాన్ని సమర్థించుకుంటూ.. భారత దళాలు అక్రమంగా భూభాగంలోకి చొరబడి.. చైనా సైనికులపై దాడి చేశాయంటూ వివాదస్పద వ్యాఖ్యలు చేసింది. దీనికి భారత ప్రభుత్వ వర్గాలు ఖండిస్తూ.. "కళాత్మక స్వేచ్ఛకు అనుగుణంగా సినిమాలను తెరకెక్కించే హక్కు దర్శకనిర్మాతలకు ఉంటుంది. 'బ్యాటిల్ ఆఫ్ గల్వాన్' విషయంలో ఎవరికైనా (చైనాను ఉద్దేశిస్తూ)సందేహాలు గానీ, ఆందోళన గానీ ఉంటే.. స్పష్టత కోసం భారత రక్షణ మంత్రిత్వ శాఖను సంప్రదించొచ్చు. ఈ చిత్రం విషయంలో ప్రభుత్వ జోక్యం ఏమీ లేదు" అని వెల్లడించాయి.

మోహన్‌లాల్‌కి మాతృవియోగం



ప్రముఖ మలయాళ అగ్రకథానాయకుడు మోహన్‌లాల్ తల్లి శాంతకుమారి (90) కన్నుమూశారు. వృద్ధాప్య సమస్యలతో బాధపడుతున్న ఆమె మంగళవారం తమ నివాసంలో తుదిశ్వాస విడిచినట్లు కుటుంబ సన్నిహిత వర్గాలు తెలిపాయి. తన తల్లి కారణంగానే తాను ఈ స్థానంలో ఉన్నట్లు పలు సందర్భాల్లో చెప్పారు మోహన్‌లాల్. ఆయన తల్లి మృతి పట్ల కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్, అగ్రహీరో చిరంజీవితో పాటు పలువురు సినీ, రాజకీయ ప్రముఖులు సామాజిక మాధ్యమాల వేదికగా సంతాపం వ్యక్తం చేశారు.

అందరి కోరిక నా విజయమే


వశిష్ఠ, అర్చన, బాబీ, ఆది, అల్లు అరవింద్, సాయికుమార్

"సాయికుమార్‌తో మాది మూడు తరాల అనుబంధం. ఆది సాయికుమార్ అద్భుతంగా నటించి కొంచెం ఆలస్యంగానైనా మంచి విజయాన్ని అందుకున్నాడు. ఇక నుంచి హైవేపై ప్రయాణంలా దూసుకుపోవాలి" అన్నారు ప్రముఖ నిర్మాత అల్లు అరవింద్. ఆయన ముఖ్య అతిథిగా 'శంబాల' విజయోత్సవం ఇటీవల హైదరాబాద్‌లో జరిగింది. ఆది సాయికుమార్ కథానాయకుడిగా... యుగంధర్ ముని దర్శకత్వంలో రూపొందిన సినిమానే 'శంబాల'. మహీధర్‌రెడ్డి, రాజశేఖర్ అన్నభీమోజు నిర్మించారు. ఈ చిత్రం ఇటీవలే విడుదలై విజయవంతంగా ప్రదర్శితమవుతోంది. వేడుకను ఉద్దేశించి అల్లు అరవింద్ మాట్లాడుతూ "ఈ సినిమా ట్రైలర్ చూసిన వెంటనే ఆదికి మెసేజ్ చేశాడు బన్నీ. అంతగా నచ్చింది తనకు. ఈ సినిమాని చూసి నేనూ ఎంతగానో ఆస్వాదించా" అన్నారు. ఆది సాయికుమార్ మాట్లాడుతూ "నేను విజయవంతం కావాలని పరిశ్రమలోని ప్రతి ఒక్కరూ కోరుకున్నారు. ఇకపై కొత్త ఆదిని చూస్తారు. అన్ని జాగ్రత్తలు తీసుకుని మంచి సినిమాలు చేస్తా" అన్నారు. సాయికుమార్ మాట్లాడుతూ "చిత్ర పరిశ్రమలో యాభయ్యేళ్లుగా కొనసాగుతున్నా. ఈ సందర్భంలో ఆది 'శంబాల'తో హిట్ అందుకోవడం ఆనందంగా ఉంది" అన్నారు. ఈ కార్యక్రమంలో బాబీ, వశిష్ఠ, అర్చన, కోన వెంకట్, రాజేశ్ దండా, సందీప్‌కిషన్, అయ్యప్ప శర్మ, రవిశంకర్ తదితరులు పాల్గొన్నారు.

కొత్త ప్రయాణం


బండ్ల గణేశ్

నవ్యమైన ఆలోచనలు, నవతరం ప్రతిభావంతుల్ని ప్రోత్సహిస్తూ... కథాబలం ఉన్న సినిమాల్ని ప్రేక్షకులకు అందించడమే లక్ష్యంగా నటుడు, నిర్మాత బండ్ల గణేశ్ కొత్త నిర్మాణ సంస్థని ఏర్పాటు చేశారు. బండ్ల గణేశ్ బ్లాక్‌బస్టర్స్ (బీజీ బ్లాక్‌బస్టర్స్) పేరుతో ఏర్పాటు చేసిన ఈ కొత్త సంస్థలో పలు ఆసక్తికరమైన సినిమాలు రానున్నాయని, ఇప్పటికే ఓ ప్రాజెక్ట్ ఖరారైందని, త్వరలోనే ఆ వివరాల్ని వెల్లడిస్తామని బండ్ల గణేశ్ మంగళవారం విడుదల చేసిన ఓ ప్రకటనలో తెలిపారు. నటుడిగా కెరీర్‌ని ప్రారంభించిన బండ్ల గణేశ్, ఆ తర్వాత పరమేశ్వర ఆర్ట్ ప్రొడక్షన్స్ సంస్థపై నిర్మాతగా 'ఆంజనేయులు', 'గబ్బర్‌సింగ్', 'బాద్‌షా', 'ఇద్దరమ్మాయిలతో', 'టెంపర్' తదితర చిత్రాల్ని నిర్మించారు.

ఈనాడు బిజినెస్

హ్యుందాయ్ మోటార్ 'ప్రైమ్ ట్యాక్సీ' కార్లు



దిల్లీ: ట్యాక్సీలు, క్యాబ్‌ల వంటి వాణిజ్య అవసరాల కోసం ప్రత్యేక కార్లను 'ప్రైమ్ ట్యాక్సీ' శ్రేణిలో ఆవిష్కరించినట్లు హ్యుందాయ్ మోటార్ ఇండియా తెలిపింది. ప్రైమ్ హెచ్‌బీ (హ్యాచ్‌బ్యాక్), ప్రైమ్ ఎస్‌డీ (సెడాన్) పేరిట ఈ మోడళ్లను విడుదల చేసినట్లు వెల్లడించింది. వాహనాలు అద్దెకు ఇచ్చే వ్యాపారులు - సొంతంగా ట్యాక్సీ నడుపుతూ ఉపాధి పొందే వారి కోసమే ఈ మోడళ్లను అభివృద్ధి చేసినట్లు పేర్కొంది. ధర తక్కువగా ఉండి, నిర్వహణ ఖర్చు పరిమితంగా ఉండే ఈ కార్లు, అధిక సామర్థ్యం కలిగి, యజమానులు అధిక ఆదాయం ఆర్జించేందుకు వీలు కల్పిస్తాయని హ్యుందాయ్ మోటార్ ఇండియా ఎండీ తరుణ్ గార్గ్ తెలిపారు. రెండు మోడల్ కార్లకు 1.2 లీటర్ కప్పా ఫోర్ సిలిండర్ ఇంజిన్ (పెట్రోల్, సీఎన్‌జీ) అమర్చినట్లు పేర్కొన్నారు. ప్రైమ్ హ్యాచ్‌బ్యాక్ ధర రూ.5,99,900 నుంచి, ప్రైమ్ సెడాన్ ధర రూ.6,89,900 (ఎక్స్-షోరూం) నుంచి ప్రారంభమవుతాయని వెల్లడించారు. దేశ వ్యాప్తంగా ఉన్న తన విక్రయ కేంద్రాల్లో రూ.5,000 చెల్లించి, ఈ కార్లను బుక్ చేసుకోవచ్చని.. 72 నెలల పాటు వాయిదాల్లో మిగిలిన మొత్తం జమ చేయొచ్చని సంస్థ వివరించింది.

అంబికా నుంచి రాగస్వర అగర్‌బత్తీ

ఈనాడు, హైదరాబాద్: అగర్‌బత్తీ పెట్టె తెరవగానే వేంకటేశ్వరస్వామి సుప్రభాతం వినిపించే ఉత్పత్తిని 'రాగస్వర సుప్రభాతం' పేరిట అంకుర సంస్థ అంబికా ఆరోగ్య విడుదల చేసింది. ఈ ఉత్పత్తిని అంబికా దర్బార్‌బత్తి డైరెక్టర్ అంబికా రామచంద్ర రావు అభివృద్ధి చేశారు. మంగళవారం రంగారెడ్డి జిల్లాలోని సమతామూర్తి స్ఫూర్తి కేంద్రంలో త్రిదండి రామానుజ చినజీయర్ స్వామి ఈ అగర్‌బత్తీలను విడుదల చేశారు. పూజా మందిరంలో అగరుబత్తీల పెట్టె తెరవగానే సుప్రభాతం వినిపించడం కొత్త అనుభూతి కలిగిస్తోందని చినజీయర్ స్వామి తెలిపారు.. తమ ఉత్పత్తులపై కోట్ల మందికి ఉన్న విశ్వాసాన్ని మరింత పెంచేలా కొత్త ఉత్పత్తిని తీసుకొస్తున్నామని అంబికా గ్రూపు సీఎండీ అంబికా కృష్ణ తెలిపారు. త్వరలోనే వారంలోని 7 రోజులకు సంబంధించిన దేవతా శ్లోకాలతో, ఏడు విభిన్న సువాసనలతో ప్యాక్‌లు విడుదల చేస్తామని రామచంద్ర రావు చెప్పారు. రాగస్వర బ్రాండు ద్వారా ఏడాది కాలంలో రూ.100 కోట్ల ఆదాయాన్ని ఆర్జించాలనేది లక్ష్యమని అంబికా ఆరోగ్య ఎండీ అంబికా కార్తీక్ తెలిపారు. శ్రీ వరమహాలక్ష్మి, సాయి శరణం ఉత్పత్తులు త్వరలోనే అందుబాటులోకి వస్తాయన్నారు.



రాగస్వర సుప్రభాతం అగర్‌బత్తీని ఆవిష్కరిస్తున్న త్రిదండి రామానుజ చినజీయర్ స్వామి. చిత్రంలో కార్తీక్, రామచంద్రరావు, అంబికా కృష్ణ

ప్రపంచంలోనే నాలుగో ఆర్థిక వ్యవస్థగా భారత్

2030 కల్లా జర్మనీని కూడా వెనక్కి నెడతాం: కేంద్రం



దేశ ఆర్థిక వ్యవస్థ వృద్ధి పరుగులు తీస్తోంది. జపాన్‌ను సైతం వెనక్కి నెట్టి, ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో నాలుగో స్థానానికి మనదేశం చేరినట్లు ప్రభుత్వం తెలిపింది. రాబోయే మూడేళ్లలో జర్మనీని సైతం వెనక్కి తోసి ప్రపంచంలోనే మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా మారనున్నామని కేంద్రం పేర్కొంది.

4.18 లక్షల కోట్ల డాలర్లతో..: 'ప్రస్తుత ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసికంలో భారత వాస్తవ జీడీపీ 8.2% వృద్ధిని నమోదు చేసింది. తొలి త్రైమాసిక వృద్ధి 7.8% కంటే, 2024-25 చివరి త్రైమాసికంలోని 7.4% కంటే ఇది అధికం. 4.18 లక్షల కోట్ల డాలర్ల (దాదాపు రూ.376.2 లక్షల కోట్ల)తో జపాన్‌ను అధిగమించి ప్రపంచంలోనే నాలుగో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించాం. వచ్చే 2.5-3 ఏళ్లలో జర్మనీని సైతం పక్కకు నెట్టి మూడో స్థానాన్ని అధిరోహిస్తాం. 2030 కల్లా 7.3 లక్షల కోట్ల డాలర్లకు మన ఆర్థిక వ్యవస్థ చేరుతుందన్న అంచనాలు ఇందుకు నేపథ్యమ'ని కేంద్రం విడుదల చేసిన 2025 సంస్కరణల వివరాలు చెబుతున్నాయి. ఆర్థిక వ్యవస్థ పరిమాణం పరంగా అమెరికా, చైనా తొలి రెండు స్థానాల్లో ఉన్నాయి. 2047 కల్లా, అంటే స్వాతంత్ర్యం వచ్చిన 100 ఏళ్లకు హై మిడిల్ ఇన్‌కమ్ (అధిక మధ్యాదాయ) హోదా పొందాలన్న లక్ష్యంతో ప్రభుత్వం ఉందని కేంద్రం తెలిపింది.

కోడి గుడ్లు — 31న ఫారం వద్ద రైతు అమ్మకం ధరలు (నెక్) (100కు రూపాయలలో)

హైదరాబాద్	630	తూ/ప గోదావరి	620
వరంగల్	632	విశాఖపట్నం	660
విజయవాడ	660	చిత్తూరు	703

2025లో రూ.30 లక్షల కోట్లు

- పెరిగిన మదుపర్ల సంపద
- గత రెండేళ్లతో పోలిస్తే బాగా తక్కువ
- సూచీల స్థిరీకరణ వల్లే



స్టాక్ మార్కెట్ మదుపర్ల సంపద విలువ ఈ ఏడాదిలో రూ.30 లక్షల కోట్ల మేర పెరిగింది. అయితే గత రెండేళ్లలో పెరిగిన సంపద విలువతో పోలిస్తే మాత్రం, 2025లో సగానికి పరిమితమైంది. అమెరికా సుంకాల అనిశ్చితులు, విదేశీ సంస్థాగత మదుపర్ల (ఎఫ్‌ఐఐ) అమ్మకాలు, బలహీన రూపాయి వంటి ప్రతికూలతల నడుమ సూచీలు స్థిరీకరణ బాట పట్టడమే ఇందుకు కారణంగా చెబుతున్నారు.

2025లో ట్రేడింగ్ మరొక్కరోజే జరగనుంది. జనవరి నుంచి ఇప్పటివరకు బీఎస్‌ఈ సెన్సెక్స్ 8.39% రాణించింది. కొన్నేళ్లుగా దేశీయ స్టాక్ మార్కెట్ ప్రధాన సూచీలు రెండంకెల ప్రతిఫలాన్ని పంచడం వల్లా, ఈసారి సూచీల స్థిరీకరణ చోటుచేసుకుందని అంటున్నారు.

✦ మదుపర్ల సంపదగా పరిగణించే బీఎస్‌ఈలోని నమోదిత కంపెనీల మార్కెట్ విలువ ఈ ఏడాదిలో డిసెంబరు 30 వరకు రూ.29.77 లక్షల కోట్లు పెరిగి రూ.471.72 లక్షల కోట్లకు చేరింది.

దేశీయ అంశాలే ఆదుకున్నాయ్: అంతర్జాతీయంగా ప్రతికూలతలు కొనసాగినా, దేశీయ స్థూల ఆర్థిక అంశాలు మెరుగ్గా ఉండటం, రిటెయిల్ మదుపర్ల ప్రాతినిధ్యం గణనీయంగా పెరగడం వంటివి ఈ ఏడాదిలో మన స్టాక్ మార్కెట్ సానుకూల ధోరణిలో ముగియడానికి మద్దతుగా నిలిచాయి. దేశ జీడీపీ వృద్ధి అంచనాలకు మించడం, పలు స్థూల ఆర్థిక గణాంకాల రాణింపుతో మదుపర్ల సెంటిమెంట్ బలపడింది. దేశీయ సంస్థాగత మదుపర్ల (డీఐఐలు) కొనుగోళ్ల అండ, పబ్లిక్ ఇష్యూల సందడి కొనసాగడం, మ్యూచువల్ ఫండ్ పథకాల్లో సిప్ పెట్టుబడులు పెరగడం కూడా తోడ్పడ్డాయి. అయితే కార్పొరేట్ కంపెనీల ఆర్థిక ఫలితాలు స్తబ్దుగా ఉండటం, రూపాయి విలువ బలహీనపడటం, అధిక స్థాయిలకు చేరిన షేర్లలో మదుపర్ల లాభాల స్వీకరణ వల్ల సూచీల లాభాలు పరిమితమయ్యాయి.

మార్కెట్ విలువలో అగ్రగామి 5 కంపెనీలు

కంపెనీ	మార్కెట్ విలువ (రూ.కోట్లలో)
రిలయన్స్ ఇండస్ట్రీస్	20,85,083
హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్	15,24,150
భారతీ ఎయిర్‌టెల్	11,97,357
టీసీఎస్	11,74,974
ఐసీఐసీఐ బ్యాంక్	9,59,728

మార్కెట్ విలువ పెరిగిందిలా

2025★	రూ.29.77 లక్షల కోట్లు
2024	రూ.77.66 లక్షల కోట్లు
2023	రూ.81.90 లక్షల కోట్లు

(★ డిసెంబరు 30 వరకు)

భారీ ఐపీఓలు ఇలా

టాటా క్యాపిటల్	రూ.15,512 కోట్లు
హెచ్‌డీబీ ఫైనాన్షియల్	రూ.12,500 కోట్లు
ఎల్‌జీ ఎలక్ట్రానిక్స్ ఇండియా	రూ.11,607 కోట్లు
హెక్సావేర్ టెక్నాలజీస్	రూ.8750 కోట్లు
లెన్స్‌కార్ట్ సొల్యూషన్స్	రూ.7278 కోట్లు

రూ.1.6 లక్షల కోట్లు — 2025లో భారత స్టాక్ మార్కెట్ల నుంచి ఎఫ్‌ఐఐలు ఉపసంహరించుకున్న పెట్టుబడుల విలువ

సెన్సెక్స్ ▼ 20 — 84675 | నిఫ్టీ ▼ 03 — 25939

సూచీలకు స్వల్ప నష్టాలు..

ఎఫ్‌ఐఐ అమ్మకాలు.. రూ.3844 కోట్లు
డీఐఐ కొనుగోళ్లు.. రూ.6160 కోట్లు

స్వల్ప శ్రేణికి పరిమితమై కదలాడిన సూచీలు మంగళవారం ఓ మోస్తరు నష్టాలతో ముగిశాయి. విదేశీ సంస్థాగత మదుపర్ల అమ్మకాలు కొనసాగడం, అంతర్జాతీయ మార్కెట్లు స్తబ్దుగా కదలాడటం లాంటివి మన మదుపర్ల సెంటిమెంటుపై ప్రతికూల ప్రభావం చూపాయి. సెన్సెక్స్ 20.46 పాయింట్ల నష్టంతో 84,675.07 వద్ద ముగిసింది. ఎన్‌ఎస్‌ఈ నిఫ్టీ 3.25 పాయింట్లు కోల్పోయి 25,938.85 వద్ద స్థిరపడింది. సెన్సెక్స్ 30 కంపెనీల షేర్లలో 12 మినహా మిగతావి నష్టాల్లో ముగిశాయి. ఎటర్నల్ షేరు 2.10% నష్టపోగా.. టాటా స్టీల్ షేరు 2.03% మెరిసింది. డాలరుతో పోలిస్తే రూపాయి మారకపు విలువ 23 పైసలు పెరిగి 89.75 వద్ద ముగిసింది. బ్రెంట్ ముడిచమురు 0.27% పెరిగి 62.21 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.

✦ బీఎస్‌ఈలోని నమోదిత కంపెనీల మార్కెట్ విలువ రూ.43,000 కోట్లు తగ్గి రూ.471.72 లక్షల కోట్ల (5.24 లక్షల కోట్ల డాలర్ల)కు చేరింది.

ఆరంభం బాగున్నా.. ఆఖర్లో నష్టాలు: గుజరాత్ కిడ్నీ అండ్ సూపర్ స్పెషాలిటీ లిమిటెడ్ షేరు స్టాక్ ఎక్స్ఛేంజీల్లో నమోదైన రోజే నష్టాలతో ముగిసింది. ఇష్యూ ధర రూ.114తో పోలిస్తే, 5.92% అధికంగా రూ.120.75 వద్ద ఈ షేరు ట్రేడింగ్ ఆరంభమైంది. ఒక దశలో రూ.123.25 వద్ద ఇంట్రాడే గరిష్ఠాన్ని తాకింది. తదుపరి నష్టాల్లోకి జారుకుని, చివరకు 8.20% నష్టంతో రూ.104.65 వద్ద ముగిసింది.

ఏఐతో ఉత్పాదకతను పదింతలు చేస్తాం

ఆర్‌ఐఎల్ ఛైర్మన్ ముకేశ్ అంబానీ



దిల్లీ: రిలయన్స్ ఇండస్ట్రీస్ (ఆర్‌ఐఎల్) ఛైర్మన్ ముకేశ్ అంబానీ 'రిలయన్స్ ఏఐ ముసాయిదా మానిఫెస్టో'ను ఆవిష్కరించారు. అధునాతన తయారీ సామర్థ్యాలతో 'ఏఐ నేటివ్ డీప్ టెక్ సంస్థలు'గా తమ గ్రూప్‌ను మార్చబోతున్నట్లు ప్రకటించారు. తద్వారా తమ 6 లక్షల మంది ఉద్యోగుల ఉత్పాదకత, పది రెట్లు పెరుగుతుందనే విశ్వాసాన్ని వ్యక్తం చేశారు. భారత ఏఐ విప్లవానికి నేతృత్వం వహిస్తామని ముకేశ్ పేర్కొన్నారు. 'భారతీయులందరికీ ఏఐని అందుబాటులోకి తెస్తాం. అన్ని కంపెనీలకూ ఎంబెడెడ్ ఏఐ అందిస్తాం. భద్రత, విశ్వాసం కలిగించేలా బాధ్యతతో వ్యవహరిస్తామ'న్నారు.

రెండు భాగాలుగా..: 'ముసాయిదాలోని తొలి భాగం కంపెనీ అంతర్గత మార్పులపై దృష్టి సారిస్తుంది. దీనిని టెక్నాలజీ ప్రాజెక్టుగా కాకుండా.. పనిచేయడానికి సరికొత్త మార్గంగా చూస్తాం. ఏఐ, ఏజెంటిక్ ఆటోమేషన్ వినియోగంతో రిపిటీటివ్ పనుల తొలగింపు, నిర్ణయాలను మెరుగుపరచుకోవడంతో పాటు నాణ్యత, వేగాన్ని పెంచుతాం. ఇందుకు డేటా, ఆపరేషన్స్, గవర్నెన్స్, లెర్నింగ్, ఆటోమేషన్ పైప్‌లైన్స్ మద్దతు తీసుకుంటామ'న్నారు. 'రెండో భాగంలో దేశవ్యాప్త ఏఐ మార్పు ఉంటుంది. మా ఉద్యోగుల పని వేగం, సామర్థ్యం, నాణ్యతను పదింతలు పెంచుకుంటాం. మా వ్యాపారాలు, దాతృత్వ కార్యకలాపాల ద్వారా భారత్‌పైనా పదింతల ప్రభావాన్ని చూపిస్తామ'ని వివరించారు.

పబ్లిక్ ఇష్యూకు దీపా జువెలర్స్ సన్నాహాలు

ఈనాడు, హైదరాబాద్: హైదరాబాద్ కేంద్రంగా కార్యకలాపాలు సాగిస్తున్న దీపా జువెలర్స్, తొలి పబ్లిక్ ఆఫర్ (ఐపీఓ) ద్వారా నిధులు సమీకరించేందుకు అనుమతి కోరుతూ సెబీకి ప్రాస్పెక్టస్ (డీఆర్‌హెచ్‌పీ) దాఖలు చేసింది. ఈ సంస్థ రూ.250 కోట్లకు, రూ.2 ముఖ విలువ గల షేర్లు జారీ చేస్తుంది. సంస్థ ప్రమోటర్లు ఆశిష్ అగర్వాల్, సీమా అగర్వాల్ 1,18,48,340 షేర్లను 'ఆఫర్ ఫర్ సేల్'లో విక్రయిస్తారు. తాజా షేర్ల ద్వారా వచ్చే నిధులను సంస్థ నిర్వహణ మూలధన అవసరాలకు కేటాయిస్తారు.

సంగీతా గ్యాడ్జెట్స్ ట్రూలూజ్ ఆఫర్

తమ వద్ద ఫోన్, గృహోపకరణాలు కొన్నవారికి మానసికంగా పూర్తి భరోసా కల్పించేలా ట్రూలూజ్ ఆఫర్ ఇస్తున్నామని సంగీతా గ్యాడ్జెట్స్ ప్రకటించింది. ఫోన్ కిందపడి స్క్రీన్ పగిలినా, నీటిలో పడి పనికిరాకుండా పోయినా, దొంగతనానికి గురయినా, అకస్మాత్తుగా పనిచేయకుండా ఆగినా కూడా, ఈ ఆఫర్ కింద పూర్తి భరోసా లభిస్తుందని తెలిపింది. ఎటువంటి ప్రశ్నలు అడగకుండా, పూర్తిస్థాయి సర్వీస్ అందిస్తామంది. 365 రోజుల పాటు ఇంటిలోని గృహోపకరణాలకు అపరిమిత సర్వీస్ అందిస్తామని పేర్కొంది.

2026-27లో సిమెంటు రంగ వృద్ధి 6-7%

గృహ, మౌలిక రంగాల దన్ను: ఇక్రా అంచనా



దిల్లీ: భారత సిమెంటు పరిశ్రమ వచ్చే ఆర్థిక సంవత్సరంలో 6-7% వృద్ధిని నమోదు చేయగలదని రేటింగ్ ఏజెన్సీ ఇక్రా పేర్కొంది. గృహ, మౌలిక ప్రాజెక్టుల నుంచి సిమెంటుఉకు గిరాకీ స్థిరంగా ఉండడం ఇందుకు దోహదం చేస్తుందని తెలిపింది. ఈ ఆర్థిక సంవత్సరంలోనూ పరిశ్రమ 6.5-7.5% మేర రాణించగలదని పేర్కొంది. 'దేశంలో నిర్మాణ కార్యకలాపాలు బలంగా ఉండడంతో 2025-26లో సిమెంటు విక్రయాల పరిమాణం 8.5% పెరగొచ్చని నివేదిక వివరించింది. సిమెంట్‌పై జీఎస్‌టీ 28% నుంచి 18 శాతానికి తగ్గడం, మౌలిక వ్యయాలను కేంద్ర ప్రభుత్వం పెంచడంతో ప్రస్తుత, వచ్చే ఆర్థిక సంవత్సరంలో సిమెంటుఉకు గిరాకీ రాణిస్తుందని అంచనా వేసింది. సిమెంటు తయారీ సంఘం (సీఎమ్‌ఏ) ప్రకారం.. భారత్‌లో సిమెంటు తయారీ సామర్థ్యం 700 ఎమ్‌టీపీఏగా ఉంది. 2025-26 నుంచి 2026-27 వరకు 85-90 మిలియన్ మెట్రిక్ టన్నుల వార్షిక (ఎమ్‌టీపీఏ) సామర్థ్యాన్ని సిమెంటు రంగం జత చేసుకోవచ్చు. నిర్వహణ ఎబిటా మెట్రిక్ టన్నుకు రూ.880-930 మేర నమోదు కావొచ్చ'ని నివేదిక అంచనా వేసింది.

రూ.4,300 కోట్ల రుణాల మంజూరుకు ఎస్‌ఎంఎఫ్‌సీఎల్ బోర్డు ఆమోదం

దిల్లీ: మారిటైమ్ ఫైనాన్సింగ్ రంగంలోకి అడుగు పెట్టినట్లు మంగళవారం సాగరమాల ఫైనాన్స్ కార్పొరేషన్ లిమిటెడ్ తెలిపింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ.4,300 కోట్ల రుణాలు మంజూరు చేయడానికి తన బోర్డు అనుమతి ఇచ్చిందని వెల్లడించింది. ఈ ఆర్థిక సంవత్సరం చివరి కల్లా రుణ పరిమాణాన్ని రూ.8,000 కోట్లకు పెంచుకోవడం లక్ష్యమని ఎస్‌ఎంఎఫ్‌సీఎల్ వివరించింది. సాగరమాల ఫైనాన్స్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఎస్‌ఎంఎఫ్‌సీఎల్) అనేది సముద్ర రంగంలో దేశీయంగా ఆర్థిక సేవలు అందించే మొదటి బ్యాంకింగేతర ఆర్థిక సంస్థ (ఎన్‌బీఎఫ్‌సీ).

రష్యా చమురు దిగుమతులు తగ్గాయ్



దిల్లీ: డిసెంబరులో రష్యా నుంచి మన దేశానికి చమురు దిగుమతులు గణనీయంగా తగ్గాయి. దిగుమతులపై మన విధాన నిర్ణయాల్లో మార్పులేమీ రాలేదని, స్వల్పకాలిక అంతరాయాల వల్లే రష్యా నుంచి చమురు దిగుమతి తగ్గిందని చెబుతున్నారు. రియల్ టైమ్ డేటా అనలిటిక్స్ కంపెనీ కెప్లర్ గణాంకాల ప్రకారం.. ఈ నెలలో రష్యా నుంచి చమురు దిగుమతులు రోజుకు దాదాపు 1.2 మిలియన్ బ్యారెళ్లకు తగ్గాయి. నవంబరులో రోజుకు 1.84 మిలియన్ బ్యారెళ్ల చమురును మన దేశం రష్యా నుంచి దిగుమతి చేసుకుంది. 2022 డిసెంబరు తర్వాత రష్యా నుంచి ఇంత తక్కువగా చమురు దిగుమతి కావడం ఈ నెలలోనే.

✦ అమెరికా ఆంక్షలు లేని రష్యా కంపెనీల నుంచి చమురు కొనుగోళ్లను భారత రిఫైనరీలు కొనసాగిస్తున్న విషయం తెలిసిందే. రష్యా సంస్థలు రాస్‌నెఫ్ట్, లుక్‌ఆయిల్‌పై అమెరికా ఆంక్షల కారణంగా మన దేశ దిగుమతులు తగ్గొచ్చని అక్టోబరులోనే విశ్లేషకులు అంచనా వేశారు. రష్యా నుంచి వచ్చే ఉత్పత్తులపై ఐరోపా సమాఖ్య (ఈయూ) ఆంక్షలు కూడా ఇందుకు తోడయ్యాయి. 'రాస్‌నెఫ్ట్, లుక్‌ఆయిల్‌పై ఆంక్షల నేపథ్యంలో డిసెంబరులో రష్యా నుంచి చమురు దిగుమతులు భారీగా తగ్గాయి. ఇది స్వల్పకాల సర్దుబాటుగా కనిపిస్తోంది. కొత్త ఇంటర్‌మీడియరీలు రావడం, సరఫరా వ్యవస్థల పునరుద్ధరణ కారణంగా 2026 జనవరి నుంచి మళ్లీ దిగుమతులు పెరిగే అవకాశం ఉంది' అని కెప్లర్ లీడ్ రీసెర్చ్ అనలిస్ట్ (రిఫైనింగ్-మోడలింగ్) సుమిత్ రిటోలియా పేర్కొన్నారు.

✦ 2022లో ఉక్రెయిన్‌పై యుద్ధం ప్రారంభించిన రష్యాపై పశ్చిమ దేశాలు ఆంక్షలు విధించాయి. రష్యా రాయితీ ధరలకు చమురును విక్రయించడం ప్రారంభించడంతో, మన దేశం అతిపెద్ద దిగుమతిదారుగా మారింది. ఫలితంగా మొత్తం మన చమురు దిగుమతుల్లో రష్యా వాటా 1% నుంచి 40 శాతానికి చేరింది.

విదేశీ సిమ్‌ల అమ్మకాలపై నియంత్రణ అవసరం: ట్రాయ్

దిల్లీ: ఎగుమతి చేసే ఎం2ఎం, ఐఓటీ పరికరాల్లో ఉపయోగించడానికి ఉద్దేశించిన విదేశీ టెలికాం సర్వీస్ ప్రొవైడర్ల సిమ్‌ల అమ్మకంపై నియంత్రణ అవసరమని టెలికాం నియంత్రణ సంస్థ ట్రాయ్ పేర్కొంది. కొత్త సేవల ధ్రువీకరణను 'ఇంటర్నేషనల్ ఎం2ఎం సిమ్ సర్వీస్ అథరైజేషన్'గా పరిగణించాలని పేర్కొంది. ప్రవేశ రుసుము, కనీస ఈక్విటీ, కనీస నికర విలువ, బ్యాంక్ గ్యారెంటీ, అథరైజేషన్ కోసం రుసుము సున్నాగా ఉండాలని ట్రాయ్ తెలిపింది. అథరైజేషన్ కోసం అప్లికేషన్ ప్రాసెసింగ్ ఛార్జీగా రూ.5000ను ప్రతిపాదించింది. అథరైజేషన్ కోసం 10 ఏళ్ల కాలవ్యవధి సమయాన్ని సూచించింది.

విలాస నివాసాలకు గిరాకీ నెమ్మదించొచ్చు

దిల్లీ: దేశంలోని ప్రధానమైన 9 నగరాల్లో విలాస గృహాలకు గిరాకీ వచ్చే ఏడాదిలో నెమ్మదించొచ్చని స్థిరాస్తి కన్సల్టెంట్ స్క్వేర్ యార్డ్స్ అంచనా వేస్తోంది. ఇందుకు బదులుగా అందుబాటు ధర, మధ్యశ్రేణి ధరల ఇళ్లు/ఫ్లాట్లకు గిరాకీ పెరుగుతుందని తెలిపింది. విలాస నివాసాలకు గిరాకీలో వృద్ధి ఇప్పటికే తగ్గుతోందని వివరించింది. ఈ ఏడాదిలో జనవరి నుంచి డిసెంబరు 25 వరకు 9 ప్రధాన నగరాల్లో రూ.4.46 లక్షల కోట్ల విలువైన 5.45 లక్షల ఇళ్లు/ఫ్లాట్లు రిజిస్టర్ అయినట్లు తెలిసింది. 2024 ఇదే సమయంలో రిజిస్టర్ అయిన ఇళ్లతో పోలిస్తే విలువ పరంగా ఈసారి 11% పెరిగినా, ఇళ్ల సంఖ్య 5.77 లక్షలతో పోలిస్తే ఈసారి 5% తక్కువ అని పేర్కొంది.

సంస్కరణల వల్ల తగ్గుతున్న సీఎన్‌జీ, పైప్‌లైన్ గ్యాస్ ధరలు



దిల్లీ: పెట్రోలియం అండ్ నేచురల్ గ్యాస్ రెగ్యులేటరీ బోర్డ్ (పీఎన్‌జీఆర్‌బీ) ఇటీవల చేపట్టిన సంస్కరణల వల్ల వినియోగదార్లకు ప్రయోజనాలు ప్రారంభమయ్యాయి. పైపు లైన్ల టారిఫ్‌లను సవరించడంతో సిటీ గ్యాస్ ఆపరేటర్లు తమ సీఎన్‌జీ, పైపులైన్లలో సరఫరా చేసే వంట గ్యాస్(పీఎన్‌జీ) ధరలను తగ్గించడం మొదలుపెట్టారు. కొత్త టారిఫ్ జనవరి 1 నుంచి అమల్లోకి రానున్న నేపథ్యంలో థింక్ గ్యాస్ ఇప్పటికే పలు రాష్ట్రాల్లో సీఎన్‌జీ, పీఎన్‌జీ ధరలు తగ్గించింది. మిగతా సంస్థలు కూడా ఇదే బాట పట్టొచ్చు. సహజవాయువును సరఫరా చేసే పైపు లైన్ల టారిఫ్‌లను పీఎన్‌జీఆర్‌బీ డిసెంబరు 16న క్రమబద్ధీకరించింది. దీంతో సహజ వాయువు రవాణా వ్యయాలు తగ్గాయి.

స్వర్ణాక్షులో 26% వాటా కొనుగోలు: అరబిందో

ఈనాడు, హైదరాబాద్: సొంత విద్యుత్తు అవసరాల కోసం స్వర్ణాక్షు సోలార్ పవర్ లిమిటెడ్ అనే కంపెనీతో విద్యుత్తు కొనుగోలు ఒప్పందం కుదుర్చుకోనున్నట్లు అరబిందో ఫార్మా వెల్లడించింది. ఆ కంపెనీలో 26% వాటా కూడా కొనుగోలు చేయనున్నట్లు పేర్కొంది. 2026 మార్చి చివరికి ఈ ప్రక్రియ పూర్తవుతుందని వివరించింది.

వార్షిక రిటర్నుల దాఖలు గడువు పెంపు



గత ఆర్థిక సంవత్సరానికి (2024-25) సంబంధించిన కంపెనీల వార్షిక రిటర్నులు, ఆర్థిక నివేదికల సమర్పణ గడువును కార్పొరేట్ వ్యవహారాల మంత్రిత్వ శాఖ పొడిగించింది. మంగళవారం జారీ చేసిన ఉత్తర్వుల ప్రకారం.. కంపెనీలు తమ ఫైలింగ్‌లను 2026 జనవరి 31 లోగా పూర్తి చేయాలి. వాస్తవానికి ఈ గడువు ఈనెల 31తో ముగియనుండగా, పొడిగించారు. ఫైలింగ్ వ్యవస్థలో ఎదురవుతున్న సాంకేతిక సమస్యలు, వివిధ వర్గాల నుంచి అందిన విజ్ఞప్తుల మేరకు ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది.

సంక్షిప్తంగా

✦ 2017-18 ఆర్థిక సంవత్సరానికి క్రెడిట్ నోట్స్ సమర్పించడంలో జాప్యానికి సంబంధించి, జరిమానాతో కలిపి రూ.192.36 కోట్లు చెల్లించాలంటూ ఐషర్ మోటార్స్ అనుబంధ సంస్థ అయిన **వీఈ కమర్షియల్ వెహికల్స్**కు పన్ను అధికార్లు జీఎస్‌టీ నోటీసులు పంపించారు.

✦ ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ (ఐటీసీ) క్లెయిమ్‌కు సంబంధించిన వ్యవహారంలో వడ్డీ, జరిమానాతో కలిసి రూ.3.4 కోట్లు కట్టాల్సిందిగా వ్యవసాయ, నిర్మాణ సామగ్రి తయారీ సంస్థ **ఎస్కార్ట్స్ కుబోటా**కు మహారాష్ట్ర పన్ను అధికారుల నుంచి జీఎస్‌టీ నోటీసు వచ్చింది.

✦ **ఎటర్నల్**కు చెందిన క్విక్ కామర్స్ సంస్థ బ్లింకిట్ ముఖ్య ఆర్థిక అధికారిగా ఉన్న విపిన్ కపూరియా తన పదవికి రాజీనామా చేసినట్లు సంబంధిత వర్గాల ద్వారా తెలుస్తోంది.


✦ దేశీయంగా అభివృద్ధి చేసిన 4680 భారత్ సెల్ బ్యాటరీ ప్యాక్‌ను అమర్చిన తన మొదటి విద్యుత్ మోటార్ సైకిల్ మోడల్ రోడ్‌స్టర్ ఎక్స్‌ప్లస్‌కు ప్రభుత్వం నుంచి సర్టిఫికేషన్ లభించినట్లు **ఓలా ఎలక్ట్రిక్** తెలిపింది. ఈ మోడల్ డెలివరీలు ప్రారంభిస్తామని పేర్కొంది.

✦ విమానయాన సంస్థ **ఇండిగో**కు రూ.458 కోట్ల జీఎస్‌టీ జరిమానా నోటీసులను దిల్లీ సౌత్ కమిషనరేట్ అందచేసింది. 2018-19 నుంచి 2022-23 వరకు నిర్వహించిన లావాదేవీలకు సంబంధించి ఈ నోటీస్ జారీ చేయగా, దీన్ని సవాలు చేస్తామని సంస్థ తెలిపింది.

✦ **అమరరాజా ఎనర్జీ అండ్ మొబిలిటీ** సంస్థకు రూ.15.26 కోట్ల పన్ను నోటీసును ఆదాయపు పన్ను విభాగం జారీ చేసింది. దీనిపై అప్పీల్ చేయనున్నట్లు సంస్థ తెలిపింది.

మన సంస్కరణలకు ప్రపంచం ఫిదా

- భారత్ వైపు ఆశ, నమ్మకంతో చూస్తున్నాయ్
- ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ



దిల్లీ: కొత్త తరం సంస్కరణల ఫలితంగా, మన దేశం సాధిస్తున్న వృద్ధి తీరును ప్రపంచ దేశాలు కొనియాడుతున్నాయని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ మంగళవారం వెల్లడించారు. పలు రంగాల్లో అమలు చేసిన సంస్కరణల వల్ల, దేశ వృద్ధి సామర్థ్యాలు పెరిగాయని అన్నారు. వ్యాపార, ఉద్యోగ సామాజిక మాధ్యమం లింక్డ్‌ఇన్‌లో పెట్టిన పోస్ట్‌లో పలు అంశాలను ప్రధాని ప్రస్తావించారు. యువ ఆవిష్కరణల కారణంగా, అంతర్జాతీయ ఆసక్తికి కేంద్రబిందువుగా భారత్ నిలిచిందని, ప్రపంచదేశాలు మన వైపు ఆశ, నమ్మకంతో చూస్తున్నాయని మోదీ తెలిపారు. ప్రస్తుతం 'సంస్కరణల ఎక్స్‌ప్రెస్'ను భారత్ అధిరోహించిందని.. దీనికి ప్రధాన ఇంధనం మన జనాభా, యువత, ప్రజల స్ఫూర్తి అన్నారు. '2025 సంస్కరణల సంవత్సరంగా గుర్తుండిపోతుంది. పలు సంస్థలను ఆధునికీకరించడంతో పాటు పరిపాలనను సరళీకృతం చేసి, దీర్ఘకాలిక వృద్ధికి మూలాలను బలోపేతం చేశాం' అని మోదీ వివరించారు. ఆయన ఇంకా ఏమన్నారంటే..

విశ్వాసం పెరిగింది

ప్రభుత్వం పెద్ద ఆశయాలు, వేగవంతమైన నిర్ణయాలు, భారీ మార్పులతో ముందుకు వెళ్తోంది. దేశ పౌరులు గౌరవంగా జీవించడానికి, వ్యాపారవేత్తలు నమ్మకంగా ఆవిష్కరణలు చేపట్టడానికి, సంస్థలు స్పష్టత, నమ్మకంతో పనిచేయడానికి ప్రభుత్వ సంస్కరణలు వీలు కల్పిస్తున్నాయి. జీఎస్‌టీ రేట్ల తగ్గింపు, భారత బీమా కంపెనీల్లో 100% ఎఫ్‌డీఐకు అనుమతి, కార్మిక చట్టాలు, గ్రామీణ ఉపాధి హామీ వంటి కొన్ని సంస్కరణలే ఇందుకు ఉదాహరణ.

పన్ను వ్యవస్థల మెరుగు

జీఎస్‌టీ రేట్ల తగ్గింపుతో మధ్యతరగతికి భారీ ఉపశమనం లభించింది. పండగల సీజన్‌లో అమ్మకాలు పెరిగాయి. రూ.12 లక్షల వార్షికాదాయంపై పన్నే లేకపోవడం ఇప్పుడే. 1961 ఐటీ చట్టాన్ని సరళీకరించి, కొత్తగా 2025 చట్టంతో భర్తీ చేశాం. ఈ సంస్కరణలతో భారత్ పారదర్శకమైన, సాంకేతికత ఆధారిత పన్నుల వైపు అడుగులు వేస్తోంది.

వివాదాలు తగ్గిస్తున్నాం

చిన్న, మధ్య తరహా సంస్థలకు ఊతమిస్తూ, చిన్న కంపెనీ నిర్వచనాన్ని రూ.100 కోట్ల వరకు టర్నోవర్ ఉన్న సంస్థలకు విస్తరించాం. అతి స్వల్ప వ్యవధిలో 5 కీలక మారిటైమ్ చట్టాలకు ఆమోదముద్ర వేశాం. ఈ సంస్కరణలు డాక్యుమెంటేషన్‌తో పాటు వివాదాల పరిష్కారాన్ని సులభతరం చేస్తాయి. లాజిస్టిక్స్ ఖర్చులను తగ్గిస్తాయి.

✦ 29 చట్టాలను కలిపివేసి 4 ఆధునిక కార్మిక కోడ్‌లు అమల్లోకి వచ్చాయి. ఈఎస్‌ఐసీ, ఈపీఎఫ్‌ఓ కవరేజీలోకి మరింత మంది ఉద్యోగులు వచ్చేలా సంస్కరణలు వచ్చాయి.

✦ న్యూజిలాండ్, ఒమన్, బ్రిటన్‌లతో స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాల (ఎఫ్‌టీఏ)తో పెట్టుబడులు, ఉద్యోగాలు పెరగనున్నాయి. ఐరోపా ఫ్రీ ట్రేడ్ అసోసియేషన్ కూడా చరిత్రాత్మకమే.

✦ శాంతి చట్టంతో అణు విద్యుత్‌లో సంస్కరణలను ప్రారంభించాం. 2025 వికసిత్ భారత్ జీ రామ్ జీ చట్టం అమలు చేయడం ద్వారా గ్రామీణ ఉపాధి హామీలో ఒక మైలురాయి సంస్కరణగా నిలిచిపోనుంది.

ఆర్థికవేత్తలతో మోదీ భేటీ

రాబోయే బడ్జెట్ కోసం అభిప్రాయాలను తెలుసుకునేందుకు ప్రముఖ ఆర్థికవేత్తలు, పలు రంగాల నిపుణులతో మోదీ మంగళవారం భేటీ అయ్యారు. 2047 వికసిత్ భారత్ లక్ష్యాన్ని సాధించేందుకు అవసరమైన దీర్ఘకాలిక వృద్ధి కోసం, భారీ సంస్కరణలు అవసరమని ప్రధాని వివరించారు. ప్రపంచ స్థాయి సామర్థ్యాలు, అంతర్జాతీయ వ్యవస్థలతో సమీకృతం కావడం అవసరమని అన్నారు. ఈ భేటీలో ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, నీతి ఆయోగ్ వైస్ ఛైర్మన్ సుమన్ బెరీ, నీతి ఆయోగ్ సీఈఓ బీవీఆర్ సుబ్రమణియన్ సహా పలువురు పాల్గొన్నారు.

ప్రాక్టీస్ బిట్స్

విపత్తు నిర్వహణ

1. ఆంధ్రప్రదేశ్‌లో దాదాపు 10 వేల మంది ప్రాణాలు హరించిన పెను తుపాను సంభవించిన రోజు?
1) 1977, నవంబరు 15 2) 1978, నవంబరు 15 3) 1979, నవంబరు 15 4) 1980, నవంబరు 15
2. ఇప్పటివరకు ఆంధ్రప్రదేశ్‌లో ఎక్కువ సంఖ్యలో ప్రాణాలు బలిగొన్న పెను తుపాను?
1) జల్ తుపాను 2) హుద్‌హుద్ తుపాను 3) నీలం తుపాను 4) దివిసీమ తుపాను
3. హుద్‌హుద్ తుపాను విశాఖ తీరాన్ని దాటిన రోజు?
1) 2014, అక్టోబరు 12 2) 2013, అక్టోబరు 12 3) 2014, అక్టోబరు 13 4) 2014, అక్టోబరు 14
4. గాలుల వేగం గంటకు 221 కి.మీ. కంటే ఎక్కువగా ఉన్న తుపానులను ఏ విధంగా వర్ణిస్తారు?
1) సైక్లోనిక్ స్టార్మ్ 2) సివియర్ సైక్లోనిక్ స్టార్మ్ 3) సూపర్ సైక్లోన్ 4) డిప్రెషన్
5. 'సునామీ' అనే పదాన్ని ఏ భాషా పదజాలం నుంచి గ్రహించారు?
1) జపనీస్ 2) అరబిక్ 3) ఫ్రెంచ్ 4) లాటిన్
6. భారతదేశంలో ఏ ప్రాంతాన్ని తరచుగా సునామీలు ప్రభావితం చేస్తాయి?
1) రాణ్ ఆఫ్ కచ్ 2) గల్ఫ్ ఆఫ్ కంబట్ 3) మలబార్ తీరప్రాంతం 4) తూర్పుతీర ప్రాంతం
7. సునామీలు ఎక్కువగా సంభవించే మహాసముద్రం?
1) పసిఫిక్ మహాసముద్రం 2) అట్లాంటిక్ మహాసముద్రం 3) హిందూ మహాసముద్రం 4) అంటార్కిటికా మహాసముద్రం

సమాధానాలు: 1-1; 2-4; 3-1; 4-3; 5-1; 6-4; 7-1.

JUNIOR INTER Physics — Motion in a Plane



Final Exams-2026 IMPORTANT Q & A — 2 Marks

1. **What are scalars and vectors?**

A: **Scalars:** The quantities which have only magnitude and no direction are called scalar quantities. **e.g.:** mass distance, time etc.

Vectors: The quantities which have both magnitude and direction are called vector quantities.

e.g.: displacement, velocity, force etc.

2. **When two right angled vectors of magnitude 7 units and 24 units combine, what is the magnitude of their resultant?**

A: Given $|\bar{A}| = 7$ units, $|\bar{B}| = 24$ units, $\theta = 90^\circ$

$R = \sqrt{A^2 + B^2 + 2AB\cos\theta} = \sqrt{A^2 + B^2}$

$R = \sqrt{7^2 + 24^2} = \sqrt{49 + 576} = \sqrt{625} = 25$

3. **If $\bar{P} = 2\bar{i} + 4\bar{j} + 4\bar{k}$ and $Q = 4i + 4j + 10k$ find the magnitude of $\bar{P} + \bar{Q}$.**

A: Given $\bar{P} = 2\bar{i} + 4\bar{j} + 4\bar{k}$ and $Q = 4\bar{i} + 4\bar{j} + 10\bar{k}$

$\bar{P} + \bar{Q} = 6\bar{i} + 8\bar{j} + 24\bar{k}$

magnitude of $\bar{P} + \bar{Q}$

$|P + Q| = \sqrt{6^2 + 8^2 + 24^2} = \sqrt{36 + 64 + 576}$

$= \sqrt{676} = 26$ units

4. **If vertical component of a vector is equal to its horizontal component, what is the angle made by the vector with x-axis.**

A: Horizontal component of vector $\bar{A}$ = vertical component of vector $\bar{A}$ $A_x = A_y$

$A\cos\theta = A\sin\theta \Rightarrow \tan\theta = 1$

$\theta = 45^\circ$

5. **Two forces of magnitude 3 units and 5 units act at 60° with each other. What is the magnitude of their resultant?**

A: Given $|\bar{A}| = 3$, $|\bar{B}| = 5$, $\theta = 60^\circ$

magnitude of resultant,

$R = \sqrt{A^2 + B^2 + 2AB\cos\theta}$

$= \sqrt{3^2 + 5^2 + 2 \times 3 \times 5 \times \cos60}$

$= 9 + 25 + 15 = \sqrt{49} = 7$

For more IMP Q & A



Writer: Dr. Allu Rambabu

సరళ రేఖల సంవృత రూపం!



జనరల్ స్టడీస్ — అరిథ్‌మెటిక్

తేనెతుట్టెను గమనిస్తే అది అయిదు లేదా ఆరు భుజాలతో తయారైన ఆకారంలో ఉంటుంది. షడ్భుజి ఆకృతిలో గూళ్లు నిర్మించుకోవడం వల్ల తక్కువ స్థలంలో ఎక్కువ పదార్థాన్ని తేనె టీగలు సమర్థంగా నిల్వ చేయగలుగుతాయి. ట్రాఫిక్ సిగ్నల్స్, ప్రమాద హెచ్చరికల బోర్డులు కూడా నాలుగు కంటే ఎక్కువ భుజాలతో దృష్టిని ఆకర్షించే విధంగా ఉంటాయి. మూడు లేదా అంత కంటే ఎక్కువ భుజాలతో ఏర్పడిన సంవృత పటాన్ని బహుభుజి అంటారు. నిత్య జీవితంలో తరచూ కనిపించే ఈ బహుభుజిపై పోటీ పరీక్షల్లో ప్రశ్నలు అడుగుతున్నారు. వాటికి సరైన సమాధానాలను వేగంగా గుర్తించాలంటే కుంభాకార, పుటాకార తదితర బహుభుజుల ప్రాథమిక నిర్వచనాలను అర్థం చేసుకోవాలి. కోణాల మొత్తాన్ని, కర్ణాలను లెక్కించడం తెలుసుకోవాలి. ప్రతి ఆకృతికీ వైశాల్యాన్ని, చుట్టుకొలతను కనుక్కోవడం నేర్చుకోవాలి.

బహుభుజి

బహుభుజి: మూడు లేదా 3 కంటే ఎక్కువ రేఖా ఖండాలతో ఏర్పడే సరళ సంవృత పటం.


బహుభుజి పేరును భుజాల సంఖ్య ఆధారంగా నిర్ణయిస్తారు.

భుజాల సంఖ్య	బహుభుజి పేరు	చిత్రం
3	త్రిభుజం	
4	చతుర్భుజం	
5	పంచభుజి	
6	షడ్భుజి	
7	సప్తభుజి	
8	అష్టభుజి	
9	నవభుజి	
10	దశభుజి	

కుంభాకార బహుభుజి

★ బహుభుజిలోని ప్రతీ కోణం 180° తక్కువగా ఉంటే అది కుంభాకార బహుభుజి.

★ ఒక బహుభుజిలో ఏవైనా రెండు బిందువులను కలిపినప్పుడు రేఖాఖండం మొత్తం దాని లోపల ఉంటే దాన్ని 'కుంభాకార బహుభుజి'అంటారు.




★ కుంభాకార బహుభుజిలో కర్ణాలు అంతరంగా ఖండించుకుంటాయి.

పుటాకార బహుభుజి

★ బహుభుజిలో కనీసం ఒక కోణం 180° కంటే ఎక్కువైతే దానిని పుటాకార బహుభుజి అంటారు.

★ బహుభుజిలో ఏవైనా రెండు బిందువులను కలిపినప్పుడు రేఖాఖండం మొత్తం దాని లోపల లేకపోతే అది పుటాకార బహుభుజి.



★ పుటాకార బహుభుజిలో కర్ణాలు బాహ్యంగా ఖండించుకుంటాయి.

★ 'n' భుజాలున్న బహుభుజిలో

కర్ణాల సంఖ్య $= \frac{n(n-3)}{2}$

నోట్: కర్ణాల సంఖ్య, భుజాల సంఖ్య సమానంగా ఉన్న బహుభుజియే పంచభుజి (n = 5).

★ 'n' భుజాలున్న బహుభుజిలో ఒక శీర్షం నుంచి గీయగల కర్ణాల సంఖ్య = n – 3

క్రమ బహుభుజి

ఒక బహుభుజి యొక్క అన్ని అంతర కోణాలు, అన్ని భుజాలు సమానం.

a) n భుజాలున్న బహుభుజిలో

i) అంతర కోణాల మొత్తం = $(2n - 4) \times 90^\circ$ లేదా $(n - 2) \times 180^\circ$


ii) బాహ్య కోణాల మొత్తం = 360°

b) n భుజాలున్న క్రమ బహుభుజిలో

i) ఒక్కో అంతర కోణం = $\frac{(2n-4) \times 90^\circ}{n}$

లేదా $\frac{(n-2) \times 180^\circ}{n}$

ii) ఒక్కో బాహ్యకోణం = $\frac{360^\circ}{n}$



మాదిరి ప్రశ్నలు

1 ఒక దశభుజికి ఉన్న కర్ణాలు ఎన్ని?
1) 45 2) 35 3) 55 4) 65

వివరణ: కర్ణాల సంఖ్య $= \frac{n(n-3)}{2}$

దశభుజి n = 10

$\therefore \frac{10 \times 7}{2} = 35$

జ: 2


2 ఒక బహుభుజిలో కర్ణాల సంఖ్య 54. అయితే ఆ బహుభుజిలో భుజాల సంఖ్య?
1) 8 2) 9 3) 10 4) 12

వివరణ: కర్ణాల సంఖ్య $= \frac{n(n-3)}{2} = 54$

$n(n-3) = 108 \Rightarrow 12 \times 9 = 108$

$\therefore n = 12$

జ: 4



3 ఒక క్రమ దశభుజి యొక్క బాహ్యకోణాల మొత్తం ఎంత?
1) 360° 2) 1440° 3) 720° 4) 1080°

వివరణ: ఏ బహుభుజి అయినా బాహ్యకోణాల మొత్తం = 360°

జ: 1

4 ఒక పంచభుజిలో అంతర కోణాల మొత్తం ఎంత?
1) 1080° 2) 720° 3) 1440° 4) 540°

వివరణ: n భుజాలున్న బహుభుజిలో అంతర కోణాల మొత్తం

$= (n-2) \times 180^\circ \Rightarrow$ పంచభుజి n = 5

$(5-2) \times 180 \Rightarrow 3 \times 180^\circ = 540^\circ$

జ: 4

5 15 భుజాలున్న క్రమ బహుభుజిలో ఒక్కో అంతర కోణం ఎంత?
1) 144° 2) 156° 3) $128\frac{4^\circ}{7}$ 4) 120°

వివరణ: ఒక్కో అంతరకోణం $= \frac{(n-2) \times 180^\circ}{n}$

$= \frac{(15-2) \times 180}{15} \Rightarrow 13 \times 12 = 156^\circ$


జ: 2

6 ఒక బహుభుజిలో భుజాల సంఖ్య.. కర్ణాల సంఖ్యలో $\frac{2}{7}$వ వంతు అయితే ఆ బహుభుజి పేరేంటి?
1) దశభుజి 2) అష్టభుజి 3) షడ్భుజి 4) సప్తభుజి

వివరణ: భుజాలు : కర్ణాలు

2 : 7

2x 7x



కర్ణాల సంఖ్య $= \frac{n(n-3)}{2}$

$7x = \frac{2x(2x-3)}{2} \Rightarrow 7 = 2x - 3$

$2x = 7 + 3 = 10 \Rightarrow x = 5$

భుజాల సంఖ్య = 2x = 10 (దశభుజి)

జ: 1



రచయిత: పిరాది నరేష్

సరకు రవాణా సామర్థ్యాన్ని పెంచే రుద్రాస్త్ర!

కరెంట్ అఫైర్స్ రౌండప్ - 2025 — ఆగస్టు

రష్యా చమురు కొనవద్దనే హెచ్చరికలను భారత్ ఖాతరు చేయకపోవడంతో అమెరికా అధ్యక్షుడు ట్రంప్ గత ఆగస్టు నుంచి యాభై శాతం సుంకాలను విధించారు. ఆంధ్రప్రదేశ్‌లో రైతులకు అన్నదాత సుఖీభవ, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం మొదలయ్యాయి. తెలంగాణలో నూతన క్రీడావిధానాన్ని తీసుకొచ్చారు. తాజాగా జాతీయ చలనచిత్ర పురస్కారాలను ప్రకటించారు. ఆగస్టు పదిహేనున ప్రధాని నరేంద్ర మోదీ ఎర్రకోట నుంచి నూటమూడు నిమిషాలు ఏకధాటిగా ప్రసంగించి రికార్డు సృష్టించారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా ఒకేసారి రెండు భారీ యుద్ధనౌకలు ప్రారంభమయ్యాయి. షాంఘై సహకార సంస్థ శిఖరాగ్ర సదస్సులో పాల్గొనడానికి మోదీ చైనా పర్యటనకు వెళ్లి, అంతర్జాతీయ రాజకీయ సమీకరణల్లో మార్పులకు కేంద్రంగా నిలిచారు. ఉత్తర్‌ప్రదేశ్‌లోని జలాలాబాద్ పేరు పరశురాంపురిగా మారింది. నెల వారీగా చోటుచేసుకున్న ఇలాంటి ముఖ్యాంశాలను, వివిధ రంగాల పరిణామాలను, ప్రధాన వార్తలను పోటీ పరీక్షల అభ్యర్థులు ఇంకోసారి చదువుకోవాలి.



మృగరాజుల గణాంకాలపై విడుదలైన 16వ అంచనా నివేదిక ప్రకారం భారతదేశంలో ఆసియా సింహాల సంఖ్య 2025 నాటికి 891కి చేరింది. 2020లో ఈ సంఖ్య 674గా ఉంది.

ముఖ్యాంశాలు

- లెఫ్టినెంట్ జనరల్ పుష్పేంద్ర సింగ్ ఆగస్టు 1న వైస్ చీఫ్ ఆఫ్ ఆర్మీ స్టాఫ్ (వీసీఓఏఎస్)గా బాధ్యతలు చేపట్టారు.
- వైస్ అడ్మిరల్ సంజయ్ వాత్సయన్ 47వ వైస్ చీఫ్ ఆఫ్ నేవల్ స్టాఫ్ (వీసీఓఎన్ఎస్)గా ఆగస్టు 1న పదవి చేపట్టారు.
- భారత పురుషుల ఫుట్‌బాల్ జట్టుకు చీఫ్ కోచ్‌గా ఖలీద్ జమీల్ ఎంపికయ్యాడు. జాతీయ జట్టుకు ఒక భారతీయుడు చీఫ్ కోచ్‌గా నియమితులవటం గత 13 ఏళ్లలో ఇదే తొలిసారి.



71వ జాతీయ చలన చిత్ర పురస్కారాలను కేంద్రం ఆగస్టు 1న వెల్లడించింది. 2023 సంవత్సరానికి గాను ప్రకటించిన ఈ పురస్కారాల్లో ఉత్తమ చిత్రంగా 12th ఫెయిల్ నిలిచింది. ఉత్తమ నటుడి అవార్డుకు షారుక్ ఖాన్ (జవాన్), విక్రాంత్ మాసే (12th ఫెయిల్) సంయుక్తంగా ఎంపికయ్యారు. ఉత్తమ నటిగా రాణీ ముఖర్జీ, ఉత్తమ దర్శకుడిగా సుదీప్తో సేన్ (ది కేరళ స్టోరీ), ఉత్తమ సంగీత దర్శకుడిగా జీవీ ప్రకాష్ (వాతి) ఎంపికయ్యారు.

- అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ 'సర్దుబాటు చేసిన ప్రతీకార సుంకం' భారత్‌పై 25 శాతంగా ఉంటుందని, ఇది ఆగస్టు 7 నుంచి అమలవుతుందని ఆగస్టు 1న ప్రకటించారు. భారత్ సహా ఇతర దేశాలపై 10- 41% వరకు సుంకాలు విధించే కార్యనిర్వాహక ఉత్తర్వుపై సంతకం చేశారు.
- సౌర విద్యుదుత్పత్తిలో జపాన్‌ను అధిగమించిన భారత్ ప్రపంచంలో మూడో స్థానంలో ఉన్నట్లు అంతర్జాతీయ పునరుత్పాదక ఇంధన సంస్థ (ఐఆర్ఈఎన్ఏ) పేర్కొంది. జపాన్ 96,459 గిగావాట్ల విద్యుత్తును ఉత్పత్తి చేయగా, భారత్ 1,08,494 గిగావాట్లను ఉత్పత్తి చేసింది.
- తెలంగాణ రాష్ట్ర నూతన క్రీడావిధానాన్ని సీఎం రేవంత్ రెడ్డి ఆగస్టు 2న హైదరాబాద్‌లో నిర్వహించిన తెలంగాణ స్పోర్ట్స్ కాంక్లేవ్‌లో ఆవిష్కరించారు.
- 'అన్నదాత సుఖీభవ - పీఎం కిసాన్' కార్యక్రమాన్ని ఆగస్టు 2న ప్రకాశం జిల్లా, దర్శి మండలం, తూర్పువీరాయపాలెంలో సీఎం చంద్రబాబు ప్రారంభించారు.
- లద్దాఖ్‌లో పండే బెర్రీలు (సీబక్ థోర్న్), హిమాలయన్ గోధుమల (బక్‌వీట్) విత్తనాలను క్రూ - 11 మిషన్ ద్వారా పరీక్షల నిమిత్తం అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి ఆగస్టు 3న పంపించి, కొన్నిరోజుల పరీక్షల అనంతరం ఆగస్టు 10న భూమికి తీసుకొచ్చారు.
- ఝార్ఖండ్ ముక్తి మోర్చా (జేఎంఎం) అగ్ర నేత, ఝార్ఖండ్ మాజీ ముఖ్యమంత్రి శిబూ సోరెన్ (81) మరణించారు. ఆయన మూడుసార్లు సీఎంగా వ్యవహరించారు. 8 సార్లు లోక్‌సభకు, ఒకసారి రాజ్యసభకు ఎంపికయ్యారు. యూపీఏ హయాంలో మూడు సార్లు కేంద్ర బొగ్గు శాఖ మంత్రిగా పనిచేశారు.
- ఫిలిప్పీన్స్ అధ్యక్షుడు ఫెర్డినాండ్ రోముల్డేజ్ మార్కోస్ జూనియర్ భారత పర్యటనలో భాగంగా న్యూదిల్లీలో ప్రధాని మోదీతో సమావేశమయ్యారు. రెండు దేశాలూ వ్యూహాత్మక సహకార ఒడంబడికతో సహా మొత్తం 9 ఒప్పందాలపై సంతకాలు చేశాయి.



దేశంలోనే అత్యంత పొడవైన గూడ్స్ రైలు 'రుద్రాస్త్ర'ను ఆగస్టు 7న తూర్పు మధ్య రైల్వే ప్రారంభించింది. సరకు రవాణా సామర్థ్యాన్ని పెంచడమే లక్ష్యంగా దీన్ని ప్రారంభించారు.

- భారత్ నుంచి 2024-25 ఆర్థిక సంవత్సరంలో మొత్తం రూ.37.02 లక్షల కోట్ల (437.42 బిలియన్ డాలర్ల) విలువైన ఎగుమతులు జరిగినట్లు ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఎక్స్‌పోర్ట్ ఆర్గనైజేషన్స్ (ఫియో) వెల్లడించింది. ఇందులో 116.33 బిలియన్ డాలర్ల (రూ. 9.83 లక్షల కోట్లు) విలువైన ఎగుమతులతో గుజరాత్ అగ్ర స్థానంలో ఉంది.



- రష్యా నుంచి చమురు కొనొద్దన్న తన హెచ్చరికలను పట్టించుకోని భారత్‌పై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ సుంకాలను పెంచారు. భారత్ దిగుమతులపై ఇప్పటికే 25% సుంకాలు విధించిన ట్రంప్ దీన్ని 50 శాతానికి పెంచాడు. కొత్తగా విధించిన అదనపు 25 శాతం సుంకాలను ఆగస్టు 27 నుంచి అమలు చేస్తామని ట్రంప్ ప్రకటించాడు.
- 'నేతన్న భరోసా' పథకం కింద రూ.25 వేలు ఆర్థిక సాయం అందిస్తామని సీఎం చంద్రబాబు ఆగస్టు 7న ప్రకటించారు. చేనేత మగ్గాలకు 200 యూనిట్లు, మరమగ్గాలకు 500 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్తు ఆగస్టు నుంచే అమల్లోకి తీసుకొస్తున్నట్లు చెప్పారు.
- ఆంధ్రప్రదేశ్‌లో వంద శాతం అక్షరాస్యత సాధించేందుకు ఆ రాష్ట్ర వయోజన విద్యాశాఖ 'అక్షర ఆంధ్ర' కార్యక్రమాన్ని చేపట్టింది.
- ఈ - టికెట్లు కొనే ప్రయాణికులు 45 పైసలతోనే ప్రమాద బీమా సదుపాయం పొందవచ్చని రైల్వేశాఖ ప్రకటించింది.
- జాగ్వార్ లాండ్ రోవర్ (జేఎల్ఆర్) చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ (సీఈఓ)గా పీబీ బాలాజీ నియమితులయ్యారు. ఈ పదవికి నియమితులైన తొలి భారతీయుడు ఈయనే.
- విశాఖకు చెందిన ప్రముఖ ఇంద్రజాలికుడు బీఎస్ రెడ్డికి ప్రతిష్ఠాత్మక 'మెర్లిన్' అవార్డు లభించింది. మెజీషియన్ రంగంలో దీన్ని ఆస్కార్‌గా భావిస్తారు.
- తమ దేశంలో నేరం చేసి శిక్ష పడ్డ విదేశీయులను స్వదేశానికి తిప్పి పంపేందుకు బ్రిటన్ అనుసరిస్తున్న 'డిపోర్ట్ నౌ, అప్పీల్ లేటర్' విధానంలోకి భారత్ కూడా చేరింది.
- ఆంధ్రప్రదేశ్‌లో రూ.468 కోట్ల పెట్టుబడితో సెమీ కండక్టర్ యూనిట్ ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది.
- ప్రపంచంలోనే అత్యధిక రుణ భారం అమెరికా మీద ఉన్నట్లు వెల్లడైంది. అమెరికా ప్రభుత్వం తన రుణదాతలకు చెల్లించాల్సిన మొత్తం 37 లక్షల కోట్ల డాలర్లకు చేరింది. ఇది అమెరికా జీడీపీలో 122 శాతానికి సమానం.
- నీరజ్ ఘయ్వాన్ దర్శకత్వం వహించిన హోమ్ బౌండ్ చిత్రం ఇండియన్ ఫిల్మ్ ఫెస్టివల్ ఆఫ్ మెల్‌బోర్న్ (ఐఎఫ్ఎఫ్ఎం) - 2025లో ఉత్తమ చిత్రం, ఉత్తమ దర్శకుడి పురస్కారాన్ని గెలుచుకుంది.



బ్రిటన్ అత్యున్నత పౌర పురస్కారాల్లో ఒకటైన 'కమాండర్ ఆర్డర్ ఆఫ్ ది బ్రిటిష్ ఎంపైర్' (సీబీఈ) అవార్డును కింగ్ చార్లెస్ సోదరి ప్రిన్సెస్ అనీ చేతుల మీదుగా తెలుగు మహిళ పూర్ణిమ తణుకు అందుకొన్నారు.

- ఆగస్టు 15న ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు 'స్త్రీ శక్తి' పేరిట మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ పథకాన్ని ప్రారంభించారు.
- దేశంలో సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమ (ఎంఎస్ఎంఈ)ల రంగాన్ని బలోపేతం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం రైజింగ్ అండ్ యాక్సిలరేటింగ్ ఎంఎస్ఎంఈ పెర్ఫార్మెన్స్ (ఆర్ఏఎంపీ) పేరిట కొత్త పథకాన్ని ప్రవేశపెట్టింది.
- రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆగస్టు 19న జాతీయ క్రీడా బిల్లుకు ఆమోదముద్ర వేశారు.
- బ్రిటన్ నౌకాదళంలో సిబ్బందికి ధార్మిక, ఆధ్యాత్మిక మార్గదర్శనం చేసేందుకు తొలిసారిగా ఓ హిందూ చాప్లెయిన్ (పురోహితుడు)గా హిమాచల్‌ప్రదేశ్‌కు చెందిన భాను అత్రి నియమితులయ్యారు. క్రైస్తవుడు కాని వ్యక్తి చాప్లెయిన్‌గా ఎంపికకావడం ఇదే ప్రథమం.




స్వాతంత్ర్యదినోత్సవం సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ ఎర్రకోట బురుజు నుంచి 103 నిమిషాలు ఏకధాటిగా ప్రసంగించి రికార్డు సృష్టించారు. ఏ ప్రధానీ ఇంత సుదీర్ఘ ప్రసంగం ఇవ్వలేదు. 2017లో మోదీ 98 నిమిషాల పాటు ప్రసంగించారు.

- మధ్యమ శ్రేణి బాలిస్టిక్ క్షిపణి అగ్ని-5ను భారత రక్షణ శాఖ ఆగస్టు 20న ఒడిశాలోని చాందీపుర్ పరీక్ష కేంద్రం నుంచి విజయవంతంగా ప్రయోగించింది. 5 వేల కి.మీ. పరిధి ఉన్న ఈ క్షిపణికి ఒకేసారి మూడు అణువార్ హెడ్‌లను మోసుకెళ్లి దాడి చేసే సామర్థ్యం ఉంది.
- షాంఘై సహకార సంస్థ (ఎస్‌సీఓ) 25వ శిఖరాగ్ర సదస్సు ఆగస్టు 31న తియాన్‌జిన్‌లో ప్రారంభమైంది. భారత్, చైనా, రష్యా, ఇరాన్, పాకిస్థాన్ సహా 26 దేశాల అగ్రనేతలు పాల్గొన్నారు.
- పీఎం పీఓఎస్‌హెచ్ఏఎన్, వివిధ రంగాల్లో పోషకాహార కార్యక్రమాల ద్వారా రక్తహీనత, పోషకాహార లోపాన్ని ఎదుర్కోవడానికి, కేంద్ర ప్రభుత్వం రూ.17,082 కోట్ల నిధులతో ఫోర్టిఫైడ్ రైస్ పథకాన్ని 2028 వరకూ పొడిగిస్తూ నిర్ణయం తీసుకుంది.
- ఉత్తర్‌ప్రదేశ్‌లోని షాజహాన్‌పుర్ జిల్లాలోని, జలాలాబాద్ పట్టణం పేరును పరశురాంపురిగా మార్చేందుకు కేంద్ర ప్రభుత్వం అధికారికంగా ఆమోదం తెలిపింది.



స్వీయ సాంకేతికతతో తయారు చేసిన నీలగిరి శ్రేణి నౌకలైన ఐఎన్ఎస్ హిమగిరి, ఐఎన్ఎస్ ఉదయగిరిలను రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్, నౌకా దళాధిపతి అడ్మిరల్ త్రిపాఠీ ఆగస్టు 25న విశాఖపట్నంలోని నేవల్ బేస్ ఐఎన్ఎస్ సర్కార్‌లో జాతికి అంకితం చేశారు. ఒకేసారి రెండు భారీ యుద్ధ నౌకలను ప్రారంభించడం భారత రక్షణ చరిత్రలో ఇదే తొలిసారి.


- ఆగస్టు 19 నుంచి 21 వరకు థాయ్‌లాండ్‌లోని పుకెట్‌లో జరిగిన 23వ ఏఐబీడీ జనరల్ కాన్ఫరెన్స్‌లో భారత్ - ఆసియా - పసిఫిక్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ బ్రాడ్ కాస్టింగ్ డెవలప్‌మెంట్ (ఏఐబీడీ)ఎగ్జిక్యూటివ్ బోర్డు ఛైర్మన్‌గా ఎన్నికైంది.
- సెర్గియో గోర్ భారత్‌లో తదుపరి అమెరికా రాయబారిగా, దక్షిణ, మధ్య ఆసియాకు ప్రత్యేక రాయబారిగా నియమితులయ్యారు.
- లండన్‌కు చెందిన వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్ గోల్డ్ ఎడిషన్‌లో ప్రముఖ నటుడు బాలకృష్ణకు చోటు దక్కింది. భారతీయ చిత్ర పరిశ్రమలో ఈ గౌరవాన్ని పొందిన తొలి నటుడు ఈయనే.
- ఫిజీ ప్రధానమంత్రి సితివేణి రబుక భారత పర్యటనలో భాగంగా ఆగస్టు 25న న్యూదిల్లీలో ప్రధాని మోదీతో సమావేశమయ్యారు. ఏడు ఒప్పందాల పై ఇరు దేశాలు సంతకాలు చేశాయి.
- దక్షిణ లెబనాన్‌లో ఐదు దశాబ్దాలుగా కొనసాగుతున్న ఐక్యరాజ్య సమితి శాంతి స్థాపక దళం 2026 చివరలో రద్దవుతుందని భద్రతా మండలి ఆగస్టు 28న తీర్మానించింది.
- 2030 కామన్వెల్త్ క్రీడల ఆతిథ్య హక్కుల బిడ్‌కు కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ఈ క్రీడల వేదికగా అహ్మదాబాద్‌ను తీర్మానించింది.
- దేశంలో అత్యధికంగా ఆహార ఉత్పత్తుల రంగంలో 21.67 లక్షల మంది పనిచేస్తున్నట్లు ప్రభుత్వ గణాంకాలు వెల్లడించాయి. దేశవ్యాప్తంగా ఉన్న పరిశ్రమల్లో 15.99% వాటా ఆహార ఉత్పత్తులదే. తర్వాతి స్థానాల్లో జౌళి, ప్రాథమిక లోహాల రంగాలు ఉన్నాయి.
- తెలంగాణ రాష్ట్రం, సూర్యాపేట జిల్లా పెన్‌పహాడ్ జడ్పీ పాఠశాలలో జీవశాస్త్ర ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్న మాదం పవిత్ర జాతీయ ఉత్తమ ఉపాధ్యాయినిగా ఎంపికయ్యారు.
- ప్రపంచ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్ - 2025లో సాత్విక్ సాయిరాజ్- చిరాగ్ శెట్టి జోడీ కాంస్య పతకం నెగ్గింది. ప్రపంచ బ్యాడ్మింటన్‌లో ఈ జోడీకి ఇది రెండవ పతకం. 2022లోనూ కాంస్యం నెగ్గింది. సింధు (5), సైనా (2) తర్వాత ప్రపంచ బ్యాడ్మింటన్‌లో రెండు పతకాలు గెలిచిన భారత షట్లర్లు సాత్విక్, చిరాగ్‌లు.



రచయిత: సీహెచ్ కృష్ణప్రసాద్

పేపర్ కటింగ్


పోటీపరీక్షల్లో రీజనింగ్ విభాగంలో పేపర్ కటింగ్ అనే అంశం నుంచి ప్రశ్నలు అడుగుతుంటారు. దీనిలో X, Y, Z అనే మూడు పేపర్ కటింగ్ చిత్రాలు ఉంటాయి. ఇది కాగితాన్ని మడతపెట్టే క్రమాన్ని తెలుపుతుంది. చిత్రం Z అనేది పేపర్‌ను కత్తిరించిన విధానాన్ని సూచిస్తుంది. కొన్నిసార్లు Xలోనే పేపర్ కత్తిరింపు ప్రక్రియను చూపిస్తారు. మడత విప్పినప్పుడు వచ్చే చిత్రం ఏ విధంగా ఉంటుందనేది ఐచ్ఛికాల నుంచి అభ్యర్థి ఎంచుకోవాలి. పోటీపరీక్షార్థుల ఆలోచన సామర్థ్యాన్ని తెలుసుకునేందుకే ఈ రకమైన ప్రశ్నలు ఇస్తుంటారు. నిత్య సాధనతో ఈ విధమైన ప్రశ్నలకు సమాధానాలు సులువుగా కనిపెట్టొచ్చు.





కత్తిరింపు క్రమం గమనిస్తే.. కంటపడే జవాబు చిత్రం!


ఏపీపీఎస్సీ పరీక్షల ప్రత్యేకం — రీజనింగ్


సూచన (ప్రశ్న. 1 – 9): కింది ప్రశ్నలకు సరైన ఐచ్ఛికాలను ఎంచుకోండి.


1.



2.



3.



4.


5.


6.


7.


8.


9.


సమాధానాలు

1-3 2-3 3-4 4-4 5-2 6-3 7-2 8-3 9-3



రచయిత
బూసర గణేష్, విషయ నిపుణులు

Word of the Day 877

Turpitude

Telugu meaning: దుర్మార్గం, క్రూరత్వం

English meaning: The word turpitude (టర్పిట్యూడ్) is a noun that refers to moral corruption, depravity, or extreme wickedness.

Synonyms: Corruption, Immorality

Antonyms: Integrity, Virtue

Usage: **1.** The court condemned the crime as an act of moral turpitude that shocked the conscience of society.

2. History often records how leaders' personal turpitude eventually led to their political downfall.

కరెంట్ అఫైర్స్



ఒడిశా, చాందీపూర్‌లోని ఇంటిగ్రేటెడ్ టెస్ట్ రేంజ్‌లో చేపట్టిన దీర్ఘశ్రేణి గైడెడ్ రాకెట్ పినాక తొలి ప్రయోగం విజయవంతమైంది. ఈ రాకెట్ 120 కిలోమీటర్ల దూరం ప్రయాణించింది. నిర్దేశిత రీతిలో గాలిలో పలు విన్యాసాలు చేసింది. దీన్ని రక్షణ పరిశోధన, అభివృద్ధి సంస్థకు చెందిన ఆర్మమెంట్ రిసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఎస్టాబ్లిష్‌మెంట్ ల్యాబ్ తయారుచేసింది. దీనికి హై ఎనర్జీ మెటీరియల్స్ రిసెర్చ్ ల్యాబ్, హైదరాబాద్‌లోని డీఆర్‌డీఎల్, రిసెర్చ్ సెంటర్ ఇమారత్‌లు తోడ్పాటు అందించాయి.




ప్రపంచ ర్యాపిడ్ ఛాంపియన్‌షిప్‌లో డిఫెండింగ్ ఛాంపియన్ కోనేరు హంపి, అర్జున్ ఇరిగేసి కాంస్య పతకాలు సాధించారు. హంపి రష్యా, చైనా ఆటగాళ్లతో సమానంగా నిలిచినా టైబ్రేక్ స్కోరులో మూడో స్థానానికి పరిమితమైంది. ఓపెన్ విభాగంలో అర్జున్ పతకం గెలవగా, ఇందులోనూ టైబ్రేక్‌లోనే ఫలితం తేలింది. అయితే ప్రపంచ చెస్‌లో అర్జున్‌కు ఇదే తొలి పతకం.

భారత సంతతికి చెందిన అంతర్జాతీయ సంపన్న సీఈఓల్లో జయశ్రీ ఉల్లాల్ అగ్రస్థానంలో నిలిచారు. హురున్ ఇండియా రిచ్ లిస్ట్ 2025 ప్రకారం, ఈమె నికర సంపద రూ.50170 కోట్లు. ప్రస్తుతం ఈమె అరిస్టా నెట్‌వర్క్ ప్రెసిడెంట్, సీఈఓగా ఉన్నారు. కంప్యూటర్ నెట్‌వర్కింగ్ కంపెనీ అయిన అరిస్టా నెట్‌వర్క్‌లో 2008 నుంచి ఈమె తన సేవలు అందిస్తున్నారు. మైక్రోసాఫ్ట్ సీఈఓ సత్య నాదెళ్ల రూ.9770 కోట్లతో రెండో స్థానంలో ఉండగా, రూ.5810 కోట్లతో గూగుల్ సీఈఓ సుందర్ పిచాయ్ ఏడో స్థానంలో ఉన్నారు.

2024-25 ఆర్థిక సంవత్సరంలో వాణిజ్య బ్యాంకులు బలమైన పనితీరును కనబరిచాయని, మొండి బకాయిలు దశాబ్దాల కనిష్ఠానికి చేరాయని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) తెలిపింది. ఈ మేరకు 'ట్రెండ్ అండ్ ప్రోగ్రెస్ ఆఫ్ బ్యాంకింగ్ ఇన్ ఇండియా 2024-25' నివేదికను 29 డిసెంబరు 2025న విడుదల చేసింది. 2024-25లో అన్ని షెడ్యూల్డ్ వాణిజ్య బ్యాంకుల నికర లాభం 14.8% వృద్ధితో 4.01 లక్షల కోట్లకు చేరినట్లు వెల్లడించింది. గత ఆర్థిక సంవత్సరంలో 32.8% వార్షిక వృద్ధితో 3.5 లక్షల కోట్లుగా నమోదైంది.

మరిన్ని కరెంట్ అఫైర్స్ కోసం క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

దేశంలో ప్రధాన నీటిపారుదల ప్రాజెక్టులు/ డ్యామ్‌లు

స్టడీ జోన్

భారత్ ప్రధానంగా వ్యవసాయ ఆధారిత దేశం. నేటికీ అధిక శాతం ప్రజలు వ్యవసాయం, దాని అనుబంధ రంగాల్లో పనిచేస్తున్నారు. వ్యవసాయానికి నీరు ప్రధాన సహజ వనరు. సంవత్సరం పొడవునా దీనికి నీళ్లు అవసరం. పూర్వం వ్యవసాయం వర్షాధారంగా సాగేది. అయితే దేశంలో వర్షపాతం కొన్ని నెలలకే పరిమితం. రుతుపవనాలు అనుకూలంగా లేకపోతే అదీ కష్టమే.

వర్షాభావ పరిస్థితులను అధిగమించి పంటలకు కృత్రిమంగా మానవ ప్రయత్నం ద్వారా నీరు అందించడాన్ని 'నీటిపారుదల' అంటారు. జనాభా పరంగా భారత్ ప్రపంచంలోనే తొలిస్థానంలో ఉంది. వేగంగా పెరుగుతున్న జనాభాకు ఆహారం, ప్రాథమిక నిత్యావసర వస్తువులు అందించడానికి నీటిపారుదల అవసరం. అందు కోసమే చెరువుల తవ్వకం, ఆనకట్టలు, రిజర్వాయర్లు, డ్యామ్‌ల నిర్మాణం జరుగుతోంది.

ప్రాజెక్టులు ఎందుకు?

వ్యవసాయం ప్రధానమైన భారతదేశం భూగోళంలో ఉత్తరార్ధ భాగంలో ఉప ఆయన మండలం (సబ్ ట్రాపికల్ రీజియన్)లో ఉంది. దీంతో మనకు నీటి ఆవశ్యకత చాలా ఎక్కువ. దేశ వ్యవసాయం రుతుపవనాలపై ఆధారపడి ఉండటంతో కొన్నిసార్లు ఎక్కువగా, మరికొన్నిసార్లు సాధారణం కంటే తక్కువగా వర్షపాతం నమోదవుతుంది. దేశవ్యాప్తంగా వర్షపాతంలో విపరీతమైన వ్యత్యాసాలు ఉన్నాయి. అందుకే తక్కువ వర్షపాతం ఉన్న ప్రాంతాలకు ప్రాజెక్టుల ద్వారా నీటిపారుదల సౌకర్యం కల్పించాల్సి వస్తోంది.

ఆవశ్యకత

దేశాభివృద్ధికి బహుళార్థ సాధక ప్రాజెక్టులు ఎంతో అవసరం. ఇవి మిలియన్ల కొద్దీ హెక్టార్లకు నీరివ్వడంతో పాటు, విద్యుత్ ఉత్పాదన, వినోద




విహారాలు లాంటి బహుళ ప్రయోజనాలను అందిస్తాయి. తాగునీరు, సాగునీరు, వరద నివారణ, జలరవాణా, విహార యాత్రలు, మత్స్య సంపద అభివృద్ధి, భూసార సంరక్షణ, కృత్రిమ వనాల పెంపకం లాంటి ఎన్నో ప్రయోజనాలు బహుళార్థ సాధక ప్రాజెక్టుల వల్ల కలుగుతున్నాయి.

బహుళార్థ సాధక ప్రాజెక్టు అంటే ఏమిటి? ప్రాజెక్టుల వర్గీకరణ, గత పరీక్షల్లో అడిగిన ప్రశ్నలు - జవాబుల కోసం క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

జనరల్ స్టడీస్ - భారతదేశ చరిత్ర

భారత జాతీయోద్యమం (1935-39)



గాంధీజీ నాయకత్వంలో జరిగిన శాసనోల్లంఘన ఉద్యమం భారతదేశ చరిత్రలోనే ఒక అపూర్వ ఘట్టం. ఇది ప్రజల్లో స్వాతంత్ర్య కాంక్షను బలంగా రగిల్చింది. అదే స్ఫూర్తితో కాంగ్రెస్ పార్టీ అనేక రాజకీయపరమైన నిర్ణయాలు తీసుకుంది. ఆ పార్టీపై మహాత్మా గాంధీ ప్రభావం అలాగే నిలిచిపోయింది. అయినప్పటికీ సామ్యవాదం, కమ్యూనిజం మొదలైన సిద్ధాంతాల ఆవిర్భావంతో కాంగ్రెస్‌లో కొంత మార్పు వచ్చింది. 1935-39 మధ్యకాలంలో భారతదేశంలో జరిగిన జాతీయవాద రాజకీయాలు, 'భారత ప్రభుత్వ చట్టం-1935', కాంగ్రెస్ మంత్రివర్గాలు మొదలైనవాటిపై పోటీపరీక్షార్థికి అవగాహన ఉండాలి.

రాజకీయ సంస్థలు

ఈ కాలంలోనే అఖిల భారత కిసాన్ సభ, అఖిల భారత విద్యార్థి ఫెడరేషన్, అఖిల భారత ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ లాంటి సంస్థలు ఏర్పాటయ్యాయి.

భారత ప్రభుత్వ చట్టం–1935

సైమన్ కమిషన్ నివేదిక, మూడు రౌండ్ టేబుల్ సమావేశాల్లో వచ్చిన సూచనలన్నీ కలిపి 1933లో ఒక శ్వేత పత్రంగా వెలువడ్డాయి. వీటిని పరిశీలించేందుకు లార్డ్ లిన్‌లిత్‌గో నాయకత్వంలో పార్లమెంట్ ఒక జాయింట్ సెలెక్ట్ కమిటీని ఏర్పాటు చేసింది. దీని నివేదిక ఆధారంగా బ్రిటిష్ పార్లమెంట్ 'భారత ప్రభుత్వ చట్టం-1935'ను ప్రవేశపెట్టింది.

కాంగ్రెస్ అధ్యక్షులుగా నెహ్రూ, 1937లో సాధారణ ఎన్నికలు, ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ స్థాపన, రెండో ప్రపంచ యుద్ధం - భారత జాతీయ కాంగ్రెస్, ఆగస్టు ప్రతిపాదన మొదలైన అంశాలతో సహా పూర్తి సమాచారం ఈ-బుక్ రూపంలో 'ఈనాడు ఈప్రతిభ' వెబ్‌సైట్‌లో 'జనరల్ స్టడీస్ ఈ-బుక్స్' కోర్సులో అందుబాటులో ఉంది. మరిన్ని వివరాలకు క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

Latest Updates

Apprentice Posts

Indian Oil Corporation Limited (IOCL) is inviting applications for the recruitment of Graduate, Diploma and ITI Apprentice posts in various departments in the Eastern Region. Total no.of posts is 509. Last date for online applications is 9 January 2026.

Senior Manager Posts

National Highways Infrastructure Development Corporation Limited (NHIDCL) is inviting applications for the Senior Manager (Technical), Deputy General Manager (Technical), General Manager (Technical), Senior General Manager (Technical). Total no.of posts is 48. Last date for online applications is 13 January 2026.

Associates Posts

National Highways Infrastructure Development Corporation Limited (NHIDCL) is inviting applications for the Associates posts. Total no.of posts is 64. Last date for online applications is 12 January 2026.

Did You Apply..?

Today (December 31) is the last date for the following Jobs

- SSC released notification with 25,487 posts. ***Qualifications:*** Matriculation or 10th.
- 68 Junior Resident Jobs at AIIMS Bilaspur. ***Eligibility:*** MBBS/ BDS.
- 99 Senior Resident jobs at ESIC Ranchi. ***Eligibility:*** MBBS/ MD/ MS.
- 107 posts in Uranium Corporation of India Limited. ***Eligibility:*** 10th class.

For more information and other notifications - scan QR code

Bank Exams

English

Phrase Replacement

Directions (Qs. 1 - 12): *Here, a sentence is given with a word/phrase bold and five options (A), (B), (C), and (D) are provided as alternatives for phrase replacement. Choose the correct alternative that makes the sentence grammatically and contextually accurate, without changing the actual meaning of the sentence. If the sentence is error-free, choose (E) as your answer.*

1. The customer requested the branch manager to **look into on** the delay in processing his loan application.
A) look into B) looking into
C) look on D) look for
E) No correction required

2. The board decided that the report should be submitted **in every quarter basis** to maintain transparency.
A) in quarterly basis
B) on a quarterly basis
C) at each quarter basis
D) every quarterly basis
E) No correction required

3. The assistant manager warned that employees must avoid **sharing of passwords to others** under any circumstances.
A) share passwords among others
B) to share passwords with others
C) share password to others
D) sharing passwords with others
E) No correction required

4. The compliance team advised the bank to strengthen its data privacy to **avoid from cyber threats**.
A) avoid cyber threats
B) avoid in cyber threats
C) avoid against cyber threats
D) avoid on cyber threats
E) No correction required

5. The cashier apologized for the inconvenience caused and assured the issue would be resolved **in earliest possible time**.
A) in the earliest time
B) at earliest possible
C) at the earliest possible time
D) in earliest time possible
E) No correction required

6. The manager ensured that the employees were trained **to handle with customer concerns professionally**.
A) for handling customer's concerns professional
B) to handling customer concerns professional
C) for handle customers concern professionally
D) to handle customer concerns professionally
E) No correction required

7. The bank plans to introduce new services **for meets increasing digital demands** of customers.
A) to met increasing digital demands
B) for meeting increasing digital demands
C) to meet increasing digital demands
D) for meet increasing digital demands
E) No correction required

8. The senior analyst was praised **for performing exceptional in** her recent assignments.
A) for exceptionally perform in
B) for perform exceptional in
C) for performing exceptionally in
D) for exceptional performance in
E) No correction required

9. Employees are strictly prohibited **from using of personal email** for official communication.
A) to using their personal emails
B) from using their personal email
C) from use personal email
D) for using their personal email
E) No correction required

10. The company has launched an online portal **to provide a smoother** loan application experience.
A) for provide a smoother
B) to provided a smoother
C) to providing smoother
D) for provided smoother
E) No correction required

11. The applicant was advised to submit all required documents **prior of the deadline**.
A) prior to the deadline
B) prior on the deadlines
C) prior deadline D) prior of deadline
E) No correction required

12. The bank believes that customer satisfaction is key **for retaining their loyalty**.
A) key to retain their loyalty
B) key in retaining their loyalty
C) key to retaining its loyalty
D) key to retaining loyalty it
E) No correction required

Scan the QR code for Key

Writer: P. Manoj Kumar, Subject Expert



భద్రమైన కెరియర్‌కు..

సైబర్ సెక్యూరిటీ

సైబర్ సెక్యూరిటీ రంగంలో ప్రారంభ స్థాయి నుంచి సీనియర్ హోదా వరకూ విభిన్న నైపుణ్యాలున్న సమర్థుల కోసం సంస్థలు అన్వేషిస్తున్నాయి.

"సైబర్ ప్రపంచంలో సెకనుకో మోసం జరుగుతూ, భద్రత పెనుముప్పులో పడిన వేళ సైబర్ సెక్యూరిటీ ప్రాధాన్యం పెరుగుతోంది. ఈ రంగాన్ని నిపుణుల కొరత తీవ్రంగా వెన్నాడుతోంది. దేశంలో వేల సంఖ్యలో ఐటీ సేవలు అందించే సంస్థలు ఉన్నాయి. వీటన్నిటికీ డేటా భద్రత కోసం సైబర్ సెక్యూరిటీ నిపుణులు అవసరం. మిగతా రంగాల్లో ఉద్యోగాలకు ఏఐ సెగ తగులుతున్న నేపథ్యంలో సైబర్ సెక్యూరిటీ నిపుణులకు మాత్రం సంస్థలు ఎర్ర తివాచీ పరుస్తున్నాయి."

సైబర్ సెక్యూరిటీ అనలిస్ట్: నేర చట్టంలో ప్రాథమిక సూత్రం ఒకటి ఉంది. నేరం జరిగాక పరిశోధన కంటే.. నేరం జరగకుండా చూడగలగడమే ముఖ్యం. సైబర్ సెక్యూరిటీ అనలిస్టులు అదే పని చేస్తారు. సైబర్ దాడులకు ఎక్కడెక్కడ అవకాశాలున్నాయో బృందాల ద్వారా పరిపరి విధాలుగా పరిశీలిస్తారు. ఎక్కడైనా ప్రమాదాన్ని శంకిస్తే వెంటనే కార్యరంగంలోకి దూకుతారు. ఐటీ టీమ్‌కు భరోసా ఇస్తారు.

ఎథికల్ హ్యాకర్: సంస్థ ఐటీ కార్యకలాపాలను నిశితంగా పరిశీలిస్తూ ఎక్కడెక్కడ రక్షణ వలయాన్ని ఛేదించి ప్రవేశించవచ్చో దుర్బిణీ వేసుకొని వెతుకుతుంటారు. ఎక్కడైనా అవకాశం కనిపిస్తే చొరబడేందుకు వెనకాడరు. ఎథికల్ హ్యాకర్లను చొరబాటు పరిశీలకులు (పెనిట్రేషన్ టెస్టర్) అని కూడా పిలుస్తారు.

సెక్యూరిటీ ఇంజినీర్: ప్రాథమికంగా సంస్థ అనుసరిస్తున్న సైబర్ సెక్యూరిటీ సాధనాల (టూల్స్)ను సమర్థంగా అమలు చేసే బాధ్యత వహిస్తారు. ఎప్పటికప్పుడు వీటిని అప్డేట్ చేస్తుంటారు.

ఇన్సిడెంట్ రెస్పాండర్: సంస్థ అనుసరిస్తున్న సైబర్ భద్రతా వలయాన్ని దాటి చొరబాటు సంఘటన జరిగినప్పుడు వీరు తక్షణం స్పందిస్తారు. మరింత ముప్పు వాటిల్లకుండా జాగ్రత్తలు తీసుకుంటారు.

డిజిటల్ ఫోరెన్సిక్ ఇన్వెస్టిగేటర్: సంస్థ డేటాపై సైబర్ దాడి జరిగినప్పుడు దానిపై దర్యాప్తు చేసి రక్షణ వ్యవస్థలోని లోపాలను వెలికితీసే హోదా ఇది. ఫలితంగా అదే తరహా దాడి భవిష్యత్తులో జరగకుండా రక్షణ వ్యవస్థను పదిలం చేసేందుకు సూచనలిస్తారు.

ఉపాధి పథం నైపుణ్య సాధనం

సెక్యూరిటీ ఆర్కిటెక్ట్: సంస్థ సిస్టమ్ నెట్‌వర్క్ డేటా అనుసంధాన వ్యవస్థలను పరిశీలించి, భద్రతా వలయాలకు రూపకల్పన చేసే నిపుణులే సెక్యూరిటీ ఆర్కిటెక్టులు.

నెట్‌వర్క్ సెక్యూరిటీ

సైబర్ చొరబాటుదారులు ఎప్పుడూ విస్తృత నెట్‌వర్కుల్లోకి ప్రవేశించేందుకు ప్రయత్నిస్తారు. అదే లాభసాటిగా భావిస్తారు. దీనికి విరుగుడుగా నెట్‌వర్క్‌ను పరిరక్షించగలిగే ప్రొఫెషనల్స్ కోసం సంస్థలు గాలిస్తున్నాయి. ఫైర్‌వాల్స్, వీపీఎన్, రౌటింగ్, వివిధ నెట్‌వర్క్ విభాగాలపై పట్టు ఉన్నవారికి ఈ రంగంలో అపార అవకాశాలున్నాయి.

ఆపరేటింగ్ సిస్టమ్స్

దొంగల నుంచి ఇంటి రక్షణకు వేసే తాళాలు గట్టిగా ఉండేలా చూసుకుంటాం. ప్రస్తుతం వాడుతున్న తాళాలు ఏ మాత్రం భద్రమైనవో ఒకటికి రెండు సార్లు సరిచూస్తాం. అలాగే ఐటీ వ్యవస్థలో ఆపరేటింగ్ సిస్టమ్స్ విండోస్, లినక్స్‌పై గట్టి పట్టున్న నిపుణులకు సైబర్ సెక్యూరిటీలో మంచి భవిష్యత్తు ఉంది.

సైబర్ దాడుల ముప్పు నిర్వహణ నిపుణులు

సంస్థ నెట్‌వర్క్‌పై దాడులు జరిగిన తర్వాత బాధపడటం కంటే ప్రస్తుత వ్యవస్థను సునిశితంగా పరిశీలించాలి. ఇందుకోసం దాడుల ముప్పును ముందే పసిగట్టగలిగే నిపుణుల సేవలు అమూల్యం. ఇటువంటి నైపుణ్యాలు ఉన్నవారికి సంస్థలు పెద్ద పీట వేస్తాయి.


నష్ట నివారణ

సైబర్ నేరాల్లో 'గోల్డెన్ అవర్' సూత్రం తెరపైకి వచ్చింది. సైబర్ ఉపద్రవం జరగగానే మీనమేషాలు లెక్కిస్తే అమూల్యమైన సమయాన్ని కోల్పోయినట్లే. ఇలాంటి సందర్భాల్లో తక్షణం స్పందించి మిగతా నెట్‌వర్కులను రక్షించగలిగే నిపుణుల సేవలు ఎంతో కీలకం. వీరినే ఇన్సిడెంట్ రెస్పాన్సర్లని పిలుస్తారు. సైబర్ సెక్యూరిటీ పరంగా ఈ సామర్థ్యాలను నేర్చుకున్న వారికి మంచి అవకాశాలు ఎదురు చూస్తున్నాయి.

ఇవే కాకుండా సంస్థల కార్యకలాపాలపై ఆధారపడి సైబర్ సెక్యూరిటీ వ్యవస్థలో విభిన్నమైన హోదాలు తెరపైకి వస్తున్నాయి. ఆ అవసరాలు తీర్చగలిగే నిపుణుల కోసం సంస్థలు ఎదురు చూస్తున్నాయి.

మనకు దప్పికగా ఉన్నప్పుడు సుదూరంగా అపార జలరాశి కనిపించవచ్చు. అక్కడకు చేరుకోవడానికి దగ్గరి దారి కనిపెట్టాలి. కావలసినన్ని నీళ్లు తెచ్చుకునేందుకు తగిన పాత్ర మన వద్ద ఉండాలి. దేశ సైబర్ సెక్యూరిటీ రంగానికి 8 లక్షల మంది నిపుణుల అవసరం ఉన్నప్పటికీ అందుకు కావలసిన నైపుణ్యాలను సంతరించుకున్నవారే పోటీలో ముందుంటారు.

సైబర్ సెక్యూరిటీ రంగంలో మన దేశంలో ఏటా 15.8 శాతం ఉద్యోగాలు పెరుగుతున్నాయి. వీటిలో ఏ విధమైన నైపుణ్యాలకు రాణింపు ఉందో తెలుసుకోవాలి. వాటిని పొందగలిగే కోర్సులను గుర్తించి, క్షుణ్ణంగా నేర్చుకోవాలి. ఇలా చేస్తే సైబర్ నేర నివారణ పరిష్కర్తల్లో ఒకరిగా గుర్తింపు పొందవచ్చు. వృత్తి పరంగా భవిష్యత్తులో మరింతగా రాణించవచ్చు.





యస్.వి. సురేష్
సంపాదకుడు, ఉద్యోగ సోపానం

వర్క్ ఫ్రమ్ హోమ్

ఇంటర్న్‌షిప్స్

జీఐఎస్ మ్యాపింగ్

సంస్థ: అర్బర్ రిసెర్చ్ ఇండియా
నైపుణ్యాలు: ఆర్క్‌జీఐఎస్, క్యూజీఐఎస్
స్టైపెండ్: రూ.7,500-15,000
దరఖాస్తు గడువు: జనవరి 18
☛ https://tinyurl.com/y4zjvjsv

కంటెంట్ క్రియేటర్ (యాడ్స్)

సంస్థ: గ్రాఫిక్స్ సోషల్ ప్రై.లి.
నైపుణ్యాలు: హిందీ మాట్లాడటం, సోషల్ మీడియా మార్కెటింగ్
స్టైపెండ్: రూ.5,000-10,000
దరఖాస్తు గడువు: జనవరి 21
☛ https://tinyurl.com/nxtpwt55

ప్రోగ్రామ్ అసోసియేట్

సంస్థ: పాజ్ ఫౌండేషన్ (ఎన్జీవో)
నైపుణ్యాలు: బిజినెస్ అనాలిసిస్, బిజినెస్ రిసెర్చ్, ఎఫెక్టివ్ కమ్యూనికేషన్, ఇంగ్లిష్ మాట్లాడటం, రాయడం, ఈవెంట్ మేనేజ్‌మెంట్, మార్కెటింగ్, ఎంఎస్-ఆఫీస్, ప్రొడక్ట్ మేనేజ్‌మెంట్, ప్రాజెక్ట్ మేనేజ్‌మెంట్, టైమ్ మేనేజ్‌మెంట్
స్టైపెండ్: రూ.1,500-15,000
దరఖాస్తు గడువు: జనవరి 21
☛ https://tinyurl.com/yb3nzab6

హైదరాబాద్‌లో కంటెంట్ రైటింగ్

సంస్థ: గ్రారీ ప్రై.లి.
నైపుణ్యాలు: క్రియేటివ్ రైటింగ్, డిజిటల్, సోషల్‌మీడియా మార్కెటింగ్, ఇంగ్లిష్ మాట్లాడటం, రాయడం, ఎంఎస్-ఎక్సెల్, ఎంఎస్-ఆఫీస్
స్టైపెండ్: రూ.15,000-25,000
దరఖాస్తు గడువు: జనవరి 7
☛ https://tinyurl.com/4eyueu3y

కంటెంట్ మార్కెటింగ్

సంస్థ: కలినరీ లాంజ్
నైపుణ్యాలు: కమ్యూనిటీ మేనేజ్‌మెంట్, కంటెంట్, సోషల్‌మీడియా మార్కెటింగ్, కంటెంట్ రైటింగ్, క్రియేటివ్ రైటింగ్, ఈవెంట్ మేనేజ్‌మెంట్
స్టైపెండ్: రూ.10,000
దరఖాస్తు గడువు: జనవరి 3
☛ https://tinyurl.com/5a5m2c6a

సప్లయ్ చెయిన్ అండ్ లాజిస్టిక్స్

సంస్థ: జొవెరియె
నైపుణ్యాలు: కోఆర్డినేషన్, ఇంగ్లిష్ మాట్లాడటం, ఇన్వెంటరీ మేనేజ్‌మెంట్, లాజిస్టిక్స్ మేనేజ్‌మెంట్, నెగోషియేషన్ స్కిల్స్
స్టైపెండ్: రూ.10,000-12,000
దరఖాస్తు గడువు: జనవరి 17
☛ https://tinyurl.com/2pu5nd8s

ఫిజిక్స్ అకడమీషియన్

సంస్థ: గ్రేటర్ డేన్ ఎడ్యుకేషనల్ టెక్నాలజీస్
నైపుణ్యాలు: ఎఫెక్టివ్ కమ్యూనికేషన్, ఎంఎస్-పవర్ పాయింట్, ఫిజిక్స్
స్టైపెండ్: రూ.15,000
దరఖాస్తు గడువు: జనవరి 21
☛ https://tinyurl.com/bdnkfbcn

డిజిటల్ మార్కెటింగ్

సంస్థ: ఎడ్యుకేస్ ఇండియా
నైపుణ్యాలు: డిజిటల్, ఫేస్‌బుక్ మార్కెటింగ్, ఫేస్‌బుక్ యాడ్స్
స్టైపెండ్: రూ.10,000
దరఖాస్తు గడువు: జనవరి 17
☛ https://tinyurl.com/2v9a5khh

రైల్వేలో ఐసోలేటెడ్ పోస్టులు

రైల్వే రిక్రూట్‌మెంట్ బోర్డు (ఆర్ఆర్‌బీ) 312 ఐసోలేటెడ్ కేటగిరీ పోస్టుల భర్తీకి ప్రకటన విడుదల చేసింది.

- చీఫ్ లా అసిస్టెంట్- 22
- పబ్లిక్ ప్రాసిక్యూటర్- 7
- జూనియర్ ట్రాన్స్‌లేటర్- 202
- సీనియర్ పబ్లిసిటీ ఇన్‌స్పెక్టర్- 15
- స్టాఫ్ అండ్ వెల్ఫేర్ ఇన్‌స్పెక్టర్- 24
- సైంటిఫిక్ అసిస్టెంట్/ ట్రైనింగ్- 2
- ల్యాబ్ అసిస్టెంట్ గ్రేడ్-3- 39
- సైంటిఫిక్ సూపర్‌వైజర్/ఎర్గోనామిక్స్ అండ్ ట్రైనింగ్-1

అర్హత: పోస్టును అనుసరించి ఇంటర్మీడియట్ లేదా తత్సమానం, లా డిగ్రీ, సంబంధిత విభాగాల్లో డిప్లొమా, పీజీ డిప్లొమా, ఎంబీఏ, మాస్టర్స్ డిగ్రీ.
వయసు: అన్ని పోస్టులకూ 01.01.2026 నాటికి 18 ఏళ్లు నిండి ఉండాలి. పోస్టు ప్రకారం 40 ఏళ్లకు మించరాదు.
వేతన శ్రేణి: ల్యాబ్ అసిస్టెంట్‌కు రూ.19,900, జూనియర్ ట్రాన్స్‌లేటర్, ఇన్‌స్పెక్టర్స్, సైంటిఫిక్ అసిస్టెంట్ పోస్టులకు రూ.35,400, ఇతర పోస్టులకు రూ.44,900.
దరఖాస్తు ఫీజు: రూ.500. ఎస్సీ/ ఎస్టీ/ దివ్యాంగులు/ మాజీ సైనికోద్యోగులు/ ఈబీసీ/ మైనారిటీలకు రూ.250.
ఎంపిక: ఆన్‌లైన్ టెస్ట్ (సింగిల్ స్టేజ్ సీబీటీ), ట్రాన్స్‌లేషన్ టెస్ట్(ట్రాన్స్‌లేటర్ పోస్టులకు), ధ్రువపత్రాల పరిశీలన, మెడికల్ ఎగ్జామినేషన్‌లతో.
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: 29.01.2026. **వెబ్‌సైట్:** www.rrbapply.gov.in/#/auth/landing

బేసిల్‌లో ఎలక్ట్రీషియన్లు

బ్రాడ్ కాస్ట్ ఇంజినీరింగ్ కన్సల్టెంట్స్ ఇండియా లిమిటెడ్ (బీఈసీఐఎల్), నోయిడా.. ఒప్పంద ప్రాతిపదికన వివిధ ఉద్యోగాల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- ఎలక్ట్రీషియన్-2,
- సబ్ స్టేషన్ ఆపరేటర్- 02,
- చిల్లర్/బాయిలర్ ఆపరేటర్- 1
- ఫైర్ అలారమ్/ పంప్ ఆపరేటర్-1

అర్హత: పోస్టులను అనుసరించి సంబంధిత విభాగంలో ఐటీఐతో పాటు పని అనుభవం ఉండాలి.
వయసు: 45 ఏళ్లలోపు ఉండాలి.
వేతనం: నెలకు రూ.23,218 నుంచి రూ.25,506.
దరఖాస్తు ఫీజు: జనరల్, ఓబీసీ, ఈడబ్ల్యూఎస్‌లకు రూ.295. ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులకు ఫీజు లేదు.
ఆఫ్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: 12.01.2026
చిరునామా: బ్రాడ్‌కాస్ట్ ఇంజినీరింగ్ కన్సల్టెంట్స్ ఇండియా లిమిటెడ్, బీఈసీఐఎల్ భవన్, సీ-56/ఏ-17, సెక్టార్-62, నోయిడా-201307 (ఉత్తర్‌ప్రదేశ్)
ఎంపిక: స్కిల్ టెస్ట్/ఇంటర్వ్యూలతో.
వెబ్‌సైట్: www.becil.com/Vacancies

ఐఏఆర్ఐలో

ఐసీఏఆర్-ఇండియన్ అగ్రికల్చర్ రిసెర్చ్ ఇన్‌స్టిట్యూట్, దిల్లీ ఒప్పంద ప్రాతిపదికన యంగ్ ప్రొఫెషనల్, ఎస్ఆర్ఎఫ్ ఉద్యోగాల భర్తీకి ఇంటర్వ్యూలు నిర్వహిస్తోంది.


● యంగ్ ప్రొఫెషనల్-2: 01 ● సీనియర్ రిసెర్చ్ ఫెలో(ఎస్ఆర్ఎఫ్): 01 ● యంగ్ ప్రొఫెషనల్-1: 01

అర్హత: పోస్టులను అనుసరించి సంబంధిత విభాగంలో డిగ్రీ/పీజీతో పాటు పని అనుభవం ఉండాలి.
వేతనం: నెలకు యంగ్ ప్రొఫెషనల్-1, 2, పోస్టులకు రూ.30,000 - రూ.42,000, సీనియర్ రిసెర్చ్ ఫెలోకు రూ.37,000. **ఎంపిక:** ఇంటర్వ్యూతో
ఇంటర్వ్యూ తేదీ: 16.01.2026
వెబ్‌సైట్: https://www.iari.res.in/bms/announcements/jobs.php

డీఎస్సీలో అర్హత ఉందా?

బీటెక్ (మెకానికల్), ఎంఏ (ఇంగ్లిష్), బీఈడీ (ఫిజిక్స్, ఇంగ్లిష్ మెథడాలజీ) చేశాను. డీఎస్సీలో ఎస్ఏ (ఫిజిక్స్)కు అర్హత ఉంటుందా?

- ఆర్.వెంకయ్య



■ బీటెక్ (మెకానికల్ ఇంజినీరింగ్), బీఈడీ (ఫిజిక్స్, ఇంగ్లిష్ మెథడాలజీ), ఎంఏ (ఇంగ్లిష్) విద్యార్హతలతో మీరు స్కూల్ అసిస్టెంట్ (ఇంగ్లిష్) పోస్టులకు పోటీ పడొచ్చు. స్కూల్ అసిస్టెంట్ (ఫిజికల్ సైన్స్) విషయంలో పూర్తి స్పష్టత లేదు.

✦ తెలంగాణ రాష్ట్ర ఎడ్‌సెట్ నోటిఫికేషన్ ప్రకారం బీఈడీ (ఫిజికల్ సైన్స్) చేయాలంటే.. బీఎస్సీలో ఫిజిక్స్/ కెమిస్ట్రీ లేదా అనుబంధ సబ్జెక్టులు చదివి ఉండాలి. ఫిజిక్స్, కెమిస్ట్రీ సబ్జెక్టులతో ఇంటర్మీడియట్ పూర్తిచేసిన తర్వాత ఇంజినీరింగ్ లేదా బీసీఏ చదివినవాళ్లు బీఈడీ (ఫిజికల్ సైన్స్) చేయొచ్చు.

✦ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎడ్‌సెట్ నోటిఫికేషన్ ప్రకారం బీఈడీ (ఫిజికల్ సైన్స్)కోసం.. బీఎస్సీలో ఫిజిక్స్/ కెమిస్ట్రీ లేదా మెటీరియల్ సైన్స్‌కు అనుబంధ సబ్జెక్టులు చదివి ఉండాలి. ఇంటర్మీడియట్‌లో మ్యాథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ సబ్జెక్టులు చదివి ఇంజినీరింగ్ పూర్తిచేసినవారు, ఫిజిక్స్, కెమిస్ట్రీలతో ఇంటర్మీడియట్ పూర్తిచేసి బీసీఏ చదువుకున్నవారు బీఈడీ (ఫిజికల్ సైన్స్) చేయొచ్చు.

రెండు తెలుగు రాష్ట్రాల ఎడ్‌సెట్ నోటిఫికేషన్లలో ఇంజినీరింగ్ పట్టభద్రుల అర్హత విషయంలో కొంత వైరుధ్యం ఉంది. తెలంగాణ డీఎస్సీ నోటిఫికేషన్ ప్రకారం స్కూల్ అసిస్టెంట్ (ఫిజికల్ సైన్స్) ఉద్యోగాలకు ఇంజినీరింగ్ లేదా బీసీఏ గురించి పేర్కొనలేదు. ఆంధ్రప్రదేశ్ డీఎస్సీ నోటిఫికేషన్‌లో స్కూల్ అసిస్టెంట్ (ఫిజికల్ సైన్స్) ఉద్యోగాలకు బీసీఏ గురించి పేర్కొన్నారు కానీ, ఇంజినీరింగ్ గురించి చెప్పలేదు. అనుబంధ సబ్జెక్టుల్లో మాత్రం ఇంజినీరింగ్ ఫిజిక్స్, ఎలక్ట్రానిక్స్, ఇన్‌స్ట్రుమెంటేషన్, అప్లైడ్ కెమిస్ట్రీ, ఇండస్ట్రియల్ కెమిస్ట్రీ లాంటి సబ్జెక్టులను పేర్కొన్నారు. పైన చెప్పిన అనుబంధ సబ్జెక్టుల్లో మెకానికల్ ఇంజినీరింగ్ పదం ఎక్కడా లేదు.

మీరు బీటెక్ (మెకానికల్ ఇంజినీరింగ్)లో ఫిజిక్స్, కెమిస్ట్రీ సబ్జెక్టులు చదివినట్లు మార్కుల మెమోల్లో ఉంటే, వాటిని ఫిజికల్ సైన్స్ ఆప్షనల్ సబ్జెక్టులకు సమానంగా భావిస్తే, స్కూల్ అసిస్టెంట్ (ఫిజికల్ సైన్సెస్)కు అర్హత ఉంటుంది.

ఇంటర్మీడియట్‌లో మ్యాథ్స్ చదివి, ఇంజినీరింగ్‌లో కూడా కనీసం రెండు మ్యాథ్స్ సబ్జెక్టులు చదివి ఉంటే, ఏ బ్రాంచ్ వారైనా స్కూల్ అసిస్టెంట్ (మ్యాథమెటిక్స్) ఉద్యోగాలకు అర్హులు అవుతారు.



✦ మీరు స్కూల్ అసిస్టెంట్ (ఫిజికల్ సైన్సెస్) ఉద్యోగం మాత్రమే చేయాలనుకుంటే ఎమ్మెస్సీ ఫిజిక్స్ చేస్తే ఎలాంటి ఇబ్బందీ లేకుండా డీఎస్సీ రాయడానికి అర్హులు అవుతారు. జాతీయ విద్యా విధానం 2020 ప్రకారం ఇంజినీరింగ్ డిగ్రీతో నచ్చిన సబ్జెక్టులో పీజీ చేసే అవకాశం కూడా ఉంది.

– ప్రొ. బెల్లంకొండ రాజశేఖర్, కెరియర్ కౌన్సెలర్

బెల్‌లో ట్రెయినీ ఇంజినీర్లు

భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ (బీఈఎల్), ఘజియాబాద్.. 119 ట్రెయినీ ఇంజినీర్, ట్రెయినీ ఆఫీసర్స్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. ఒప్పంద ప్రాతిపదికన రెండేళ్లకు ఎంపిక చేసినప్పటికీ మరో ఏడాది పొడిగిస్తారు. రాతపరీక్షతో నియామకాలు ఉంటాయి.



మొత్తం ఖాళీల్లో.. ట్రెయినీ ఇంజినీర్-117 ట్రెయినీ ఆఫీసర్-2 ఉన్నాయి. ప్రకటనలో ఇచ్చిన క్యూఆర్ కోడ్ స్కాన్ చేసి గడువు తేదీలోగా రిజిస్టర్ చేసుకోవాలి. భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్, ఘజియాబాద్‌లో జరిగే వాక్‌ఇన్ సెలక్షన్‌కు హాజరుకావాలి. పూర్తిచేసిన దరఖాస్తుకు సంబంధిత ధ్రువపత్రాలను జతచేసి సమర్పించాలి. ఈ వివరాలతో అభ్యర్థులను రాత పరీక్షకు ఎంపిక చేస్తారు.

పరీక్ష: దీనికి 100 మార్కులు. ప్రతి తప్పు సమాధానానికీ పావుమార్కు తగ్గిస్తారు. ఇందులో జనరల్/ ఈడబ్ల్యూఎస్/ ఓబీసీ-ఎన్‌సీఎల్ 35 శాతం, ఎస్సీ/ ఎస్టీ/ దివ్యాంగులు 30 శాతం కనీసార్హత మార్కులు సాధించాలి.

ఎంపికైనవారు జమ్మూ కశ్మీర్, షిల్లాంగ్, పోర్ట్‌బ్లెయిర్, లద్దాఖ్, దిల్లీల్లో ఎక్కడి నుంచైనా సేవలు అందించాలి.

అర్హత: ట్రెయినీ ఇంజినీర్ పోస్టుకు.. ఎలక్ట్రానిక్స్/ మెకానికల్/ కంప్యూటర్ సైన్స్/ ఎలక్ట్రికల్/ కెమికల్ బ్రాంచ్‌తో బీఈ/ బీటెక్/ బీఎస్సీ. ట్రెయినీ ఆఫీసర్ పోస్టుకు.. ఎంబీఏ (ఫైనాన్స్) పూర్తిచేయాలి.

వయసు: 01.01.2026 నాటికి 28 సంవత్సరాలు మించకూడదు. ఓబీసీకి మూడేళ్లు, ఎస్సీ/ఎస్టీకి ఐదేళ్లు, దివ్యాంగులకు పదేళ్ల సడలింపు ఉంటుంది.

దరఖాస్తు ఫీజు: రూ.150 (18 శాతం జీఎస్టీ అదనం). ఎస్సీ/ ఎస్టీ/ దివ్యాంగులకు ఫీజు లేదు.

వేతనం: మొదటి ఏడాది నెలకు రూ.30,000. రెండో ఏడాది రూ.35,000, మూడో ఏడాది రూ.40,000. అదనంగా ప్రతినెలా 10 శాతం ఏరియా అలవెన్స్, ఇన్స్యూరెన్స్ ప్రీమియం, ఇతర అలవెన్సులుగా ఏడాదికి రూ.12 వేలు చెల్లిస్తారు.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: 09.01.2026

రాత పరీక్ష తేదీ: 11.01.2026 **వెబ్‌సైట్:** bel-india.in

నాబార్డ్‌లో యంగ్ ప్రొఫెషనల్స్

నేషనల్ బ్యాంక్ ఫర్ అగ్రికల్చర్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్ (నాబార్డ్), ముంబయి ఒప్పంద ప్రాతిపదికన 44 యంగ్ ప్రొఫెషనల్ (వైపీ) పోస్టులను భర్తీచేయనుంది. ముందుగా ఏడాది కాలానికి ఎంపిక చేసినప్పటికీ మూడేళ్లు పొడిగించే అవకాశం ఉంటుంది.



అర్హతలు

- క్లైమేట్ యాక్షన్ అండ్ సస్టైనబిలిటీ విభాగంలో.. ఎన్విరాన్‌మెంటల్ ఇంజినీరింగ్/ ఎన్విరాన్‌మెంటల్ సైన్స్ లేదా క్లైమేట్ సైన్స్‌లో పీజీ డిగ్రీతో పాటు ఏడాది ఉద్యోగానుభవం ఉండాలి.
- ఎకనామిక్స్ విభాగం ఖాళీలకు.. ఎకనామిక్స్/ అప్లైడ్ ఎకనామిక్స్/ ఫైనాన్షియల్ ఎకనామిక్స్/ స్టాటిస్టిక్స్/ డేటాసైన్స్/ ఫైనాన్స్‌తో పీజీ డిగ్రీ.
- డేటా సైన్స్ విభాగానికి.. ఐటీ/కంప్యూటర్ సైన్స్ ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్/ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అండ్ డేటాసైన్స్ బ్రాంచ్‌తో బీఈ/బీటెక్.
- సైబర్ సెక్యూరిటీ కోసం.. కంప్యూటర్ సైన్స్/ ఐటీ/ సైబర్ సెక్యూరిటీ/ ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్ ఇంజినీరింగ్ డిగ్రీ.
- అకడమిక్ అడ్మినిస్ట్రేషన్‌కు.. ఎడ్యుకేషన్/ బిజినెస్ అడ్మినిస్ట్రేషన్/ కంప్యూటర్ సైన్స్/ ఐటీ డిగ్రీ. లేదా ఎంబీఏ (హెచ్ఆర్)/ ఎంఈడీ.
- గ్రాఫిక్ డిజైనింగ్‌లో.. డిజిటల్ మీడియా/ మల్టీమీడియా/ గ్రాఫిక్ డిజైన్ డిగ్రీ.
- పీఆర్, ఔట్‌రీచ్ అండ్ డాక్యుమెంటేషన్‌కు .. మాస్ మీడియా/ డెవలప్‌మెంట్ కమ్యూనికేషన్/ విజువల్ కమ్యూనికేషన్/ జర్నలిజంలో పోస్ట్‌గ్రాడ్యుయేట్ డిగ్రీ.
- ఐటీ పోస్టులకు.. కంప్యూటర్ సైన్స్/ కంప్యూటర్ ఇంజినీరింగ్/ ఐటీ బ్రాంచ్‌తో బీఈ/బీటెక్.
- జియోఇన్ఫర్మాటిక్స్‌లో .. జియోఇన్ఫర్మాటిక్స్/ జియోగ్రఫీ/ రిమోట్ సెన్సింగ్/ ఎన్విరాన్‌మెంటల్ సైన్స్‌తో పీజీ డిగ్రీ.
- డెవలప్‌మెంట్ మేనేజ్‌మెంట్ కోసం.. సోషల్‌వర్క్/ రూరల్ డెవలప్‌మెంట్/ రూరల్ మేనేజ్‌మెంట్/ డెవలప్‌మెంట్ స్టడీస్‌తో డిగ్రీ లేదా పీజీ.
- ఫైనాన్స్. బీబీఏ (ఫైనాన్స్/ బ్యాంకింగ్), బీఎంఎస్ (ఫైనాన్స్/ బ్యాంకింగ్) లేదా ఎంబీఏ (ఫైనాన్స్)/ ఎంఎంఎస్ (ఫైనాన్స్)
- ప్రాజెక్ట్ మానిటరింగ్.. అగ్రికల్చర్/ సాయిల్ సైన్స్/ హార్టికల్చర్/ ల్యాండ్/ వాటర్ రిసోర్సెస్‌తో డిగ్రీ లేదా పీజీ.
- యూఐ/యూఎక్స్ డిజైనింగ్, సాఫ్ట్‌వేర్ టెస్టింగ్ ఖాళీలకు.. కంప్యూటర్ సైన్స్/ ఐటీ డిగ్రీ లేదా పీజీ.
- డిగ్రీని 60 శాతంతో పీజీ డిగ్రీని 55 శాతంతో పూర్తిచేయాలి. అన్ని విభాగాల్లోని పోస్టులకూ ఏడాది అనుభవం ఉండాలి.

అభ్యర్థుల ఎంపిక రెండు దశల్లో ఉంటుంది. విద్యార్హతల మార్కులు, ఉద్యోగానుభవంతో ఇంటర్వ్యూకు షార్ట్‌లిస్ట్ చేస్తారు. ఇంటర్వ్యూలను నాబార్డ్ ప్రాంతీయ కార్యాలయాల్లో నిర్వహిస్తారు. వైద్య పరీక్షల అనంతరం కేటగిరీల వారీ తుది ఎంపిక చేస్తారు. ఇంటర్వ్యూకు హాజరయ్యే వారికి 2ఏసీ రైలు ఛార్జీలను చెల్లిస్తారు.

వయసు: 01.11.2025 నాటికి 21 నుంచి 30 సంవత్సరాల మధ్య ఉండాలి. 01.11.1995 - 01.11.2004 మధ్య జన్మించినవారు అర్హులు.
దరఖాస్తు ఫీజు: రూ.150.
స్టైపెండ్: నెలకు రూ.70,000.
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: 12.01.2026
వెబ్‌సైట్: https://www.nabard.org/

ముర్ము, మోదీలకు పుతిన్ హ్యాపీ న్యూ ఇయర్

మాస్కో: రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తదితర ప్రపంచ నేతలకు రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. తమ అధ్యక్షుడు క్రిస్మస్‌తోపాటు రానున్న 2026 సంవత్సర సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారని అధికారిక ప్రకటన ఒకటి తెలియజేసింది. చైనా నాయకత్వానికి, కామన్‌వెల్త్ ఆఫ్ ఇండిపెండెంట్ స్టేట్స్ నాయకులకు తన శుభాకాంక్షలు తెలిపిన పుతిన్.. ఐరోపా దేశాల నేతలను మాత్రం ప్రస్తావించలేదు. రష్యాతో స్నేహ సంబంధాలు కలిగి ఉన్న నాటో, ఈయూ సభ్య దేశాలు హంగరీ, స్లొవేకియాలకు శుభాకాంక్షలు తెలిపారు. రష్యాలో డిసెంబరు 30ని చివరి పని దినంగా పరిగణిస్తారు. ఆ తర్వాత సంవత్సరాది, ఆర్థోడాక్స్ క్రిస్మస్ సెలవులు (జనవరి 7న దీనిని జరుపుతారు) సందర్భంగా జనవరి 12 వరకూ సెలవు దినాలుంటాయి.

నేతాజీని స్మరించుకున్న ప్రధాని మోదీ

దిల్లీ: పోర్ట్ బ్లెయిర్‌లో మొదటిసారి భారత జాతీయ జెండాను నేతాజీ సుభాష్ చంద్రబోస్ ఎగురవేయడం భారత స్వాతంత్ర్య పోరాటంలో కీలక మైలురాయిగా నిలిచిందని ప్రధాని మోదీ తెలిపారు. 1943 డిసెంబరు 30న పోర్ట్ బ్లెయిర్‌లో త్రివర్ణ పతకాన్ని ఎగురవేసిన ఘటనను ఆయన గుర్తుచేశారు. ఆజాద్ హింద్ ఫౌజ్ నాయకుడిగా నేతాజీ చూపిన ధైర్యం, వీరత్వం దేశానికి స్ఫూర్తినిస్తున్నాయని, నేటి తరానికి ఆ త్యాగాలు మార్గదర్శకంగా నిలుస్తున్నాయని ప్రధాని మోదీ సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో వివరించారు.

మయన్మార్ ఎన్నికల్లో సైన్యానికే ఆధిక్యం?

బ్యాంకాక్: మయన్మార్ ఎన్నికల్లో సైన్యం మద్దతున్న రాజకీయ పార్టీ తానే ముందంజలో ఉన్నట్లు ప్రకటించుకుంది. దీనిపై ఎన్నికల కమిషన్ ఎలాంటి ఫలితాలు వెలువరించలేదు. మయన్మార్‌లో మూడు దశల్లో ఎన్నికలు జరుగుతున్నాయి. 330 టౌన్‌షిప్పులకు గాను 102 స్థానాల్లో గత ఆదివారం తొలి రౌండ్ పోలింగ్ జరిగింది. తదుపరి దశ ఎన్నికలు జనవరి 11న, జనవరి 25న జరుగుతాయి. ఉద్రిక్త పరిస్థితుల కారణంగా 65 పట్టణాల్లో ఎన్నికలు జరగడం లేదు. తొలివిడత పోలింగ్‌లో 102 స్థానాలకు గాను తాము 88 గెలుచుకున్నామని సైన్యం మద్దతున్న 'యూనియన్ సాలిడారిటీ అండ్ డెవలప్‌మెంట్ పార్టీ' ప్రతినిధి ఒకరు ప్రకటించారు. మయన్మార్ ఉభయ సభల్లో మొత్తం 664 సీట్లు ఉన్నాయి. ఈ రెండు సభల్లో అత్యధిక స్థానాలు కలిగిన పార్టీయే అధ్యక్షుణ్ని నియమిస్తుంది. అధ్యక్షుడు నూతన మంత్రివర్గాన్ని, ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తారు. రాజ్యాంగం ప్రకారం సైన్యానికి 25 శాతం స్థానాలు రెండు సభల్లోనూ దక్కుతాయి. ప్రస్తుత ఎన్నికల తుది ఫలితాలు జనవరి చివరిలో వెలువడే అవకాశం ఉంది.

దిల్లీని కమ్మేసిన దట్టమైన పొగమంచు

118 విమానాలు రద్దు

దిల్లీ: దేశరాజధాని దిల్లీని దట్టమైన పొగ మంచు కమ్మేసింది. నగరంలోని కొన్ని ప్రాంతాల్లో మంగళవారం ఉదయం 7.30 గం.ల సమయంలో 100 మీటర్ల దూరంలోని వస్తువులు, మనుషులు కూడా కనిపించలేదు. వాయునాణ్యత సూచీ(ఏక్యూఐ) స్వల్ప మెరుగుదల కనిపించింది. కనిష్ఠ ఉష్ణోగ్రత 9.4 డిగ్రీల సెల్సియస్ నమోదైంది. భారత వాతావరణ శాఖ ఆరెంజ్ హెచ్చరికను జారీ చేసింది. దట్టమైన పొగమంచు కారణంగా మొత్తం 118 విమాన సర్వీసులు రద్దయ్యాయి. 16 విమానాలను ఇతర విమానాశ్రయాలకు మళ్లించారు. సుమారు 130 విమానాల రాకపోకలు ఆలస్యమయ్యాయని అధికారులు తెలిపారు.

ప్రయాణికుడిపై దాడి కేసులో ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్ పైలట్ అరెస్ట్

దిల్లీ: ఇందిరా గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో స్పైస్‌జెట్ విమాన ప్రయాణికుడిపై ఇటీవల జరిగిన దాడి కేసులో ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్‌కు చెందిన పైలట్ వీరేందర్ అరెస్టు అయ్యారు. అదుపులోకి తీసుకున్న వెంటనే అతనికి బెయిల్ మంజూరైనట్లు పోలీసులు తెలిపారు. ఈ ఘటనతో పైలట్‌ను ఇప్పటికే ఎయిరిండియా సంస్థ విధుల నుంచి తొలగించిన విషయం తెలిసిందే. దాడి ఘటన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారడంతో దర్యాప్తు చేసి, నివేదిక సమర్పించాల్సిందిగా సివిల్ ఏవియేషన్ విభాగానికి పౌర విమానయాన మంత్రిత్వశాఖ ఆదేశాలు జారీ చేసింది.

వ్యక్తిపై దాడి చేసి.. మంచంపై విశ్రాంతి తీసుకున్న పులి

మధ్యప్రదేశ్‌లో ఘటన

ఇంటర్నెట్ డెస్క్: గ్రామంలోకి చొరబడి ఓ వ్యక్తిపై దాడి చేసిందో పులి. అనంతరం కొన్ని గంటలపాటు ఆ ఇంటి బయట ఉన్న మంచంపై సేద తీరిన ఘటన మధ్యప్రదేశ్‌లో చోటుచేసుకుంది. అధికారుల వివరాల ప్రకారం.. టైగర్ రిజర్వుకు సమీపంలోని ఓ గ్రామంలోకి పులి చొరబడి గోపాల్ కోల్ అనే వ్యక్తిపై దాడి చేసింది. అనంతరం అక్కడి ఓ మంచంపై విశ్రాంతి తీసుకుంది. భయభ్రాంతులకు గురైన ప్రజలు ఇళ్ల పైకప్పులు ఎక్కి కూర్చున్నారు. సమాచారం అందుకున్న అటవీశాఖ అధికారులు ఆ ప్రాంతానికి చేరుకుని పులిని బంధించి అడవిలో వదిలేశారు. పులి దాడిలో గాయపడిన వ్యక్తిని ఆస్పత్రికి తరలించామని ప్రస్తుతం అతడి పరిస్థితి నిలకడగా ఉన్నట్లు అధికారులు వెల్లడించారు. టైగర్ రిజర్వుకు దగ్గరగా ఉండటంతో తమ గ్రామంలోకి పలుమార్లు పులులు చొరబడుతున్నాయని.. దీనిపై పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోవడంలేదని ప్రజలు వాపోయారు.



కొత్త ఏడాది తొలి సంబరం వారిదే...

- ఆ తర్వాతే ప్రపంచమంతటా
- ద్వీపదేశం కిరిబాటి ప్రత్యేకత ఇదీ!

ఈటీవీ భారత్: నూతన సంవత్సరం... 2026 ఆరంభ క్షణాలకు ఘన స్వాగతం పలికేందుకు ప్రపంచమంతా ఎదురుచూస్తూ ముస్తాబవుతోంది. మరి కొత్త ఏడాది మొట్టమొదట ఎవరిని పలకరిస్తుందో తెలుసా? పసిఫిక్ మహా సముద్రంలో కిరిబాటి అనే ద్వీప దేశాన్ని! ఇక్కడి కిరిటిమటి (క్రిస్మస్ ఐలాండ్) అనే ద్వీప ప్రాంతంపై ప్రతిరోజూ తొలి సూర్య కిరణాలు ప్రసరిస్తుంటాయి. నూతన సంవత్సర వేడుకలు తొలుత జరిగేది అక్కడే!! ఆ ద్వీపదేశంతో పోల్చితే.. భారత్‌లో దాదాపు 7.30 గంటల తర్వాత నూతన ఏడాది అడుగుపెడుతుంది.

అక్కడ అర్ధరాత్రి... భారత్‌లో ముందు రోజు మధ్యాహ్నం

నూతన సంవత్సర శుభాకాంక్షలు తొలుత చెప్పుకునే ప్రాంతంగా కిరిటిమటి నిలుస్తోంది. ఈ ప్రాంతంలో



నూతన సంవత్సర క్షణాలు ప్రారంభమయ్యే సమయానికి భారత్‌లో డిసెంబరు 31వ తేదీ మధ్యాహ్నం 3.30 గంటల సమయం అవుతుంది. అంటే.. మన దేశం దాదాపు 7.30 గం.ల ఆలస్యంగా నూతన సంవత్సరం వేడుకలు జరుపుకొంటుంది. కిరిబాటి తర్వాత.. 2.30 గం.లకు ఆస్ట్రేలియాలో, 2 గంటలకు రష్యాలో, 1.15 గం.లకు న్యూజిలాండ్‌లో కొత్త ఏడాది వేడుకలు జరుగుతాయి. దాదాపు ఒక రోజు తర్వాత, అమెరికాకు చెందిన సమోవా, బేకర్ అండ్ హౌలాండ్ దీవుల్లో జనవరి 1వ తేదీ మొదలవుతుంది. ప్రపంచంలో నూతన సంవత్సరంలోకి చాలా ఆలస్యంగా ప్రవేశించే ప్రదేశాలు ఇవే.

సూర్యోదయానికి శ్రీకారం

యావత్ ప్రపంచంలో భూమిపై నిత్యం తొలి సూర్య కిరణాలు ప్రసరించే ప్రాంతం 'తూర్పు ఆసియా'. ఈ ప్రాంతం చుట్టూ దక్షిణ పసిఫిక్ మహా సముద్రం, మధ్య పసిఫిక్ మహా సముద్రం ఉన్నాయి. ఈ మహా సముద్ర జలాల మధ్య ఉన్న బుల్లి ద్వీప దేశాల్లోనే ప్రతి రోజు తొలుత ఉషోదయం అవుతుంది. ఆ వెంటనే 'తూర్పు ఆసియా'లోని జపాన్, ఉత్తర కొరియా, దక్షిణ కొరియా, తైవాన్, చైనా, మంగోలియాలలో సూర్యోదయం అవుతుంది. డిసెంబరు 31న కూడా ఇదేవిధంగా జరుగుతుంది. తమ దేశంలోని అన్ని ద్వీపాలు ఒకే క్యాలెండర్, ఒకే టైమ్ జోన్‌ను పాటించేలా 1995లోనే కిరిబాటి ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. భూమధ్య రేఖకు 232 కి.మీ.దూరంలో ఉన్న ఈ బుల్లి దేశం పలు ద్వీపాల సమూహం. జనాభా లక్షా 19 వేలు. 1979లో బ్రిటన్ నుంచి స్వాతంత్ర్యం పొందింది.

వీసా రూల్స్‌తో భయం భయం.. సెలవుల్లోనూ ఇళ్లకే పరిమితం

అమెరికాలో వలసదారుల పరిస్థితి

ఇంటర్నెట్ డెస్క్: క్రిస్మస్, న్యూఇయర్ హాలిడే సీజను సందర్భంగా అమెరికాలో సాధారణంగా ప్రయాణాల రద్దీ విపరీతంగా ఉంటుంది. వరుస సెలవులతో అనేకమంది పర్యటనలకు మొగ్గు చూపుతుంటారు. అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వీసా నిబంధనల పుణ్యమా అని స్థానిక వలసదారులు ఇప్పుడు ఇళ్లకే పరిమితమవుతున్నారు. కఠిన ఇమిగ్రేషను నియమాలతో ప్రయాణాలు అంటేనే 'వద్దు బాబోయ్' అంటున్నారు. అమెరికాలో ఉంటున్న భారతీయులు సహా అనేకమంది వలసదారులు తమ ప్రయాణాలను మానుకుంటున్నారని 'న్యూయార్క్ టైమ్స్', కేఎఫ్ఎఫ్ సర్వేలో వెల్లడైంది. ఇమిగ్రేషను అధికారుల దృష్టిలో పడకూడదనే ఉద్దేశపూర్వకంగా ప్రయాణాలను రద్దు చేసుకుంటున్నామని ప్రతి 10 మందిలో ముగ్గురు విదేశీ వలసదారులు చెప్పినట్లు సర్వే తెలిపింది. హెచ్-1బీ వీసాదారుల్లో 32 శాతం మంది, అమెరికా పౌరసత్వం పొందిన విదేశీయుల్లో 15 శాతం మంది కూడా ఇదే అభిప్రాయాన్ని వ్యక్తపరిచినట్లు పేర్కొంది. ఇక.. సరైన పత్రాలు లేకుండా అమెరికాలో ఉంటున్న వలసదారుల్లో అయితే ఏకంగా 63 శాతం మంది బయటకు ఎక్కడికీ వెళ్లకుండా ఇళ్లలోనే ఉంటున్నారట! విదేశీ ప్రయాణాల మాట దేవుడెరుగు.. అమెరికాలో అంతర్గత పర్యటనలకూ వీరు ఇష్టపడటం లేదని సర్వే తెలిపింది. హెచ్-1బీ సహా పలు వీసాల నిబంధనలను ట్రంప్ ప్రభుత్వం కఠినతరం చేసిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో అత్యవసరమైతే తప్ప విదేశీ ప్రయాణాలు చేయొద్దని ఇటీవల పలు టెక్ కంపెనీలు కూడా తమ ఉద్యోగులకు సూచనలు జారీ చేశాయి.

పుతిన్ నివాసంపై దాడికి యత్నం.. మోదీ, ట్రంప్ ఆందోళన

దిల్లీ: రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ నివాసంపై డ్రోన్ల దాడికి యత్నం జరిగిందంటూ వచ్చిన వార్తలపై ప్రధాని మోదీ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. శత్రుత్వానికి తెరదించుకునేందుకు దౌత్య మార్గాల్లోనే ప్రయత్నించాలని రష్యా, ఉక్రెయిన్‌లను ఆయన కోరారు. హింసాత్మక చర్యలకు దిగితే.. యుద్ధం ముగింపు కోసం ప్రస్తుతం జరుగుతున్న చర్చలకు తీవ్ర విఘాతం కలుగుతుందని 'ఎక్స్'లో మోదీ మంగళవారం పేర్కొన్నారు. డ్రోన్లతో పుతిన్ నివాసాన్ని లక్ష్యంగా చేసుకున్నారన్న వార్త తనను కూడా ఆందోళనకు గురిచేసిందని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ అన్నారు. అయితే ఉక్రెయిన్ ఈ సాహసానికి ఒడిగట్టినట్లు రష్యా చెబుతున్నప్పటికీ, అది వాస్తవం కాకపోవచ్చని అభిప్రాయపడ్డారు. దాడికి ప్రయత్నం జరిగిన సంగతిని స్వయంగా పుతిన్ తనకు తెలియజేశారని చెప్పారు. నోవ్‌గొరోడ్ ప్రాంతంలో పుతిన్ ఇంటిపై ఆదివారం రాత్రి, సోమవారం ఉదయం ఉక్రెయిన్ 91 దీర్ఘశ్రేణి డ్రోన్లతో దాడికి యత్నించినట్లు వార్తలొచ్చిన సంగతి గమనార్హం.

2025లో భానుడి భగభగ

దిల్లీ: వాతావరణ మార్పులవల్ల సంభవించిన ప్రకృతి వైపరీత్యాలు 2025లో ప్రపంచాన్ని అతలాకుతలం చేశాయి. ఉష్ణ తాపం, తుపానులు, కార్చిచ్చులు, అనావృష్టి పరిస్థితులు కోట్ల మంది ప్రజలను ఇబ్బంది పెట్టాయి. 2025లో లా నినా ఏర్పడినా ఉష్ణోగ్రత పెద్దగా తగ్గలేదు. పైగా ఉష్ణ తాపం ఎక్కువగా ఉన్న సంవత్సరాల్లో ఒకటిగా నిలిచింది. వాతావరణ మార్పులు మానవులు తట్టుకోలేని స్థాయికి చేరుతున్నాయని వరల్డ్ వెదర్ అట్రిబ్యూషన్ సంస్థ నివేదిక హెచ్చరించింది. వాతావరణ మార్పుల నిరోధానికి 2015లో పారిస్ వాతావరణ సభ తీర్మానించిన తరువాత ప్రచండ ఎండలు (హీట్ వేవ్‌లు) మరింత ఉధృతమవుతున్నాయి. కర్బన ఉద్గారాలను తగ్గించడానికి కృషి జరుగుతున్నా, అవి భూతాపాన్ని నిరోధించగల స్థాయిలో లేవు. గడచిన మూడేళ్ల సగటు ఉష్ణోగ్రత పారిస్ సభ నిర్దేశించిన 1.5 సెల్సియస్ డిగ్రీల పరిమితిని దాటింది.

- 2025 సంవత్సరంలో 157 ప్రకృతి వైపరీత్యాలు సంభవించాయని నివేదిక తెలిపింది. వాటిలో 49 ఘటనలు హీట్ వేవ్స్, వరదలే. తదుపరి స్థానాలను తుపానులు (38), కార్చిచ్చులు (11), అనావృష్టి పరిస్థితులు (7), అతి శీతల ఘటనలు (3) ఆక్రమించాయి. అతి తీవ్ర ప్రకృతి వైపరీత్యాల సంఖ్య 22 కాగా, అందులోనూ అత్యధికంగా 7 ఘటనలు ఉత్తర, దక్షిణ అమెరికా ఖండాల్లో, ఆరు ఐరోపా దేశాల్లో సంభవించాయి. 5 ఆసియాలో, 3 ఆఫ్రికాలో వచ్చాయి. ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, వాటి పరిసర ప్రాంతాల్లో ఒకటే ఘటన సంభవించింది. 2025లో హీట్ వేవ్స్ చాలా ఎక్కువగా సంభవించాయి. ఐరోపా దేశాల్లో గత వేసవిలో కేవలం ఒక్క ప్రచండ హీట్ వేవ్‌లో 24,400 మంది మరణించారని ఒక అధ్యయనం తెలిపింది.

ఎగతాళితో ఘర్షణ

- దేహ్రాదూన్‌లో త్రిపుర విద్యార్థి మరణానికి జాతి విద్వేష వ్యాఖ్యలు కారణం కాదు
- పోలీసుల స్పష్టీకరణ

దేహ్రాదూన్: ఉత్తరాఖండ్‌లో త్రిపుర విద్యార్థి ఏంజెల్ చక్మా (24) మరణానికి జాతి విద్వేషమే కారణమని తెలిపే సాక్ష్యాలేవీ లభించలేదని, అయితే ఎగతాళిపై అభ్యంతరం తెలపడంతో ఘర్షణ జరిగిందని, ఈ సందర్భంగా మద్యం దుకాణానికి వచ్చిన ఒక గ్రూపు అతడిపై దాడి చేసిందని దేహ్రాదూన్ పోలీసులు తెలిపారు. ఈ ఘటన వెనుక జాతి విద్వేషం ఉందని సోషల్ మీడియాలో వచ్చిన పోస్టులను పరిగణనలోకి తీసుకుని విచారణ జరిపామని, అందులో ఎటువంటి సాక్ష్యాలు లభించలేదని సీనియర్ ఎస్పీ అజయ్ సింగ్ మంగళవారం వెల్లడించారు. 'చక్మాపై ఈ నెల 9న దాడి జరిగింది. అతడు 26న ఆసుపత్రిలో మరణించారు. ఈ మధ్యకాలంలో జాతి విద్వేషానికి సంబంధించిన ఫిర్యాదు ఏదీ మాకు అందలేదు' అని తెలిపారు. సెలాఖీ ప్రాంతంలో మణిపూర్‌కు చెందిన సూరజ్ ఖ్వాస్ బర్త్‌డే పార్టీ జరుగుతుండగా ఘర్షణ తలెత్తిందని, బాధితుడు ఏంజెల్ చక్మా, అతడి సోదరుడు ఒకవైపు, ఆరుగురు నిందితులు మరోవైపు ఘర్షణలో పాల్గొన్నారని వివరించారు. సూరజ్ ఈ కేసులో నిందితుడేనని తెలిపారు. ఈ ఘర్షణలో తగిలిన గాయాల కారణంగా ఏంజెల్ ఆసుపత్రిలో ప్రాణాలు వదిలారని వివరించారు. ఎఫ్ఐఆర్‌లో ఆరుగురి పేర్లున్నాయని, అందులో ఐదుగురిని ఇప్పటికే నిర్బంధంలోకి



ఎస్పీ అజయ్ సింగ్

తీసుకున్నామని వెల్లడించారు. ఇందులో ఇద్దరు మైనర్లు ఉండటంతో వారిని జువైనల్ హోంకు తరలించామని వెల్లడించారు. నిందితుల్లో ఒకడైన నేపాల్ పౌరుడి ఆచూకీ తెలియడం లేదని పేర్కొన్నారు. 'అతిథుల మధ్య కొన్ని అభ్యంతరకర వ్యాఖ్యలు దొర్లాయి. అందులో కొన్ని రెచ్చగొట్టేవిగా ఉన్నాయని బాధితుడు, అతడి సోదరుడు భావించారు. దీంతో ఘర్షణ తలెత్తింది. ఇందులో ఏంజెల్ చక్మా, ఆయన సోదరుడు మైఖేల్ చక్మా గాయపడ్డారు. ఏంజెల్‌కు వెన్నెముక, మెడపై తీవ్ర గాయాలయ్యాయి. దీంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఏంజెల్ మరణించారు' అని ఎస్ఎస్‌పీ తెలిపారు. స్థానికుల స్టేట్‌మెంట్లను రికార్డు చేశామని, డిజిటల్ సాక్ష్యాలను సేకరించామని, సీసీటీవీ ఫుటేజ్‌లను చూశామని వెల్లడించారు. పారదర్శకంగా దర్యాప్తు జరుపుతున్నామని వివరించారు.

- మరోవైపు చక్మా హత్యకు కారణమైన వారికి మరణ దండనగానీ, యావజ్జీవ కారాగార శిక్షగానీ విధించాలని అతడి కుటుంబ సభ్యులు డిమాండు చేశారు.



చక్మా కుటుంబానికి న్యాయం చేయాలని త్రిపుర సీఎం మాణిక్ సాహాను కలిసిన అనంతరం మీడియాతో మాట్లాడుతున్న విద్యార్థి సంఘం నేతలు

త్రిపురలోని ఉనకోటి జిల్లాలో మచ్మారా గ్రామానికి చెందిన ఏంజెల్.. ఎంబీఏ కోసం దేహ్రాదూన్ వచ్చారు. ఆయన తండ్రి బీఎస్ఎఫ్ జవాను. మణిపుర్‌లోని టాంగ్‌జెంగ్‌లో పని చేస్తున్నారు. తన సోదరుడిని రక్షించేందుకు ప్రయత్నించిన ఏంజెల్‌పై నిందితులు దారుణంగా దాడి చేశారని, 'చైనీయుడు, చైనీస్ మోమో' అంటూ జాతి విద్వేష వ్యాఖ్యలు చేశారని ఏంజెల్ తండ్రి ఆరోపించారు. కత్తులు, పదునైన ఆయుధాలతో దాడికి పాల్పడ్డారని వివరించారు.

సోఫాలోంచి లేచే ప్రయత్నంలో తుపాకీ పేలి ఎన్నారై మృతి

ఇంటర్నెట్ డెస్క్: ఆత్మరక్షణ కోసం ఉపయోగించే తుపాకీయే పొరపాటున పేలడంతో ఒక ఎన్నారై మృత్యువాతపడ్డాడు. ఈ ఘటన పంజాబ్‌లోని ఫిరోజ్‌పుర్ జిల్లాలో చోటుచేసుకుంది. ధని సుచా సింగ్ గ్రామానికి చెందిన హర్పిందర్ సింగ్ అలియాస్ సోనూ కొన్నేళ్లు విదేశాల్లో ఉండి ఈ మధ్యే స్వగ్రామానికి తిరిగొచ్చాడు. సోమవారం తన ఇంట్లో బంధువుతో మాట్లాడుతూ సోఫాలోంచి లేచాడు. ఈ క్రమంలో నడుము భాగంలో ఉన్న తుపాకీ పొరపాటున పేలి ఓ తూటా అతడి పొట్టలోకి దూసుకెళ్లింది. ఇంట్లో అమర్చిన నిఘా కెమెరాల్లో అవి రికార్డయ్యాయి. తుపాకీ శబ్దానికి ఉలిక్కిపడిన కుటుంబ సభ్యులు.. అతడిని తొలుత స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడి వైద్యుల సూచన మేరకు బఠిండాలోని వేరే ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృత్యువాతపడ్డాడు. హర్పిందర్‌కు రెండున్నరేళ్ల కుమార్తె ఉంది.

తైవాన్ చుట్టూ చైనా యుద్ధ విన్యాసాలు

హాంకాంగ్: తైవాన్ చుట్టూ సోమవారం ప్రారంభమైన చైనా నౌకా, వైమానిక దళాల విన్యాసాలు మంగళవారం కొనసాగాయి. ఈ రెండు రోజుల్లో చైనా తమ ద్వీప దేశం చుట్టూ 130 యుద్ధ విమానాలు, 14 యుద్ధ నౌకలను మోహరించిందని తైవాన్ రక్షణశాఖ తెలిపింది. చైనా సైన్యం ఫ్యూజియాన్ రాష్ట్రం నుంచి తైవాన్ తీరానికి 44 కిలోమీటర్ల దూరంలోని ఉత్తర సాగర జలాల్లోకి ఫిరంగి గుళ్ల ప్రయోగించింది.



చైనా ఇలా కవ్వింపు చర్యలకు పాల్పడుతూ ప్రాంతీయ స్థిరత్వానికి, శాంతికి ముప్పు తెస్తోందని తైవాన్ రక్షణ మంత్రి వెలింగ్టన్ కూ అభిప్రాయపడ్డారు. కాగా తైవాన్ స్వాతంత్ర్యం పేరిట హంగామా చేస్తున్న వేర్పాటువాద శక్తులకూ, వారికి మద్దతు ఇస్తున్న విదేశీ శక్తులకూ హెచ్చరికగానే తాము విన్యాసాలు జరుపుతున్నామని చైనా రక్షణశాఖ ప్రతినిధి ఝాంగ్ షియావోగాంగ్ ప్రకటించారు. చైనాలో కమ్యూనిస్టు విప్లవం వచ్చిన తరువాత తైవాన్ వేరుపడినా.. అది తమ అంతర్భాగమేనని చైనా అంటోంది. తైవాన్‌కు 1,000 కోట్ల డాలర్ల విలువైన ఆయుధాలను విక్రయించబోతున్నట్లు అమెరికా గతవారం ప్రకటించిన నేపథ్యంలో 20 అమెరికన్ ఆయుధ కంపెనీలపై, 10 మంది ఉన్నతాధికారులపై చైనా ఆంక్షలు విధించింది. తైవాన్ చుట్టూ సైనిక విన్యాసాలు చేపట్టింది. చైనా ఈ విన్యాసాల గురించి తనకు ముందుగా తెలపలేదని, చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్‌తో తనకు మంచి సంబంధాలున్నాయని, ఆయన తైవాన్‌పై దాడి చేస్తారని తాను అనుకోవడం లేదని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సోమవారం వ్యాఖ్యానించారు.

బెలారస్‌లో రష్యా ఒరెష్నిక్ క్షిపణి వ్యవస్థల మోహరింపు

మాస్కో: రష్యాకు చెందిన అణ్వస్త్ర సామర్థ్యమున్న 'ఒరెష్నిక్' క్షిపణి వ్యవస్థలు బెలారస్‌లో తాజాగా క్రియాశీల సర్వీసులో చేరాయి. రష్యా రక్షణ మంత్రిత్వ శాఖ మంగళవారం ఈ విషయాన్ని వెల్లడించింది. 10 ఒరెష్నిక్ క్షిపణి వ్యవస్థలను తమ దేశంలో మోహరించనున్నట్లు బెలారస్ అధ్యక్షుడు అలెగ్జాండర్ లుకషెంకో ఇటీవల ప్రకటించిన సంగతి గమనార్హం. ఒరెష్నిక్‌లోని వార్‌హెడ్‌లు మ్యాక్-10 వేగంతో దూసుకెళ్లగలవని, వాటిని అడ్డుకోవడం అసాధ్యమని రష్యా అధ్యక్షుడు పుతిన్ గతంలో పేర్కొన్నారు. 5 వేల కిలోమీటర్ల పరిధిలోని లక్ష్యాలను అవి ఛేదించగలవని తెలిపారు. మరోవైపు దేశవ్యాప్తంగా కీలక స్థావరాలు/కేంద్రాలను సంరక్షించుకునేందుకు విధుల్లో చేరాలని రష్యా అధ్యక్షుడు పుతిన్ రిజర్వు సైనికులను ఆదేశించారు.

సాధువుల అభ్యంతరంతో సన్నీ లియోన్ కార్యక్రమం రద్దు

ఈటీవీ భారత్: ఉత్తర్‌ప్రదేశ్‌లోని మథురలో ఒక బార్‌లో నూతన సంవత్సర వేడుకల్లో ప్రముఖ నటి సన్నీ లియోన్ పాల్గొనాల్సి ఉండగా సాధువుల అభ్యంతరాలతో చివరిక్షణంలో రద్దయింది. అశ్లీలతను ప్రోత్సహించేలా ఉండే ఆమె కార్యక్రమాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ వందలమంది సాధువులు మంగళవారం నిరసన చేపట్టారు. జిల్లా కలెక్టర్‌కు 'శ్రీకృష్ణ జన్మభూమి సంఘర్ష్ న్యాస్' వినతిపత్రం అందజేసింది. ఒకవేళ నిర్వాహకులు ముందుకువెళ్తే చట్టపరంగా చర్యలు తీసుకోవడంతోపాటు నటిపై ఫిర్యాదు చేస్తామన్నారు. శ్రీకృష్ణుడి జన్మస్థలమైన పవిత్ర ప్రదేశంలో ఇలాంటి కార్యక్రమాలు ఏర్పాటు చేయడం సమంజసం కాదని స్థానిక సాధువుల సంఘాలు పేర్కొంటున్నాయి. ఈ నేపథ్యంలో కార్యక్రమాన్ని రద్దు చేయాలని నిర్వాహకులు నిర్ణయించారు.

దిల్లీ గగనతలానికి 'సుదర్శన చక్ర' రక్షణ!

దిల్లీ: స్వదేశీ పరిజ్ఞానంతో రూపొందిన సమీకృత గగనతల రక్షణ వ్యవస్థ (ఐఏడీడబ్ల్యూఎస్)ను దిల్లీలోని కీలక వీఏపీ-89 జోన్ రక్షణకు మోహరించాలని కేంద్రం నిర్ణయించినట్లు తెలుస్తోంది. ఈ వ్యవస్థను కొనుగోలు చేయడానికి ఆమోదం తెలిపినట్లు కథనాలు వచ్చాయి. వీఏపీ-89 ప్రాంతంలో పార్లమెంటు, రాష్ట్రపతి భవన్, ప్రధాన మంత్రి కార్యాలయం వంటివి ఉన్నాయి. కేంద్ర మంత్రులు, ఇతర వీఐపీలు అక్కడే ఉంటారు. 26 చదరపు కిలోమీటర్ల మేర ఇది విస్తరించి ఉంటుంది. ఆ ప్రాంతాన్ని నో ఫ్లై జోన్‌గా వర్గీకరించారు. అక్కడ విమానాలు ఎగరడానికి వీల్లేదు. వైమానిక దళాన్ని దృష్టిలో పెట్టుకొని రక్షణ పరిశోధన, అభివృద్ధి సంస్థ (డీఆర్‌డీవో) ఐఏడీడబ్ల్యూఎస్‌ను రూపొందించింది. దీని విలువ దాదాపు రూ.5,181 కోట్లు ఉంటుందని అంచనా. 'సుదర్శన చక్ర కార్యాచరణలో భాగంగా ప్రయోగాత్మకంగా దీన్ని ఏర్పాటుచేయనున్నారు. ఇది దిల్లీ చుట్టూ 30 కిలోమీటర్ల పరిధిలో ఎలాంటి గగనతల ముప్పునైనా అడ్డుకోగలదు. భద్రతాపరంగా సున్నితమైన ప్రాంతాల్లో డ్రోన్ల ముప్పు పెరుగుతున్న నేపథ్యంలో కేంద్రం ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. సోమవారం రక్షణ శాఖ ఆమోదం తెలిపిన ప్రాజెక్టుల్లో ఈ వ్యవస్థ కొనుగోలు అంశం కూడా ఉన్నట్లు కథనాలు వచ్చాయి.

రేపటి నుంచి కొన్ని అంతర్జాతీయ సేవల నిలిపివేత: పోస్టల్ శాఖ

దిల్లీ: రిజిస్టర్డ్ స్మాల్ ప్యాకెట్ సర్వీసుతో సహా కొన్ని అంతర్జాతీయ తపాలా సేవల్ని జనవరి 1 నుంచి నిలిపివేయనున్నట్టు పోస్టల్ శాఖ మంగళవారం వెల్లడించింది. చిన్న ప్యాకెట్ సర్వీసులు తమ గమ్య స్థానం చేరాయా లేదా అని చూసుకునే ట్రాకింగ్ అవకాశం తక్కువగా ఉండటం లేదా అలాంటి సదుపాయమే లేకపోవడం, గమ్య దేశాల్లో పాటించాల్సిన కస్టమ్స్, భద్రతాపరమైన క్రతువులు ఎక్కువగా ఉండటం, చిన్న ప్యాకెట్లను స్వీకరించి వాటి గమ్యస్థానం చేర్చేందుకు విదేశీ పోస్టల్ యంత్రాంగాలు ఆసక్తి చూపకపోవడం ఇందుకు కారణాలని అధికార ప్రకటన తెలిపింది. "జనవరి 1, 2026 నుంచి అంతర్జాతీయ లెటర్ మెయిల్ సర్వీసుల్ని నిలిపివేస్తున్నాం. యూనివర్సల్ పోస్టల్ యూనియన్ నిర్ణయం మేరకు రిజిస్టర్డ్ స్మాల్ ప్యాకెట్ సర్వీస్‌ను నిలిపివేస్తున్నాం" అని అధికారిక ప్రకటన వివరించింది. సర్ఫేస్ లెటర్ మెయిల్ సర్వీసు, సర్ఫేస్ ఎయిర్ లిఫ్టెడ్ మెయిల్ సర్వీసు కింద ఇతర దేశాలకు తపాలా సేవలు దీంతో ఆగిపోతాయి. పోస్టల్ శాఖ ఈ సేవలకు బలమైన, విశ్వసనీయమైన ప్రత్యామ్నాయాలను అందిస్తోందని ప్రకటన వివరించింది.

మాజీ ఉపరాష్ట్రపతికి ప్రభుత్వ వసతి లేదు

జగదీప్ ధన్‌ఖడ్ సన్నిహితుల వెల్లడి

దిల్లీ: ఈ ఏడాది జులైలో ఉపరాష్ట్రపతి పదవికి రాజీనామా చేసిన జగదీప్ ధన్‌ఖడ్‌కు ఇప్పటివరకు ప్రభుత్వ వసతి లభించలేదని ఆయన సన్నిహిత వర్గాలు వెల్లడించాయి. ఆరోగ్య కారణాలతో జులై 21న పార్లమెంటు వర్షాకాల సమావేశాల తొలి రోజున ధన్‌ఖడ్ ఉపరాష్ట్రపతి పదవికి రాజీనామా చేశారు. అనంతరం సెప్టెంబరులో అధికారిక నివాసమైన వైస్ ప్రెసిడెంట్స్ ఎన్‌క్లేవ్‌ను ఖాళీ చేసి, దక్షిణ దిల్లీలోని ఛతర్‌పుర్ ప్రాంతంలో ఉన్న ఓ ప్రైవేట్ ఫామ్‌హౌజ్‌కు మారారు. ఆగస్టు 22న గృహనిర్మాణ, పట్టణ వ్యవహారాల మంత్రిత్వ శాఖ కార్యదర్శికి రాసిన లేఖలో మాజీ ఉపరాష్ట్రపతిగా తనకు అర్హత ఉన్న ప్రభుత్వ నివాసం కేటాయించాలని ధన్‌ఖడ్ కోరారు. రాజీనామా చేసి ఐదు నెలలు గడిచినా ధన్‌ఖడ్‌కు అధికారిక నివాస వసతి అందలేదని ఆయన సన్నిహితులు పేర్కొన్నారు.

హిందీలోనూ ఐరాస అధినేత నూతన సంవత్సర శుభాకాంక్షలు

ఐరాస: ఐక్యరాజ్యసమితి చరిత్రలో తొలిసారి ఆ సంస్థ సెక్రెటరీ జనరల్ హిందీలోనూ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. దేశాధినేతలు అభివృద్ధిపైనే తమ శక్తియుక్తులను కేంద్రీకృతం చేయాలని.. విధ్వంసంపై కాదని ఆంటోనియో గుటెరస్ ఆ సందేశంలో హితవు పలికారు. ప్రస్తుతం ప్రపంచ జనాభాలో 25 శాతం మంది ఘర్షణాత్మక వాతావరణంలో నివసిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. 'ఈ కల్లోల సమయంలో నూతన సంవత్సరం సందర్భంగా అందరం ప్రతిజ్ఞ తీసుకుందాం. పేదరికంపై పోరాడటం ద్వారా మాత్రమే సురక్షితమైన ప్రపంచం సాకారమవుతుంది.. యుద్ధాల ద్వారా కాదు. శాంతి వర్ధిల్లాలి' అని గుటెరస్ పిలుపునిచ్చారు. ఆయన విడుదల చేసిన వీడియో సందేశానికి హిందీ సబ్‌టైటిల్స్‌ను ఇచ్చారు. ఐరాస అధికార భాషలైన అరబిక్, చైనీస్, ఇంగ్లిష్, ఫ్రెంచ్, రష్యన్, స్పానిష్‌లతో పాటు హిందీ, ఉర్దూ సహా 11 భాషల్లో ఈ సందేశం వెలువడింది.

ఈశాన్య రాష్ట్రాల ప్రజలపై దాడులను అడ్డుకోవడంలో వ్యవస్థాగత వైఫల్యం

సుప్రీంకోర్టు జోక్యం కోరుతూ ప్రజాహిత పిటిషన్

దిల్లీ: దేశంలోని వివిధ ప్రాంతాల్లో ఈశాన్య రాష్ట్రాల ప్రజలపై జాతి వివక్షతో కూడిన దాడులు జరుగుతున్నాయని, వాటిని అడ్డుకోవడంలో వ్యవస్థాగతమైన వైఫల్యం కనిపిస్తోందని పిటిషనర్ ఆరోపించారు. ఈ పరిస్థితిని నివారించడానికి న్యాయస్థానం జోక్యం అవసరమని సుప్రీంకోర్టులో దాఖలు చేసిన ప్రజాహిత పిటిషన్ (పిల్)లో పేర్కొన్నారు. ఉత్తరాఖండ్‌లోని దేహ్రాదూన్‌లో తీవ్ర దాడికి గురై మృతి చెందిన త్రిపురకు చెందిన 24 ఏళ్ల విద్యార్థి ఏంజెల్ చక్మా ఉదంతాన్ని ప్రస్తావిస్తూ దిల్లీకి చెందిన న్యాయవాది అనూప్ ప్రకాశ్ అవస్థి ఈ పిటిషన్ వేశారు. ఈశాన్య రాష్ట్రాల వాసులపై ఇలాంటి దాడులు అనేకం జరిగాయని తెలిపారు.

గాజాలో రేపటి నుంచి మానవతాసంస్థల సేవల నిలిపివేత

జెరూసలెం: గాజాలో 'డాక్టర్స్ విత్‌ఔట్ బోర్డర్స్ (డీడబ్ల్యూబీ)' సహా పలు అంతర్జాతీయ మానవతా సంస్థల కార్యకలాపాలను గురువారం (జనవరి 1) నుంచి నిలిపివేయనున్నట్లు ఇజ్రాయెల్ ప్రకటించింది. సేవా కార్యక్రమాలకు సంబంధించి తాము రూపొందించిన నూతన నిబంధనలను పాటించడంలో అవి విఫలమవుతుండటమే ఈ నిర్ణయానికి కారణమని తెలిపింది.

ఉత్తర్‌ప్రదేశ్‌లో కత్తుల పంపిణీ

గాజియాబాద్: ఉత్తర్ ప్రదేశ్‌లోని గాజియాబాద్ షాలిమార్ గార్డెన్ కాలనీలో రెండు డజన్లకుపైగా కత్తులను పంపిణీ చేసిన ఆరుగురు హిందూ రక్షాదళ్ కార్యకర్తలను పోలీసులు అరెస్టు చేశారు. వారు హిందూ రక్షాదళ్ ఆఫీసు బేరర్లు. ఆ సంస్థ అధ్యక్షుడు భూపేంద్ర చౌధరి 'పింకీ' ప్రస్తుతం పరారీలో ఉన్నారు. అజ్ఞాతం నుంచి పింకీ విడుదల చేసిన వీడియోలో ముస్లింలను ఎదుర్కోవడానికిగానూ స్థానిక హిందువులకు 250కి పైగా కత్తులను పంచామని తెలిపారు. బంగ్లాదేశ్‌లో హిందువులను హతమారుస్తున్నారని, అదే గతి ఇక్కడి హిందువులకు పట్టకుండా చూడటానికే కత్తులు పంచామని వివరించారు.

భారత్-పాక్‌లకు మధ్యవర్తిత్వం నడిపింది మేమే: చైనా

బీజింగ్: ఈ సంవత్సరం భారత్-పాకిస్థాన్ మధ్య తలెత్తిన ఉద్రిక్తతల సడలింపునకు తామే మధ్యవర్తిత్వం నడిపామని చైనా విదేశాంగ మంత్రి వాంగ్ యీ మంగళవారం ప్రకటించారు. ఈ సంవత్సరం మే 7 నుంచి 10 వరకు భారత్-పాక్ మధ్య నెలకొన్న యుద్ధ పరిస్థితులు.. ఆపరేషన్ సిందూర్ నేపథ్యంలో రెండు దేశాల సైనిక డీజీఎంవోల సంప్రదింపుల ఫలితంగా సడలిపోయాయని మోదీ సర్కారు చెబుతున్న విషయం తెలిసిందే. ఉత్తర మయన్మార్ సంక్షోభం, ఇరాన్ అణు సమస్య, ఇజ్రాయెల్-పాలస్తీనా ఉద్రిక్తతల పరిష్కారానికీ తాము మధ్యవర్తిత్వం వహించామని చెప్పారు.

భారత్-పాక్ మధ్య కాల్పుల విరమణ కుదిర్చారంటూ రికీ గిల్‌కు అవార్డు

భారత్-పాకిస్థాన్ మధ్య కాల్పుల విరమణ అంగీకారం కుదిర్చారంటూ భారతీయ మూలాలున్న రికీ గిల్‌ను ట్రంప్ ప్రభుత్వం తాజాగా సత్కరించింది. 'డిస్టింగ్విష్డ్ యాక్షన్ అవార్డ్'ను జాతీయ భద్రతా మండలి (ఎన్ఎస్‌సీ) ఆయనకు అందజేసింది. రికీ గిల్.. ట్రంప్‌నకు ప్రత్యేక సహాయకుడు. యూనివర్సిటీ ఆఫ్ కాలిఫోర్నియా నుంచి న్యాయశాస్త్ర పట్టా పొందారు. ఎన్ఎస్‌సీలో భారత్, అఫ్గానిస్థాన్, పాకిస్థాన్ సహా దక్షిణ, మధ్య ఆసియాకు సీనియర్ డైరెక్టర్‌గా ఆయన వ్యవహరిస్తున్నారు.

ఐపీఎం సంచాలకులుగా నీలకంఠరెడ్డి

అదనపు బాధ్యతలు అప్పగించిన ప్రభుత్వం

ఈనాడు, అమరావతి: ఆంధ్రప్రదేశ్ ఎయిడ్స్ నియంత్రణ మండలి ప్రాజెక్ట్ డైరెక్టర్ నీలకంఠరెడ్డికి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ప్రివెంటివ్ మెడిసిన్ (ఐపీఎం) డైరెక్టర్‌గా ప్రభుత్వం పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించింది. ఇప్పటివరకు ఈ అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్న వైద్యారోగ్యశాఖ కమిషనర్ వీరపాండియన్‌ను పరిపాలన కారణాల దృష్ట్యా రిలీవ్ చేసింది. మరోవైపు వైద్యారోగ్య-కుటుంబ సంక్షేమ శాఖలో జిల్లా మాస్ ఎడ్యుకేషన్ అండ్ మీడియా అధికారిగా పనిచేస్తున్న ఎస్‌డీ మైనుద్దీన్‌కు మాస్ ఎడ్యుకేషన్ అండ్ మీడియా డిప్యూటీ డైరెక్టర్‌గా ప్రభుత్వం పదోన్నతి కల్పించింది.

154 మంది పొరుగు సేవల సిబ్బంది సర్వీస్ పొడిగింపు

ఈనాడు, అమరావతి: శాప్ రాష్ట్ర కార్యాలయం, జిల్లా స్పోర్ట్స్ అథారిటీస్‌లలో పనిచేస్తున్న 154 మంది పొరుగు సేవల సిబ్బంది సర్వీసును ప్రభుత్వం ఏడాది పాటు పొడిగించింది. ఈ మేరకు మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది.

విద్యార్థులు తక్కువగా ఉన్న బడుల మూసివేత తగదు: ఎస్టీయూ

ఈనాడు, అమరావతి: విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉందంటూ పాఠశాలలను విలీనం చేయాలని చూస్తున్నారని, ఈ ఆలోచనను విరమించుకోవాలని రాష్ట్రోపాధ్యాయ సంఘం(ఎస్టీయూ) అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మల్లు రఘునాథరెడ్డి, ఎల్.సాయిశ్రీనివాస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. "ఐదుగురు లోపు ఉన్న ప్రాథమిక పాఠశాలలను సమీపంలోని పాఠశాలల్లోను, 30మందిలోపు ఉన్న ఆదర్శ ప్రాథమిక పాఠశాలలను ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లోను, 50మంది విద్యార్థుల్లోపు ఉన్న ఉన్నత పాఠశాలలను ఉన్నత పాఠశాలల్లో విలీనం చేయనున్నారని ప్రతిపాదనలు కోరుతున్నారు. ఇలాంటి ఏకపక్ష నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలి. రాష్ట్రంలో ఏ ఒక్క పాఠశాలను మూసివేయకూడదని ఇచ్చిన హామీని తప్పడం సరికాదు. ప్రతి తరగతికి ఒక ఉపాధ్యాయుడు పేరుతో 9,620 ఆదర్శ ప్రాథమిక పాఠశాలలను ఏర్పాటు చేసినప్పటికీ ఇప్పటికీ చాలా బడులు ఇద్దరు, ముగ్గురు టీచర్లతోనే కొనసాగుతున్నాయి. ఉపాధ్యాయ సంఘాలతో చర్చించకుండా, ఎలాంటి లిఖితపూర్వక ఆదేశాలు ఇవ్వకుండా పాఠశాలలను విలీనం చేయాలన్న ఆలోచనను ఉపసంహరించుకోవాలి" అని కోరారు.

డీజీఎఫ్టీ డీజీగా లవ్ అగర్వాల్

ఈనాడు, దిల్లీ: కేంద్ర ప్రభుత్వంలో అదనపు కార్యదర్శి హోదాలో ఉన్న ఏపీ కేడర్‌కు చెందిన ముగ్గురు ఐఏఎస్ అధికారులను వివిధ శాఖలకు బదిలీ చేస్తూ కేంద్ర సిబ్బంది వ్యవహారాలు, శిక్షణ శాఖ మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం కేంద్ర మహిళా, శిశు అభివృద్ధిశాఖ అదనపు కార్యదర్శిగా పనిచేస్తున్న 1996 బ్యాచ్ అధికారి లవ్ అగర్వాల్ కేంద్ర వాణిజ్యశాఖ ఆధ్వర్యంలోని డైరెక్టర్ జనరల్ ఆఫ్ ఫారెన్‌ట్రేడ్ (డీజీఎఫ్టీ) డీజీగా నియమితులయ్యారు. విద్యుత్ శాఖలో అదనపు కార్యదర్శి హోదాలో ఉన్న 1998 బ్యాచ్ అధికారి నాగులాపల్లి శ్రీకాంత్‌ను పెట్రోలియం మంత్రిత్వశాఖలోని హైడ్రోకార్బన్స్ విభాగం డైరెక్టర్ జనరల్ పోస్టుకు కేటాయించారు. ఆర్థికశాఖలో అదనపు కార్యదర్శి హోదాలో ఉన్న 1999 బ్యాచ్ అధికారి సాల్మన్ ఆరోగ్యరాజ్ కేబినెట్ సెక్రటేరియట్‌లో అదనపు కార్యదర్శిగా వెళ్లనున్నారు.

నెల్లూరులో అరెస్టులను ఖండించిన వామపక్షాలు

ఈనాడు, అమరావతి: శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా కొడవలూరు మండలం రాచర్లపాడు ఇఫ్కో కిసాన్ సెజ్‌లో నిర్వహించనున్న ఇండస్ట్రియల్ పార్కులపై మంగళవారం నిర్వహించిన ప్రజాభిప్రాయ సేకరణ సభకు వెళ్తున్న వామపక్ష పార్టీల నాయకులు, రైతు ప్రతినిధులను అరెస్టు చేయడాన్ని ఖండిస్తున్నామని వామపక్ష పార్టీలు తెలిపాయి. సీపీఎం, సీపీఐతో సహా 10 వామపక్ష పార్టీలు ఉమ్మడి ప్రకటన విడుదల చేశాయి. "కిసాన్ సెజ్ పేరిట దాదాపు 25 ఏళ్ల క్రితం రైతుల నుంచి భూమిని సేకరించి, ఇప్పటి వరకు ఏమీ చేయలేదు. ఇప్పుడు వాటిని వ్యాపారంతో భూమిని విషపూరితం చేసే పరిశ్రమల ఏర్పాటుకు ప్రయత్నించడం దారుణం" అని పేర్కొన్నాయి.

సహకార సంఘాల ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి: సీపీఐ

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలోని వ్యవసాయ సహకార సంఘాల ఉద్యోగులు దీర్ఘకాలికంగా ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరుతూ సీఎం చంద్రబాబుకు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య లేఖ రాశారు. "గతంలో జారీచేసిన ప్రభుత్వ ఉత్తర్వు జీఓ నం.36ను వెంటనే అమలు చేయాలి. ఉద్యోగులకు ప్రతి ఐదేళ్లకోసారి వేతన సవరణ జరగాల్సి ఉండగా.. ఇప్పటి వరకు జరగలేదు. పెండింగ్‌లో ఉన్న 2019, 2024 వేతన సవరణలు చేయాలి. అప్పటి వరకు మధ్యంతర భృతి ఇవ్వాలి. సహకార సంఘాల్లో పనిచేస్తున్న ఉద్యోగులకు.. ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా పదవీ విరమణ వయసు 62 ఏళ్లకు పెంచాలి. ఉద్యోగులకు రూ.5 లక్షలకు తక్కువ కాకుండా ఆరోగ్య బీమా కల్పించాలి" అని కోరారు.

పన్ను ఎగవేతలపై ప్రభుత్వం కఠినంగా వ్యవహరించాలి: సీటీఎస్ఏ

ఈనాడు, అమరావతి: పాత ఇనుము వ్యాపారం పేరుతో రూ.500 కోట్లకుపైగా పన్ను ఎగవేతపై దర్యాప్తు చేయించాలని, పన్ను ఎగవేతదారులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఏపీ వాణిజ్య పన్నుల సర్వీసెస్ అసోసియేషన్ (సీటీఎస్ఏ) అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కేఆర్ సూర్యనారాయణ, రమేష్‌కుమార్ ప్రభుత్వాన్ని కోరారు. పన్ను ఎగవేతదారులతో కుమ్మక్కైన అధికారులపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. గతంలో జీఎస్టీ రిజిస్ట్రేషన్‌లు స్థానిక సర్కిల్ అధికారుల వద్ద ఉన్నప్పుడు ప్రతి దరఖాస్తును పరిశీలించేవారని, దీంతో బోగస్ వ్యాపారులు రిజిస్ట్రేషన్ పొందడం సులభమయ్యేది కాదని వెల్లడించారు. ఉన్నతాధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించి, ఒక చిన్న అంశంపై కోర్టులో కౌంటర్ దాఖలు చేయకపోవడంతో ప్రభుత్వానికి రావాల్సిన రూ.వెయ్యి కోట్ల జీఎస్టీ రెండేళ్లుగా నిలిచిపోయిందని తెలిపారు. దీనికి కారకులైన అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరారు. విశాఖపట్నానికి చెందిన ఒక స్టీల్ వ్యాపార సంస్థ రికార్డులను మదింపు చేసిన అసిస్టెంట్ కమిషనర్ దాదాపు రూ.వెయ్యి కోట్ల పన్ను ఎగవేతను గుర్తించారని, దీనిపై సదరు సంస్థ న్యాయస్థానాన్ని ఆశ్రయించినట్లు పేర్కొన్నారు.

తెలుగు భాషతో మాది భావోద్వేగ ప్రయాణం

తెలుగు తమ జీవనాడి అని ఈ భాషతో తమది భావోద్వేగ ప్రయాణమని బర్మా నుంచి వచ్చిన తెలుగు అతిథులు పేర్కొన్నారు. హైదరాబాద్‌లో ఇటీవల జరిగిన విశ్వ సంఘ్ శిబిర్ 2025లో పాల్గొనడానికి బర్మా నుంచి వంద మంది హాజరయ్యారు. వీరిలో పది మంది తెలుగువారు ఉన్నారు. ఈ సందర్భంగా తెలుగు జాతి ట్రస్ట్ ఆధ్వర్యంలో బర్మా తెలుగు తోబుట్టువులతో హైదరాబాద్ బంజారాహిల్స్‌లోని లామకాన్‌లో మంగళవారం ఆత్మీయ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు తమ అనుభవాలను పంచుకున్నారు.

-ఈనాడు, హైదరాబాద్

మళ్లీ వచ్చేటప్పటికి తెలుగులో మాట్లాడతా: వెంకటేశ్



మొదటిసారి భారత్ వచ్చాను. బర్మాలో వృత్తి రీత్యా మెడికల్ డిస్ట్రిబ్యూషన్‌లో ఉన్నా. తెలుగులో మాట్లాడలేకపోతున్నందుకు సిగ్గుపడుతున్నా. మరోసారి వచ్చేటప్పటికీ తెలుగు నేర్చుకుని మాట్లాడేందుకు ప్రయత్నిస్తా.

ప్రభుత్వాలు బడ్జెట్ కేటాయించాలి: ఎర్రంనాయుడు, విశాఖపట్నం



నేను బర్మాలో పుట్టి తర్వాత భారత్ తిరిగి వచ్చేశాను. అక్కడ ఒకప్పుడు తెలుగు ఒక వెలుగు వెలిగింది. భాష, పత్రికలు, నాటకాలు, సమాజాలు గొప్పగా ఉండేవి. 1962 తర్వాత తెలుగు వారు చాలామంది తిరిగి భారత్‌కు రావడంతో అక్కడ మిగిలిన వారు దిక్కులేనివారై భాషకు దూరమయ్యారు. అక్కడ తెలుగు వీధి ప్రభుత్వ రికార్డుల్లో ఉంది. ఇది చరిత్ర. ఇప్పుడు భాషను నేర్చుకోవాలని చాలామంది తాపత్రయపడుతున్నారు. అక్కడ పుట్టి పెరిగిన వాడిని కాబట్టి భాష నేర్పించాలని వేసవిలో వెళ్లి చెబుతుంటాను. సరైన రీతిలో నేర్పేవారు లేరక్కడ.

తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలు విదేశాల్లో ఉన్న తెలుగు వారి కోసం కొంత బడ్జెట్ కేటాయించాలి. విదేశాల్లో ఉన్న తమిళుల సంక్షేమానికి అక్కడి ప్రభుత్వం విశేషంగా కృషి చేస్తోంది.

ఇక్కడి వారిని చూశాక ఎంతో సంతోషం కలిగింది: గానలక్ష్మి




నేను మొదటిసారి హైదరాబాద్ వచ్చాను. ఇక్కడ తెలుగు వారిని చూసి ఎంతో సంతోషం వేసింది. మా పూర్వీకులది విశాఖపట్నం దగ్గర కొత్తవలస. ఎప్పుడూ అక్కడికి వెళ్లలేదు. మా తాత బర్మాకు వలస వెళ్లారు. అక్కడే మా నాన్న తెలుగు గురువుగా పాఠాలు బోధించేవారు. ఐదుగురు తెలుగు ఉపాధ్యాయుల్లో ఆయన ఒకరు. ప్రతి ఇంటికి వెళ్లి బయటే కాదు ఇంట్లోనూ తెలుగు మాట్లాడాలని చెప్పేవారు. తెలుగు భాష ఎప్పుడు మర్చిపోకూడదని మా నాన్న మాకు చెబుతూ ఉండేవారు. నేను తెలుగు మాట్లాడగల్గుతున్నాను కానీ మా పిల్లలకు కొంచెం కొంచెమే వచ్చు.

అమ్మాయిలను బాగా చూసుకుంటారు: లండా ప్రభావతి



బర్మాలో చాలా మంది అమ్మాయిలకు ఎదురుకట్నం ఇచ్చి పెళ్లి చేసుకుంటారు. కుమార్తెలాగా చూస్తారు. ఎంత బాగా చదువుకుంటే అంత బాగా చూసుకుంటారు. బర్మా నేలపై దీపావళి, సంక్రాంతి, ఉగాది, శ్రీరామనవమి అన్ని పండగలను చేసుకుంటాం.



● బర్మా దేశస్థులతో తమ జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ **సీవీ రావు..** 'గతంలో ప్రపంచ తెలుగు మహాసభలు జరిగినప్పుడు అక్కడి తెలుగువారు ఇక్కడకు రాగా.. రామోజీ సంస్థల వ్యవస్థాపక ఛైర్మన్ రామోజీరావును కలిసేందుకు తీసుకొని వెళ్లాను. ఆయన చాలా సంతోషిస్తూ తెలుగు భాషకు నేనేమైనా చేయగలనా అని ఆత్మీయంగా అడిగారు' అని వివరించారు.

ప్రజా ఉద్యమాలపై కేంద్రం కుట్ర

● సీపీఐ జాతీయ కార్యదర్శి కె.రామకృష్ణ

ఈనాడు-అమరావతి, విజయవాడ(గాంధీనగర్), న్యూస్‌టుడే: కేంద్రంలోని భాజపా ప్రభుత్వం ప్రజా ఉద్యమాలపై కుట్ర పన్నుతోందని సీపీఐ జాతీయ కార్యదర్శి కె.రామకృష్ణ మండిపడ్డారు. దేశవ్యాప్తంగా 1974 తర్వాత జరిగిన ప్రజా ఆందోళనలపై సమగ్ర అధ్యయనం చేపట్టాలని కేంద్రం నిర్ణయించడం చాలా తీవ్రమైన అంశమని ధ్వజమెత్తారు. సీపీఐ ఏపీ రాష్ట్ర విస్తృత కార్యవర్గ సమావేశాన్ని జి.కోటేశ్వరరావు అధ్యక్షతన విజయవాడ దాసరిభవన్‌లో మంగళవారం నిర్వహించారు. ప్రజా ఉద్యమాలపై అణచివేత చర్యలను తక్షణమే నిలిపివేయాలని తీర్మానించారు. అనంతరం నిర్వహించిన విలేకరుల సమావేశంలో రామకృష్ణ మాట్లాడారు. కేంద్రం అమలు చేస్తున్న విధానాలనే రాష్ట్రంలోనూ అవలంబిస్తున్నారని విమర్శించారు. ఇటీవల అనకాపల్లి జిల్లా సీపీఎం నాయకుడు అప్పలరాజుపై పీడీ యాక్ట్ ప్రయోగించి అరెస్టు చేసి, జైలుకు పంపారని దుయ్యబట్టారు. సీపీఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు



మాట్లాడుతున్న రామకృష్ణ. చిత్రంలో కొత్తగూడెం ఎమ్మెల్యే సాంబశివరావు, ఈశ్వరయ్య తదితరులు

మాట్లాడుతూ.. జనవరి 18న ఖమ్మంలో జరగనున్న సీపీఐ శతాబ్ది ఉత్సవాల ముగింపు కార్యక్రమాలకు పార్టీ శ్రేణులు, ప్రజానీకం పెద్దఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు. ఖమ్మం సభకు ఏపీ నుంచి 50 వేల మంది తరలివెళ్లనున్నట్లు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి జి.ఈశ్వరయ్య తెలిపారు. జనవరి 10, 11, 12 తేదీల్లో రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో ర్యాలీలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. సమావేశంలో సీపీఐ నగర కార్యదర్శి జి.కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్యులకు అండగా కూటమి ప్రభుత్వం

● ఏపీ ఆర్యవైశ్య కార్పొరేషన్ ఛైర్మన్ రాకేశ్

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో ఆర్యవైశ్యుల భద్రతకు కూటమి ప్రభుత్వం పూర్తిగా కట్టుబడి ఉందని ఏపీ ఆర్యవైశ్య కార్పొరేషన్ ఛైర్మన్ డూండి రాకేశ్ తెలిపారు. ప్రకాశం జిల్లా పొదిలి మండలంలో ఆర్య వైశ్య యువకుడిపై దాడి జరిగిన వెంటనే ప్రభుత్వం స్పందించి ఎస్సైను వీఆర్‌కు పంపడం అభినందనీయమని మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. దాడికి గురైన ఆర్య వైశ్య యువకుడిని పరామర్శించానని తెలిపారు. వైకాపా పాలనలో ఒంగోలులో ఆర్యవైశ్య నాయకుడు సోమిశెట్టి సుబ్బారావు గుప్తాపై ఆ పార్టీ కార్యకర్తలు దాడి చేసి, సెల్‌ఫోన్లో చిత్రీకరించినా కనీస చర్యలు తీసుకోలేదని రాకేశ్ గుర్తుచేశారు. తెనాలి మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో ఆర్యవైశ్య కౌన్సిలర్‌పై వైకాపా కౌన్సిలర్లు దాడిచేసినా కేసు నమోదు చేయలేదన్నారు. గత ఐదేళ్ల పాలనలో ఆర్యవైశ్యులపై అనేక దాడులు జరిగినా ఒక్క కేసు కూడా నమోదు కాలేదన్నారు. జె- ట్యాక్స్ విధించి వ్యాపారాలను దెబ్బతీశారని రాకేశ్ ఆరోపించారు.

మే 4 నుంచి తెలంగాణ ఎప్‌సెట్

ఈనాడు, హైదరాబాద్: తెలంగాణలో 2026లో నిర్వహించే కీలకమైన ప్రవేశ పరీక్షల (సెట్‌ల) తేదీలు ఖరారయ్యాయి. ఎప్‌సెట్ ఆన్‌లైన్ పరీక్షలు మే 4వ తేదీ నుంచి ప్రారంభం కానున్నాయి. తొలుత అగ్రికల్చర్, ఫార్మసీ.. తర్వాత ఇంజినీరింగ్ విభాగాల పరీక్షలు నిర్వహిస్తారు. ఈ మేరకు రాష్ట్ర ఉన్నత విద్యామండలి మంగళవారం మొత్తం 7 ప్రవేశ పరీక్షల తేదీలను వెల్లడించింది. విద్యాశాఖ మంత్రిగా ఉన్న సీఎం రేవంత్‌రెడ్డి ఆమోదం తెలపడంతో ప్రవేశ పరీక్షల తేదీలను విద్యామండలి ఛైర్మన్ ఆచార్య వి.బాలకిష్టారెడ్డి, కార్యదర్శి ఆచార్య శ్రీరాం వెంకటేష్ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఛైర్మన్ మాట్లాడుతూ గతంలో మాదిరిగానే ఈసారి కూడా అగ్రికల్చర్, ఫార్మసీ పరీక్షలతో ప్రారంభిస్తున్నట్లు తెలిపారు.

'సెట్‌'ల షెడ్యూల్..

ప్రవేశ పరీక్ష	కోర్సులు	నిర్వహించే తేదీలు
ఎప్‌సెట్	అగ్రికల్చర్, ఫార్మసీ	మే 4, 5
ఎప్‌సెట్	బీటెక్	9 నుంచి 11 వరకు
ఎడ్‌సెట్	బీఈడీ	12
ఐసెట్	ఎంబీఏ, ఎంసీఏ	13, 14
ఈసెట్	బీటెక్, బీఫార్మసీల్లోకి లేటరల్ ఎంట్రీ	15
లాసెట్	ఎల్ఎల్‌బీ, ఎల్ఎల్ఎం	18
పీజీఈసెట్	ఎంటెక్, ఎంఫార్మసీ, ఎంఆర్క్	28 నుంచి 31 వరకు
పీఈసెట్	డీపీఎడ్, బీపీఎడ్	మే 31 నుంచి జూన్ 3 వరకు

✦ ఎప్‌సెట్‌లో భాగంగా.. తొలి రెండు రోజులు అగ్రికల్చర్, ఫార్మసీ పరీక్షలు, మే 9 నుంచి వరుసగా మూడు రోజులపాటు ఇంజినీరింగ్ విభాగం పరీక్షలను నిర్వహిస్తారు.

✦ ఎప్‌సెట్ తర్వాత అత్యధిక మంది రాసే ఐసెట్‌ను 2 రోజుల పాటు నిర్వహించనున్నారు.

✦ అమ్మాయిలు సాధ్యమైనంత వరకు ఉదయం వేళల్లో జరిగే పరీక్షలు రాసేలా, నగరంలోని పరీక్షా కేంద్రాలను కేటాయించడంపైనా దృష్టి సారించారు. మధ్యాహ్నం షిఫ్ట్ పరీక్షలు సాయంత్రం 6 గంటలకు పూర్తవుతాయి. కొన్ని అనివార్య పరిస్థితుల్లో కొద్దిసేపు కంప్యూటర్లు పని చేయకపోతే మరికొంత ఆలస్యమయ్యే అవకాశం ఉంది. అలాంటి పరిస్థితుల్లో అమ్మాయిలు ఇళ్లకు వెళ్లేందుకు ఇబ్బంది పడకూడదన్నది ఆలోచన. ✦ మధుమేహం ఉన్నవారు పరీక్షా కేంద్రాల్లో ఇబ్బంది పడకుండా ముందుగానే తాము షుగర్ బాధితులమని దరఖాస్తు సమయంలో పేర్కొంటే.. వారికి పండ్లు, మాత్రలను అనుమతించడం లాంటి విధానాలను అమలు చేయడాన్ని పరిశీలించనున్నారు.

✦ ఈసారి దరఖాస్తు ఫీజుల్లో ఎటువంటి మార్పు లేదు. జోసా షెడ్యూల్ తదితర వాటిని పరిగణనలోకి తీసుకొని వీలైనంత మేరకు త్వరగా ప్రవేశాలు జరుపుతామని ఛైర్మన్ వెల్లడించారు.


ప్రవేశ పరీక్షల తేదీలను విడుదల చేస్తున్న బాలకిష్టారెడ్డి, శ్రీరాం వెంకటేష్

అద్దంకి, కందుకూరు ప్రజల ఆకాంక్ష నెరవేరింది

● మంత్రి గొట్టిపాటి రవికుమార్

ఈనాడు, అమరావతి: ప్రజల ఆకాంక్షలకు తగ్గట్టుగా అద్దంకి, కందుకూరు నియోజకవర్గాలను ప్రకాశం జిల్లాలో కలపడం సంతోషదాయకమైన నిర్ణయమని మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. మంగళగిరిలోని తెదేపా కేంద్ర కార్యాలయంలో మంగళవారం ఆయన మాట్లాడారు. "పాదయాత్రలో లోకేశ్ ఇచ్చిన హామీ మేరకు కందుకూరు, అద్దంకిని ప్రకాశం జిల్లాలో ప్రభుత్వం కలిపింది. 2012 నుంచి ఉన్న డిమాండ్‌ను పరిగణనలోకి తీసుకుని అద్దంకి ప్రజల రెవెన్యూ సమస్యల పరిష్కారం దిశగా అద్దంకి రెవెన్యూ డివిజన్ మంజూరు చేసినందుకు చంద్రబాబుకు కృతజ్ఞతలు" అని మంత్రి పేర్కొన్నారు.


హోరాహోరీగా జరిగిన ఏపీ సచివాలయ(ఉద్యోగుల) సంఘం ఎన్నికల ఫలితాలు సోమవారం రాత్రి వెలువడ్డాయి. అధ్యక్షుడిగా రామకృష్ణ ఎన్నికయ్యారు. ఆయన ప్యానెల్ ఎక్కువ స్థానాలు దక్కించుకుంది. దీంతో ఉద్యోగ సంఘం నేతలు విజయోత్సవం నిర్వహించారు. రామకృష్ణకు తోటి ఉద్యోగులు అభినందనలు తెలిపారు.

వైకాపా నేత బెదిరింపుల నుంచి విముక్తి కల్పించండి

● కడప జిల్లాకు చెందిన వ్యక్తి అర్జీ

● తెదేపా కేంద్ర కార్యాలయంలో అర్జీలు స్వీకరించిన మంత్రి గొట్టిపాటి

ఈనాడు, అమరావతి: తన వస్త్ర దుకాణాన్ని పులివెందులకు చెందిన రఘునాథరెడ్డి బలవంతంగా గిఫ్ట్ డీడ్ చేయించుకున్నారని.. బెదిరింపులకు పాల్పడ్డారని వైఎస్సార్ కడప జిల్లాకు చెందిన ధనుంజయ తెదేపా కేంద్ర కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన ప్రజావినతుల స్వీకరణ కార్యక్రమంలో ఫిర్యాదు చేశారు. వైకాపా హయాంలో పవన్‌కుమార్‌కు ఇచ్చిన తుపాకీ లైసెన్స్‌తో తన ప్రాణాలకు ముప్పు ఉందని, ఆ లైసెన్స్ రద్దు చేసి తనకు రక్షణ కల్పించాలని ఓ వ్యక్తి మంత్రి గొట్టిపాటి రవికుమార్, ఏపీ ఖాదీ అండ్ విలేజ్ ఇండస్ట్రీస్ బోర్డు ఛైర్మన్ కె.కె.చౌదరిలకు అర్జీ ఇచ్చారు. పలు జిల్లాల నుంచి వచ్చిన బాధితులు తమ సమస్యలను వివరించి, న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

● 40 ఏళ్లుగా ప్రతి ఆదివారం సంత జరిగే ప్రాంతాన్ని వైకాపా ఎమ్మెల్సీ భరత్ పీఏ మురుగేష్ అక్రమించుకున్నారని చిత్తూరు జిల్లా రామకుప్పం మండలం గోవిందపురం గ్రామానికి చెందిన జయశంకర్ ఫిర్యాదు చేశారు.

● కాకినాడ జిల్లా తుని మండలం డి-పోలవరం గ్రామంలో ఉన్న 1.01 ఎకరాల భూమి మంగలి మాన్యం కింద పట్టా నం-255 ద్వారా తమ తండ్రి సూర్యారావు పేరిట రెవెన్యూ రికార్డుల్లో ఉందని.. తప్పుడు పత్రాలతో కేసు వేసి తన ప్రత్యర్థి ఇంజంక్షన్ ఆర్డర్ తెచ్చుకున్నారని లోవరాజు అర్జీలో పేర్కొన్నారు.

● గ్రామంలోని 1.80 ఎకరాల భూమిని 1970లో చట్టబద్ధంగా కొన్నామని.. బైరెడ్డి వెంకటరెడ్డి, పాపిరెడ్డి, రాజశేఖర్‌రెడ్డిలు అందులో ఎకరా తమ పేరిట రికార్డుల్లో నమోదు చేయించుకున్నారని పల్నాడు జిల్లా వెల్దుర్తి మండలం ఉప్పలపాడు గ్రామానికి చెందిన మల్లికార్జునరావు ఫిర్యాదు చేశారు.

● ఆడపిల్ల పుట్టిందని అత్తమామలు, భర్త తనను వేధిస్తున్నారని గుంటూరు జిల్లా పెదకాకానికి చెందిన యశోద సుధారాణి పేర్కొన్నారు. దీనిపై మంగళగిరి డీఎస్పీ కార్యాలయంలో ఫిర్యాదు చేసినా న్యాయం జరగలేదని చెప్పారు.

● తన భూముల పట్టాలు వైకాపా ప్రభుత్వం రద్దు చేసిందని.. దీనిపై పలుమార్లు ఫిర్యాదు చేసినా న్యాయం జరగలేదని చిత్తూరు జిల్లా రామకుప్పం మండలం గోవిందపల్లికి చెందిన జయశేఖర్ అర్జీ ఇచ్చారు.

● రీసర్వేలో తన భూమి హద్దులు తప్పుగా నిర్ణయించడంతో పాటు హద్దురాళ్లు కాలువలో ఏర్పాటు చేశారని.. పాత సర్వే నంబరు ప్రకారం భూముల హద్దులు నిర్ధారించాలని నెల్లూరు జిల్లా ఇందుకూరుపేట మండలం సోమరాజుపల్లి గ్రామానికి చెందిన నారాయణమ్మ గ్రీవెన్స్‌లో అర్జీ ఇచ్చారు.

● పలువురు పింఛన్, రేషన్, ఇళ్ల స్థలాల సమస్యలపై అర్జీలు అందించారు. అనారోగ్య సమస్యలతో ఇబ్బంది పడుతున్నామని.. ఆర్థికంగా ఆదుకోవాలని మరికొందరు వినతులిచ్చారు.

ఉత్తరాదిన తితిదే ఆలయాల్లో ముక్కోటి వేడుకలు

● శ్రీవారిని దర్శించుకున్న పలువురు ప్రముఖులు

ఈనాడు, దిల్లీ: ఉత్తర భారతదేశంలోని తితిదే ఆలయాల్లో వైకుంఠ ఏకాదశి పర్వదినాన్ని వైభవంగా నిర్వహించారు. దిల్లీ గోల్‌మార్కెట్‌లో ఉన్న శ్రీవేంకటేశ్వర స్వామివారిని మంగళవారం దాదాపు 40 వేల మంది భక్తులు దర్శించుకున్నారు. కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి, నీతి ఆయోగ్ సీఈవో బీవీఆర్ సుబ్రహ్మణ్యం, ఏపీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్, ఏపీభవన్ రెసిడెంట్ కమిషనర్ ప్రవీణ్‌కుమార్, కమిషనర్ అర్జా శ్రీకాంత్, తెలంగాణభవన్ రెసిడెంట్ కమిషనర్ గౌరవ్ ఉప్పల్, తెలంగాణ భాజపా అధ్యక్షుడు ఎన్.రామచంద్రరావు తదితరులు స్వామివారిని దర్శించుకున్నారు. అలాగే జమ్మూ, రుషికేశ్, కురుక్షేత్ర, దిల్లీ ఏపీభవన్‌లోని తితిదే ఆలయాల్లోనూ వైకుంఠ ఏకాదశి వేడుకలు వైభవంగా జరిగాయి. కురుక్షేత్రలోని ఆలయంలో స్వామివారిని హరియాణా ముఖ్యమంత్రి నాయబ్‌సింగ్ సైనీతో పాటు వేల సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు.


దిల్లీలోని తితిదే ఆలయంలో శ్రీవారిని దర్శించుకుంటున్న కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి


కురుక్షేత్ర ఆలయంలో హరియాణా సీఎం నాయబ్‌సింగ్ సైనీ


స్వామివారి సన్నిధిలో నీతిఆయోగ్ సీఈవో బీవీఆర్ సుబ్రహ్మణ్యం

లోక్‌భవన్ సిబ్బందికి సీపీఆర్‌పై శిక్షణ

ఎన్టీఆర్ హెల్త్ వర్సిటీ, ఐఆర్‌సీఎఫ్ ఆధ్వర్యంలో కార్యక్రమం

ఈనాడు, అమరావతి: అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనే సామర్థ్యాన్ని, ప్రాణ రక్షణ నైపుణ్యాలను ప్రభుత్వ ఉద్యోగుల్లో పెంపొందించడంలో భాగంగా లోక్‌భవన్‌లోని సిబ్బందికి సీపీఆర్‌పై శిక్షణ ఇచ్చారు. ఎన్టీఆర్ యూనివర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్, భారతీయ రీసస్సిటేషన్ కౌన్సిల్ ఫెడరేషన్ (ఐఆర్‌సీఎఫ్) ఆధ్వర్యంలో 'ఎవరైనా సీపీఆర్ చేయవచ్చు..ప్రతి ఒక్కరినీ ప్రాణదాతలుగా చేద్దాం'అనే ఇతివృత్తంతో ఈ శిక్షణ కార్యక్రమాన్ని చేపట్టారు. మంగళవారం లోక్‌భవన్‌లో నిర్వహించిన కార్యక్రమానికి ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ వీసీ డాక్టర్ పి.చంద్రశేఖర్ అధ్యక్షత వహించారు. సీపీఆర్‌ను వైద్యులకే పరిమితం చేయకుండా, ప్రతి పౌరుడికీ విస్తరించేందుకే శిక్షణ చేపట్టినట్లు వీసీ తెలిపారు. వైద్యేతర సిబ్బందికి సీపీఆర్ శిక్షణ ఎంత అవసరమనేదీ ఐఆర్‌సీఎఫ్ ఛైర్మన్ డాక్టర్ ఎస్ఎస్‌సీ చక్రరావు వివరించారు. ఏపీ నర్సింగ్-పారా మెడికల్ కౌన్సిల్(ఏపీఎన్ఎంసీ) రిజిస్ట్రార్ ఆచార్య కె.సుశీల కార్యక్రమానికి సమన్వయకర్తగా వ్యవహరించారు.

రెండో తేదీ నుంచి కందుల సేకరణ

● మార్క్‌ఫెడ్ ఎండీ మనజీర్ జిలాని సమూన్ వెల్లడి

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో కంది అధికంగా సాగయ్యే ప్రాంతాల్లో జనవరి రెండో తేదీ నుంచి కందుల సేకరణ ప్రారంభిస్తామని వ్యవసాయశాఖ డైరెక్టర్, మార్క్‌ఫెడ్ ఎండీ మనజీర్ జిలాని సమూన్ తెలిపారు. రైతులు ఆర్‌ఎస్‌కేల్లో తమ పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. "ప్రస్తుతం బహిరంగ మార్కెట్‌లో కందుల ధర క్వింటాల్‌కు రూ.6,800 నుంచి రూ.7వేలు పలుకుతోంది. రాష్ట్ర ప్రభుత్వం మద్దతు ధరపై క్వింటాల్ రూ.8వేల చొప్పున సేకరిస్తుంది" అని ఒక ప్రకటనలో తెలిపారు. ఖరీఫ్ పంట కాలానికి సంబంధించి 1,16,690 టన్నుల కందులు, 903 టన్నుల పెసలు, 28,440 టన్నుల మినుముల కొనుగోలుకు కేంద్రం అనుమతించిందని తెలిపారు. "ఖరీఫ్‌లో 4,11,653 హెక్టార్లలో కంది సాగయ్యింది. అత్యధికంగా అనంతపురం జిల్లాలో 1,37,016 హెక్టార్లు, ప్రకాశం జిల్లాలో 77,730, కర్నూలు 69,025, నంద్యాల జిల్లా 47,580 హెక్టార్లలో సాగు చేశారు. ఇప్పటి వరకు 7,175 మంది రైతులు పేర్లు నమోదు చేసుకున్నారు. ఇందులో అనంతపురం జిల్లా నుంచి 5,871 మంది రైతులు ఉన్నారు" అని మనజీర్ వివరించారు.




యాదగిరిగుట్ట ఆలయంలో ఉత్తర ద్వార దర్శనమిస్తున్న లక్ష్మీనారసింహులు

నేత్రపర్వం.. ఉత్తర ద్వార దర్శనం

యాదగిరిగుట్టలో ఘనంగా వేడుకలు

యాదగిరిగుట్ట, భద్రాచలం, న్యూస్‌టుడే: వైకుంఠ ఏకాదశి సందర్భంగా రాష్ట్రంలోని వైష్ణవ క్షేత్రాలన్నీ భక్తులతో కిటకిటలాడాయి. ప్రధాన ఆలయాలైన యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీ నరసింహస్వామి, భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామి వార్లను ఉత్తర ద్వారం వద్ద దర్శించుకునేందుకు భక్తులు పోటెత్తారు. యాదగిరిగుట్టలో అర్చకస్వాములు.. 5.30 గంటలకు స్తంభోద్భవ నారసింహుడిని శ్రీలక్ష్మీ సమేతంగా ఉత్తర ద్వారం చెంతకు తోడ్కొని వచ్చారు. ప్రత్యేక పూజల అనంతరం స్వామివారిని భక్తులు దర్శించుకున్నారు. గరుడ సేవోత్సవం ముగిశాక, అలంకార తిరువీధి సేవా పర్వంతో ఆలయ అధ్యయనోత్సవాలకు శ్రీకారం చుట్టారు. భద్రాద్రిలో శ్రీ సీతారాములు వైకుంఠ ద్వారంలో దర్శనమివ్వడంతో భక్తులు దర్శించుకొని మురిసిపోయారు. ముక్కోటి అధ్యయనోత్సవాల్లో భాగంగా మంగళవారం వైకుంఠ ద్వారంలో స్వామివారు దర్శనమిచ్చారు. 5 గంటల సమయంలో భక్తుల నోట.. శ్రీరామ నామస్మరణ మిన్నంటుతుండగా.. జయజయధ్వానాల మధ్య ఉత్తర ద్వారం తలుపులు తెరుచుకున్నాయి. వైకుంఠాన్ని తలపించేలా సాంబ్రాణి ధూపదీపాల మధ్య శ్రీ సీతారామచంద్రులు వేంచేశారు. గరుడారూఢుడై శ్రీరాముడు, గజ వాహనంపై సీతమ్మ, హనుమద్వాహనంపై లక్ష్మణస్వామి కొలువుదీరారు.



భద్రాచలంలో వైకుంఠ ద్వారంలో కొలువుదీరిన శ్రీ సీతారామలక్ష్మణులు